ఈనాడు

విజయవాడ 21-11-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 101
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టులు గడువు విధించలేవు



బిల్లులకు సమ్మతిలో తీవ్ర జాప్యాన్ని ఆమోదంగా భావించాలనడం రాజ్యాంగంలో లేదు

- గవర్నర్లు బిల్లులను నిరవధికంగా నిలిపివేయడం తగదు
- అసాధారణ నిష్క్రియ పరిస్థితుల్లోనే న్యాయస్థానాల జోక్యం..
- ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌కు సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమాధానం
- ఏకాభిప్రాయంతో ఐదుగురు న్యాయమూర్తుల తీర్పు

ఈనాడు – దిల్లీ

శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. నిర్దిష్ట గడువులోగా సమ్మతి/అభిప్రాయం తెలియజేయకపోతే ఆ బిల్లులను ఆమోదించినట్లుగా భావించడం రాజ్యాంగంలో లేదని, అధికారాల విభజన సూత్రానికి ఇది వ్యతిరేకమని పేర్కొంది. శాసన నిర్మాణంలో రాష్ట్రపతి, గవర్నర్లు నిర్వర్తించాల్సిన విధుల్ని మరే వ్యవస్థా భర్తీ చేయలేదని స్పష్టం చేసింది. దేశ సమాఖ్య వ్యవస్థలో గవర్నర్లు నిర్వహిస్తున్న పాత్రపై తీవ్ర చర్చకు దారి తీసిన 'రాష్ట్రాల బిల్లుల ఆమోదం' అంశంలో సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకాభిప్రాయంతో ఈ తీర్పునిచ్చింది. అయితే తమ వద్దకు వచ్చిన బిల్లులను గవర్నర్లు అకారణంగా, నిరవధికంగా నిలిపివేయడం తగదని, సహేతుక సమయంలోగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. నిరంకుశంగా బిల్లులను నిలిపివేసే పరిస్థితుల్లోనే కోర్టులు తమకున్న పరిమిత న్యాయ సమీక్ష అధికారాలను ఉపయోగించాల్సి వస్తుందని అభిప్రాయపడింది. అధికరణం 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంధించిన 14 ప్రశ్నలకు సమాధానం ఇచ్చింది. రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు.

రెండోసారి పంపిన బిల్లునూ రాష్ట్రపతికి గవర్నర్ పంపవచ్చు..

'రాజ్యాంగ అధికరణం 200 కింద బిల్లు తన వద్దకు వచ్చినప్పుడు గవర్నర్ దానిని ఆమోదించకుండా పక్కన పెట్టి ఉంచలేరు. ఆ బిల్లును మళ్లీ శాసనసభకు (మిగతా 12లో)

రాష్ట్రపతి ప్రశ్నలకు ధర్మాసనం సమాధానాలు.. 12లో

కోర్టు జోక్యం ఎంత వరకు?

గవర్నర్ల విధులు, నిర్ణయాలలో కోర్టులు సాధారణంగా జోక్యం చేసుకోలేవని రాజ్యాంగ ధర్మాసనం చెప్పింది. కానీ, కారణం లేకుండా బిల్లులను దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచితే అది న్యాయపరమైన సమీక్ష పరిధిలోకి వస్తుందని పేర్కొంది. రాష్ట్రపతికి కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. గవర్నర్ బిల్లును పంపిన ప్రతిసారీ రాష్ట్రపతి.. సుప్రీంకోర్టును సంప్రదించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అధికరణం 143 కింద రాష్ట్రపతి అవసరమని భావించినప్పుడు అభిప్రాయం కోరవచ్చని తెలిపింది.

గవర్నర్ విచక్షణాధికారం అపరిమితం కాదు

అధికరణం 200 కింద గవర్నర్లకు విచక్షణ అధికారమున్నప్పటికీ, దాన్ని అతి పరిమాణంలో వినియోగించడం సరికాదని రాజ్యాంగ ధర్మాసనం హెచ్చరించింది. బిల్లులను తిప్పి పంపినా, నిలిపివేసినా సరైన కారణాలతో రాతపూర్వకంగా తెలియజేయాలని తెలిపింది. . లేదంటే భవిష్యత్తులో వివాదాలు తప్పవని కోర్టు అభిప్రాయపడింది.



హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టు నుంచి తిరిగి వెళ్తున్న జగన్ చుట్టూ కార్యకర్తలు

జగన్ మార్కు బలప్రదర్శన

- సీబీఐ కోర్టుకు రాకతో అనుచరుల హల్‌చల్
- కోర్టులో చెప్పాల్సిందేమీ లేదన్న జగన్

ఈనాడు, హైదరాబాద్: యూరప్ పర్యటనకు అనుమతి ఇస్తూ విధించిన షరతుల్లో భాగంగా ఏపీ మాజీ ముఖ్యమంత్రి, అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడైన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం హైదరాబాద్ సీబీఐ ప్రధాన కోర్టులో మందీమార్బలంతో హాజరయ్యారు. బేగంపేట నుంచి నాంపల్లిలోని సీబీఐ కోర్టు వరకు అనుచరులతో ర్యాలీగా వచ్చారు. రాజకీయ బలప్రదర్శనలా సాగిన ఈ ర్యాలీలో ఆయన అనుచరులు బేగంపేట వద్ద, కోర్టు బయట నినాదాలతో హోరెత్తించారు. భవిష్యత్తులో తాను మళ్లీ కోర్టుకు రావాల్సి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో చూపించాలన్నట్లుగా ఆయన బలప్రదర్శన సాగింది. జగన్ తరచూ బెంగళూరు వెళ్తున్నా, విజయవాడలోని సొంత ఇంటికి వెళ్తున్నా ఎప్పుడూ కనిపించని హడావుడి.. ఇప్పుడు కోర్టుకు వస్తున్నప్పుడు మాత్రం భారీగా కనిపించింది.

బేగంపేటలోనూ తోపులాట: బేగంపేటలో జగన్‌ను కలవడానికి (మిగతా 12లో)



కొలువుదీరిన నీతీశ్ ప్రభుత్వం

మోదీ, అమిత్ షా, నడ్డా, చంద్రబాబుసహా ఎన్డీయే నేతల హాజరు

బిహార్‌లో 26 మంది మంత్రుల ప్రమాణం 11లో

బిహార్ సీఎంగా నీతీశ్ ప్రమాణం చేసిన అనంతరం ఆయనతో కలిసి అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



నీతీశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాటామంతీ

ఈ నెల 24 నుంచి 'రైతన్నా.. మీ కోసం'

- అన్నదాతల ఇళ్లకు ప్రజాప్రతినిధులు, అధికారులు
- పంచసూత్రాల అమలు ద్వారా రైతులకు కలిగే మేలుపై అవగాహన
- టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈ నెల 24వ తేదీ నుంచి 'రైతన్నా.. మీ కోసం' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా వ్యవసాయంలో 'పంచసూత్రాలు' అమలు ద్వారా రైతులకు కలిగే మేలుపై వారి ఇళ్లకు వెళ్లి ప్రజాప్రతినిధులు, అధికారులు వివరించనున్నారు. ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. డిసెంబర్ 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు నిర్వహిస్తారు. వ్యవసాయ, అనుబంధ రంగాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు, సిబ్బంది సహా 10 వేల మందితో సీఎం చంద్రబాబు గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచసూత్రాలపై రైతులకు అవగాహన కల్పించే అంశంపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించి షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

అవగాహనే లక్ష్యంగా..

'17 నెలలుగా రైతులు, వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళుతున్నాం. ఇప్పటికే 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకం కింద దాదాపు 46.50 లక్షల మంది రైతులకు రెండు విడతల్లో రూ.14 వేలు చొప్పున జమ చేశాం. బిందు సేద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఇప్పుడు రైతులకు మరింత మేలు చేకూర్చేలా పంచసూత్రాలు ప్రకటించాం. నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, (మిగతా 12లో)

మావోయిస్టు రహిత రాష్ట్రమే లక్ష్యం

రంపచోడవరం పర్యటనలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

లోపలి పేజీలో



తిరుచానూరులో పద్మావతి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభానికి మొక్కుతున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

పద్మావతి అమ్మవారి సేవలో రాష్ట్రపతి

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న ద్రౌపదీ ముర్ము

ఈనాడు–తిరుపతి, న్యూస్‌టుడే, తిరుమల, తిరుచానూరు: శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం తిరుమల చేరుకున్నారు. అంతకుముందు ఆమె తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. కుమార్తె ఇతిశ్రీ ముర్ము, ఇతర కుటుంబసభ్యులతో కలిసి సాయంత్రం 4.20 గంటలకు రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన రాష్ట్రపతి, కుటుంబ సభ్యులు అక్కడి నుంచి నేరుగా తిరుచానూరు ఆలయానికి వెళ్లారు. వారికి వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయం ప్రకారం మహాద్వారం నుంచి (మిగతా 12లో)

గూగుల్ కోసం శరవేగంగా భూసేకరణ

ప్రభుత్వం పరిహారం పెంచడంతో స్వచ్ఛందంగా ముందుకొస్తున్న రైతులు

ఇప్పటికే 60 శాతం మందికి పైగా అంగీకారం

ఎకరానికి రూ.40 లక్షల వరకు పరిహారం, 20 సెంట్ల భూమి ● రేపటి నుంచే రైతుల ఖాతాల్లోకి పరిహారం సొమ్ము

ఈనాడు, విశాఖపట్నం: గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలంలోని తర్లువాడలో భూసేకరణ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ప్రభుత్వం అక్కడి భూముల రిజిస్ట్రేషన్ విలువ రూ.20 లక్షలకు పెంచి, రైతులకు ఎక్కువ మొత్తం పరిహారం వచ్చేలా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూములిస్తున్నారు. భూమిలివ్వకుండా అడ్డంకులు సృష్టించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నప్పటికీ వాటిని లెక్క చేయకుండా ఇప్పటికే 60 శాతం మందికి పైగా రైతులు అంగీకార పత్రాలు అందజేశారు. భూములిస్తున్నవారికి ప్రభుత్వం తాజాగా పెంచిన ప్రయోజనాల గురించి వివరించేందుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ విశాఖపట్నంలోని సర్క్యూట్‌హౌస్‌లో గురువారం నిర్వహించిన సమావేశానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైకాపా ఎంపీపీ మజ్జి శారద తండ్రి, తర్లువాడ మాజీ సర్పంచ్ మజ్జి వెంకట్రావు కూడా సమావేశానికి హాజరై ఆమోదపత్రం అందజేయడం విశేషం. భూములిచ్చిన రైతుల ఖాతాల్లో శనివారం నుంచి పరిహారం మొత్తాన్ని ప్రభుత్వం జమ చేయనుంది.



గూగుల్‌కు భూములు ఇచ్చేందుకు ఆమోదపత్రాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు అందిస్తున్న ఆనందపురం వైకాపా ఎంపీపీ తండ్రి మజ్జి వెంకట్రావు, తదితరులు, చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

రైతుల డిమాండ్లకు అంగీకారం: ప్రభుత్వం గూగుల్ కోసం 308.657 ఎకరాల్ని కేటాయిస్తోంది. ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో ఈ భూములు సేకరించి గూగుల్‌కు కేటాయించబోతున్నారు. వాటిలో 204 ఎకరాల వరకు డీపట్టా, శివాయ్ జమేదార్, రికార్డుల్లోకి ఎక్కని శివాయ్ జమేదార్ భూములున్నాయి. అక్కడ భూముల రిజిస్ట్రేషన్ విలువను డీ పట్టా భూములకు ఎకరానికి రూ.17 లక్షలు, రికార్డుల్లోకి ఎక్కని శివాయ్ జమేదార్ భూములకు ఎకరానికి రూ.8.5 లక్షలుగా తొలుత నిర్ణయించారు. తాజాగా రైతుల డిమాండ్ మేరకు డీ పట్టా భూముల రిజిస్ట్రేషన్ విలువ ఎకరానికి రూ.20 లక్షలకు, రికార్డుల్లోకి ఎక్కని శివాయ్ జమేదార్ భూములకు ఎకరానికి రూ.10 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. అయితే తమ భూమికి ఎకరానికి 20 సెంట్ల చొప్పున తర్లువాడ సమీపంలోనే భూమి కేటాయించాలని, మిగతా భూమికి పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. దానికి కూడా ప్రభుత్వం అంగీకరించింది. అంటే ఎకరం భూమి ఇచ్చిన రైతుకు 80 సెంట్లకు పరిహారం చెల్లించి, 20 సెంట్ల భూమి కేటాయిస్తారు.

3 సెంట్ల ఇళ్ల స్థలం కూడా..

తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు భూములిచ్చిన రైతుల ఖాతాల్లో శనివారం నుంచి పరిహారం జమ కానుంది. డీపట్టా రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన రిజిస్ట్రేషన్ ధరకు రెండున్నర రెట్లు, ఆక్రమణదారులకు (రికార్డుల్లోకి ఎక్కని శివాయ్‌జమేదార్ భూములు) నిర్ణయించిన ధర ప్రకారం పరిహారం జమవుతుంది. దీంతోపాటు భూములిచ్చిన రైతులకు 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలం, ఫలసాయం కోల్పోయిన కుటుంబాలకు వాణిజ్య సముదాయం నిర్మించి వ్యాపారాలు చేసుకునే సదుపాయం కల్పించేందుకు (మిగతా 12లో)

కల్తీ నిర్ధారణైనా.. వాళ్లను ఎందుకు కొనసాగించారు?

భోలేబాబా, వైష్ణవి డెయిరీ, ప్రీమియర్ అగ్రిఫుడ్స్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదు?

- నెయ్యి సరఫరా టెండర్లలో కఠిన నిబంధనలు ఎందుకు మార్చారు?
- మీ పీఏ లంచం అడిగారని ఫిర్యాదొచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదు?
- తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిపై సిట్ అధికారుల ప్రశ్నల వర్షం
- హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సుదీర్ఘ విచారణ
- తితిదే అధికారులే అంతా చూసుకున్నారని బదులిచ్చిన సుబ్బారెడ్డి

ఈనాడు – తిరుపతి, న్యూస్‌టుడే, ఫిల్మ్‌నగర్, తిరుపతి (నేరవిభాగం): 'తిరుమల తిరుపతి దేవస్థానానికి (తితిదే) ప్రీమియర్ అగ్రిఫుడ్స్, వైష్ణవి డెయిరీ, భోలేబాబా డెయిరీలు సరఫరా చేసిన నెయ్యిలో వెజిటబుల్ ఆయిళ్లు కలిసి ఉన్నాయని, అది కల్తీనెయ్యి అని మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్ నిర్ధారించిన తర్వాత కూడా.. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవి డెయిరీలను 2024 వరకూ, భోలేబాబాను 2022 అక్టోబరు వరకూ నెయ్యి సరఫరాదారులుగా ఎందుకు కొనసాగించారు? కల్తీనెయ్యి సరఫరా చేస్తున్నారని తెలిసినా వారెవరిపైనా ఎందుకు చర్యలు తీసుకోలేదు? మీపై ఎవరి ఒత్తిడి ఉంది? కల్తీ నెయ్యి వ్యవహారాన్ని తితిదే ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రహ్మణ్యం మీ దృష్టికి తీసుకొచ్చిన తర్వాత కూడా ఎందుకు స్పందించలేదు?' అంటూ వైకాపా హయాంలో తితిదే ఛైర్మన్‌గా (మిగతా 12లో)





సుబ్బారెడ్డి నివాసం వద్ద మీడియా ప్రతినిధులు

నకిలీ ఈ-కామర్స్ మోసాలతో రూ.285 కోట్లు స్వాహా

లోపలి పేజీలో

అరటి కిలో రూపాయి!

అరటి పంట సాగుచేసే రైతులు ప్రస్తుతం దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. గతేడాది అరటి టన్ను రూ.28 వేలకు పైగా పలకగా.. ఈసారి టన్ను రూ.1,000కి పడిపోయింది. అరటి రైతు ఏ మేర నష్టపోయాడో ఈ గణాంకాలే చెబుతున్నాయి. అనంతపురం జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి చేసిన ఈ పంట ఇంతటి దారుణ స్థితికి చేరడానికి ప్రధాన కారణాల్లో ఒకటి వ్యాపారస్థుల దోపిడీ అయితే.. రెండోది మహారాష్ట్ర నుంచి వచ్చే పంట మరింత నాణ్యంగా ఉండటం. పట్టణాల్లో ఇప్పటికీ డజను అరటి పళ్లు రూ.40-70 వరకు పలుకుతున్నా.. వాటిని పండించే రైతుకు రూ.15 కూడా దక్కడం లేదు. అనంతపురం జిల్లా నార్పల మండలం గడ్డం నాగేపల్లిలో ఓ రైతు అరటికాయలను ట్రాక్టరుతో తరలించి మూగజీవాలకు ఆహారంగా పారబోశారు. ఇకనైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని నష్టం లేకుండా చూడాలని అరటి రైతులు వేడుకుంటున్నారు. – ఈనాడు, అనంతపురం

టన్ను ధర రూ.వెయ్యి

ధరలు దిగజారడంతో గెలలను మూగజీవాలకు ఆహారంగా వేసిన రైతు





ఇదీ సంగతి!





రసకందాయంలో 'కర్ణాటకం'

సిద్ధరామయ్య, డీకే పోటాపోటీ

అధికార పంపిణీపై పట్టు

లోపలి పేజీలో



సభాహక్కుల ఉల్లంఘన కమిటీ విచారణపై స్టే ఇవ్వలేం

- సాక్షి ఎడిటర్, చీఫ్ రిపోర్టర్‌కు తేల్చిచెప్పిన హైకోర్టు
- అదనపు సమాచారంతో వివరణ ఇచ్చేందుకు రెండు వారాల వెసులుబాటు



ఈనాడు, అమరావతి: సాక్షి దినపత్రిక ఎడిటర్ రఘురాం ధనుంజయరెడ్డి, చీఫ్ రిపోర్టర్ బి.పణికుమార్‌లకు హైకోర్టు ధర్మాసనం ముందు ఎదురుదెబ్బ తగిలింది. ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతుల పేరుతో రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారంటూ శాసనసభ, సభాపతిని కించపరిచేలా కథనం ప్రచురించిన విషయంలో శాసనసభ సభాహక్కుల ఉల్లంఘన కమిటీ (ప్రివిలేజ్ కమిటీ) చేస్తున్న విచారణపై స్టే విధించబోమని ధర్మాసనం తేల్చిచెప్పింది. కమిటీ విచారణ చర్యలను కొనసాగించుకోవచ్చని స్పష్టం చేసింది. షోకాజ్ నోటీసు దశలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని వ్యాఖ్యానించింది. సభాహక్కుల ఉల్లంఘన కమిటీ ముందు అదనపు మెటీరియల్ దాఖలు చేసుకునేందుకు ఇద్దరికీ సమయం ఇచ్చేందుకు అభ్యంతరం లేదని సెక్రటరీ జనరల్, ప్రివిలేజ్ కమిటీ తరఫు న్యాయవాది గింజుపల్లి సుబ్బారావు నివేదించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. రెండు వారాల్లో కమిటీ ముందు అదనపు మెటీరియల్ దాఖలు చేయాలని వారిద్దరికీ స్పష్టంచేసింది. ఇద్దరూ ఈ నెల 21న సభాహక్కుల కమిటీ ముందు హాజరయ్యే ప్రక్రియను వాయిదా వేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ ఆర్. రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

★ 'కోట్లు ఖర్చు... శిక్షణ తుస్సు, ప్రణాళిక లేకుండా ఎమ్మెల్యేల శిక్షణ తరగతుల ప్రకటన' అంటూ సాక్షి పత్రిక ఈ ఏడాది ఫిబ్రవరి 22న కథనాన్ని ప్రచురించింది. శిక్షణ తరగతులకు సగం ఏర్పాట్లు పూర్తిచేసి రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని ఆ కథనంలో పేర్కొంది. దీనిపై శాసనసభలో ప్రస్తావనకు అనుమతివ్వాలంటూ ఎమ్మెల్యే జి.జయసూర్య ఫిబ్రవరి 25న శాసనసభ స్పీకర్‌కు నోటీసు ఇచ్చారు. ఈ విషయాన్ని స్పీకర్.. సభాహక్కుల ఉల్లంఘన కమిటీకి సిఫారసు చేశారు. కమిటీ చర్చించి సాక్షి పబ్లిషర్స్ నుంచి వివరణ కోరాలని నిర్ణయించింది. దీంతో నోటీసు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ ధనుంజయరెడ్డి, ఫణికుమార్ దాఖలుచేసిన వ్యాజ్యంలో జోక్యానికి హైకోర్టు సింగిల్ జడ్జి నిరాకరించారు.

★ ఈ తీర్పును సవాలు చేస్తూ ఎడిటర్, చీఫ్ రిపోర్టర్ ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. వారి తరఫు సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తాము ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకోకుండా సభాహక్కుల సంఘం ముందుకెళుతోందన్నారు. షోకాజ్ నోటీసు ఇచ్చే అధికారం ప్రివిలేజ్ కమిటీకి లేదన్నారు. ఈ నెల 21న హాజరై సాక్ష్యం ఇవ్వాలని ప్రివిలేజ్ కమిటీ తరఫున శాసనసభ సెక్రెటరీ జనరల్ ఈ నెల 11న నోటీసు ఇచ్చారన్నారు. హాజరుకాకుండా ఊరట నివ్వాలని కోరారు.

★ ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. 'ప్రివిలేజ్ కమిటీ విచారణ ప్రాథమిక దశలోనే ఉంది. ఆ కమిటీ అన్ని వివరాలను పరిశీలించి తుది నివేదిక ఇస్తుంది. ఆ నివేదిక ఆధారంగా సభ నిర్ణయం తీసుకోవాలి. తుది నిర్ణయం వెలువడే వరకు న్యాయస్థానాలు న్యాయసమీక్ష జరపలేవు. ఆధారాలతో ఈ నెల 21న హాజరు కావాలని కోరాం' అని అన్నారు.

★ వివరణను కమిటీ పరిగణనలోకి తీసుకోలేదని చెబుతున్న నేపథ్యంలో అదనపు మెటీరియల్ దాఖలు చేసేందుకు రెండువారాల సమయం ఇవ్వొచ్చన్నట్లు ధర్మాసనం పేర్కొంది. ఆ వివరాల ఆధారంగా ప్రివిలేజ్ కమిటీ తదుపరి చర్యలు కొనసాగించుకోవచ్చని తెలిపింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

కాంక్రీట్ గోడ కూల్చివేతకు మరో రూ.31.97 లక్షలు జమచేశాం

- హైకోర్టుకు నివేదించిన నేహారెడ్డి, ఆమె కంపెనీ

ఈనాడు, అమరావతి: విశాఖ జిల్లా భీమిలి బీచ్‌కు అత్యంత సమీపంలో సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన కాంక్రీట్ గోడ మిగిలిన భాగాన్ని తొలగించేందుకు మరో రూ.31.97 లక్షలను జీవీఎంసీకి చెల్లించామని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి, ఆమెకు సంబంధించిన అవ్యాన్ రియల్టర్స్ కంపెనీ ప్రతినిధులు గురువారం హైకోర్టుకు నివేదించారు. కాంక్రీట్ గోడ నిర్మించి పర్యావరణానికి నష్టం కలిగించినందుకు రూ.17.46 కోట్లు చెల్లించాలని కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ(ఎంఓఈఎఫ్) నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికపై అభ్యంతరాలు దాఖలు చేశామన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. నష్టపరిహారాన్ని రాబట్టే విషయంలో నిర్దిష్ట గడువులోగా ఓ నిర్ణయానికి రావాలని ఎంఓఈఎఫ్‌ను ఆదేశించింది. మరోవైపు సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన రెస్టోబార్ల విషయంలో రెండు వారాల తర్వాత చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని జీవీఎంసీని కోరింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావులతో కూడిన ధర్మాసనం గురువారం ఈ ఉత్తర్వులిచ్చింది. నేహారెడ్డికి చెందిన కంపెనీ అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ వేశారు. మరోవైపు భీమిలి సీఆర్‌జడ్ జోన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా శాశ్వత రెస్టోబార్లు ఏర్పాటు చేశారని, దీంతో తాబేళ్ల ఉనికికి ప్రమాదం పొంచిఉందని పేర్కొంటూ గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు మరో పిల్ వేశారు. ఇటీవల జరిగిన విచారణలో ఇప్పటి వరకు కాంక్రీట్ గోడ కూల్చివేతకు అయిన రూ.48.21 లక్షలు జీవీఎంసీకి జమచేశామని నేహారెడ్డి, ఆమె కంపెనీ వెల్లడించిన విషయం తెలిసిందే. మరో రూ.31.97 లక్షలు చెల్లించేందుకు సమయం కోరింది. గురువారం జరిగిన విచారణలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన రెస్టోబార్లను రెండు వారాల్లో తొలగించాలని ఉత్తర్వులు ఇచ్చామన్నారు.

రైతుల ధాన్యం విక్రయాలకు వాట్సప్ సేవలు

- 7337359375 నంబరుకు హాయ్ అని పంపాలి
- మంత్రి నాదెండ్ల మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్, వేదికపై సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ శ్రీనివాసరావు

తాడేపల్లి, న్యూస్‌టుడే: రైతులు ధాన్యం విక్రయించేందుకు వాట్సప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రావూరులో ధాన్యం రైతులతో మాట్లాడిన తర్వాత గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. 73373 59375 నంబరుతో సేవలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ధాన్యం అమ్మదలచిన రైతులు వాట్సప్ నంబర్‌కు హాయ్ అనే మెసేజ్ పంపగానే ఏఐ ద్వారా ప్రత్యేక వాయిస్‌తో సేవల వినియోగంపై మార్గదర్శకం చేస్తుందని చెప్పారు. 'రైతు తన ఆధార్ నంబరు నమోదుచేశాక పేరును ధ్రువీకరించాలి. తర్వాత ధాన్యం అమ్మదలచిన తేదీకి మూడు ఆప్షన్లు ఇస్తుంది. ఏదో ఒక తేదీని, సమయాన్ని నిర్ణయించుకోవాలి. తర్వాత ధాన్యం రకం నమోదు చేశాక.. ఎన్ని బస్తాలు అమ్ముతారో నమోదుచేయాలి. తర్వాత ఓ మెసేజ్ ద్వారా రైతులకు ధాన్యం అమ్మకం స్లాట్ బుక్ అయినట్లు కూపన్ కోడ్ వస్తుంది. దీంతో రైతు తాను ఎంచుకున్న కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి సులభంగా ధాన్యాన్ని అమ్మవచ్చ'ని మంత్రి వివరించారు.

★ రాష్ట్రంలో ఈ ఏడాది 51 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి మనోహర్ చెప్పారు. చిర్రావూరులో రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించాక.. రైతుల వద్ద ఉన్న ధాన్యం నాణ్యతను చూశారు. 4వేల రైతు సేవా కేంద్రాలతో పాటు 3వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు రూ.680 కోట్ల విలువైన ధాన్యం కొన్నామని, కొన్న రోజే రైతుల ఖాతాలకు నగదు జమచేసినట్లు చెప్పారు. తేమ శాతం పేరిట మిల్లర్లు ఇబ్బందులు సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

గన్నవరాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి

ప్రభుత్వ విప్ యార్లగడ్డ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పరిపాలనా సౌలభ్యం, ప్రజల సౌకర్యార్థం గన్నవరం నియోజకవర్గంలోని మూడు ప్రధాన మండలాలను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలన్నదే తన అభిమతమని, ఈ విషయాన్ని మంత్రి లోకేశ్‌తో పాటు మంత్రివర్గ ఉపసంఘానికి నివేదించానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు చెప్పారు. కృష్ణా జిల్లా బాపులపాడులో గురువారం ఆయన మాట్లాడారు. గన్నవరం నియోజకవర్గం రెండు జిల్లాల పరిధిలో ఉండడం వల్ల ప్రజా సమస్యల పరిష్కారానికి ఇబ్బందిగా మారిందన్నారు. కృష్ణా జిల్లా అని చెప్పుకోవడం ఓ భావోద్వేగ అనుభూతి అయినప్పటికీ, అభివృద్ధి కోణంలో ఎన్టీఆర్ జిల్లాలోకి మారడమే ఉత్తమమన్నారు. విమానాశ్రయం ఉందని గన్నవరం మండలాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలిపి, బాపులపాడు, ఉంగుటూరు మండలాలను కృష్ణాలో ఉంచాలన్న ప్రతిపాదనకు తాను వ్యతిరేకమని చెప్పారు. మూడు మండలాలను ఒకే జిల్లాలో ఉంచాలన్నారు. విజయవాడకు 70 కి.మీ. దూరంలో ఉన్న నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతున్నప్పుడు, కూతవేటు దూరంలో ఉన్న గన్నవరాన్ని కృష్ణాలో ఉంచడం తగదన్నారు.

22, 23 తేదీల్లో పుట్టపర్తిలో చంద్రబాబు పర్యటన

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు ఈ నెల 22, 23 తేదీల్లో పుట్టపర్తిలో పర్యటించనున్నారు. 22 ఉదయం 8:15 గంటలకు విజయవాడ నుంచి పుట్టపర్తి వెళ్లనున్నారు. 10:30 గంటలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు స్వాగతం పలుకుతారు. అనంతరం రాష్ట్రపతితో కలిసి భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొననున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కలిసి శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. రాత్రికి పుట్టపర్తిలోనే బస చేస్తారు. 23 ఉదయం 9 గంటలకు సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. పుట్టపర్తి నుంచి తిరుగు ప్రయాణమై మధ్యాహ్నం ఒంటి గంటకు ఉండవల్లి నివాసం చేరుకుంటారు.

దోపిడీ ముఠా.. తిరుపతి బాట

బెంగళూరు ఏటీఎంలో చోరీ నిందితుల్లో ఇద్దరి పట్టివేత

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: బెంగళూరు వాసుల్లో దడ పుట్టించిన ఏటీఎం సొమ్ము దోపిడీ ముఠా ఆనవాళ్లను పోలీసులు శరవేగంగా గుర్తించారు. బెంగళూరులో బుధవారం మధ్యాహ్నం రూ.7.11 కోట్లను దోపిడీ చేసి చిత్తూరు మీదుగా తిరుపతి వైపు పారిపోతున్న నిందితుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకుని.. గురువారం నగరానికి తీసుకొచ్చి విచారిస్తున్నారు. ఏటీఎం కేంద్రాల్లో నగదు జమచేస్తున్న సీఎంఎస్ ఏజెన్సీ వాహనాన్ని సీబీఐ, ఐటీ, ఆర్‌బీఐ అధికారులమంటూ దుండగులు నిలిపివేసి రూ.7.11 కోట్ల నగదు ఎత్తుకెళ్లిన సంగతి తెలిసిందే. ఈ ముఠాలో ఇద్దరు సభ్యులను చిత్తూరు సమీపంలో పట్టుకున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. నగరంలోని బాణసవాడి, కల్యాణనగర ప్రాంతాలకు చెందిన ఆరుగురు నిందితులు ఈ నేరానికి పాల్పడినట్లు తేలింది. దోపిడీకి వినియోగించిన వాహనాన్ని తిరుపతి సమీపంలో గుర్తించారు. దుండగులు దాన్ని అక్కడవదిలేసి.. మరో వాహనంలో పారిపోయారని అంచనా వేస్తున్నారు. తిరుపతి పోలీసుల సహకారంతో బెంగళూరు పోలీసులు అక్కడి హోటళ్లు, లాడ్జిలు, ఆలయాల వద్ద గాలిస్తున్నారు. వివిధ సందర్భాల్లో దోపిడీలకు పాల్పడిన 20 మందిని ప్రత్యేక పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉద్యోగులు, సీఎంఎస్ సిబ్బంది, వాహనం డ్రైవర్ తదితరులనూ విచారించారు. నిందితులను పట్టుకోవడానికి పోలీసు బృందాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, మహారాష్ట్రలకు పంపారు. దొంగలు రెక్కీ చేశాకే.. డెయిరీ కూడలి సమీప వంతెనపై సీసీ కెమెరాలు లేని అదును చూసుకుని దోపిడీకి పాల్పడ్డారు.

ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ అనుమతి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫార్ములా-ఈ కేసులో మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అనుమతించారు. ఈ మేరకు ప్రభుత్వానికి లేఖ రాశారు. ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలంటూ ఈ ఏడాది సెప్టెంబరులో గవర్నర్‌కు ప్రభుత్వం లేఖ రాసిన సంగతి తెలిసిందే. గవర్నర్ తాజాగా అనుమతి ఇవ్వడంతో కేటీఆర్ న్యాయవిచారణకు అడ్డంకులు తొలగిపోయినట్లయింది.

'బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరపాలి'

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్రం చేయిస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఒంగోలులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్‌కౌంటర్లను ఖండించే వారిపై కేసులుంటాయని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొనడం దుర్మార్గమన్నారు.

గ్రహం అనుగ్రహం

21–11–2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశీర్ష మాసం, శుక్లపక్షం

పాడ్యమి: మ. 12-45 తదుపరి విదియ; **అనూరాధ:** మ. 1-02 తదుపరి జ్యేష్ఠ; **వర్జ్యం:** రా. 7-32 నుంచి 8-58 వరకు

అమృత ఘడియలు: తె.5-48 నుంచి; **దుర్ముహూర్తం:** ఉ.8-25 నుంచి 9-10 వరకు తిరిగి మ. 12-08 నుంచి 12-52 వరకు

రాహుకాలం: ఉ.10-30 నుంచి 12-00 వరకు; **సూర్యోదయం:** ఉ.6.12; **సూర్యాస్తమయం:** సా.5.20; చంద్రోదయం

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	13.1	29.4
విజయనగరం	18.0	29.0
కర్నూలు	18.8	32.0
విజయవాడ	19.0	31.7
అనంతపురం	19.2	32.0
రాజమహేంద్రవరం	19.5	36.5
నరసాపురం	19.6	32.5
విశాఖపట్నం	21.2	32.0
ఒంగోలు	21.4	32.8
తిరుపతి	21.6	30.7
శ్రీకాకుళం	22.0	31.0
గుంటూరు	22.0	31.5
నెల్లూరు	22.4	32.4
కడప	23.0	30.0
తాడేపల్లిగూడెం	27.0	32.0



స్థిరత్వంతో దేన్నయినా జయించొచ్చు

ఓ కొత్త నైపుణ్యాన్ని నేర్చుకోవాలంటే రోజూ స్థిరత్వంతో దాన్ని సాధన చేయడం అవసరం. రోజుకు గంట సమయం దానికోసం కేటాయించండి. అది కుదరకపోతే అరగంట సేపైనా సాధన చేయండి. అది కూడా కష్టమనుకుంటే కనీసం 10 నిమిషాలు వెచ్చించండి. కానీ మీకు ఉత్సాహం ఉన్నా, లేకున్నా క్రమం తప్పకుండా దాన్ని సాధన చేయడం మాత్రం మరవకండి. ఎలాంటి లక్ష్యాన్నైనా స్థిరత్వంతో జయించొచ్చు.

– శుభం వర్మ, సాఫ్ట్‌వేర్ డెవలపర్

ఉద్యోగ అవకాశాలు

ప్రశాంతతతో ప్రతి సమస్యకూ పరిష్కారం

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- పుట్టపర్తిలో ఘనంగా జాతీయ యువజన సదస్సు



బాబా మహాసమాధిని దర్శించుకుంటున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జీవితంలో ప్రశాంతత ఉంటే ప్రతి సమస్యకూ సమాధానం దొరుకుతుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. శ్రీసత్యసాయి శతజయంతి వేడుకల్లో భాగంగా పుట్టపర్తిలోని ప్రశాంతినిలయంలో 11వ అంతర్జాతీయ యువజన సదస్సు గురువారం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సును శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సత్యసాయి నివాసం యజుర్వేద మందిరం నుంచి వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు వారి జాతీయ పతాకాలు, సత్యసాయి సేవాసంస్థల పతాకాలు, బాబా సందేశాలతో కూడిన చిహ్నాలతో సాయికుల్వంత్ మందిరానికి చేరుకున్నారు. యువజన సదస్సు కౌన్సిల్ సభ్యుడు సురేష్ మేనన్ ప్రారంభోపన్యాసం చేశారు. ట్రస్టు సభ్యులు నాగానంద సదస్సు లక్ష్యాలను తెరపై ప్రదర్శించి వివరించారు. ఈ సందర్భంగా నితిన్ గడ్కరీ ప్రసంగించారు. సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలతో కోట్ల మందిని ప్రేమ, సేవామార్గం వైపు నడిపించారన్నారు. సత్యసాయి సందేశాలను స్ఫూర్తిగా తీసుకుని, సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తర్వాత సత్యసాయి సంస్థల సేవా కార్యక్రమాల వివరాలు తెలిపే 'ఎటర్నల్ ప్రెజెన్స్' పుస్తకాన్ని ఆయన, రత్నాకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్, బీసీ జనార్దన్‌రెడ్డి, దుర్గేష్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీతీశ్ ప్రమాణస్వీకారంలో చంద్రబాబు, లోకేశ్

- ఘనస్వాగతం పలికిన అధికారులు, ఎన్డీయే నేతలు



నీతీశ్ ప్రమాణ వేడుకలో గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, ఏపీ సీఎం చంద్రబాబు, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ

ఈనాడు, అమరావతి: బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సహా కార్యక్రమానికి హాజరైన ఎన్డీయే నేతల్ని వారు ఆత్మీయంగా పలకరించారు. కొంతసేపు వారితో ముచ్చటించారు. అంతకుముందు పట్నా విమానాశ్రయంలో చంద్రబాబు, లోకేశ్‌లకు బిహార్ ఎన్డీయే నేతలు, అధికారులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. సంప్రదాయం ప్రకారం మహిళలు వారికి తిలకం దిద్ది, ఆహ్వానించారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, భాజపా అగ్రనేత రవిశంకర్‌ప్రసాద్, బిహార్‌కు చెందిన భాజపా, జేడీయూ నేతలను చంద్రబాబు, లోకేశ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు. 'నీతీశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనడం ఆనందాన్నిచ్చింది. సీఎం సహా మంత్రివర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశాను. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా నీతీశ్ ప్రభుత్వం పనిచేయనుంది' అని చంద్రబాబు తర్వాత 'ఎక్స్'లో పేర్కొన్నారు.

కాఫీ కొనుగోలుదారులు లైసెన్సులు తీసుకోవాలి

అరకులోయ, పాడేరు, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల పరిధిలో కాఫీ కొనుగోలుదారులు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా ఉద్యానాధికారి బాలకర్ణ తెలిపారు. అరకులోయ మండలం చినలబుడు పంచాయతీ హట్టగుడ గ్రామంలో కాఫీ తోటలను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ ఏడాది కాఫీ పంటకు బెర్రీబోరర్ సోకిన కారణంగా కొనుగోళ్లలో కొన్ని షరతులు విధించామన్నారు. కాఫీ పండ్లు, పార్చిమెంట్, ఇతర కాఫీ ఉత్పత్తులను కొనాలనుకునే ప్రైవేటు వ్యాపారులు, ఎన్‌జీఓలు సంబంధిత అధికారుల నుంచి లైసెన్సు పొందాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గాన 'కిశోరా'లు

- 40 గంటలు సంగీత విభావరి
- గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డు సొంతం



పాటలు పాడుతున్న కళాకారులు

మంగళూరు, న్యూస్‌టుడే: అమర గాయకుడు కిశోర్‌కుమార్ ఆలపించిన 460 పాటలను 136 మంది గాయకులు 40 గంటల పాటు నిర్విరామంగా పాడి కొత్త రికార్డు సృష్టించారు. మంగళూరులో నవంబరు 18న వేకువ జామున రెండు గంటలకు ప్రారంభమైన ఈ కచేరీ నవంబరు 19న సాయంత్రం ఆరు గంటలకు ముగిసింది. స్థానిక టౌన్‌హాల్‌లో గాయకులు తొమ్మిది బృందాలుగా విడిపోయారు. రెండు పాటల మధ్య 59 క్షణాలు మాత్రమే విరామం తీసుకున్నారు. కొందరు కళాకారులు విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు మిగిలిన వారు గానాలాపన కొనసాగించారు. గతంలో కిశోర్‌కుమార్ పాటలను 100 మంది గాయకులు అహ్మదాబాద్‌లో 36 గంటల పాటు పాడిన రికార్డును మంగళూరు వారు తుడిచిపెట్టారు. షోడశి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'గాతా రహే మేరా దిల్' పేరిట నిర్వహించిన ఈ పాటల కచేరీకి గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్ లభించింది.

ఇందిరాగాంధీ స్టేడియానికి అంతర్జాతీయ హంగులు!

- 2026 చివరి నాటికి పనులు పూర్తిచేయాలని లక్ష్యం
- ఇకపై క్రీడావసరాలకే వినియోగించాలని నిర్ణయం!



విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించేలా ఉన్నత ప్రమాణాలతో కొత్త క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతో పాటు పాతవాటినీ ఆధునికీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా విజయవాడ నడిబొడ్డునున్న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియాన్ని అభివృద్ధి చేసేందుకు సంకల్పించింది. 2026 చివరి నాటికి దీన్ని ఆధునికీకరించి, 2029లో అంతర్జాతీయ క్రీడలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్), విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్(వీఎంసీ) సంయుక్తంగా ఈ స్టేడియం అభివృద్ధి, నిర్వహణ చేపట్టనున్నాయి. పనులకు రూ.53 కోట్లు అంచనా వేయగా, రూ.30 కోట్లతో మొదటి విడత పనులు ప్రారంభించనున్నారు. ఈనెలాఖరు కల్లా అధికారులు డీపీఆర్‌ను ప్రభుత్వానికి అందించనున్నారు. స్టేడియంలో ఇకపై ప్రభుత్వ, ప్రైవేటు క్రీడేతర కార్యక్రమాలు ఉండవని అధికార వర్గాలు వెల్లడించాయి.

మల్టీపర్పస్.. 2 సింథటిక్ ట్రాక్‌లు

స్టేడియంలో ఇప్పుడున్న కొన్ని నిర్మాణాలను ఆధునికీకరించి, మరికొన్ని భవనాలు నిర్మించి అదనపు కోర్టులు, వసతులు అందుబాటులోకి తేవాలని ప్రతిపాదనలు ఉన్నాయి. వాటిలో..

- ◆ ఇప్పుడున్న శాప్ ప్రధాన కార్యాలయాన్ని తొలగిస్తారు. ఆ స్థలంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ హాల్, బాక్సింగ్ ప్రాక్టీస్ ఎరీనా, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కమర్షియల్ హాల్‌ను నిర్మించడం.
- ◆ స్టేడియంలో సాధనకు 3 సింథటిక్ ఔట్‌డోర్ టెన్నిస్ కోర్టులు ఉన్నాయి. అదనంగా రెండేసి చొప్పున టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ ఔట్‌డోర్ కోర్టుల నిర్మాణం.
- ◆ ప్రాక్టీస్ కోసం క్రికెట్ నెట్ ఏర్పాటు.
- ◆ స్థలాభావం దృష్ట్యా అవసరం లేనప్పుడు పక్కనపెట్టే గ్యాలరీలు.
- ◆ ప్రధాన స్టేడియంమధ్యలో 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, ట్రాక్ మధ్య ఫుట్‌బాల్ ఫీల్డ్.
- ◆ గ్యాలరీలకు అనుసంధానంగా ఓ వైపు భవనం నిర్మాణం. మొదటి అంతస్తులో మరో సింథటిక్ వార్మప్ ట్రాక్. ఈ భవనం నుంచి గ్యాలరీల మీదుగా నేరుగా ప్రధాన స్టేడియం చేరుకునేలా మార్గం.
- ◆ క్రీడా క్యాంపులకు వీలుగా గ్రౌండ్ ఫ్లోర్‌లో కిచెన్, డార్మెంటరీ, వసతి సదుపాయాలు.
- ◆ ప్రధాన స్టేడియం గ్యాలరీల కింద ఉన్న గదుల ఆధునికీకరణ.

ఆస్తిలో వాటా రాదని బెదిరించి బాలికకు పెళ్లి

- పాఠశాలకు వెళ్లనివ్వకుండా వేధింపులు
- భర్త సహా అతని తల్లిదండ్రుల అరెస్టు

గుంటూరు నేరవార్తలు న్యూస్‌టుడే: వారసత్వపు ఆస్తిలో వాటా దక్కకుండా చేస్తామని బెదిరించి.. పదమూడేళ్ల బాలికను వివాహం చేసుకున్న కేసులో యువకుడిని, అతని తల్లిదండ్రులను గుంటూరు దక్షిణ డివిజన్ డీఎస్పీ భానోదయ అరెస్టు చేశారు. గురువారం ఆమె ఈ కేసు వివరాలు వెల్లడించారు. గుంటూరు నగర శివారు గ్రామానికి చెందిన బాలిక తండ్రి ఐదేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అప్పటి నుంచి ఆమె కుటుంబం పెదకాకానిలోని అమ్మమ్మ ఇంటికెళ్లిపోయింది. ఆమెకు తండ్రి తరఫు వాటాగా రావాల్సిన ఆస్తి దక్కాలంటే తన కుమారుడు డానియేల్(26)ను పెళ్లి చేసుకోవాలని మేనత్త నిర్మల, ఆమె భర్త శాంసన్‌లు ఒత్తిడి తెచ్చారు. పెళ్లయ్యాక చదువు కొనసాగించుకోవచ్చని, అంగీకరించకపోతే ఆస్తి రాకుండా చేస్తామంటూ బెదిరించడంతో బాలిక తల్లి అంగీకరించింది. ఈ ఏడాది మే నెలలో ఓ చర్చిలో వివాహం జరిపించారు. బాలికను కాపురానికి తీసుకెళ్లిన అత్తింటివారు పాఠశాలకు వెళ్లకుండా కట్టడి చేశారు. తనకు చదువుకోవాలని ఉందని చెప్పినా వినకుండా వేధించారు. భరించలేని ఆమె తన అమ్మమ్మ ఇంటికెళ్లిపోయింది. కాపురానికి రావాలని భర్త, మేనత్త ఒత్తిడి తేవడంతో భయపడిన బాలిక.. చైల్డ్ వెల్ఫేర్ రక్షణ విభాగం టోల్ ఫ్రీ నంబరు 1098కు ఫోన్ చేసి చెప్పింది. స్పందించిన సభ్యుడు బ్రహ్మానాయుడు బాలిక తల్లితో మాట్లాడి నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన డీఎస్పీ భానోదయ.. బాలిక భర్త డానియేల్, అతని తల్లిదండ్రులు నిర్మల, శాంసన్‌లను అరెస్టు చేశారు. వివాహానికి కారణమైన బాలిక నాయనమ్మ, పెళ్లి చేసిన చర్చి పాస్టర్లు, సంఘ పెద్దలు, హాజరైన బంధువులపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చెప్పారు.



మీ విలువను కాపాడుకోవాలంటే..

మీ విలువ అనేది ఇతరుల ఆమోదం మీద ఆధారపడి ఉండదు. ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం, మిమ్మల్ని మీరు ప్రేమించుకోవడం, ఇతరులతో సంబంధాల విషయంలో స్పష్టమైన సరిహద్దులను ఏర్పర్చుకోవడం ద్వారా మాత్రమే మీ విలువ పెరుగుతుంది. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులను మెప్పించడానికి ఆరాటపడకండి.

– లిల్లీ, లైఫ్ కోచ్

అరాచక పాక్ బాటలో బంగ్లా!

ప్రజామోదంతో పాలకులైనవారు నేరాలకు పాల్పడితే- వారిని గద్దె దించి విచారణ జరిపి తగిన కారాగార శిక్ష విధించడంలో తప్పులేదు. ప్రజాస్వామ్య మనుగడకు అది అత్యవసరం కూడా. అలా కాకుండా అసత్య ఆరోపణలు మోపి రాజకీయ ప్రత్యర్థులను భౌతికంగా నిర్మూలించాలనుకోవడం దుర్మార్గమవుతుంది. అది సమాజంలో అశాంతిని రాజేసి దేశ సౌభాగ్యాన్ని హరిస్తుంది. తన ప్రధాన పోటీదారు హత్యకు కుట్రపన్నారనే నెపంతో పాక్ మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టోను 1979లో సైనిక పాలకులు ఉరితీశారు. ఆ కేసు విచారణ లొసుగులమయమని పాక్ సుప్రీంకోర్టే తేల్చిచెప్పింది. అంతకు ముందు పాక్ తొలి ప్రధానమంత్రి లియాఖత్ అలీఖాన్ ఓ రాజకీయ ర్యాలీలో హత్యకు గురయ్యారు. భుట్టో కుమార్తె బెనజీర్ 2007లో అలాగే కడతేరిపోయారు. ఈ అరాచక ఘటనలు, మతఛాందస శక్తుల విజృంభణలన్నీ కలగలిసి పాకిస్థాన్‌ను విఫల రాజ్యంగా మార్చేశాయి. ఇప్పుడు బంగ్లాదేశ్‌లో పరిస్థితులూ అలాగే అఘోరిస్తున్నాయి. నిరుటి విద్యార్థి ఉద్యమ సమయంలో హత్యలకు ఆదేశాలిచ్చారంటూ ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాకు స్థానిక అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్(ఐసీటీ) మరణశిక్ష విధించింది. ఆ తీర్పులోని న్యాయబద్ధత మేడిపండు చందమన్న సంగతి ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుంది!

ఎన్నికల్లో ఆర్థిక అవకతవకలకు పాల్పడినందుకు ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీకి ఇటీవల అయిదేళ్ల జైలు శిక్ష పడింది. పన్ను మోసం కేసులో ఇటలీ పూర్వ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీని ఏడాది పాటు సమాజ సేవ చేయాలని అక్కడి కోర్టు ఆదేశించింది. ప్రజాధనాన్ని దిగమింగినవారు రాజకీయంగా ఎంతటి బలసంపన్నులైనప్పటికీ వదిలిపెట్టని ప్రజాస్వామ్య వ్యవస్థలు పాశ్చాత్య దేశాల్లో పాదుగొన్నాయి. నిందితుల వాదనలను ఆలకించి, సాక్ష్యాధారాలను సాకల్యంగా పరిశీలించి అపరాధులను అక్కడ తగిన విధంగా దండిస్తుంటారు. అందుకు విరుద్ధంగా హసీనా పరోక్షంలో హడావుడిగా విచారణ జరిపి ఉరే సరి అనడమే గర్హనీయం. అసలు ఐసీటీ జడ్జిల నియామకాలే రాజ్యాంగ విరుద్ధమన్న కథనాలు వెలువడుతున్నాయి. ప్రజా ప్రభుత్వం లేనిచోట ఇష్టారీతిగా చట్టాలను మార్చి రాసి ఏకపక్షంగా శిక్షలు విధించడం సమర్థనీయమే కాదు. ఇలాంటి పెడపోకడలు హసీనా మద్దతుదారుల్లో ఆగ్రహావేశాలు రాజేస్తే బంగ్లా రావణకాష్ఠమవుతుంది. అలాంటి భయానక వాతావరణం నెలకొంటే- అభివృద్ధి పథంలో బంగ్లా ప్రస్థానం ఆగిపోయి అంతిమంగా ఆ దేశం మరో పాకిస్థాన్‌గా మిగిలిపోతుంది!

భారతావని చలవతోనే బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా ఆవిర్భవించింది. భార్య, కుమారులతో సహా 'బంగ బంధు' ముజిబుర్ రెహమాన్ హత్యకు గురైనప్పుడు హసీనాకు ఆరేళ్ల పాటు ఇండియానే ఆశ్రయమిచ్చింది. అనంతర కాలంలో ఆమె బంగ్లాదేశ్ పగ్గాలు చేపట్టాక ఇరుదేశాల బంధం బలపడింది. ఈశాన్యంలో వేర్పాటువాదుల పీచమణచడంలో ఇండియాకు హసీనా చాలా సహకరించారు. అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్న బంగ్లాదేశ్‌కు ఆమె సరికొత్త జవసత్వాలు అందించారు. హసీనా హయాంలో ఆ దేశం దక్షిణాసియాలో ఇండియా తరవాత రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఆమె ప్రభుత్వం కూలిపోయాక బంగ్లాదేశ్ ఆర్థిక అగచాట్లలో కూరుకుపోయింది. యూనస్ తాత్కాలిక సారథ్యంలో బంగ్లాలో మతఛాందస శక్తులకు కొత్త రెక్కలొచ్చాయి. పాకిస్థాన్, చైనా జమిలిగా బంగ్లాదేశ్‌లో ప్రాబల్యం చాటుకుంటున్నాయి. వీటికి తోడు హసీనాకు మరణశిక్ష విధింపు- భారత్‌తో బంగ్లా బంధాన్ని మరింతగా బీటలువార్చేదే. మన గడ్డపై తలదాచుకుంటున్న హసీనాను యూనస్ సర్కారుకు అప్పగించి, ఆమె ప్రాణాలను ప్రమాదంలో పడేయడం అసంభవమే. ఈ పరిస్థితుల్లో జాతీయ భద్రతా కోణంలో సరిహద్దుదేశ పరిణామాలను గమనిస్తూ ఇండియా అనునిత్యం అప్రమత్తంగా ఉండక తప్పదు!




తొలితరం కృషిని మలితరం అందిపుచ్చుకోవాలి. విద్యావంతులైన యువతకు స్ఫూర్తినిస్తూ తమ అనుచరులుగా మార్చుకోవాలి. వారసత్వాన్ని సమర్థంగా కొనసాగించే వాళ్లుంటేనే ఏ రంగమైనా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది.

– సరోజిని వరదప్పన్, సంఘసేవకురాలు

అనుష్ఠానం

అనుష్ఠానం అంటే నిర్వహించడం, అమలు చేయడం. దీన్నే ఉపాసన అనీ కర్మకాండ అనీ పిలుస్తారు. ఇది ఒక పని కాదు. ఏదైనా ఒక లక్ష్యాన్ని సాధించడానికి చేసే క్రమబద్ధమైన కార్యక్రమం. ఉదాహరణకు ఒక మంత్రాన్ని కొంత కాలంపాటు నిరంతరాయంగా జపించడం- అనుష్ఠానమే.

ఇతరులకు సంతోషాన్ని కలిగించే పనులు, సాయం లాంటివన్నీ సామాజిక అనుష్ఠానంలో భాగాలు. ఆధ్యాత్మిక సాధనలో భాగంగా చేసే నిర్దిష్ట కర్మలను ఆధ్యాత్మిక అనుష్ఠానంగా భావిస్తారు. హరిస్మరణ, సేవ, సత్యాచరణ ముఖ్యాంశాలుగా భక్తితో చేసిన నిరంతర కర్మ మాత్రమే భగవంతుడికి ప్రీతిపాత్రమైందని భాగవతం చెబుతోంది. తెలిసిన సత్యం కన్నా, అనుష్ఠించిన సత్యమే స్పష్టంగా ఉంటుంది. మనసు కోతి లాంటిది. చూసినదాంతోనో, విన్నదాంతోనో ప్రభావానికి లోనై, క్రియాశీలమవుతుంది. ఒక పనిని ఒకసారి చేస్తే, ఫలితం పొందడం కష్టసాధ్యం. అదే పనిని ప్రయత్నపూర్వకంగా పదేపదే చేయడం వల్ల, మనసుకు అది అలవాటుగా మారి ఫలితం సిద్ధిస్తుంది. సజ్జన సాంగత్యంతో, నిరంతరాయంగా గుడికి వెళ్లి భగవన్నామ స్మరణ చేస్తే, అది ఆ మనిషికి అలవాటుగా మారి, అతణ్ని భగవంతుడికి చేరువ చేస్తుంది.



పురాణపఠనం నిత్యం చేయడం వల్ల ధర్మం, నిజాయతీ, దయ వంటి విలువలు అలవడతాయి. ఫలితంగా సకల అనర్థాలకూ మూలమైన మనసు, ద్వంద్వాలకు దూరమై శాంతిని పొంది, స్థితప్రజ్ఞతకు దారిస్తుంది. అందుకే కర్మ, భక్తి, జ్ఞాన యోగానుష్ఠానాలు సంపూర్ణ ఆత్మవికాసానికి ఆలంబనలని భగవానుడు గీతలో బోధిస్తాడు.

అంతర్యామి

వైదిక జీవుల అనుష్ఠానం ఒకలా ఉంటే, విభిన్న రంగాలకు చెందిన లౌకిక వర్గాలది వేరుగా ఉంటుంది. అందుకే ఎవరి స్థాయిలో చేసేది వారు వదలకూడదని ప్రాజ్ఞులు చెబుతారు. పర్వదినాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉన్నా, నిత్యానుష్ఠానంలో మాత్రం మార్పు రాకూడదు. అనుష్ఠాన బలం గట్టిగా ఉన్నపుడు శిల కూడా శివుడి ప్రతిరూపమవుతుందని మహాత్ములు చెబుతారు. తాము ఆచరిస్తూ, ఇతరులతో ఆచరింపజేసే ప్రయత్నం ఉత్తమం. శాస్త్రాధ్యయనం చేసే పండితులే కాక, అనుష్ఠానం చేసే సామాన్యులు కూడా ఈ ప్రయత్నం మానకూడదు. అందుకే జ్ఞానం గురువుల కోసం కాదని, సమాజం కోసమని సకల శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ధర్మరక్షణలో అనుష్ఠానం మొదటిదైతే, ధర్మవ్యాప్తి రెండోది.

ధర్మో రక్షతి రక్షితః అన్న సూక్తికి ఆచరణలో దెబ్బ తగిలితే, ప్రతిఘటించే బలం సంపాదించుకోవాలి. అందుకు భార్గవరాముడే అందరికీ ఆదర్శం. సకల జీవుల పరిరక్షణకు నడుంకట్టినవాడే 'రాజు' అంటాయి రామాయణ మహాభారతాలు. పాలకులు అలాంటి అనుష్ఠానాన్ని ఎంచుకోవాలి. తల్లిదండ్రులంతా ధర్మాచరణలో నిమగ్నమై పిల్లలతో ఆచరింపజేస్తూ, త్యాగబుద్ధితో ప్రతి ఇంటినీ ఒక పాఠశాలగా చేసినప్పుడే, అది జీవహితమై అలరారుతుంది, అందరికీ మేలు చేకూరుతుంది.

– పాటిబండ్ల వీర వెంకట సత్యనారాయణ

'టెపా' ఒప్పందం ఎవరికి అనుకూలం?

ఐరోపా స్వేచ్ఛా వాణిజ్య సంఘం (ఈఎఫ్‌టీఏ-ఎఫ్టా)తో మనదేశం వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టెపా) కుదుర్చుకుంది. ఈ ఏడాది అక్టోబరు 1 నుంచి టెపా అమల్లోకి వచ్చింది. ఇదొక చరిత్రాత్మక విజయమని ఎల్లెడలా ప్రశంసలు కురిశాయి. భారత్‌కు భారీగా పెట్టుబడులు వస్తాయని, ఉద్యోగాలు పుట్టుకొస్తాయన్న ప్రచారం జరిగింది. ఈ ఒప్పందంతో మన దేశానికి నిజంగా లాభమేనా?

పదహారేళ్ల సుదీర్ఘ చర్చల తరవాత టెపా ఒప్పందం కుదిరింది. దీని కింద ఎఫ్టాలోని స్విట్జర్లాండ్, లిక్టెన్‌స్టెయిన్, నార్వే, ఐస్‌లాండ్ వంటి దేశాలు వచ్చే పదిహేనేళ్లలో 10వేల కోట్ల డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ) పెడతాయని ప్రకటించాయి. తద్వారా భారత్‌లో పది లక్షల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని చెప్పుకొచ్చారు. కానీ, ఈ ఒప్పందాన్ని లోతుగా పరిశీలిస్తే ఎఫ్టా దేశాలు భారత్‌లో కొత్తగా పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టబోవడం లేదని, నూతన సాంకేతికతలను బదిలీ చేయబోవడం లేదన్న సంగతి అర్థమవుతుంది. ఎందుకంటే, వాగ్దానాల నుంచి తప్పించుకునే క్లాజులు ఒప్పందంలోనే ఉన్నాయి. 2000-2024 మధ్య నాలుగు ఎఫ్టా దేశాలు భారత్‌లో మొత్తం పెట్టుబడులు 1180 కోట్ల డాలర్లకు మించవు. గడచిన దశాబ్దంలో అవి ఏటా అందించిన ఎఫ్‌డీఐ 86కోట్ల డాలర్లు మాత్రమే. తాజాగా టెపా కింద చేసిన వాగ్దానాలను నెరవేర్చాలంటే ఎఫ్టా వార్షిక ఎఫ్‌డీఐ ఏడు రెట్లు పెరగాల్సి ఉంటుంది. ఒప్పందం కుదిరిన తరవాత ఈ ఏడాది కాలంలో ఎఫ్టా దేశాల నుంచి భారత్‌కు అందిన పెట్టుబడులు 33.4కోట్ల డాలర్లు మాత్రమే. ఈ లెక్కన 10వేల కోట్ల డాలర్ల ఎఫ్‌డీఐ ఎప్పటికి వస్తుందోనన్న సందేహం వ్యక్తమవుతోంది. 2021లో ఒక స్విస్ హోల్డింగ్ కంపెనీ ద్వారా జర్మనీ సంస్థ బాష్ పునర్వ్యవస్థీకరణ జరిగింది. దాని వ్యయం 400 కోట్ల డాలర్లే అయినా కొత్త పెట్టుబడులేవీ రాలేదు. ఈ లావాదేవీతో ఇండియాలో స్విస్ పెట్టుబడులు పెరిగినట్లు మాత్రం కనిపించింది. దీన్ని మినహాయిస్తే భారత్‌లో ఎఫ్టా దేశాల పెట్టుబడులు ఏడాదికి 40 కోట్ల డాలర్లను మించవు.






కాలయాపనకు అవకాశం

భారత్‌లో 2015-24 మధ్యకాలంలో ఎఫ్టా దేశాల పెట్టుబడుల్లో మూడోవంతు మాత్రమే పారిశ్రామిక రంగంలోకి ప్రవహించాయి. మన పరిశ్రమలకు అధునాతన సాంకేతికతలు అందుతాయనుకున్న ఆశలు నెరవేరలేదు. 2020 తరవాత ఈఎఫ్‌టీఏ దేశాలు మన పరిశ్రమల్లోకన్నా బీమా, ఫైనాన్స్ రంగాల్లోనే ఎక్కువ పెట్టుబడులు పెట్టాయి. స్విట్జర్లాండ్ పారిశ్రామిక విలీనానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. ఆ దేశం నుంచి బయటికి ఎఫ్‌డీఐల ప్రవాహం తగ్గిపోయింది. ఫలితంగా ఇతర దేశాల్లో కొత్త ఉద్యోగావకాశాలు పుట్టుకు రావడం లేదు. ఇండియాకు తప్పనిసరిగా అధునాతన సాంకేతికతలను బదిలీ చేయాలన్న నిబంధన ఒప్పందంలో లేదు. అందువల్ల ఈఎఫ్‌టీఏ దేశాల కంపెనీలు భారతీయ సంస్థలకు అధునాతన సాంకేతికతలను అందించే అవకాశం లేదు. వాటి సామర్థ్య పెంపునకు భాగస్వాములుగానూ వ్యవహరించవు. ఏబీబీ ఇండియా, నెస్లే ఇండియా, గివౌడాన్ ఇండియా వంటి స్విస్ కంపెనీలు ఇక్కడ ఆర్జించిన లాభాలను స్వదేశానికి తరలిస్తాయే తప్ప అధునాతన సాంకేతిక సామర్థ్యాలను బదిలీ చేయవు.

టెపా క్లాజులను చూస్తే ఎఫ్టా దేశాలు నేరుగా భారత్‌లో పెట్టుబడులు పెట్టకపోయినా ఫర్వాలేదు అన్నట్టున్నాయి. అమెరికా, జర్మనీ వంటి దేశాల నుంచి స్విట్జర్లాండ్ గుండా భారత్‌కు వచ్చిన పెట్టుబడులను కూడా ఎఫ్టా పెట్టుబడులుగానే పరిగణించడం మరో విషయం! దీనివల్ల ఒప్పందం కింద భారత్‌లో పెట్టాల్సిన 10 వేల కోట్ల డాలర్ల పెట్టుబడిలో వాటినీ భాగంగా చూపించవచ్చు. యుద్ధాలు, మహమ్మారులు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే భారత్‌లో పెట్టుబడులు పెట్టనక్కర్లేదనే నిబంధన కూడా టెపాలో ఉంది. ఒప్పందం కింద పెట్టాల్సిన పెట్టుబడులను ఈఎఫ్‌టీఏ దేశాలు భారత్‌లో పెట్టకపోయినా, ఇతర నిర్దేశిత లక్ష్యాలను అందుకోలేకపోయినా చేసేదేమీ లేదు. చర్చల పేరిట కనీసం రెండు దశాబ్దాల పాటు కాలయాపన చేయడానికి టెపా అవకాశం కల్పిస్తోంది. స్విస్ బహుళజాతి సంస్థలు ప్రపంచంలో దాదాపు 25 లక్షల ఉద్యోగాలు సృష్టించినా, గత పదేళ్లలో పారిశ్రామిక కొలువులు 14 లక్షలకు మించడం లేదు. కాబట్టి టెపా కింద ఈఎఫ్‌టీఏ దేశాలు భారత్‌లో 10 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తాయని ఆశించడం అత్యాశే. ఈఎఫ్‌టీఏ దేశాలు వివిధ కంపెనీల స్వాధీనానికి, విలీనానికే ప్రాధాన్యం ఇస్తాయి. అక్కడ ఉన్న ఉద్యోగులే ఇతర సర్దుబాటు అవుతారు, తప్పించి కొత్త ఉద్యోగాలు రాకపోవచ్చు. 10వేల కోట్ల డాలర్ల పెట్టుబడులనేవి చట్టపరంగా తప్పనిసరి కావని, ఎక్కడ పెట్టుబడులు పెట్టాలనేది తమ కంపెనీలను స్విస్ ప్రభుత్వం శాసించలేదని చెబుతున్నారు. స్విస్ పాడి ఉత్పత్తులను అనుమతించబోమని భారత్ చెబుతున్నా వాటిని మనతోపాటు చైనా, లాటిన్ అమెరికా దేశాలకు అంటగట్టే ప్రయత్నం జరుగుతుంది. అధిక పెట్టుబడుల ఎరతో పని పూర్తి చేసుకునేందుకు స్విస్ ప్రయత్నిస్తుంది.

భారత్ కర్తవ్యమిదే

మనదేశంలో ఆర్థిక సంస్కరణలు చేపట్టినప్పటి నుంచి ఎఫ్‌డీఐలన్నీ మంచివని, అవెంత ఎక్కువగా వస్తే అంత లాభమనే భావన నెలకొంది. దాంతో చిన్న పరిశ్రమలను సహా అన్ని రంగాల్లోకీ ఎఫ్‌డీఐలు చొరబడ్డాయి. విదేశీ వస్తువులూ సాంకేతికతలతో ఇండియా కిక్కిరిసిపోతోంది. స్వదేశీ శుష్కనినాదంగా మారుతోంది. లాభంకన్నా నష్టమే ఎక్కువైంది. చైనా మాత్రం కీలక రంగాల్లోకి ఎఫ్‌డీఐ, అధునాతన సాంకేతికతలను ఆహ్వానించింది. తమ దేశంలో బృహత్తర కంపెనీలను అభివృద్ధి చేసుకుంది. టెపా ఒప్పందాన్ని కూడా ఇండియా తనకు అనుకూల రీతిలో మలచుకుని ఎదగాలి. ఈ ఒప్పందం కింద పెట్టాల్సిన పెట్టుబడుల్లో కొత్త ప్రాజెక్టులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని దిల్లీ స్పష్టం చేయాలి. ఫైనాన్స్ రంగం కాని విభాగాల్లోని పెట్టుబడులను షేర్‌మార్కెట్ పెట్టుబడులుగా పరిగణించాలి. ఈఎఫ్‌టీఏ దేశాల ద్వారా ఇతర దేశాల పెట్టుబడులు, సాంకేతికతలు భారత్‌లోకి ప్రవేశిస్తే టెపా కింద గుర్తించకూడదు. నికర పెట్టుబడుల ప్రవాహం, సాంకేతికతల బదిలీ, కొత్త ఉద్యోగాల సృష్టి వంటివాటిని సంయుక్త యంత్రాంగం ద్వారా నిర్ధారించాలి.



ప్రొఫెసర్ కె.ఎస్.చలపతిరావు
సీనియర్ రీసెర్చ్ ఫెలో, అకాడమీ ఆఫ్ బిజినెస్ స్టడీస్, దిల్లీ
విశ్రాంత ఆచార్యులు, ఐఎస్ఐడీ



రోజుకు రెండున్నర గంటలా..!

జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని అందరూ కలలు కంటారు. దాన్ని నిజం చేసుకోవడానికి ఎలా పని చేస్తున్నామన్నది ముఖ్యం. అంబానీల్లాంటి కుబేరులకైనా, ఆఫీసులో తరగని ఫైళ్ల గుట్టలో కూరుకుపోయే క్లర్కుకైనా; ఐఐటీనో ఐఏఎస్సో లక్ష్యంగా చదువుకునే విద్యార్థికైనా, ఒలింపిక్ పతకమే ధ్యేయంగా సాధన చేస్తున్న ఆటగాడికైనా ఉండేది ఇరవై నాలుగ్గంటలే. దాన్ని ఎలా ఉపయోగించుకుంటున్నామన్నదే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

కొందరికి పొద్దున్నే లేచి కాసేపు వ్యాయామం చేసి గబగబా పనులు చేసుకోవడం అలవాటు. మరికొందరికి లేవగానే ఫోన్ చూసుకోకపోతే తోచదు. వాట్సాప్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, ఎక్స్... అన్నిట్లోకీ ఒక రౌండ్ వేసొచ్చేసరికి అరవై నిమిషాలు హుష్ కాకి అయిపోతాయి. రీల్స్ స్క్రోల్ చేయడం మొదలెడితే ఎవరైనా పిలిచేదాకా ఈ లోకంలోనే ఉండని వారెందరో. బ్లాక్ హోల్ ఎక్కడో లేదు, మన చేతిలోనే ఉంది. మనకి ఎంతో విలువైన కాలాన్ని మింగేసే ఆ మొబైల్‌ను ఒక్కపూట పక్కన పెట్టి చూడండి. మీకెంత టైమ్ ఉంటుందో, ఎన్ని పనులు చేయగలరో తెలుస్తుంది. చెప్పడానికేం అందరూ చెబుతారు. ఎవరూ వాడకుండానే సోషల్ మీడియా నిండా ఇంత కంటెంట్ వస్తోందా?... అని కదూ మీ ప్రశ్న. నిజమే ఆ కంటెంట్ రాసేవాళ్లంతా రాసి అక్కడ పడేసి వాళ్ల పనులు వాళ్లు చేసుకుంటున్నారు. మనం అవన్నీ చదువుతూ చూస్తూ నవ్వుకుంటూ ఆశ్చర్యపోతూ... ఒక్క మాటలో చెప్పాలంటే వాళ్లకు వినియోగదారులుగా మారిపోతున్నాం. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ రోజుకు సగటున రెండున్నర గంటలు సోషల్ మీడియాలో గడుపుతున్నారట. ఒక్కసారి ఆలోచించండి... రెండున్నర గంటల్లో ఎన్ని పనులు చేయవచ్చో!


అంతదాకా ఎందుకు... రోజంతా సంగతి వదిలేయండి, పొద్దున్న లేవగానే ఫోన్ పట్టుకోవడం వల్ల మనకు తెలియకుండానే మనకి మనం ఎంత హాని చేసుకుంటున్నామో తెలుసా? సోషల్ మీడియాలో రకరకాల యాప్‌లలో ఒకదానికొకటి సంబంధం లేని సమాచారాన్ని ఒకేసారి చూడటం వల్ల మెదడు మీద ఒత్తిడి పెరిగిపోతోందట. దాని ప్రభావం రోజంతా మనం చేసే పనుల మీద పడుతోందట. కావాలంటే రెండు రోజులు లేవగానే ఫోను సంగతి మర్చిపోయి పనులు చేసుకోండి, తేడా మీకే తెలుస్తుంది- అంటున్నారు పరిశోధకులు. గుర్తుపెట్టుకోవాల్సిన అక్కర్లేదో తెలియని సమాచార వరద మెదడు మీద పడదు కాబట్టి అది ప్రశాంతంగా ఉంటుంది. మూడ్‌ని ఉత్సాహంగా ఉంచుతుంది. దాంతో చేసే పని మీద ఏకాగ్రత కుదురుతుంది. వీటివల్ల సహజంగానే పనితీరు మెరుగవుతుంది. చదువుకునేవాళ్లకు చదివిందంతా గుర్తుంటుంది, ఆడేవాళ్లు ఫోకస్డ్‌గా సాధన చేస్తారు. ఉద్యోగం చేసేవాళ్ల ఉత్పాదకత పెరుగుతుంది. కాస్త శారీరక వ్యాయామం కూడా జత చేశారనుకోండి... ఇక మీకు తిరుగే లేదంటున్నాయి అధ్యయనాలు. ఓవరాల్‌గా ఆరోగ్యం మెరుగై లక్ష్యం మీద, కల నెరవేర్చుకోవడం మీద దృష్టి పెడతారు. అప్పుడిక ఫోన్‌ని అవసరానికి తప్ప వాడరు.

– సుతారపు సోమశేఖర్



మాదక మారణహోమం

కొన్నేళ్లుగా దేశదేశాల్లో విచ్చలవిడిగా దొరుకుతున్న మాదకద్రవ్యాలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. ముఖ్యంగా యువత ఉజ్జ్వల భవిష్యత్తును అవి నిర్వీర్యం చేస్తున్నాయి. గత మూడు దశాబ్దాల్లో డ్రగ్స్ వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య దాదాపు రెట్టింపయ్యింది. మత్తు మందుల వల్ల అనారోగ్యం బారిన పడి, ఎయిడ్స్, హెపటైటిస్ బి, సి వంటివి సోకి జనం పెద్దసంఖ్యలో చనిపోతున్నారు. డ్రగ్స్ విపరీత వినియోగంతో కాలేయ క్యాన్సర్ కోరలు చాస్తోంది. మాదక ద్రవ్యాల మత్తులో ఎంతోమంది స్వీయ హానికీ ఒడిగడుతున్నారు. ఆయా సంవత్సరాల్లో డ్రగ్స్ వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎంత మంది మరణించారంటే... (లక్షల్లో)




(ఆధారం: వరల్డ్ డ్రగ్ రిపోర్ట్-2025)

మట్టికరిచిన 'మహానుభావులు'!

దేశమంతా ఆసక్తిగా, బెదురు బెదురుగా ఎదురుచూసిన బిహార్ శాసనసభ ఎన్నికల్లో నిలిచింది ఎన్ని పార్టీలైనా గెలిచింది మాత్రం బిహారే. దశాబ్దాల తరబడి పీడకలగా మారిన జంగిల్ రాజ్ మళ్లీ వస్తుందేమోనని భయపడి పదోసారి సీఎంగా నీతీశ్‌కు పట్టం కట్టింది బిహార్. దాంతో ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టిందని నీతీశ్ అభిమానులు 'హమ్మయ్య' అనుకుంటున్నారు.

బిహార్ అంటే లాలూ ప్రసాద్, ఆయన పార్టీ రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) ఎవరికైనా గుర్తురావడం సహజం. లాలూ అంటే వ్యక్తి కాదు వ్యవస్థ.. జనానికి అవస్థ అన్నమాట ఉన్నమాటే! పశుగ్రాసం స్కాం ఫేం లాలూ- తన సతీమణి రబ్రీ దేవిని సీఎం చేసి, తాను 'జైల్ రాజ్' నడిపించారన్న చెడ్డ పేరు మూటకట్టుకున్నారు. ఆ మూట బరువు మోయలేక జనం దభేల్మని కింద పడేసి గూబ గుభేల్ మనిపించారు. ఇప్పుడు మళ్లీ లాలూ దర్శకత్వంలో ఆయన తనయుడు తేజస్వీ యాదవ్ ముఖ్యమంత్రి సింహాసనం ఎక్కాలని కలలుగని భంగపడి బెంగపడ్డారు.



బిహార్‌లో మట్టికరిచిన పార్టీలకు ఇప్పుడు ఏడుపొచ్చినా, ఎన్నికల్లో వాటి వాలకం గుర్తొచ్చి ప్రజలకు తెగ నవ్వొస్తోంది. ఎన్నికలకు ముందు ప్రత్యేకించి ఆర్జేడీ, కాంగ్రెస్ వంటి వాటి తీరు- 'మమ్మల్ని ఎలా గెలిపిస్తారో చూస్తాం! మీకు దమ్ముంటే గెలిపించండి' అని ఓటర్లకు సవాల్ విసిరినట్టుంది. సీట్ల సర్దుబాటు చర్చలను, 'గుద్దు'బాటు పోటీలు చేసుకుని.. ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో మల్లగుల్లాలుపడి.. ఘాటు ఘాటు అని చెప్పుకొన్న మహా గఠ్‌బంధన్ జనానికి సూటు గాక ఎన్నికల్లో గట్టిగా దెబ్బతింది. ముఖ్యంగా ఈసారి బిహార్‌లో కాంగ్రెస్ ఏ పార్టీతోనూ పోరాడలేదు. ఓట్ చోరీ అంటూ ఎన్నికల సంఘాన్నే ప్రత్యర్థిగా భావించి యుద్ధం చేసింది. అయినా, ఫలితాల తరవాత ఎన్నికల కమిషన్ తాను కాంగ్రెస్ మీద గెలిచానని చెప్పలేదు. ఓట్ చోరీ అంటున్నారే, మరి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఎలా గెలిచిందంటే ఆ క్రెడిట్ కాంగ్రెస్‌దీ కాదు.. రాహుల్ గాంధీదీ కాదు, రేవంత్ రెడ్డిది అని లోకమంతా మైకయి కూస్తోంది.


ఏ దేవుడు ఎప్పుడిచ్చాడో తేదీలు, దస్తావేజులు లేవుగానీ- కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఒక వరముంది. దాని ఫలితంగా కాంగ్రెస్‌ను ఓడించే పార్టీ ఇప్పటివరకూ పుట్టలేదు. ఇక ముందు పుట్టబోదు. అసలు అంత అవసరం వేరే పార్టీలకు ఏముంది? తమను తాము ఓడించుకునే శక్తి కాంగ్రెస్ వాళ్లకు లేకపోతే కదా వేరేవాళ్ల అవసరం పడేది! కాంగ్రెస్ వాళ్ల వ్యూహం అనన్య సామాన్యం. తాము అధికారంలో ఉన్నప్పుడు తమ ముఖ్యమంత్రులను గద్దె దించడానికి ఆ పార్టీ అసమ్మతివాదులు తెగ కష్టపడి తమ పార్టీ ఓటమికి చిత్తశుద్ధితో పాటు 'విత్తసిద్ధి'తో తామే బంగారుబాటలు వేస్తారు. ఎన్నికలు వస్తే చాలు తమ రక్తంలో ఎన్ని గ్రూపులున్నా, అసమ్మతివాదులంతా ఒక్కతాటిపై నిలిచి, కాంగ్రెస్ తాడుతెగి అందరూ కిందపడిపోయి పార్టీ అడ్రస్సు గల్లంతయ్యే దాకా వదలరు. ఇది బిహార్‌లో అచ్చోసినట్టు, ముక్కు మీద ఓటుతో గుద్దినట్టు జరిగింది. బిహార్ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 19 సీట్లు గెలిస్తే, ఈసారి 61 సీట్లలో పోటీ చేసి 6 స్థానాల్లో విజయం సాధించింది. అయితేనేం ఈ ఎన్నికల్లో తాము పోగొట్టుకుంది 61లో 6 పక్కన ఉన్న ఒకటేగా అంటూ ఆ పార్టీవాళ్లు కొందరు కుళ్లు జోకు వేసుకుంటున్నారు. ఇక్కడ చెప్పాల్సిన తమాషా ఒకటుంది. కుంభకోణాల్లో లాలూను ఓడించగలిగిన సత్తా ఉన్న మేత నేత విషయమిది. అది వైకాపా గతి, సంగతి. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపాకు 151 సీట్లొస్తే 2024లో కేవలం 11 దక్కాయి. జగన్‌కు ప్రతిపక్షహోదా కూడా రాలేదు. 151 మధ్యలో ఉన్న 5 మాత్రమే మిస్సయింది.. అటూ, ఇటూ కలిపి 11 వచ్చాయిగా అని వైకాపాలోని అసమ్మతివాదులు అప్పటి నుంచి జగన్‌కు వినపడకుండా నవ్వుకుంటూనే ఉన్నారు. జగన్‌ను సాగనంపడానికి వారేమన్నా కుట్రలు చేశారా అంటే అదేమీ లేదు. అసలా అవసరమే లేదు. జగన్ ఒక్క చేత్తో కోటి మందికి పైగా ఓటర్లను అసమ్మతివాదులుగా మార్చేసుకుని 'అసమాన విజయం' సాధించారు. లాలూ జంగిల్ రాజ్యానికి మించిపోయిన జగన్ రాజ్యం ఏపీ ప్రజలతో అంతగా 'అమ్మ బాబోయ్' అనిపించింది మరి!

ఇక వైకాపా సహా ఎన్నో పార్టీలను గెలిపించానని రొమ్ము విరుచుకుని తిరిగే ప్రశాంత్ కిశోర్ సొంతంగా పెట్టుకున్న పార్టీ బిహార్‌లో గల్లంతు కావడం ఆయనకూ ఆశ్చర్యం కలిగించలేదు. తన లాంటి ఎన్నికల సలహాదారుణ్ని పెట్టుకుని ఉంటే కనీసం కొన్ని సీట్లయినా దక్కేవని కొందరు ఎకసెక్కాలాడుతున్నారు. 'స్వ(పార్టీ)స్వరూప జ్ఞానం' ఉండబట్టే ఆయన పోటీకి దిగకుండా ఆమడదూరంలో ఉన్నారని వారు వ్యాఖ్యానిస్తున్నారు. దర్శకత్వం వేరు, ప్రదర్శకత్వం వేరు అని నొక్కి వక్కాణిస్తున్నారు. ఏది ఏమైనా అందరికీ శకునం చెప్పే బల్లి తానే కుడితిలో పడ్డదన్న సామెత ప్రశాంత్ కిశోర్ కన్నా ముందే ఎలా పుట్టిందనేది పెద్ద వింత!

– శంభు

ఓయ్! బుజ్జీ!! — ఆదుకునే స్నేహితుడే ఉంటే..


ఓ గ్రామంలో రామయ్య, కృష్ణయ్య అనే ఇద్దరు రైతులు ఉండేవారు. వాళ్ల ఇళ్లు, పొలాలు కూడా పక్కపక్కనే. అయితే రామయ్య పొలంలో పెద్ద బావి ఉండేది. కృష్ణయ్యేమో బోరు వేయించాడు. ఇద్దరూ కలిసే పొలానికి వెళ్లేవారు. కలిసే పని చేసుకునేవారు. కానీ కృష్ణయ్య మాత్రం ఎప్పుడూ రామయ్యను నమ్మేవాడు కాదు. తన పొలానికి రావాల్సిన నీళ్లు అటువైపే తిప్పుకొంటున్నాడని అనుకునేవాడు. పొరపాటున ఎప్పుడైనా పంట ఎండిపోతే.. దానికి కారణం రామయ్యే అనుకునేవాడు. అనుకోకుండా ఒకరోజు కృష్ణయ్య భార్యకు ఆరోగ్యం బాగోకపోవడంతో పట్టణంలోని ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చింది. అక్కడేమో డాక్టర్ వారం రోజులు ఉండాలని చెప్పడంతో ఉండిపోయారు. కానీ కృష్ణయ్య మనసంతా పొలం మీదే ఉంది. 'పొలం కోతకు వచ్చింది. వాన పడితే పంటంతా నాశనం అవుతుంది.



ఈ సమయంలో వారం రోజులు ఇక్కడే ఉంటే ఎలా? ఆ రామయ్య నా పంటను పట్టించుకునే అవకాశమే లేదు' అనుకుంటూ కుమిలిపోసాగాడు కృష్ణయ్య.

ఆరోజు బాగా మబ్బులు కమ్ముకున్నాయి. మిత్రుడు ఆసుపత్రికి వెళ్లిన విషయం తెలుసుకున్న రామయ్య.. కొంతమంది కూలీలను తీసుకొచ్చాడు. వెంటనే ఇద్దరి పొలాన్నీ కోయించాడు. కుప్పలు వేయించి.. ధాన్యాన్ని భద్రపరిచాడు. ఆ సమయంలోనే పట్టణంలో జోరున వర్షాలు కురిశాయి. 'అయ్యో! నా పంట అంతా నీటి పాలై ఉంటుంది' అనుకుని బాధపడిపోయాడు కృష్ణయ్య. వారం గడిచాక భార్యని ఇంట్లో దింపి.. వెంటనే పొలానికి పరుగులు తీశాడు. అప్పుడే అటువైపుగా వస్తున్న పాపయ్య జరిగిన విషయం చెప్పాడు. దాంతో మిత్రున్నే తప్పుగా అర్థం చేసుకున్నందుకు చాలా బాధపడ్డాడు కృష్ణయ్య. పొలంలో పనిచేస్తున్న రామయ్య దగ్గరికి వెళ్లి.. తనను క్షమించమని అడిగాడు.

– ముక్కామల జానకీరామ్



అక్షరాల చెట్టు

ఈ అక్షరాలతో అర్థవంతమైన పదం తయారు చేయండి.

జవాబు: LITERATURE

నిత్య కార్తికం.. పచ్చతోరణం



కార్తిక మాసం సందర్భంగా కళాశాల విద్యార్థులు అంతా ఎక్కడో పచ్చని ప్రాంతానికి విహారయాత్రకు వెళ్లి ఇలా మధ్యాహ్న భోజనం చేస్తున్నారని అనుకుంటున్నారా..! అదేంకాదండి వీరికి నిత్యం కార్తిక వనభోజనాలే. ఏడు దశాబ్దాలుగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాల ప్రాంగణం ఇది. 1954లో ప్రారంభమై.. 98 ఎకరాల్లో విస్తరించిన ఈ కళాశాలలో సుమారు 20 ఎకరాల్లో మాత్రమే తరగతి గదులు, వసతిగృహాలు, కార్యనిర్వహణ భవనాలు ఉంటాయి. మిగిలిన 78 ఎకరాలు భారీ వృక్షాలతో, విశాలమైన మైదానాలతో నిండి ఉంది. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్‌లలో 5వేల మందికి పైగా విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. నిత్యం ఇలా మధ్యాహ్న విరామ సమయంలో కళాశాలలో అంతర్గత రహదారుల్లో పచ్చని చెట్ల నీడలో ఆహ్లాదభరిత వాతావరణంలో అమ్మాయిలు ఒకవైపు, అబ్బాయిలు మరోవైపు కూర్చుని భోజనాలు చేస్తారు. - ఈనాడు, అమరావతి

ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విజయవాడ (రైల్వేస్టేషన్): ప్రయాణికుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాలకు నడుపుతున్న ప్రత్యేక రైళ్లను పండగల దృష్ట్యా పొడిగిస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07033/07034 కాకినాడ టౌన్- మైసూర్ ప్రత్యేక రైలు డిసెంబరు 1వ తేదీ నుంచి జనవరి 13 వరకు, 07153/07154 నర్సాపూర్- బెంగళూరు జనవరి 2వ తేదీ నుంచి 10 వరకు, 07165/07166 హైదరాబాద్- భువనేశ్వర్ డిసెంబరు 12వ తేదీ నుంచి జనవరి 28 వరకు రాకపోకలు సాగిస్తాయని చెప్పారు.

ధాన్యం సేకరణ.. ఇక హాయ్ హాయి!



జిల్లాలో వరి సాగు విస్తీర్ణం: 1.34 లక్షల ఎకరాలు
దిగుబడి: 3.59 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాలు: 149
ధాన్యం కొనుగోలు లక్ష్యం: 1.5 లక్షల మెట్రిక్ టన్నులు

కంకిపాడు, ఉయ్యూరు గ్రామీణం, గంపలగూడెం: ఆరుగాలం శ్రమించి పండించిన వ్యవసాయోత్పత్తుల సేకరణలో ఎదురవుతోన్న ఇబ్బందులను చాలా వరకు పరిష్కరించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికత సాయంతో వినూత్న ప్రక్రియలను అందుబాటులోకి తెస్తోంది. ఈ-పంట నమోదును సంబంధిత రైతు ఫోన్ నంబరుతో లింక్ చేస్తున్నారు. దీని ఆధారంగా కల్లంలోనే ఉండి ఖరీఫ్ ధాన్యం సమాచారాన్ని నిర్దారిత 'యాప్'లో అప్‌లోడు చేసుకునే సౌకర్యం కల్పించారు. లింకైన ఫోన్ నుంచి వాట్సప్‌లో 7337359375కు 'హాయ్(హెచ్ఐ)' అని సందేశం పంపిన వెంటనే రైతుకు నమూనా తెరపై ప్రత్యక్షమవుతుంది.

సందేశం పంపితే స్పందిస్తారు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలనుకునే రైతులు 'హాయ్' సందేశం పంపగానే పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందిస్తారు. రైతు వద్ద ఎన్ని బస్తాల ధాన్యం ఉంది.. ఏ రకానికి చెందినది.. ఎగుమతికి ఇంకా ఎన్ని రోజులు అవసరం.. వంటి ప్రశ్నలకు ఐచ్ఛిక(ఆప్షన్)రూపంలో రైతు బదులివ్వాలి. అనంతరం సమీప కొనుగోలు కేంద్రం, సేకరణ రైస్ మిల్లు ఊరు, పేరుతో పాటు స్లాట్ బుక్ అవుతుంది. దీంతో ఎక్కడికి, ఎప్పుడు తీసుకెళ్లాలనే ఆందోళన తొలగిపోతుందని చెబుతున్నారు.

నిస్పృహ వలదండి.. నిశ్చయంగా కదలండి..

ఈనాడు, అమరావతి

'విజయవాడ, మచిలీపట్నం నగరాలు.. ఉమ్మడి జిల్లాలో అన్ని పట్టణాల్లో నిత్యం ఎదుర్కొనే.. అనేక ప్రమాద, కాలుష్య సమస్యలను.. పౌరస్పృహతోనే పరిష్కరించొచ్చు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిని గుల్లచేస్తూ.. పర్యావరణ సమతుల్యతను దెబ్బకొడుతున్నాయి. దశాబ్దాలుగా ప్లాస్టిక్ వ్యర్థాలపై విస్తృత ప్రచారం చేస్తున్నా మార్పులేదు. ఇది నా సమస్య కాదని అందరూ అనుకోవడం వల్లే.. ప్లాస్టిక్ వ్యర్థాలు మరింతగా పెరుగుతున్నాయి. ఇది భవిష్యత్తులో మరింత ప్రమాదకరం కానుంది.'

17 నగరాల్లో మనమూ... 2025 అక్టోబరు 02 నుంచి పర్యావరణ, ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా విజయవాడ, మచిలీపట్నం సహా 17 నగరాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధిస్తూ ప్రభుత్వం ఆదేశించింది. కానీ.. ప్లాస్టిక్ వినియోగం ఏమాత్రం తగ్గలేదు.

చైతన్యంతో అడుగేస్తేనే ప్లాస్టిక్ నిషేధం



భయపెడుతున్న భూకాలుష్యం...

ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ కవర్లతో నగరాల్లో భూకాలుష్యం తీవ్రమవుతోంది. విజయవాడలో దశాబ్దాలుగా పైగా ప్లాస్టిక్ నిషేధం కొనసాగుతుండగా కొంతమేర నియంత్రించారు. ఇప్పటికీ అన్ని చిన్న, పెద్ద దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా సాగుతోంది.

నిత్య వేదన..

✦ విజయవాడ: ఇళ్లు, హోటళ్లు, మార్కెట్లు, వ్యాపార సంస్థల నుంచి రోజుకు 550-600 మెట్రిక్ టన్నుల వ్యర్థాల విడుదల అవుతుండగా.. వీటిలో 20 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ చెత్తనే.
✦ మచిలీపట్నం: రోజుకు 80 మెట్రిక్ టన్నుల చెత్త వస్తే.. 3-5 టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలే.

1 ఓ సంచి తీసుకెళ్దాం: ప్లాస్టిక్ కవర్లను వాడకూడదన్న స్పృహ ప్రజల్లో రానంత వరకూ వినియోగం ఆగదు. నిత్యం.. బైక్, కార్లలో ఓ సంచిని పెట్టుకుంటే.. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని దాదాపు అరికట్టొచ్చు. రెండు నగరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల్లో అత్యధికం.. పాలిథిన్ కవర్లే.

2 తడిపొడి వేరుచేద్దాం: నిత్యం ఇంటింటికీ వెళ్లి తడి పొడి చెత్త సేకరిస్తున్నా.. ఇప్పటికీ కొంత మంది ఇళ్లలో ప్లాస్టిక్ కవర్ల తోపాటు చెత్తంతా కలిపే వేస్తున్నారు. కొన్నిచోట్ల విభజించి ఇస్తున్నా.. సిబ్బంది కలిపేసి వాహనాల్లో పోసేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి.

3 మద్యం దుకాణాల వద్ద: రెండు నగరాల్లో మద్యం దుకాణాలను ఆనుకుని ఉండే కాలువలన్నీ.. ప్లాస్టిక్ గ్లాసులు, బాటిళ్లతో నిండి.. కనిపిస్తున్నాయి.

4 నాలుగు కాలువల్లో: నగరంలో అన్ని డ్రెయినేజీ కాలువలు.. బందరు, రైవస్, ఏలూరు, బుడమేరు కాలువల్లో నిత్యం 4-5 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోస్తున్నారు.

5 ఒక్క చోటే రెండు టన్నులు: విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న భూగర్భ డ్రెయినేజీ కాలువల్లోనే నిత్యం కనీసం రెండు టన్నుల ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు పోస్తున్నారు.

కోటి కాంతులు.. శతకోటి ప్రణతులు



పవిత్ర సంగమం వద్ద కోటి దీపోత్సవం శోభ

ఇబ్రహీంపట్నం: పవిత్ర సంగమం వేదికగా కోటి దీపోత్సవం గురువారం సాయంత్రం కనుల పండువలా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణ క్రతువు అనంతరం వేల మంది భక్తులు దీపాలను వెలిగించారు. ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు.

వి హారం.. వి నోదం.. వి జ్ఞానం

విజయవాడ సిటీ, వత్సవాయి, న్యూస్‌టుడే

తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను విద్యార్థులు క్షేత్ర స్థాయిలో దృశ్యరూపంగా దర్శించడం వల్ల వారిలో పూర్తి అవగాహన కలుగుతుంది. ఈ ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రలకు వెళ్లేలా చర్యలు తీసుకుంది.

పర్యాటక ప్రదేశాల సందర్శనకు అనుమతి



హైకోర్టు వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు



భవానీపురం సైన్స్ సెంటర్‌లో బాలికలు

జిల్లాలో 208 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 27 స్కూళ్లను పీఎంశ్రీకి ఎంపిక చేశారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం, చారిత్రక, వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రదేశాలు, పాలన, న్యాయపరమైన కార్యాలయాలపై అవగాహన కలిగించాలని సమగ్ర శిక్షా విజ్ఞాన విహార యాత్రలకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలో పీఎంశ్రీ పాఠశాలలకు రూ.8.57 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే సుమారు 18 పాఠశాలలు విజ్ఞాన యాత్రకు వెళ్లాయి. మిగిలిన స్కూళ్లు కూడా ఈ నెలాఖరులోపు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నాయి.

❖ వీటిని చూసేందుకు అనుమతి: విద్యార్థులు సైన్స్, చారిత్రక, పర్యాటక, ముఖ్యమైన ప్రాంతాలను సందర్శించడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సచివాలయం, హైకోర్టు, బాపూ మ్యూజియం, కొండపల్లి ఖిల్లా, భవానీపురం సైన్స్ సెంటర్, ప్లానిటోరియం, గాంధీహిల్ ప్రాంతాలను ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు సందర్శించారు. వీటివల్ల ఎంతో విజ్ఞానం, అవగాహన కలిగిందని లింగాలపాడు (నందిగామ), కంభంపాడు (వత్సవాయి) విద్యార్థులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనం

ఈ కార్యక్రమం విద్యార్థుల్లో విజ్ఞానం పెంచుతుంది. పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై అవగాహన వస్తుంది. జిల్లాలో ఎంపికైన అన్ని పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులు ఆయా ప్రాంతాలను సందర్శించేలా చర్యలు తీసుకుంటున్నాం. - అశోక్‌బాబు, సమగ్రశిక్షా అకడమిక్ పర్యవేక్షణాధికారి

కాలువలు పూడి.. కడగండ్లు పొంగి..



ఆటోనగర్‌లో చాలా చోట్ల కాలువలు మూసుకుపోయి రహదారిపై మురుగు నిలిచిపోతోంది. దీంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారుల్లో అవస్థలు తప్పడం లేదు. ఆటోనగర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ గోదాంకు సమీపంలో రహదారిపై మురుగు చేరడంతో ఇలా సగం దారిలోనే వాహనాలు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. - ఈనాడు, అమరావతి

దారంతా పాడైంది.. దుమ్మెత్తిపోతోంది..



ఇటీవల కురిసిన వర్షాలకు కానూరు పరిధిలో రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. డ్రెయినేజీ విస్తరణ పనులు సైతం కొనసాగుతుండడంతో రహదారులపై విపరీతంగా దుమ్ము పేరుకుపోతోంది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు తిరిగే సమయంలో విపరీతంగా దుమ్ము లేచి వాహనదారులకు ఇబ్బందులు తప్పటం లేదు. స్థానికంగా ఉండే దుకాణాల్లో సైతం దుమ్ము పేరుకుపోతోందని చెబుతున్నారు. - ఈనాడు, అమరావతి

పశ్చిమ బైపాస్‌పై... రయ్ రయ్!

ప్యాకేజీ-3లో మొదలైన రాకపోకలు



దూసుకెళ్తున్న వాహనాలు..

ఈనాడు, అమరావతి: పశ్చిమ బైపాస్ ప్యాకేజీ-3కి మార్గం సుగమమైంది. హైదరాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించే వారికి విజయవాడ ట్రాఫిక్ చెర నుంచి విముక్తి దొరికింది. ఎంచక్కా పశ్చిమ బైపాస్‌పై దూసుకెళ్లేందుకు గురువారం సాయంత్రం నుంచి దారులు తెరుచుకున్నాయి. ప్రయాణానికి ప్రతిబంధకంగా ఉన్న నున్న విద్యుత్తు టవర్ల సమస్యకు అధికారులు పరిష్కారం చూపించారు. దీంతో హైదరాబాద్ ప్రయాణికులకు బోలెడంత సమయం ఆదా కానుంది.

తాత్కాలిక టవర్ నిర్మాణంతో...: ప్యాకేజీ-3లో చినఆవుటపల్లి-గొల్లపూడి వరకు 30 కిమీ మేర బైపాస్ పూర్తి చేశారు. జక్కంపూడి, నున్నలో రహదారిపై నుంచి వెళ్లిన హైటెన్షన్ విద్యుత్తు టవర్లతో ఇప్పటి వరకు ప్రయాణికులను అనుమతించలేదు. ఇటీవల జక్కంపూడి టవర్ల వివాదానికి కోర్టు పరిష్కారం చూపింది. ప్రస్తుతం ఉన్న ఎలైన్‌మెంట్‌లోనే విద్యుత్తు వైర్లను ఎత్తు పెంచాలని తీర్పు ఇచ్చింది. నున్న టవర్ల విషయంలో ఇప్పటికే కొత్త టవర్ల నిర్మాణం సగానికి పైగా పూర్తవడంతో జక్కంపూడి తరహా మార్పు సాధ్యం కాదని అధికారులు భావించారు. దీనికి ఎన్‌హెచ్ఏఐ అధికారులు యుద్ధప్రాతికన రహదారిపై తక్కువ ఎత్తులో ఉన్న వైర్లను పైకిలేపి నున్నలో ఓ తాత్కాలిక టవర్ నిర్మించి సమస్యను పరిష్కరించారు.

ఇక దూసుకుపోవడమే...

ఇప్పటి వరకు వైజాగ్-హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగించే వారు విజయవాడ మీదుగా వెళ్లాల్సి వచ్చేది. చినఆవుటపల్లి నుంచి విజయవాడ దాటి హైదరాబాద్ ఎన్‌హెచ్ చేరాలంటే ట్రాఫిక్ యాతనతో గంటపైగా పట్టేది. ప్రస్తుతం చినఆవుటపల్లి దగ్గర బైపాస్ ఎక్కితే 30 నిమిషాల్లో అక్కడికి చేరుకోవచ్చు. చినఆవుటపల్లి దగ్గర గతంలో పండగల సమయంలో అనుమతించిన దారి ద్వారానే బైపాస్ ఎక్కొచ్చు. గొల్లపూడి దగ్గర యూటర్న్ తీసుకుని హైదరాబాద్ ఎన్‌హెచ్‌కి చేరవచ్చు. జక్కంపూడి టవర్ పనులకు మరో మూడు నెలలు పడుతుంది. అయినా అక్కడ రెండు వైపులా ఉన్న సర్వీస్ రోడ్డుల నుంచి ప్రయాణికులు వెళ్లే అవకాశం ఉంది.

తేరుకోగలమ?!

మొక్కజొన్న రైతుతో దళారుల చెలగాటం
క్వింటాకు ఏకంగా రూ.600-900 కోత

✦ 20 ఎకరాల్లో మొక్కజొన్న కౌలుకు సాగు చేశా. ఎకరాకు 25 చొప్పున 500 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.40 వేల ఖర్చయింది. కొనుగోలు కేంద్రాలు లేక క్వింటా రూ.1700లకు.. 250 క్వింటాళ్లు అమ్ముకొని తీవ్రంగా నష్టపోయా. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు తెరిస్తే మిగిలిందైనా అమ్ముకుంటా. - ఎం.మధు, రైతు, దాచవరం (వీరులపాడు)

✦ 10 ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న వేశా. కొనుగోలు కేంద్రాలు తెరుస్తారని ఎదురు చూసినా ఫలితం లేక... తుపాన్ వస్తుందనే భయంతో దళారులకు క్వింటా రూ.1,800 చొప్పున 250 క్వింటాళ్లు అమ్ముకున్నా. క్వింటాకు రూ.600 వరకు నష్టపోయా. - కోలా శ్రీనివాసరావు, పెద్దాపురం (వీరులపాడు)

ఈనాడు, అమరావతి

మొక్కజొన్న రైతుల ఆరుగాలం శ్రమను దళారుల సిండికేట్ స్వాహా చేస్తోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడం.. తుపాను హెచ్చరికలు ఆసరాగా ధరలు తగ్గించి దోచుకుంటున్నారు. రైతులు కోసిన పంట కాపాడుకునే అవకాశం లేక వచ్చిన ధరకే అమ్ముకుని నష్టపోతున్నారు.

దళారులు చెప్పిందే ధర...

ఎన్టీఆర్ జిల్లాలో 11 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. నవంబరు మొదటి వారంలోనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవాల్సి ఉన్నా అడుగు పడలేదు. కేంద్రాల్లో క్వింటాకు రూ.2,400 మద్దతు ధర వస్తుంది. దాదాపు 90 శాతం పంట కోసి కల్లాల్లో ఉంది. తుపాను హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దళారులు.. కొన్ని కంపెనీలు కుమ్మక్కై ధరను అమాంతం తగ్గించేశాయి. రూ.1500-1800 మించకుండా సిండికేట్ అయ్యారు. తేమ శాతం వంకతో మరింత కోత వేస్తున్నారు. క్వింటాకు రూ.600-900 నష్టపోతున్నారు. రైతుల దగ్గర తక్కువకు కొని కొనుగోలు కేంద్రాలు తెరిస్తే ఎక్కువ ధరకు అమ్ముకోవాలనేది దళారుల పన్నాగం. విజయనగరం, శ్రీసత్యసాయి, నంద్యాల జిల్లాల్లో బహిరంగ మార్కెట్‌లోనూ క్వింటా రూ.2,200 ఉంది. ఇక్కడ మాత్రం దళారులు చెప్పిందే ధర.



కల్లాల్లో మొక్కజొన్న నిల్వలు

అనుమతులు రాగానే ప్రారంభం

రెండు నెలల కిందటే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం.. అనుమతులు రాగానే ప్రారంభిస్తాం. - నాగమల్లిక, మార్క్‌ఫెడ్ డీఎం

వాయుసేనలో అవకాశాలపై అవగాహన

పాయకాపురం: భారత వాయుసేనలో ఉద్యోగావకాశాలపై శుక్రవారం లయోలా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం ఆయన, వాయుసేన అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ మాట్లాడుతూ.. ఇంటర్, తత్సమాన విద్యార్హతల గల యువత అగ్నివీర్-వాయుగా వాయుసేనలో చేరవచ్చనీ, 17 -21 ఏళ్ల యువత అర్హులన్నారు. శనివారం తిరువూరులోనూ అవగాహన కల్పిస్తామన్నారు.

కోట్లు కరిగాయి.. పాట్లు మిగిలాయి!

రూ.5 కోట్లు వెచ్చించినా .. బండి నిలిపే స్థలం లేదు
దుర్గగుడిలో అత్యంత తీవ్రంగా పార్కింగ్ సమస్య



ప్రతిపాదిత మల్టీలెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ నమూనా

ఈనాడు, అమరావతి

'దుర్గగుడికి నిత్యం 40 వేలు.. శుక్ర, శని, ఆదివారాల్లో 70 వేల మంది భక్తులు వస్తున్నారు. ఏటేటా ఆలయానికి వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. నిత్యం కనీసం 500 కార్లు, వేలాది ద్విచక్ర వాహనాలు వస్తున్నాయి. వారాంతాల్లో రెట్టింపు ఉంటున్నాయి. కానీ.. ఓ వంద కార్లను నిలిపే సౌకర్యమూ లేదు. వారాంతాలొస్తే.. ఘాట్‌రోడ్డు స్తంభిస్తోంది. పార్కింగ్ సమస్య పరిష్కారానికి.. దశాబ్దాలుగా రూ.కోట్లు కరిగించినా కొలిక్కి రాలేదు.'

ఇంద్రకీలాద్రిని ఆనుకుని పైవంతెన పక్కన రూ.5 కోట్లు ఖర్చు పెట్టి వైనావాల్ పేరుతో 2012లో ఓ నిర్మాణం చేపట్టారు. ఈ వాల్ పూర్తయితే.. కనీసం వంద కార్లను ఘాట్‌రోడ్డుపై పార్కింగ్ చేయొచ్చన్నారు. కానీ.. రూ.5 కోట్లు కరిగినా 50 కార్లను నిలిపే స్థలం కూడా రాలేదు. దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం పనితనానికి.. ఇదే నిదర్శనం. ఈ భారీగోడ ఎప్పుడు కుంగుతుందో తెలియని దుస్థితి నెలకొంది.

పరిష్కారాలు అనేకం..

☛ కనకదుర్గానగర్‌లో కింది నుంచి ఘాట్‌రోడ్డును కలిపేలా ఓ మల్టీలెవెల్ వాహన పార్కింగ్ నిర్మిస్తామని కొద్దినెలల కిందట నమూనాలు రూపొందించారు. ఆ ప్రతిపాదన ఏ దశలో ఉందో కూడా తెలీదు. ☛ ఇంద్రకీలాద్రికి సమీపంలోనే తితిదే రెండెకరాల ఖాళీ స్థలం ఉంది. దీనినే ఉత్సవాల వేళ పార్కింగ్‌కు వాడుతుంటారు. ఈ స్థలాన్ని గత తెదేపా ప్రభుత్వంలోనే ఆలయానికి స్వాధీనం చేస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చినా.. దుర్గగుడి అధికారుల నిర్లక్ష్యంతో చేజారింది. ☛ దుర్గగుడి బృహత్తర ప్రణాళికలో భాగంగా గతంలోనూ పార్కింగ్ సమస్య తీర్చేందుకు కనకదుర్గానగర్‌లో అనేక ప్రణాళికలు వేసినా.. అమలు జరగలేదు.

పెరిగే అవసరాలకు తగినట్లు ఉండాలి



గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే మేం దుర్గగుడిని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి.. బృహత్తర ప్రణాళికలో భాగంగా పార్కింగ్ సమస్య పరిష్కారానికి అనేక సూచనలు చేశాం. ప్రస్తుతం వస్తున్న వాహనాలు, వచ్చే రెండు మూడు దశాబ్దాల అవసరాలు దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలి. - డాక్టర్ కె.ఎస్.ఎస్.వి.వి.ప్రసాద్, ఛైర్మన్, క్రెయాటో సొల్యూషన్స్, విజయవాడ

దుకాణం డబ్బులు సొంత ఖాతాలోకి..

యజమానికి ఉద్యోగిని టోకరా

గవర్నర్‌పేట: యజమానికి టోకరా వేసిన యువతిపై గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని మ్యూజియం రోడ్డులో వేముల వెంకటేశ్వర్లు చరవాణి దుకాణం నిర్వహిస్తున్నారు. అతని వద్ద 2020 నుంచి తోట దుర్గా ప్రమీల అనే యువతి పనిచేస్తున్నారు. నమ్మకంగా పని చేస్తుండడంతో ఆమెకు బిల్లింగ్ సెక్షన్ అప్పగించారు. ఇటీవల దుకాణం లావాదేవీలను పరిశీలించినప్పుడు తేడా గుర్తించారు. దీంతో ఆమెను ప్రశ్నించగా తనకేమీ తెలియదని బుకాయించారు. ఈ క్రమంలో ఆమె బ్యాంకు ఖాతా లావాదేవీలను తనిఖీ చేయగా రూ.2,97,750 అనుమానాస్పదంగా కనిపించాయి. అవన్నీ క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా వివిధ ఖాతాల నుంచి వచ్చినట్లు గుర్తించారు. అవన్నీ తన దుకాణంలో ఖాతాదారుల నుంచి వసూలైన డబ్బులేనని.. చెల్లింపులు చేసే వారికి తన ఖాతా క్యూఆర్ కోడ్ ఇచ్చి నగదును తన ఖాతాలోకి మళ్లించుకున్నట్లు యజమాని వెంకటేశ్వర్లు గుర్తించారు. అదే దుకాణంలో పనిచేసే వందన్‌కుమార్‌తో కూడా ఆమె కుమ్మక్కైనట్లు తెలుసుకున్నారు. వారంతా కలిసి నగదును తమ కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించి ఆ తరువాత సొంత ఖాతాలకు మళ్లించుకున్నట్లు గుర్తించారు. దాదాపు రూ.4 లక్షలు దుర్వినియోగం అయినట్లు దుకాణ యజమాని వెంకటేశ్వర్లు గవర్నర్‌పేట పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు దుర్గాప్రమీల తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ కేసులో కొండారెడ్డి కోసం పీటీ వారెంట్ దాఖలు

ఈనాడు - అమరావతి: ఎండీఎంఏ కేసులో వైకాపా నేత కొండారెడ్డిపై పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. విశాఖవాసి కొండారెడ్డిని ఈ కేసులో మాచవరం పోలీసులు ఏ7గా నమోదు చేశారు. విశాఖలో ఇటీవల డ్రగ్స్ కేసులో అక్కడి పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఇటీవల బెంగళూరులో పోలీసులు అరెస్టు చేసిన పెడ్లర్ మ్యాడీ విచారణలో కొండారెడ్డి లింకుల గురించి వెల్లడించాడు. దీంతోపాటు నెల్లూరు కారాగారంలో రిమాండ్‌లో ఉన్న లోహిత్ యాదవ్‌ను పోలీసులు విచారించారు. అందులోనూ కొండారెడ్డి ప్రమేయం గురించి చెప్పాడు. తరచూ మత్తు పార్టీలు చేసుకునే వారమని తెలిపాడు. ఈ నేపథ్యంలో కస్టడీకి తీసుకుని మరింత లోతుగా విచారించేందుకు ఎంఎస్‌జే కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

గుట్టు వీడుతున్న.. జోగి.. అద్దేపల్లిల ఆర్థిక బంధం!

ఈనాడు, అమరావతి

రమేష్, రాముల ఆర్థిక లావాదేవీల ఆరా
ఆస్తుల కొనుగోళ్లపై నిశిత పరిశీలన

మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్‌తో జనార్దనరావు ఆర్థిక బంధంపై సిట్ సునిశిత దృష్టి సారించింది. గతంలో ఉమ్మడిగా మద్యం వ్యాపారం చేసిన ఇద్దరి ఆర్థిక చరిత్రను తవ్వి తీస్తోంది. శుక్రవారం సిట్, ఎక్సైజ్ అధికారులు నిందితులు జనార్దనరావు (ఏ1), జగన్మోహన్‌రావు (ఏ2)ను ప్రధానంగా వీటిపైనే ప్రశ్నించారు. గత కొన్నేళ్ల నగదు విత్‌డ్రాయల్స్‌ను పరిశీలిస్తున్నారు. నగదు డ్రా చేసిన తేదీల్లో జోగి రమేష్, రాములకు ఇచ్చారా? ఇస్తే.. ఎంత మొత్తాన్ని అందజేశారు? అనే కోణంలో పలు ప్రశ్నలు సంధించి వివరాలు రాబట్టారు.

నిందితుల మధ్య లావాదేవీలు...

ఈ కేసులో పలువురు నిందితులతో అద్దేపల్లి సోదరుల మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఈ స్టేట్‌మెంట్లను వారి ముందుంచి.. వివరాలు తీసుకున్నారు. ఏ1 ఇచ్చిన ముడుపులతో జోగి రమేష్ ఏవైనా ఆస్తులు కొన్నారా? కొంటే వాటి వివరాలు? వాటిని ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారా? అనే వివరాలను పరిశీలిస్తున్నారు. ఆదాయ పన్ను రిటర్న్‌లలో పొందుపరిచారా? అని కూడా పరిశీలిస్తున్నారు. ఇందుకు జోగి రమేష్ (ఏ18), జోగి రాము (ఏ19) బ్యాంకు స్టేట్‌మెంట్లను నిశితంగా పరిశీలిస్తున్నారు.

☛ స్పిరిట్, మూతలు, సీసాలు, లేబుళ్లను సరఫరా చేసిన నిందితులకు.. జోగి రమేష్, రాములతో లింకులు ఉన్నాయా? అని దర్యాప్తు చేస్తున్నారు. వీటిపై రెండో రోజు కస్టడీలో నిందితులను పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం. ఏ1, ఏ2 నుంచి వీరి బంధువైన రవి (ఏ14)తో జరిగిన పెద్ద ఎత్తున లావాదేవీలను గుర్తించి.. వాటిని ఆరా తీశారు. మూతలు, లేబుళ్ల సరఫరాదారులకు డబ్బులు ఇచ్చేందుకే రవికి యూపీఐ ద్వారా బదిలీ చేసినట్లు విచారణలో వెల్లడించారు.


దీపానికి నమస్కరిస్తున్న భక్తులు


వేదికపై శివలింగం


కల్యాణ శోభలో శివపార్వతులు


ప్రవచనకర్త దివి నరసింహ దీక్షితులును సత్కరిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు, కమిషనర్ రమ్యకీర్తన, తెదేపా నాయకులు, కౌన్సిలర్లు

కనుల పండువగా కోటి దీపోత్సవం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కోటి దీపాల కాంతులతో కృష్ణా గోదారమ్మ సంగమం ప్రాంతం ఆధ్యాత్మికతను సంతరించుకొంది. వేలాది మంది భక్తుల శివనామం స్మరణతో మార్మోగింది. కార్తిక మాసం ముగింపు సందర్భంగా కోటి దీపోత్సవ కార్యక్రమం కొండపల్లి పురపాలక సంఘ పరిధిలోని పవిత్ర సంగమం వద్ద గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవచనకర్త దివి నరసింహదీక్షిత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సంకీర్తనలు, లలిత సహస్రనామ పారాయణం, లింగాష్టకం, భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. అనంతరం పురపాలక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు దంపతులు, కమిషనర్ రమ్యకీర్తన, కౌన్సిలర్లు జ్యోతి వెలిగించారు. అర్చకుల పిలుపు మేరకు దీపోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని వీక్షించారు. అనంతరం ప్రవచనకర్తను సన్మానించారు.

పూర్వ వైభవం తెస్తాం..

పవిత్ర సంగమానికి పూర్వ వైభవం తీసుకొస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. పవిత్ర సంగమం వద్ద నిర్వహించిన కోటి దీపోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తెదేపా ప్రభుత్వంలో సంగమం ప్రాంతం ఆధ్యాత్మికంగా ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. తిరిగి ఆ వైభవాన్ని తీసుకొచ్చేందుకు జలహారతి కార్యక్రమాన్ని రెండు నెలల్లో ప్రారంభించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

అనుసంధానం ఆగి.. గోతులు తేలి!

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నందిగామ వైజంక్షన్ వద్ద అండర్‌పాస్ వంతెన అనుసంధాన మార్గం పనులు మళ్లీ ఆగిపోయాయి. ఇవి ఏళ్ల తరబడి సాగుతున్నా.. ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని రోజులు చేయడం.. నెలలు తరబడి నిలిపివేయడం పరిపాటిగా మారింది. గుత్తేదారు, ఉప గుత్తేదారుడి మధ్య ఆర్థిక లావాదేవీల విషయమే పనులు ముందుకు సాగకపోవడానికి కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సర్వీస్ రోడ్డుపై పడిన గోతుల కారణంగా రాకపోకలు సాగించే సమయంలో వాహన చోదకులు, ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం వస్తే గోతులో ఎంత లోతులో నీరు ఉందో తెలియక పడిపోతున్నారు. మరోవైపు నిత్యం ఇసుక, గ్రావెల్, కంకర టిప్పర్లు, లారీలు వెళుతుంటాయి. ఏదైనా ప్రమాదం జరిగితే నష్టం భారీగా ఉండే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. రెండు వైపులా సర్వీసు రోడ్డు పరిస్థితి ఘోరంగా ఉంది. కీసర వద్ద స్వర్ణ టోల్‌ప్లాజా నిర్వాహకులు కేవలం వాహనాల నుంచి టోల్ రుసుం వసూలుపైనే దృష్టి సారిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చందాపురం క్రాస్‌రోడ్డు వద్ద హైవే సర్వీసు రోడ్డుపై పడిన భారీ గోతులు ఇబ్బందికరంగా మారాయి. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీనిపై హైవే అథారిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - **నందిగామ, న్యూస్‌టుడే**


నందిగామ వైజంక్షన్ వద్ద సర్వీసు రోడ్డుపై గోతులు

పనులు పూర్తి చేయడంలో అలసత్వం వద్దు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : రానున్న కృష్ణా పుష్కరాల నాటికి దుర్గగుడి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఇంద్రకీలాద్రిపై ఉన్న ఈవో కార్యాలయంలో దుర్గగుడి అభివృద్ధి పనులపై పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నలతో కలిసి ఆయన గురువారం సమీక్షించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రసాదాల పోటు, అన్నప్రసాద పంపిణీ కేంద్రం, ఎలివేటెడ్ క్యూలైన్లతో పాటు ప్రధాన సమస్యలైన పార్కింగ్, శాశ్వత కేశఖండన శాల, భద్రతా పరమైన చర్యలపై అలసత్వం లేకుండా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్‌లో అభివృద్ధి చేసే పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆర్కియాలజీ విభాగం నుంచి వచ్చే అభ్యంతరాలపై అవసరమైతే ఉన్నతాధికారులను సంప్రదిస్తామన్నారు. ట్రస్టు బోర్డు సభ్యులు వెలగపూడి శంకర్‌బాబు, సుకాసి సరిత, ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.


సమావేశంలో ఎంపీ శివనాథ్, రాధాకృష్ణ, శీనానాయక్, వెంకన్న

ఇంటర్ విద్యార్థినులపై దాష్టీకం!

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాల వసతి గృహంలో ఉంటూ ఇంటర్ చదువుతున్న తాము.. ట్యూటర్ అనుమతితో మూత్రశాలకు వెళ్లి వస్తుండగా.. వైస్ ప్రిన్సిపల్ గువ్వల శ్రీనివాసరెడ్డి.. ఎక్కడికి వెళ్లారంటూ తమను వైరుతో తీవ్రంగా కొట్టారని బాధిత విద్యార్థిని ఒకరు గురువారం వాపోయారు. తనతో పాటు తన స్నేహితురాలిపై క్రూరంగా వ్యవహరించారని, స్పృహ తప్పేదాకా కొట్టారని ఆరోపించారు. అనంతరం ఎత్తుకొని ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్లారని, ఈ విషయం సీసీ టీవీ ఫుటేజీ ద్వారా తమకు తెలిసిందని, బోరున విలపిస్తూ విలేకరుల ముందు వాపోయారు. విషయం తెలుసుకున్న బాలికల తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి దాష్టీకాన్ని ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగారు. బాలికలపై దాడిచేసిన కళాశాల వైస్ ప్రిన్సిపల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆరోపణలు ఎదుర్కొంటున్న కళాశాల వైస్‌ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డితో మాట్లాడేందుకు 'న్యూస్‌టుడే' ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు. బాలికలపై దాష్టీకం గురించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై జి.రామకృష్ణ తెలిపారు.

ఎమ్మెల్యే సౌమ్యపై అసత్య ప్రచారం

నిందితుడిపై కేసు నమోదు

నందిగామ, న్యూస్‌టుడే: ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యపై సామాజిక మాధ్యమాల్లో ఓ వ్యక్తి తప్పుడు ప్రచారం చేస్తున్నాడని నందిగామకు చెందిన నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దారెల్లి రాజీవ్‌గాంధీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై సీఐ గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయన వివరాల మేరకు.. నందిగామలో గీతా మందిరం రోడ్డులో ఉంటున్న సోమవరపు రవితేజ తెదేపాలో చురుగ్గా పని చేస్తుండేవాడు. కొంతకాలంగా ఆయన ప్రవర్తనలో మార్పు వచ్చి సౌమ్యపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నాడు. ఆయన వల్ల విప్ సౌమ్యకు ప్రాణహాని ఉంది. పార్టీలో విభేదాలు వచ్చే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాడని, ఈ దుష్ప్రచారం ప్రత్యర్థి పార్టీ వారితో విభేదాలు వచ్చే విధంగా ఉంటోందని రాజీవ్‌గాంధీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్తు చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించండి

గాంధీనగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విద్యుత్తు చట్ట సవరణ ముసాయిదా బిల్లును రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని ఏపీ విద్యుత్తు ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సుదర్శనరెడ్డి, వెన్నపూస సుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు. స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నాచౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ బిల్లు పార్లమెంటు ఆమోదం పొంది చట్టంగా మారితే విద్యుత్తు రంగం ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. కేంద్రం రూపొందించిన ఈ బిల్లులో ఒక ప్రాంతంలోని ప్రభుత్వ విద్యుత్తు పంపిణీల సంస్థలతోపాటు ప్రైవేటు సంస్థలకు కూడా అవకాశం ఇస్తున్నారని చెప్పారు. మొదట ప్రజలను ఆకర్షించి..ప్రభుత్వ విద్యుత్తు సంస్థలు దెబ్బతిన్నాక ప్రయివేటు కంపెనీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తాయన్నారు. భవిష్యత్తులో ప్రైవేటీకరణ దిశగా వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు పెడుతూ వినియోగదారులపై ఒత్తిడి తెస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. క్రమంగా రాయితీలు తొలగించడంతోపాటు తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు, రైతులు, గ్రామీణ వినియోగదారులపై అదనపు భారం పడుతుందని తెలిపారు. ఉద్యోగ భద్రతకు సైతం ప్రమాదం పొంచి ఉంటుందని, యువతకు రెగ్యులర్ ఉద్యోగాలు ఉండవని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డి.హరిబాబు, వి.గంగయ్య, ముజఫర్, ఎం.మోహనరావు, పుల్లారెడ్డి, చంద్రశేఖర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఐక్యత చాటుతున్న నాయకులు

ఉత్సాహంగా రాష్ట్ర క్రీడా జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ(డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల రాష్ట్ర క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో భాగంగా రెండో రోజు గురువారం సుమారు 240 మంది ఉద్యోగులు పాల్గొన్నారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు తెలిపారు. ఐజీఎంసీ స్టేడియంలో జరిగిన కబడ్డీలో 70, బాస్కెట్‌బాల్‌లో 39, క్యారమ్‌లో 62, రెజ్లింగ్‌లో 18 మంది తలపడగా.. ఈడుపుగల్లులోని కృష్ణా డీఎస్‌ఏ ఈత కొలనులో జరిగిన స్విమ్మింగ్ జట్ల ఎంపికలో 50 మంది పోటీపడ్డారని పేర్కొన్నారు. వీరిలో ప్రతిభగల క్రీడాకారులను రాష్ట్ర జట్లకు ఎంపిక చేస్తారని వివరించారు.

బకాయిలు విడుదల చేయాలని వినతి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థల్లో పనిచేసే కార్మికులకు యాజమాన్యాలు ప్రకటించిన బకాయిలను సాధ్యమైనంత త్వరగా విడుదల చేయించాలని జెన్‌కో ఎండీ నాగలక్ష్మీని ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జి-445 యూనియన్ నాయకులు కోరారు. ఆ మేరకు విజయవాడ కార్యాలయంలో జెన్‌కో ఎండీని గురువారం వారు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో జరిగిన అనేక చర్చల్లో యాజమాన్యాలు కార్మికులకు లబ్ధి చేకూర్చుతూ ప్రకటనలు చేశాయన్నారు. అయితే వాటిని నెరవేర్చకపోవడంతో ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. సర్వీస్ ఇన్‌సెంటివ్, 15 శాతం ఐఆర్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎండీని కలిసిన వారిలో యూనియన్ నాయకులు రామగోపాల్‌రెడ్డి, బాలకృష్ణ, కిరణ్‌కిశోర్, సుధాకరరెడ్డి, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జెన్‌కో ఎండీ నాగలక్ష్మిని కలిసిన ఏపీ పవర్ ఎంప్లాయీస్ జి-445 నాయకులు

కండక్టర్‌పై దౌర్జన్యం తగదు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : అంతర్రాష్ట్ర బస్సుల్లో స్త్రీశక్తి వర్తించదు అని చెప్పిన ఒక కండక్టర్‌పై దౌర్జన్యం చేయడం జగ్గయ్యపేట ఆర్టీసీ కార్మికుల ఆగ్రహానికి కారణమైంది. జగ్గయ్యపేట- కోదాడ మార్గంలో షేర్‌మహ్మద్‌పేట వద్ద సుమారు 50 మంది మహిళలు అడ్డరోడ్డు వెళ్లేందుకు బస్సు ఎక్కడం ప్రారంభించారు. ఇది అంతర్రాష్ట్ర బస్సు సర్వీస్, ఇందులో స్త్రీశక్తి వర్తించదని కండక్టర్ షేక్ ఖాదర్ సాహెబ్ చెబుతున్న వారు ఆగకపోవడంతో పాటు కృష్ణ అనే వ్యక్తి కండక్టర్‌పై దౌర్జన్యం చేసి గాయపరిచాడు. మహిళలు బస్సు దిగి వెళ్లగా ఆర్టీసీ కార్మికులు జగ్గయ్యపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన జరిగింది షేర్‌మహ్మద్‌పేటలో అని చిల్లకల్లు స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సిబ్బంది సూచించారు. మరుసటి రోజు ఉదయం కండక్టర్ ఫిర్యాదు చేయడానికి వెళ్లగా అప్పటికే కండక్టర్‌పై మహిళలు కూడా ఫిర్యాదు చేశారంటూ చెప్పడంతో పోలీసులు ఇరువర్గాలతో మాట్లాడి రాజీ చేశారు. దాడి చేసిన వ్యక్తితో క్షమాపణ లేఖ రాయించి సర్ది చెప్పి పంపించారు. ఈ విషయమై యూనియన్ నాయకులు మాత్రం తమ కార్మికుడికి జరిగిన అన్యాయాన్ని సహించేది లేదంటూ డిపో మేనేజర్, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాంకి వినతిపత్రాలు ఇచ్చారు. దీనిపై డిపో మేనేజర్ సరిగా స్పందించక పోవడంపై వారు డిపో గేటు వద్ద గురువారం నిరసన తెలిపారు.


జగ్గయ్యపేట డిపో గేటు వద్ద ఆర్టీసీ కార్మికుల ధర్నా

24 నుంచి రాష్ట్ర స్థాయి ఇంటర్ జోనల్ ఫుట్‌బాల్ లీగ్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మైలవరంలోని లకిరెడ్డి హనుమరెడ్డి క్రీడా ప్రాంగణంలో ఈ నెల 24వ తేదీ నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు రాష్ట్ర స్థాయి ఇంటర్ జోనల్ ఫుట్‌బాల్ లీగ్ టోర్నీ నిర్వహిస్తామని ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి తెలిపారు. ఈ టోర్నీలో జోనల్ స్థాయిలో విజేతగా నిలిచిన కోరమాండల్, గోదావరి, కొల్లేరు, నల్లమల, పెన్నా, తుంగభద్ర, వంశధార, విశాఖ ఫుట్‌బాల్ క్లబ్బుల నుంచి 160 మంది క్రీడాకారులు తలపడతారని పేర్కొన్నారు. విజేతలకు ట్రోఫీలు బహూకరిస్తామని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

జగన్ బెయిల్ రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేస్తా: బుద్ధా

పటమట, న్యూస్‌టుడే: న్యాయ వ్యవస్థలను సైతం తప్పుదోవ పట్టించే విధంగా న్యాయస్థానానికి హాజరు కాకుండా కుట్రలకు పాల్పడిన మాజీ సీఎం బెయిల్ రద్దు చేయాలని.. దీనిపై న్యాయనిపుణుల సలహా తీసుకుని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేస్తానని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న తెలిపారు. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు జగన్ ఊరేగింపుగా వెళ్లడం సరికాదన్నారు. 2020లో సీఎంగా నాంపల్లి కోర్టుకు హాజరైన జగన్.. ఆరేళ్ల తర్వాత పులివెందుల ఎమ్మెల్యేగా హాజరవడం నిజంగా దేవుడి స్క్రిప్టేనని పేర్కొన్నారు. రూ.లక్షల కోట్లు దోచుకుని నిందితుడిగా ఉన్న జగన్ కోర్టుకు సమయమిచ్చేలా షెడ్యూల్ విడుదల చేయడం చూస్తే న్యాయ వ్యవస్థలపై ఆయనకు ఎంత గౌరవం ఉందో స్పష్టమవుతోందన్నారు. పెయిడ్ బ్యాచ్‌లతో దారి పొడవునా నినాదాలు చేస్తూ కోర్టుకు వెళ్లిన జగన్ మళ్లీ వాయిదాకు హాజరు కాకుండా ఉండేందుకు కుట్ర పన్నారంటూ విమర్శించారు.


మాట్లాడుతున్న వెంకన్న

క్రీడా ప్రోత్సాహకాలు అందిస్తాం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నూతన క్రీడా విధానం మేరకు అందాల్సిన క్రీడా ప్రోత్సాహకాలు అందిస్తామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో జరిగిన ఏషియన్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో రికర్వ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో పసిడి పతకం కైవసం చేసుకోవడంతో పాటు చరిత్ర సృష్టించిన బొమ్మదేవర ధీరజ్.. మలేషియా కౌలాలంపూర్‌లో జరిగిన కామన్వెల్త్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన ముసునూరి రోహిత్ లలిత్‌బాబులు గురువారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రవినాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. రవినాయుడు వారిని సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విజయాలకు అందాల్సిన క్రీడా ప్రోత్సాహకాలను అందజేస్తామని, రాణించిన క్రీడాకారులకు శాప్ అండగా ఉంటుందని ఆయన అన్నారు.


గ్రాండ్ మాస్టర్ లలిత్‌బాబు, ఆర్చర్ ధీరజ్‌లను సన్మానిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

24న కృష్ణా వర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

విజయవాడ క్రీడలు: స్థానిక పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల స్త్రీ, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు, వర్సిటీ జట్టు ఎంపికలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్, పోటీల కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ మేకా రమేష్ తెలిపారు. పోటీలో పాల్గొనే కళాశాల జట్ల క్రీడాకారులు తగు అర్హత పత్రాలతో పాటు గుర్తింపు కార్డులతో అదే రోజు ఉదయం 8 గంటలకు పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి టీవీటీ కృష్ణారెడ్డికి రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 99639 92102 నంబరుకు సంప్రదించాలన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

పాయకాపురం, న్యూస్‌టుడే: గృహ నిర్మాణాలను వేగవంతం చేసి సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో గృహాల నిర్మాణంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. ..ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు నిర్మించుకోవడం ఒక కల అని, దానిని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. లబ్ధిదారుల బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని, ఈవిషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ పీడీ రజనీకుమారి, ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాలు

పాయకాపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని ఆకాంక్షిత బ్లాకులైన ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాలు వివిధ సూచికల్లో ప్రగతిపథంలో పయనిస్తున్నాయని కలెక్టర్ జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. తాజాగా వ్యవసాయ, అనుబంధ రంగాలతోపాటు ఆరోగ్యం, పోషణ విభాగాల్లో మెరుగైన ఫలితాలు సాధించినందుకు నీతి ఆయోగ్ ప్రశంసాపత్రాలు లభించాయని వెల్లడించారు.

అనుమానం పెనుభూతమై...
భార్య గొంతు కోసి హత్య చేసిన భర్త
అడ్డుపడిన కుమార్తెకు గాయాలు

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: అనుమానం మనిషిని మృగంలా మారుస్తుందనేందుకు ఖమ్మం నగరంలో గురువారం ఉదయం చోటుచేసుకున్న సంఘటనే నిదర్శనం. భార్యపై అనుమానం పెంచుకున్న ఓ వ్యక్తి కత్తితో గొంతు కోసి ఆమెను దారుణంగా హతమార్చాడు. అడ్డువచ్చిన కుమార్తె గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఖమ్మం రెండో పట్టణ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ కథనం ప్రకారం... ఖమ్మం జిల్లా చింతకాని మండలం నేరడకు చెందిన వ్యవసాయదారుడు గోగుల భాస్కర్‌తో ఏపీ ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన సాయివాణి(33)కి పదహారేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె హర్షవర్ధిని, కుమారుడు వేమేంద్రలక్ష్మీనరసింహ ఉన్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న భాస్కర్ గత కొన్నేళ్లుగా వేధిస్తున్నాడు. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినా, జగ్గయ్యపేట పోలీసు స్టేషన్‌లో రెండుసార్లు కౌన్సెలింగ్ చేసినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. గతేడాదిగా దంపతులు విడిగా ఉంటున్నారు. కొద్ది నెలలు తల్లిదండ్రుల వద్ద ఉన్న సాయివాణి, పిల్లలతో కలిసి ఆరు నెలల క్రితం ఖమ్మం వచ్చి గట్టయ్య సెంటర్‌లో ఓ అద్దె ఇంట్లో నివసిస్తోంది. స్థానికంగా ఫంక్షన్ హాలులో పనిచేస్తూ పిల్లలను చదివిస్తోంది. భార్యపై అక్కసు పెంచుకున్న భాస్కర్ తెల్లవారుజామునే ఆమె ఉండే ఇంటివద్దకు వచ్చి మాటువేశాడు. ఉదయం తలుపు తీసి బయటకు వచ్చిన సాయివాణిపై కత్తితో దాడి చేశాడు. తప్పించుకుని ఇంట్లోకి పరుగెత్తే ప్రయత్నం చేసినా వెంటపడ్డాడు. అనంతరం కత్తితో గొంతుపై బలమైన గాయం చేయడంతో సాయివాణి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనలో ఆమె ముఖం, గొంతు, తొడలపై బలమైన గాయాలయ్యాయి. ఇంట్లోనే ఉన్న కుమార్తె హర్షవర్ధిని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో చేతులకు గాయాలయ్యాయి. భయంతో బయటకు పరుగెత్తిన కుమారుడు లక్ష్మీనరసింహ సమీపంలో నివసించే తన పెద్దమ్మ గొడవర్తి కుసుమకు(మృతురాలి అక్క) ఫోన్ చేసి చెప్పాడు. స్థానికులు డయల్-100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన కుసుమ, ఆమె భర్త, చుట్టుపక్కల నివాసులు భాస్కర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనతో భీతావహ పరిస్థితి ఏర్పడింది. హర్షవర్ధినిని ఆసుపత్రికి తరలించారు. కుసుమ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, క్లూస్ టీం సందర్శించి సాక్ష్యాలు సేకరించారు.


భాస్కర్, సాయివాణి దంపతులు (పాత చిత్రం)

తిరువూరు

• తిరువూరు • మైలవరం

రక్త గ్రూపులపై అవగాహన అవసరం



విద్యార్థుల రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

మైలవరం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు వారి రక్త గ్రూపుపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులకు గురువారం ఎన్ఎస్ఎస్, ఆంధ్రా హాస్పిటల్స్ సహకారంతో రక్త గ్రూపుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రక్త గ్రూపులను ముందుగానే తెలుసుకోవడం ద్వారా అత్యవసర సమయాల్లో రక్తదానం చేయటానికి వీలుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి శివహరిప్రసాద్, ఏపీవో ఉమామహేశ్వరరెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేతో ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం



నెమలిలో అర్జీ స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల సమస్యలు స్వామిత్వ సర్వే ద్వారా పరిష్కారమవుతాయని ఎంపీడీవో టి.సరస్వతి తెలిపారు. మండలంలోని నెమలిలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామంలో జరుగుతున్న సర్వేపై యజమానుల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిలో ఆరింటిని పరిష్కరించారు. తహసీల్దార్ వి.రాజకుమారి, సర్పంచి డి.రామకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక నరసాపురం గ్రామం యాదవుల బజారులో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. పంచాయతీ ఈవో జి.స్వాతి స్పందించి సమస్య పరిష్కరించారు.

తిరువూరు టౌన్: పట్టణంలోని తొమ్మిదో వార్డులో డ్రైనేజీలో మురుగు పారుదల సరిగా లేక దోమలు వృద్ధి చెంది ఇబ్బందులు పడుతున్నామని స్థానికుడు రబ్బాని 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ స్పందించి సమస్య పరిష్కరించారు.

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని వెంపటిగూడెంలో డ్రైనేజీలో పూడిక పేరుకు పోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారడంతో స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు స్పందించి.. సమస్య పరిష్కరించారు.

? స్థానిక బీసీ కాలనీ శివారు జంగాల బజారులో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నాం. -జి.అర్జునరావు, గ్రామస్థుడు ✔ మరమ్మతులు చేయిస్తాం. -బసవలింగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి, - జి.కొండూరు, న్యూస్‌టుడే

వరికి ఊతం.. మెట్టకు శాపం!

మైలవరం, న్యూస్‌టుడే

ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలు పలు మెట్ట పంటలకు నష్టం చేకూర్చగా.. వరిసాగుకు మాత్రం మేలు చేశాయి. ఒక్క రోజు కూడా నీటి తడి కోసం ఇబ్బంది పడకుండా.. సాగు సాఫీగా సాగగా, మూడు నెలల పాటు సాధారణం కంటే, అధిక వర్షపాతం నమోదవడంతో చెరువులు కళకళలాడుతున్నాయి.

మైలవరం నియోజకవర్గంలో పత్తి, వరి ప్రధాన వ్యవసాయ పంటలు. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పత్తి పంట దెబ్బతిని.. దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి.

పెసర, మినుము పంటలైతే పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. చేతికొచ్చిన కొద్దిపాటి మినుముకొనే నాథుడే లేరని ఆందోళన చెందుతున్నారు. ఇన్ని నష్టాల మధ్య వరి సాగు రైతులకు మాత్రం వర్షాలు ఊరటనిచ్చాయి.

నియోజకవర్గంలో ఇలా..

వరిసాగు విస్తీర్ణం:	20వేల ఎకరాలు
సాగునీటి చెరువులు:	70 వరకు
సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో సాధారణ వర్షపాతం:	360 మి.మీ
కురిసింది:	410 మి.మీ

చెరువులు కళకళ

నియోజకవర్గ వ్యాప్తంగా చెరువుల కిందే ఆయకట్టు ఉంది. భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో ఒకానొక దశలో చెరువు కట్టలు తెగుతాయేమోనన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమైంది. ఫలితంగా వరి పొలాలకు సమృద్ధిగా నీరందింది. చెరువుల నీరు వాడాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇప్పటికే వరి పొలాలు కోతలకు సిద్ధమై, పలు చోట్ల ప్రారంభమయ్యాయి. చెరువులు మాత్రం నిండుకుండలను తలపిస్తున్నాయి.



కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలు

రెండో పంటకు సన్నద్ధం

దశాబ్దకాలంగా రబీలో వరి సాగుకు అవకాశం లేకుండా పోయింది. దీనికి కారణం సరిపడా నీరులేకపోవడమే. ఈ ఏడాది చెరువులన్నీ నిండుగా ఉండటంతో రబీలో సాగుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు ఆరుతడి పంటగా వేసిన మొక్కజొన్నకు అవసరమైన నీరు లభిస్తోందని రైతులు ఆశపడుతున్నారు. దీంతో మెట్ట పంటల్లో ఎదురైన నష్టాలను, రబీలో పూడ్చుకోవచ్చన్న ఆలోచన చేస్తున్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహించాలని.. అవకతవకలు జరిగితే సహించేది లేదని జేసీ ఇలక్కియా అన్నారు. విస్సన్నపేట మండలం పుట్రేల రైతు సేవా కేంద్రాలతో పాటు ధాన్యం కొనుగోలు చేస్తున్న సాయి రాఘవ రైస్ మిల్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాటా, తేమశాతం కొలిచే యంత్రం పనితీరును పరిశీలించారు. నిబంధనల మేరకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోళ్లు చేయాలని సూచించారు. ధాన్యం కల్లాల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. అనంతరం తాతకుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలో భూముల రీసర్వేకు సంబంధించి మ్యాప్‌లు, దస్త్రాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. జేసీ వెంట తిరువూరు ఆర్డీవో మాధురి, విస్సన్నపేట తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఆర్ఐ సుజాత, మండల సర్వేయర్ శంకరరావు తదితరులు ఉన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మద్దులపర్వ, కూనపరాజుపర్వ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం సాయంత్రం జేసీ ఇలక్కియా, తిరువూరు ఆర్డీవో కె.మాధురి తనిఖీ చేశారు. మద్దులపర్వ గ్రామంలో రైతుల ధాన్యం రాశులను పరిశీలించి వారితో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు చేసి మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఏవో డి.శ్రీనివాసరావు, రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పుట్రేలలో రైస్‌మిల్‌లో తనిఖీచేస్తున్న జేసీ ఇలక్కియా, ఆర్డీవో మాధురి, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి

ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: రైతులకు అసౌకర్యం కలగకుండా ధాన్యం కొనుగోలు చేసి వెంటనే ఎంపిక చేసిన రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఇలక్కియా ఆదేశించారు. ఎ.కొండూరు మండలం కంభంపాడు, తిరువూరు మండలం లక్ష్మీపురం కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఎ.కొండూరు ధాన్యం సరఫరాకు ఎంపిక చేసిన రైస్‌మిల్లును తనిఖీ చేసి అక్కడి దిగుమతులను పరిశీలించారు. కృష్ణారావుపాలెం బాలుర గురుకుల విద్యాలయాన్ని జేసీ సందర్శించి విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ, నాణ్యతను తనిఖీ చేశారు.

మరణించి.. వెలుగులు పంచి!



చెంచులక్ష్మి

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని తోటమూలకు చెందిన శీలం చెంచులక్ష్మి(56) గురువారం సాయంత్రం మృతిచెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి జి.కృష్ణారెడ్డి.. నేత్రదాన ఆవశ్యకతను మృతురాలి భర్త శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులకు వివరించారు. ఆసుపత్రి వైద్యులు వచ్చి చెంచులక్ష్మి కార్నియాలను సేకరించారు.



వెంకటేశ్వరరావు

తిరువూరు, గంపలగూడెం: తిరువూరు పట్టణానికి చెందిన కేశేపల్లి వెంకటేశ్వరరావు(75) గురువారం మృతిచెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కె.రాజేష్‌ఖన్నా, పి.వెంకటేశ్వరరావు.. నేత్రదాన ప్రాధాన్యతను మృతుడి కుటుంబ సభ్యులకు వివరించడంతో వారు అంగీకరించారు. వెంకటేశ్వరరావు కార్నియాలను ఆసుపత్రి వైద్యులు సేకరించారు.

మొక్కజొన్న విత్తనశుద్ధి చేసుకోండి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: జిల్లాలో మొక్కజొన్న సాగు అధికంగా ఉన్న నేపథ్యంలో విత్తన శుద్ధికి ట్రైకోడెర్మా విరిడిని ఉపయోగించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కిరణ్‌జ్యోతి తెలిపారు. ఇబ్రహీంపట్నం వ్యవసాయ శాఖ ప్రయోగశాలలో సుడోమోనాస్ అందుబాటులో ఉన్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



కొండపల్లిలో వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రంథాలయాధికారులు



గంపలగూడెంలో..



పెనుగొలనులో..

జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం

కొండపల్లి,న్యూస్‌టుడే: జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని జనసేనాని వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు అన్నారు. గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని కొండపల్లి శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్యంత విలువైన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నందున విద్యార్థులు వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, రంగవల్లుల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్లు సీహెచ్ నారాయణ, వాసు, యు.గోపాలరావు, నాయకులు మెల్లంపూడి శ్రీను, రామోజీ తదితరులు పాల్గొన్నారు.



మైలవరంలో..

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అతిథులు పద్మ, టి.సాంబశివరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, కోయ సుధ, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక శాఖ గ్రంథాలయంలో గత వారం రోజులుగా నిర్వహించిన వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం ముగిసింది. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించినట్లు ఆమె పేర్కొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడెం, పెనుగొలను గ్రంథాలయాల్లో నిర్వాహకులు వి.జ్యోతిర్మయి, టి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు దాతల సౌజన్యంతో బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కొండపల్లి,న్యూస్‌టుడే: పురపాలికలోని నాలుగు డివిజన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భాజపా నాయకులు కమిషనర్ రమ్యకీర్తనను కోరారు. డ్రైనేజీల్లో పూడికలు, కంప చెట్ల తొలగింపు, ఖాళీ స్థలాల్లో పారిశుద్ధ్యం వంటి వాటిపై దృష్టి సారించాలని వినతిపత్రం అందజేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కృష్ణమాచారి, అంజనేయులు, జగదీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ విజయవంతానికి పిలుపు

మైలవరం, న్యూస్‌టుడే: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పిలుపు మేరకు డిసెంబరు 13న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని స్థానిక కోర్టు న్యాయమూర్తి ఎం.శైలజ పేర్కొన్నారు. అందులో భాగంగా గురువారం స్థానిక న్యాయస్థానంలో న్యాయవాదులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. రాజీపడేందుకు అవకాశం ఉన్న కేసులను పరిష్కరించుకునేలా చూడాలన్నారు.



న్యాయవాదులు, పోలీసులతో చర్చిస్తున్న న్యాయమూర్తి శైలజ

ముగిసిన కార్తిక మాసోత్సవాలు



తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: కార్తిక మాసం చివరి రోజు సందర్భంగా గురువారం నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో అర్చకులు, భక్తులు ఆకాశం దీపాలు వెలిగించారు. నెల రోజులుగా కార్తిక మాసం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యనారాయణస్వామి వ్రతాలు, ఉపవాసాలు, వనసమారాధనలతో ప్రజలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తరించారు.

తిరువూరు పాటిమీద దాసాంజనేయస్వామి గుడిలో ఆకాశదీపం వెలిగించిన భక్తులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా గురువారం తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని శివాలయాల్లో భక్తులు దీపోత్సవాలు నిర్వహించారు. అర్చకులు శివలింగాలకు విశేష పూజలు, అలంకరణలు చేశారు. కొత్తపల్లి సమీప ఉమాగౌరీశంకరుని ఆలయంలో స్వామివారికి అన్నాభిషేకం చేశారు.



కొత్తపల్లిలో ఉమాగౌరీశంకరునికి అన్నాభిషేకం

ఇక.. ఉపాధ్యాయులకూ క్రీడా పోటీలు!

గంపలగూడెం, న్యూస్‌టుడే: మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యం, ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లే ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా క్రీడా పోటీలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తారు. మండల స్థాయిలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్, ఎంఈవో-1, 2లకు, డివిజన్ స్థాయిలో డివిజన్ కోఆర్డినేటర్, డిప్యూటీ డీఈవో, జిల్లా స్థాయిలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, డీఈవో, రాష్ట్ర స్థాయిలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఏడీ, జేడీ(కోఆర్డినేటర్), జేడీ(ఎస్ఈఆర్-1,2)లకు బాధ్యతలు అప్పగించారు.



వివరాలు ఇలా..

మండలం	పాఠశాలలు	ఉపాధ్యాయులు
గంపలగూడెం	66	217
తిరువూరు	63	238
విస్సన్నపేట	60	210
ఎ.కొండూరు	51	162

తేదీలు ఖరారు: క్రీడా పోటీల నిర్వహించే తేదీలను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. మండల స్థాయిలో ఈ నెల 29, 30 తేదీల్లో, డివిజన్ స్థాయిలో డిసెంబరు 13, 14, జిల్లా స్థాయిలో డిసెంబరు 20, 21, 22, రాష్ట్ర స్థాయిలో వచ్చే ఏడాది జనవరి 2, 3, 4 తేదీల్లో పోటీలు నిర్వహించనున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత, ఆదర్శ, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లు, వ్యాయామోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సహాయకులు జట్లుగా ఏర్పడి క్రీడల్లో పాల్గొంటారు. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు ఉంటాయి. క్రికెట్ జట్టుకు 17 మంది, త్రోబాల్ జట్టుకు 12 మందిని ఎంపిక చేస్తారు. మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు నిధులు కూడా కేటాయించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారు.

మహిళల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయవాది అనురాధ

మైలవరం, న్యూస్‌టుడే: రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఏపీ హైకోర్టు న్యాయవాది మాగంటి అనురాధ సూచించారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐసీసీ, సహేలి క్లబ్ ఆధ్వర్యంలో గురువారం చట్టపరమైన హక్కులు, మహిళా సాధికారికత అంశంపై బీటెక్, ఎంబీఏ విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, గృహహింస నిరోధక చట్టం, బాలికా రక్షణ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అప్పారావు, ఐసీసీ పీఓ రమాదేవి, కోఆర్డినేటర్లు రాణిరుద్రమ, వి.సౌజన్య పాల్గొన్నారు.

మధిర కాలువకు 485 క్యూసెక్కుల సాగర్ జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం 72వ నియంత్రిక నుంచి మధిర బ్రాంచి కెనాల్‌కు గురువారం 485 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈఈ మహేష్‌బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 191 క్యూసెక్కులు చేరగా దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం-30, ఊటుకూరు-1కి 30, పెదకొమిర 20, మధిర 10, నిదానపురం 15 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

తెదేపా నాయకులపై దాడి

వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని వినగడపకు చెందిన తెదేపా నాయకులు మందడుపు జానకిరామయ్య, మందడపు రామారావుపై.. అదే గ్రామానికి చెందిన పసుపులేటి నాగేశ్వరరావు అనే వ్యక్తి బుధవారం రాత్రి అకారణంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో తెదేపా నాయకుల తలలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. బాధితుల్లో ఒకరైన జానకిరామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు నాగేశ్వరరావుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు గంపలగూడెం ఎస్సై జి.అనిల్ తెలిపారు.

దాటాలంటే దడే..!

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన జి.కొండూరులో పులివాగుపై నిర్మించిన వంతెన శిథిల స్థితికి చేరుతున్నా అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ వంతెనపై ప్రయాణం ప్రమాదమని తెలిసినా రాకపోకలు సాగుతున్నాయి. మైలవరం నుంచి విజయవాడ వెళ్లే వాహనాలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో విరామం లేకుండా భారీ వాహనాలు వెళుతుంటాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో వంతెన అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో మరింత దుస్థితికి చేరిందని స్థానికులు వాపోతున్నారు. రెయిలింగ్ పూర్తిగా ధ్వంసమైంది. ఇంకా రాకపోకలు ఇలాగే కొనసాగితే కూలిపోయి.. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంటుందని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నీటి సమస్యతో అవస్థలు



తిరువూరు మండలం ఎర్రమాడు దళితవాడలో సుమారు 50 కుటుంబాల వారు గత మూడు నెలలుగా తీవ్ర నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ అవసరాలకు కూడా నీరు దొరకని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్లు పగిలిపోవడంతోనే సమస్య ఏర్పడినట్లు చెబుతున్నారు. తమ సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి పైపులైన్లకు మరమ్మతులు చేయించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

నేడు ప్రజాదర్బార్

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సరస్వతి తెలిపారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొని.. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొనాలని ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రదర్శనలో ఉద్యోగులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రకృతి వ్యవసాయం జగ్గయ్యపేట డివిజన్ మాస్టర్ ట్రైనర్ వన్నూరప్ప తెలిపారు. మండలంలోని శనగపాడులో గురువారం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి స.హ.చట్టం- 2005పై ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఉత్పత్తులను ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని చెప్పారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పడవల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ప్రాంతంలోని వేదాద్రి, ముక్త్యాల రేవుల్లో ప్రజా రవాణాకు ఉపయోగించే పడవల నిర్వహణలో విధిగా నిబంధనలు పాటించాలని సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మనోహర్, డిప్యూటీ ఎంపీడీవో పద్మావతి తెలిపారు. గురువారం ఆయా రేవుల్లోని పడవుల నిర్వాహకులను కలిసి ప్రస్తుతం వారు అమలు చేస్తున్న విధి విధానాలను తెలుసుకొని పలు సూచనలు చేశారు. పడవల్లో లైఫ్ జాకెట్లను తప్పనిసరిగా ఉంచుకోవాలని, పడవల్లో బైకుల వంటి వాహనాలను ఎక్కించకూడదని, నియమిత సంఖ్యను దాటి ప్రజలను కూడా ఎక్కించవద్దన్నారు. పడవుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి నిబంధనలు అమలు చేసే ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారు. ఇటీవల వేదాద్రి నుంచి గింజుపల్లి వెళ్లే పడవలో మోటారు ఆగిపోయి పడవ నదిలో అరగంట పాటు ఉండాల్సి రావడంతో రేవులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సీఐ తెలిపారు.



నిర్వాహకులకు సూచనలిస్తున్న సీఐ, తహసీల్దార్, ఎంపీడీవో

ముగిసిన సహకార వారోత్సవాలు



సొసైటీ వద్ద పతాకం ఎగురవేత కార్యక్రమంలో పాలకవర్గం, నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక సహకార సంఘ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షుడు కొరెడ్ల వెంకటనారాయణ, సభ్యులు.. సహకార సంఘ పతాకాన్ని ఎగురవేశారు. సంఘాల ద్వారా అందుతున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలిలో తహసీల్దారు వి.రాజకుమారి గురువారం పర్యటించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు రుచిగా, శుచిగా వడ్డించాలని ఏజెన్సీ సభ్యులను ఆదేశించారు. అనంతరం గ్రామస్థులకు నీరు సరఫరా చేస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు.

21న పత్తి కొనుగోళ్లు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం ఉదయం సీసీఐ బయ్యర్ పత్తి కొనుగోలు చేస్తారని ఏఎంసీ కార్యదర్శి బి.రాజబాబు తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న రైతులు పత్తిని గోనె సంచులు లేదా లూజుగా తీసుకొచ్చి.. విక్రయించుకోవాలని సూచించారు.

పీఆర్‌టీయూ నూతన కమిటీ ఎన్నిక

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను పర్యవేక్షణలో సీనియర్ నాయకుడు శెట్టి దుర్గాప్రసాద్ అధ్యక్షతన టీచర్స్ కోపరేటివ్ భవనంలో గురువారం జరిగిన సభలో జగ్గయ్యపేట మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా ధారావతు పాండు, ఆర్.నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా కొండయ్య, ప్రతినిధులుగా కె.రాజేంద్ర, తారావతు కృష్ణ, ఈశ్వర్, బాణోతు శ్రీనివాస్, పి.రాంబాబు, ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగరాజు, కోట శ్రీనివాస్ నూతన కార్యవర్గానికి ధ్రువపత్రాలు అందజేశారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు శిబిరం నేడు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపకరణాల పంపిణీ కోసం వైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నారని ఎంఈవో-2 ఎం.పద్మ గురువారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 3 వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. 0-18 ఏళ్ల వారికి పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. శిబిరానికి వచ్చేవారు సదరన్ ధ్రువపత్రం, ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు రెండు, యూడీఐడీ కార్డు, కుల ధ్రువపత్రాలను తీసుకుని రావాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల తల్లిదండ్రులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తు చేశారా?

☛ పంజాబ్ నేషనల్ బ్యాంకులో లోకల్ బ్యాంకు ఆఫీసర్ పోస్టులు (750) చివరి తేదీ: 23.11.2025

☛ దక్షిణ మధ్య రైల్వేలో స్పోర్ట్స్ కోటా ఖాళీలు చివరి తేదీ: 24.11.2025

కరెంట్ అఫైర్స్



✦ ఇటీవల ఏ నగరంలో జరిగిన 28వ యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) కాంగ్రెస్‌లో భారత్ యూపీయూ కౌన్సిల్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, పోస్టల్ ఆపరేషన్స్ కౌన్సిల్‌లకు తిరిగి ఎన్నికైంది? జ: దుబాయ్

మాదిరి ప్రశ్నలు

✦ 'ది కాన్స్టిట్యూషన్ మ్యాటర్స్' పుస్తక రచయిత ఎవరు? (రచయిత భారతదేశ 50వ ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు.) జ: మాజీ సీజేఐ డీవై చంద్రచూడ్

✦ వ్యవసాయ సాంకేతిక ఆవిష్కరణల కోసం ఇటీవల భారత్‌తో కలిసి ఏ దేశం 'మైత్రి 2.0'ను ప్రారంభించింది? జ: బ్రెజిల్ (ఇండియా-బ్రెజిల్ అగ్రిటెక్ క్రాస్-ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ ఈ కార్యక్రమానికి నామకరణం చేశారు.)

✦ వన్డే క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసిన భారతీయ క్రికెటర్ ఇటీవల ఎవరు ఘనత సాధించారు? జ: స్మృతి మంధాన (న్యూదిల్లీలో ఆస్ట్రేలియాతో జరిగిన 3వ వన్డేలో కేవలం 50 బంతుల్లోనే సెంచరీ సాధించిన ఈమె 2013లో ఆస్ట్రేలియాపై విరాట్ కోహ్లీ 52 బంతుల్లో సెంచరీ చేసిన చిరకాల రికార్డును బద్దలు కొట్టింది.)

మరింత సమాచారం

ఈనాడు ప్రతిభ

pratibha.eenadu.net/eenadupratibha.net

65 ఏళ్ల భారత ప్రణాళికలు

(విజయాలు, వైఫల్యాలు)



భారతదేశం స్వాతంత్ర్యానంతరం ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో సోవియట్ యూనియన్ నుంచి ప్రేరణ పొంది పంచవర్ష ప్రణాళికలను ప్రారంభించింది. దేశ ఆర్థిక, సామాజిక పురోగతి లక్ష్యాలను సాధించేందుకు వనరులను కేటాయించే ప్రక్రియగా అవి కొనసాగాయి. 1951 నుంచి 2017 వరకు 12 పంచవర్ష ప్రణాళికలు, 5 వార్షిక ప్రణాళికలు పూర్తయ్యాయి. వాటి వల్ల అనేక విజయాలు అందడంతోపాటు పలు అవరోధాలు ఎదురయ్యాయి. 65 ఏళ్లలో కేంద్రం అమలు చేసిన ప్రణాళికలు, వాటి లక్ష్యాలు, విజయాలు, వైఫల్యాలపై పోటీపరీక్షల అభ్యర్థులకు స్థూల అవగాహన ఉండాలి. ప్రణాళికల కారణంగా ఆహార ధాన్యాలు, పరిశ్రమలు, రక్షణ, సాంకేతిక రంగాల్లో అద్భుత పురోగతి సాధ్యమైన తీరుతో పాటు నిరుద్యోగం, ధరల పెరుగుదల, సంపద కేంద్రీకరణ, అసమానతలు అధికమయ్యేందుకు దోహదపడిన పరిస్థితులనూ అర్థం చేసుకోవాలి.

అద్భుతవృద్ధి జరిగి.. అసమానతలు పెరిగి!

ఆర్థిక వ్యవస్థలోని కార్యకలాపాలను నిర్ణీత కాలవ్యవధిలో నిర్దేశించిన లక్ష్యాల వైపు ఒక క్రమంలో నడిపించడాన్ని అర్థశాస్త్ర పరిభాషలో 'ప్రణాళిక' అంటారు.

భారతదేశంలో ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో భాగంగా ఆర్థిక ప్రణాళికల అమలు కోసం 1950, మార్చి 15న ప్రణాళికా సంఘం ఏర్పాటైంది. 1951, ఏప్రిల్ 1 నుంచి మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రారంభమైంది.

లక్ష్యాలు: దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధి, పేదరికం తగ్గింపు, దేశ వనరులను సమర్థంగా వినియోగించుకోవడం పంచవర్ష ప్రణాళికల ప్రధాన లక్ష్యాలు. ఆర్థికవృద్ధి, ఉపాధి స్థాయిలను పెంచడం, ఆర్థిక స్థిరత్వం, ఆదాయ సమానత్వం, సామాజిక న్యాయం, ప్రాంతీయాభివృద్ధితో పాటు ప్రగతిశీల పన్నులు, ఉపాధి కల్పన, రిజర్వేషన్ల ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించడం, తలసరి ఆదాయం పెంచడం ద్వారా జీవనప్రమాణాలు పెంచడం తదితరాలన్నీ ప్రణాళికల్లో భాగం.

ఆవశ్యకత: ❖ సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించడం. ❖ పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక, ప్రాంతీయ అసమానతలు మొదలైన ఆర్థిక సమస్యలకు పరిష్కార మార్గాలను చూపడం. ❖ ఆర్థిక అవస్థాపనా సౌకర్యాల (విద్యుత్తు, రవాణా, సమాచారం) అభివృద్ధి. ❖ సామాజిక అవస్థాపనా సౌకర్యాల (విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం) అభివృద్ధి. ❖ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన. ❖ సంతులిత ప్రాంతీయాభివృద్ధి సాధన.

జనరల్ స్టడీస్ — ఇండియన్ ఎకానమీ

విజయాలు

జాతీయాదాయం, తలసరి ఆదాయంలో పెరుగుదల: మొదటి ప్రణాళిక (1951-56)లో రూ.1.32 కోట్లు ఉన్న జాతీయాదాయం 2011-12 ధరల ప్రకారం 2017-18లో (12వ ప్రణాళిక ముగిసేనాటికి) రూ.114.1 లక్షల కోట్లకు పెరిగింది. జాతీయాదాయం వృద్ధి రేటు 1980 దశకం లోపు 3.5% వద్ద స్థిరంగా ఉండేది. 12వ ప్రణాళికలో 6.8 శాతానికి చేరింది.

➾ తలసరి ఆదాయం మొదటి ప్రణాళికలో 1993-94 ధరల ప్రకారం రూ.3,687 నుంచి 12వ ప్రణాళిక ముగిసేనాటికి (2011-12 ధరల ప్రకారం) 2017-18లో రూ. 86,668కు పెరిగింది. తలసరి ఆదాయం వృద్ధి రేటు మొదటి ప్రణాళికలో 1.4% నుంచి 12వ ప్రణాళిక నాటికి 5.4 శాతానికి పెరిగింది.

వ్యవసాయ రంగంలో మార్పు: భారత ప్రభుత్వం 60 ఏళ్లుగా వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలపై 23%-24% పెట్టుబడులు పెట్టింది. 1960వ దశకంలో నూతన వ్యవసాయ వ్యూహాలను ప్రవేశపెట్టడం, హరితవిప్లవానికి ప్రాధాన్యం ఇవ్వడంతో ఆహారధాన్యాల ఉత్పత్తి 1950-51లో 50.8 మిలియన్ టన్నుల నుంచి 2017-18 నాటికి 284.83 మి.టన్నులకు పెరిగింది. అన్ని ఆహార పంటల ఉత్పత్తిలో 4-5 రెట్లు వృద్ధి నమోదైంది. నూనెగింజలు, చెరకు, పత్తి తదితర ఆహారేతర పంటల ఉత్పత్తి కూడా పెరిగింది.



పారిశ్రామిక రంగ ప్రగతి: ప్రణాళికల వల్ల భారీ పరిశ్రమల్లో వైవిధ్యీకరణ సాధ్యమైంది. రెండో ప్రణాళికలో ప్రత్యేకంగా పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి భారీ, మౌలిక పరిశ్రమలను నెలకొల్పారు. 12వ ప్రణాళిక (2012-17)లో సమ్మిళిత వృద్ధిని పెంపొందించడంపై ప్రణాళిక సంఘం దృష్టి సారించింది.



ఆర్థిక అవస్థాపనా సౌకర్యాల వృద్ధి: సత్వర ఆర్థికాభివృద్ధికి కావాల్సిన ఆర్థిక, సామాజిక అవస్థాపనా సౌకర్యాలు వృద్ధి చెందాయి. రవాణా, విద్యుత్తు, సమాచారం, నీటిపారుదల సౌకర్యాలు లాంటి మౌలిక సదుపాయాలు విస్తృతమయ్యాయి.

"కొన్ని ప్రభుత్వ సంస్థలు ఉద్దేశపూర్వకంగా, సుదీర్ఘ ఆలోచన తర్వాత ఆర్థిక ప్రాధాన్యాలను ఎంపిక చేసుకోవడమే ప్రణాళిక రచన. – బార్బరా వూటెన్"

ఎగుమతి, దిగుమతుల్లో మార్పులు: సత్వర పారిశ్రామికాభివృద్ధి విధాన ఫలితంగా భారతదేశం తన మూలధన వస్తు అవసరాలకు ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గింది. 1991లో వచ్చిన నూతన ఆర్థిక సంస్కరణలతో ఎగుమతి, దిగుమతుల్లో అనూహ్య మార్పులు వచ్చాయి.



ఉదా: మొదటి పంచవర్ష ప్రణాళికలో భారత దేశ ఎగుమతుల విలువ రూ.606 కోట్లు ఉండగా, 12వ ప్రణాళికలో రూ.16,35,261 కోట్లకు చేరింది.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో ముందంజ: 1983లో సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీ, 2013లో సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ పాలసీలను ప్రవేశపెట్టారు. ఫలితంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో దేశం ప్రపంచస్థాయి ప్రమాణాలను సాధించింది.

✻ విదేశీ నిపుణులపై ఆధారపడటం తగ్గి, ప్రస్తుతం ప్రపంచ నలుమూలలకు నిపుణులను ఎగుమతి చేసే దేశంగా భారత్ అవతరించింది. **ఉదా:** గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత దేశం 39వ స్థానంలో, ప్రపంచ వ్యాప్తంగా మేధోసంపత్తిదారుల్లో 6వ స్థానంలో ఉంది.



పొదుపు, పెట్టుబడుల వృద్ధి: 1950-51లో స్థూలదేశీయోత్పత్తిలో పొదుపు 9% ఉండగా, 12వ ప్రణాళిక (2012-17)లో 34.02 శాతానికి పెరిగింది. ఇదే కాలంలో పెట్టుబడులు 9% నుంచి 38.8 శాతానికి చేరాయి.

వైఫల్యాలు



ధరల పెరుగుదల: పంచవర్ష ప్రణాళికల లక్ష్యాల్లో ధరల స్థిరత్వం ఒకటి. కానీ మొదటి ప్రణాళికలో తప్ప మిగతా అన్ని ప్రణాళికల్లో ధరలు విపరీతంగా పెరిగాయి. రెండో ప్రణాళికలో సగటున 6.3%, మూడో ప్రణాళికలో 5.8%, 4వ ప్రణాళికలో 9%, 12వ ప్రణాళికలో ధరల పెరుగుదల 4.5% - 5.0%గా ఉంది.



పేదరికం, నిరుద్యోగం వృద్ధి: 65 ఏళ్ల ప్రణాళికా కాలంలో నిరుద్యోగం, పేదరికం పెరుగుతూనే ఉన్నాయి. 2012 భారత ప్రభుత్వ నివేదిక ప్రకారం 21.9% జనాభా (300 మిలియన్లు) దారిద్ర్యరేఖకు దిగువన ఉంది. ఎన్ఎస్ఎస్ నివేదిక ప్రకారం 1999-2000 నాటికి 26.58 మిలియన్లుగా ఉన్న నిరుద్యోగులు, 2009-10 నాటికి 28.1 మిలియన్లకు పెరిగారు.

ఆదాయ సంపదల పంపిణీలో అసమానతలు: ప్రణాళికల లక్ష్యాల్లో ఆదాయం, సంపద పంపిణీ అసమానతలు తగ్గించడం ప్రధానమైంది. కానీ ఈ ప్రణాళికలు అసమానతలు పెరగడానికే దోహదపడ్డాయి. ధనిక వర్గం మరింత ధనవంతులుగా, పేదవర్గం మరింత పేదలుగా మిగిలిపోయారు.

అసమర్థ పాలన: 'భారత ప్రణాళికల లోపాల్లో ప్రధానమైంది వాటి అమలే' అని యూఎన్ఓ నిపుణుల బృందం పేర్కొంది. అసమర్థ పాలన, పాలకులు, ప్రభుత్వ యంత్రాంగంలో నిజాయతీ లేకపోవడం, స్వార్థ ప్రయోజనాలు, అక్రమ లావాదేవీల కారణంగా వాటి లక్ష్యాలు నెరవేరలేదు.


● సంతులిత ప్రాంతీయాభివృద్ధి సాధించడంలోనూ ప్రణాళికలు విఫలమయ్యాయి. **ఉదా:** హరియాణా తలసరి ఆదాయం, బిహార్ తలసరి ఆదాయం కంటే నాలుగు రెట్లు అధికంగా ఉంది.

"లభ్యమవుతున్న వనరులను గరిష్ఠ సామర్థ్యంతో ఉపయోగించి, కొన్ని స్పష్టమైన లక్ష్యాలను సాధించాలని ప్రభుత్వం తీసుకునే చొరవే ప్రణాళిక." – ప్రణాళికా సంఘం



రచయిత: వమరవల్లి రమణయ్య

స్టూడెంట్‌కు అసలు అర్థం తెలుసా! — స్టడీ స్కిల్స్



ప్రసిద్ధ ఆంగ్ల పదాలకు సంబంధించి దాదాపు అన్నింటిలో ప్రతి అక్షరానికి ఒక అర్థం ఉంటుంది. అలాగే STUDENT అనే పదంలోని అక్షరాల్లోనూ విస్తృత అర్థం ఉంది. మొదటి అక్షరం 'ఎస్' సిన్సియారిటీని సూచిస్తుంది. అంటే చదువు పట్ల నిజాయతీగా ఉండటమే విద్యార్థికి ఉండాల్సిన మొదటి లక్షణం. అర్థం కాకపోయినా అర్థమైనట్లుగా, రాని దానిని వచ్చినట్లుగా నటించకూడదని చెబుతోంది. ఆ విధంగా ప్రతి అక్షరానికి ఉన్న ఒక్కో స్ఫూర్తిదాయక అర్థంతో పాటు దానికి ఇచ్చిన సరైన వివరణలపై కూడా అభ్యర్థులు అవగాహన పెంచుకోవాలి. ఉత్తమ విద్యార్థికి ఉండాల్సిన ఆ లక్షణాలను, 'స్టూడెంట్'లోని అక్షరాల పూర్తి అర్థాన్ని తెలుసుకోవాలంటే **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.

ఐదేళ్లు సంరక్షణ.. నిరంతర ఆదాయం

రైతేరాజు

అన్నదాతకు సిరులు కురిపించే వక్క సాగు

మడకశిర, న్యూస్‌టుడే

వక్క తోటల సాగు అన్నదాతకు సిరులు కురిపిస్తుంది. ఐదేళ్ల పాటు సంరక్షణ చేపడితే అనంతరం రాబడి మొదలవుతుంది. ఏటా దిగుబడి పెరగడంతో పాటు ఆదాయం రెట్టింపవుతుంది. చెట్లకు అవసరమైన మేరకు నీరు, పేడ, మట్టిని అందిస్తే చాలు. ఈ పంట సాగులో పెద్దగా ఖర్చు చేయాల్సింది లేదు. ధరలు నిలకడగా ఉంటే రూ.లక్షల్లో ఆదాయం లభిస్తుంది.

నేల ఎంపిక : సాధారణంగా వక్క అన్ని నేలల్లో పండుతుంది. నీరు నిలవకుండా ఉండే భూములు ఎంపిక చేసుకుంటే మొక్క త్వరితగతిన పెరిగేందుకు మంచి అవకాశం. 25 నుంచి 35 డిగ్రీల మధ్య వాతావరణం అనుకూలంగా ఉండాలి. సాలుకు సాలుకు మధ్య 9 అడుగులు, మొక్కకు మొక్కకు మధ్య 7 అడుగులు దూరం పాటించాలి. ఇలా ఒక ఎకరాలో 450 నుంచి 500 మొక్కలు నాటుతారు. కొత్తగా నాటిన మొక్కలకు ఎండ నుంచి రక్షణ కోసం నీడ ఇచ్చే అవిస మొక్కలను నాటుకోవాలి. రెండేళ్ల వరకు నీడలోనే మొక్క పెరుగుతుంది. వక్క మొక్కలకు రసాయన ఎరువులు, పురుగుల మందుల అవసరం ఉండదు. సేంద్రియ ఎరువులు ఏడాదికి ఒకసారి మాత్రమే వేస్తారు. డ్రిప్ ద్వారా సరిపడా నీరు వదులుతారు. అనంతరం అయిదేళ్లకు వక్క పంట దిగుబడి ప్రారంభమవుతుంది.

నారు పోసే విధానం : సాగుకు ముందు 40 ఏళ్ల వయసున్న మంచి దిగుబడి ఇచ్చే మొక్క నుంచి విత్తనాలు సేకరిస్తారు. వాటిని గోనెసంచుల్లో కట్టి రెండు నెలల పాటు నీడలో ఉంచి నీరు పోస్తే మొలక వస్తుంది. ఈ మొలకలను మట్టి వేసిన పాలిథిన్ కవర్లలో ఉంచి నీరు పోస్తే ఏడాదికి 2 అడుగులు పెరుగుతుంది. అనంతరం గుంతల్లో నాటి బిందు సేద్యం ద్వారా నీరందించాలి. ఇలా అయిదేళ్ల పాటు ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. నాటిన అయిదేళ్ల అనంతరం ఒక చెట్టు నుంచి గరిష్ఠంగా 30 కేజీల వరకు పచ్చి కాయలు వస్తాయి. వీటిని ఒలిచి.. ఉడకబెట్టి, అయిదు రోజుల పాటు ఎండబెడితే 3 కిలోల ఎండిన వక్క సిద్ధమవుతుంది. ఇలా ఏటా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వక్క దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలు ధర రూ.52 వేలు ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తే రూ.లక్ష పెట్టుబడి పోనూ రూ.4 లక్షలు నికర లాభం వస్తుంది. అదనపు ఆదాయం కోసం అంతర పంటలుగా తమలపాకు, మిరియాలు, పూలచెట్లు, చెక్క ఇతర సుగంధ ద్రవ్యాలను సాగు చేసుకోవచ్చు.



రాష్ట్రంలోనే అమరాపురం అగ్రస్థానం : ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం వక్క సాగులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 6 వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతుండగా, ఒక్క అమరాపురం మండలంలోనే 3,100 ఎకరాల్లో సాగులో ఉంది. అలాగే అగళి, రొళ్ల, గుడిబండ మండలాల్లోనూ ఈ పంట అత్యధికంగా సాగు చేస్తున్నారు. అమరాపురం మండలంలో వక్క సాగు ద్వారా రైతులు ఏటా దాదాపు రూ.వంద కోట్ల వరకు ఆదాయం పొందుతుండడం గమనార్హం.

చలికాలంలో పాడి పశువులు జాగ్రత్త

న్యూస్‌టుడే తోట్లవల్లూరు

చలికాలంలో పాడి పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటికి సోకే వ్యాధులు, నివారణోపాయాల గురించి పశువైద్యశాల సహాయ సంచాలకుడు జె.ప్రకాష్‌బాబు వివరించారు. పశువులను చలికాలంలో రాత్రిళ్లు ఆరుబయట ఉంచొద్దు. చుట్టూ గోతాలు కట్టిన చావిళ్లలో ఉంచాలి. ఆరుబయట ఉంచితే వాటి శరీర, వాతావరణంలోని ఉష్ణోగ్రతల మధ్య ఏర్పడే తీవ్ర వ్యత్యాసాలతో అవి కొంత మేర శక్తిని కోల్పోతాయి. ఈ కాలంలో వాటికి అదనంగా దాణా కూడా పెట్టాలి. పశువులు ఎక్కువగా శీతకాలంలో ఈత, ఎదకు వస్తాయి. ఎదకొచ్చిన వాటి నుంచి తీగలు వస్తాయి. పశుపోషకులు వాటిని గుర్తించి ఒక ట్రెండు రోజుల్లో సెమన్ వేయించాలి. ఈనిన పశువుల పాలను తీసిన తర్వాత పొదుగును యాంటీ సెప్టిక్ ద్రావణంతో కడిగి జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో ఈ జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా పశువులను కాపాడుకోవచ్చని పశువైద్యాధికారి తెలియజేశారు.



రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

ప్రశ్న: వంగ సాగుకు నేలలు, రకాలు, విత్తే కాలం, విత్తన మోతాదు గురించి వివరించండి? -కె.రాజారావు, రైతు, పూషడం

సమాధానం: వంగ సాగుకు లోతైన, సారవంతమైన, మురుగు పారే సౌకర్యం ఉన్న అన్ని రకాల నేలలు అనుకూలం. ఉదజని సూచిక 5.5-6.5 నేలలు శ్రేష్ఠం. రాష్ట్రంలో 15-20 శాతం సంకర రకాలు సాగులో ఉన్నాయి. ఏడాది పొడవునా వంగ సాగు చేయవచ్చు. నవంబరు మాసం అనుకూలంగా ఉంటుంది. ఎకరానికి సూటి రకాలు 260 గ్రాములు, సంకర రకాలు 124 గ్రాముల విత్తన నారు సరిపోతుంది. 30-35 రోజుల వయసు గల మొక్కలను ప్రధాన పొలంలో నాటుకోవాలి. గుబురుగా పెరిగే రకాలను 75×50 సెం.మీ., పొడవుగా నిటారుగా పెరిగే రకాలను 50×50 సెం.మీ. ఎడంతో నాటుకోవాలి.

ప్రశ్న: పాద చిక్కుడు విత్తన మోతాదు, ఎరువులు, నీటి యాజమాన్యం వివరించండి? -ఎం.బాబూరావు, యండకుదురు

సమాధానం: ఎకరానికి 16 కిలోలు విత్తనం సరిపోతుంది. విత్తడానికి వారం రోజులు ముందు ఆఖరి దుక్కిలో పశువుల ఎరువు 8-10 టన్నులు వేసి దున్నాలి. 24 కిలోలు భాస్వరం, 12 కిలోల పొటాష్‌తో పాటు మొదటి దఫా 15 కిలోల నత్రజని వేయాలి. రెండో దఫా 15 కిలోల నత్రజనిని విత్తిన 30 రోజులకు వేయాలి. ఎరువులు వేసిన వెంటనే నీరు కట్టాలి. 7-10 రోజులకోసారి నీటితడి ఇవ్వాలి. పూత, కాయ దశలో నేల 50 శాతం తేమ ఉండేలా చూసుకోవాలి.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కేవీకే, ఘంటసాల

- న్యూస్‌టుడే, ఘంటసాల

మిరప పంటలో సస్యరక్షణ చర్యలు



నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మిర్చి పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా తోటల్లో నీరు నిలిచింది. దీంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను నందిగామ ఉద్యాన అధికారిణి వర్ధిని వివరించారు. అధిక వర్షాలకు మిరప మొక్కలు తలవాల్చితే తేరుకోడానికి లీటరు నీటికి పది గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వేరు కుళ్లు ఆశించకుండా లీటరు నీటికి మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో వేర్లు తడిసేలా పోయాలి. సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి.

నేటి దుర్గగుడి సమాచారం



ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి అంతరాలయంలో వేకువజామున ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవ, 3.30కు వస్త్రాలంకరణ సేవ, 4 గంటలకు దేవి ఖడ్గమాలార్చన నిర్వహిస్తారు.

ఉదయం భక్తులకు సర్వదర్శనం కోసం వేకువజామున 5 గంటల నుంచి క్యూలైన్లలోకి అనుమతిస్తారు. యాగశాలలో ఉదయం 6.30కు గణపతి హోమం, 7 గంటలకు రుద్రహోమం, 7.30కు నవగ్రహ శాంతిహోమం, 8 గంటలకు మృత్యుంజయ హోమం, 8.30కు చండీహోమం నిర్వహిస్తారు. ప్రాకార మండపంలో ఉదయం 7.30కు లక్ష కుంకుమార్చన, 8 గంటలకు శ్రీచక్ర నవావరణార్చన, మల్లేశ్వరాలయ ప్రాంగణంలో 9 గంటలకు శాంతి కల్యాణం ఆర్జిత సేవలుగా చేస్తారు.

మధ్యాహ్నం అమ్మవారికి ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పంచభోగ నివేదన చేస్తారు. ఆ సమయంలో అన్ని దర్శనం క్యూలైన్లు నిలిపేస్తారు. వీఐపీ, ప్రోటోకాల్ దర్శనాలు ఉండవు. మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5.30 వరకు దర్శనాలకు అనుమతిస్తారు.

సాయంత్రం దుర్గమ్మకు సాయంత్రం 4 గంటలకు స్వర్ణపుష్పార్చన సేవ(గురువారం మాత్రమే), 6 నుంచి 7 వరకు నివేదన, వేద స్వస్తి, పంచహారతులు ఇస్తారు. అన్ని దర్శనాలను ఈ సమయంలో నిలిపివేస్తారు. సాయంత్రం 7 నుంచి రాత్రి 10 వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

☛ ప్రతి రోజు రాహుకాలంలో నటరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో రాహుకేతు పూజలు జరుగుతాయి. ఆర్జిత సేవలకు టిక్కెట్ రుసుము చెల్లించిన భక్తులను మాత్రమే రానిస్తారు. www.kanakadurgamma.com, https:/// www.aptemples.ap.gov.in వెబ్‌సైట్ల ద్వారా ఆర్జిత సేవా టికెట్లు, ఇతర సమాచారం అందుబాటులో ఉంది. వాట్సప్ నంబరు: 955230 0009 ఆర్జిత సేవలు, దర్శనం టికెట్లు, విరాళాలను ఇచ్చేందుకు అవకాశం ఉంది.

☛ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు మల్లికార్జున మహామండపం రెండో అంతస్తులో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తారు.

స్వరాజ్ మైదాన్ కాంప్లెక్స్‌ను సక్రమంగా నిర్వహించడం లేదు

హైకోర్టులో వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వరాజ్ మైదాన్ కాంప్లెక్స్ నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొంటూ దాఖలైన వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అధికారుల నిర్లక్ష్యం, అశ్రద్ధ కారణంగా 18 ఎకరాల్లో విస్తరించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వరాజ్ మైదాన్ కాంప్లెక్స్ అపరిశుభ్రంగా మారిందని పేర్కొంటూ బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి వై.కొండలరావు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జడా శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. 'ప్రస్తుతం అక్కడ పరిస్థితి దారుణంగా ఉంది. కన్వెన్షన్ కేంద్రం, గ్రంథాలయం, బౌద్ధ ధ్యాన కేంద్రాన్ని మూసివేశారు. నడక మార్గంలో లైట్లు పనిచేయడం లేదు. ఫౌంటెన్లలో నీళ్లు పాచిపట్టి ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది' అని పేర్కొన్నారు.. న్యాయమూర్తి స్పందిస్తూ, పూర్తి వివరాలు సమర్పించాలని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

25 నుంచి మత్తు వైద్యుల జాతీయ సదస్సు

మధురానగర్, న్యూస్‌టుడే: మత్తు వైద్యుల 72వ జాతీయ సదస్సు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఈనెల 25 నుంచి 30 వరకు జరుగుతుందని ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియాలజిస్ట్‌ల రాష్ట్ర పూర్వపు అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ తెలిపారు. 25, 26 తేదీల్లో కార్యశాల ఉంటుందని, 27న మత్తు వైద్యులకు నిరంతర వైద్య విద్య తరగతులు జరుగుతాయని తెలిపారు. 28 నుంచి 30 వరకు మత్తు వైద్యంలో వచ్చిన అత్యాధునిక మార్పులపై సదస్సు జరుగుతుందని, దీనికి దేశ, విదేశాల నుంచి దాదాపు 300 మంది ఫ్యాకల్టీ నిపుణులు, 4 వేల మంది మత్తు వైద్యులు హాజరవుతారని డాక్టర్ తారకప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

కంటెయినర్ ఢీ.. ఒకరి దుర్మరణం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై కోడూరుపాడు వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ మధురానగర్‌కు చెందిన బొడ్డుబోయిన ఏడుకొండలు(38) మరొకరితో కలిసి సరకు రవాణా నిమిత్తం ఆటో నడుపుతూ విశాఖపట్నం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బుధవారం రాత్రి 7 గంటల సమయంలో కోడూరుపాడు ఎన్జీ ఫెర్టిలైజర్స్ సమీపంలో ఆగారు. ఈ క్రమంలో గాలికి ఎగురుతున్న పరదాను ఏడుకొండలు సరిచేస్తుండగా వెనక నుంచి వచ్చిన కంటెయినర్ లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

జోగి సోదరుల కస్టడీపై ముగిసిన వాదనలు

25న ఉత్తర్వులు ఇవ్వనున్న ఎక్సైజ్ కోర్టు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో వైకాపా నేత జోగి రమేష్, అతని సోదరుడు రాము కస్టడీపై గురువారం ఎక్సైజ్ కోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును ఈనెల 25న ఇవ్వనున్నట్లు న్యాయాధికారి లెనిన్‌బాబు ప్రకటించారు. జైలులో తనకు ములాఖత్‌లు పెంచాలన్న జోగి రమేష్ పిటిషన్‌పై కోర్టు తీర్పు ఇచ్చింది. వారంలో రెండు సార్లు కుటుంబ సభ్యులతో, న్యాయవాదులతో అదనంగా ములాఖత్‌లను పెంచుతూ కోర్టు ఉత్తర్వులిచ్చింది. అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహన్‌రావు, బాదల్ దాస్, ప్రదీప్ దాస్, జోగి రమేష్, రాముల బెయిల్ పిటిషన్లపై కౌంటర్ల దాఖలు కోసం ఈనెల 27కి వాయిదా వేశారు. రవి, కల్యాణ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావుల బెయిల్ పిటిషన్లపై విచారణ 25కు వాయిదా పడింది. చెక్కా సతీష్ కుమార్, శ్రీనివాసరెడ్డి బెయిల్ పిటిషన్లపై విచారణ 27కు న్యాయాధికారి వాయిదా వేశారు.

మద్యం కేసులో వివిధ పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో గురువారం విచారణ నిమిత్తం.. ఏసీబీ కోర్టుకు వచ్చిన పలు పిటిషన్లు వాయిదా పడ్డాయి. దిల్లీలో సమావేశం ఉన్నందున.. శుక్రవారం సిట్ ఎదుట హాజరుకాలేనని, పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యేందుకు అనుమతించాలని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి వేసిన రెండు పిటిషన్లపై విచారణ 21వ తేదీకి వాయిదా పడ్డాయి. కారాగారంలో వసతులు కల్పించాలని వైకాపా నేత చెవిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ బెయిల్ పిటిషన్లపై తదుపరి వాయిదాల నిమిత్తం 21వ తేదీకి వాయిదా వేశారు.

అరుణకు బెయిల్ మంజూరు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ఎస్సై, అంగన్‌వాడీ పోస్టులు ఇప్పిస్తానంటూ ఒక వృద్ధుడిని రూ.24.5 లక్షలు మోసం చేసిన కేసులో నిందితురాలు నిడిగుంట అరుణకు విజయవాడ 1వ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. మోసం కేసులో నెల్లూరుకు చెందిన అరుణపై గత నెల 13న విజయవాడ సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి ఆమెను పీటీ వారెంట్‌పై న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులో నిందితురాలిని రెండు రోజుల పాటు పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న అరుణ ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ న్యాయవాది ద్వారా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి దేవిక నిందితురాలికి బెయిల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు.

వసుంధర

vasundhara@eenadu.in

ఇవి తింటే... వెచ్చదనమే!

అబ్బబ్బా ఏం చలి! ఉదయాన్నే నేలమీద కాలు పెట్టాలంటే వణుకు వచ్చేస్తోంది. ఎండలోకి వెళ్లినా చల్లని గాలులే! హాయిగా రగ్గులోనే ఉండిపోవాలి అనిపిస్తోంది కదూ. కానీ అలా కూర్చుంటే మనకు పనులవ్వవుగా! కాబట్టి, పైనుంచే కాదు లోపల్నుంచీ వెచ్చదనం అందించాలి.



- టీ అయినా, మసాలా కూరలైనా కాస్త అల్లం పడితే వచ్చే రుచే వేరు! రక్తప్రసరణకు మంచిది, జీర్ణశక్తిని పెంచుతుందనీ వాడతాం. దీనిలోని థర్మోజెనిక్ స్వభావం... ఒంట్లో వేడిని పుట్టిస్తుంది. కాబట్టి, టీ, సూపుల్లో చోటిచ్చేయండి.
- కేకులు, బిస్కెట్లలో దాల్చినచెక్క పొడి కలుపుతాం. అదిచ్చే సువాసనే వేరు. టీ, కాఫీల్లో రోజూ కాస్త చోటివ్వండి. ఇది కూడా శరీరంలో వేడిని పుట్టించేదే! పైగా మెటబాలిజాన్నీ మెరుగుపరుస్తుంది.
- ఈ కాలం మరో సమస్య స్తబ్దుగా చేయడం. ఆ బద్ధకానికి ఓ పట్టాన కదల బుద్ధే కాదు. అలాంటప్పుడు తేనెని తీసుకోండి. వెచ్చగా ఉంచుతూనే శరీరంలో చురుకుదనాన్నీ పుట్టిస్తుంది. ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లు, టోస్ట్, టీ... ఇలా వేటిలో చేర్చుకున్నా మంచిదే.
- నట్స్‌తోపాటు నువ్వులు, అవిసెలు వంటి సీడ్స్‌ని రోజూ తగు మోతాదులో తీసుకోండి. ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్లు అందడమే కాదు... శరీరంలో వేడినీ ఉత్పత్తి చేస్తాయివి. అందుకే వీటిని 'వింటర్ స్నాక్'గానూ పిలుస్తారు.
- అమ్మాయిలకు రక్తక్షీణత సమస్య రావొద్దంటే తగిన ఐరన్ అందేలా చూసుకోవడం తప్పనిసరి. అది అందే మంచి మార్గం... బెల్లం. పల్లీలు, నువ్వులు లేదంటే పాలల్లో కలుపుకొని ఎలా తీసుకున్నా మంచిదే. ఐరన్ అందడమే కాదు... వెచ్చదనాన్నీ, కావాల్సిన శక్తినీ ఇస్తుంది.

ఏయే రోజుల్లో సురక్షితం?

మాకిద్దరు పిల్లలు. ఆపరేషన్ ఇంకా చేయించుకోలేదు. దీంతో మళ్లీ గర్భం దాల్చుతానేమోనని భయంగా ఉంది. పీరియడ్ తరవాత కలయికలో పాల్గొన్నా గర్భం రాకుండా సురక్షిత రోజులని ఉంటాయట కదా! నిజమేనా? అయితే ఏమిటవి? - ఓ సోదరి

ఇవి అందరికీ ఒకేలా ఉండవు. రుతుచక్రం ఆధారంగా ఈ సురక్షిత రోజులు మారుతూ ఉంటాయి. సాధారణంగా అయితే నెలసరి మొదలైన రోజు నుంచి పది రోజుల వరకూ సురక్షిత సమయంగా చెబుతాం. మళ్లీ పీరియడ్ వచ్చే రోజుకు ముందు ఏడు రోజులూ సురక్షితమే. ఇంకా కచ్చితంగా తెలియాలి అంటే మీది 28 రోజుల రుతుచక్రం అయితే అండం 14వ రోజున విడుదలవుతుంది. దానికి ముందు, వెనక మూడు రోజులు గర్భ ధారణ సమయం అవుతుంది. ఆరోజులు అసురక్షితం. అదే 30రోజుల చక్రమైతే వెనక నుంచి 14వరోజు అండం విడుదలయ్యే రోజు అవుతుంది. నిజానికి ఇన్ని లెక్కలు వేసుకోవాల్సిన పనీ లేదు. ఇప్పుడు ఫెర్టిలిటీ యాప్‌లు బోలెడు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో మీ నెలసరి వివరాలను చేర్చుకుంటూ వెళ్లండి. అదే ఈ వివరాలను ఇస్తుంది. ఆ సమయంలో మాత్రం జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

ఎలాగూ ఇద్దరు పిల్లలున్నారు. ఇంకా కనే ఉద్దేశం లేదంటున్నారు కాబట్టి, శాశ్వత పరిష్కారంగా కుటుంబ నియంత్రణ చేయించుకోవడమే మేలు. మీకు కుదరకపోతే మీవారైనా వెసక్టమీ చేయించుకోవచ్చు. దీనివల్ల అందరూ అన్నట్లు మగవారికి దుష్ఫలితాలేమీ ఉండవు. పైగా సులువు, పెద్దగా విశ్రాంతి అవసరమూ ఉండదు.

డియర్ వసుంధర



డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

గిరిజన తండాలో పుట్టిన ఆమె కష్టాలను సవాలుగా తీసుకున్నారు. పేదరికాన్ని దాటేందుకు చదువే మార్గమని భావించారు. దూర విద్యలో డిగ్రీ, రెగ్యులర్ పీజీ చేసి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. తాజాగా గ్రూప్-1 పరీక్షల్లో 38వ ర్యాంకుతో డెప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో శిక్షణ పొందుతున్న **బానోతు వనజ** విజయగాథ ఇది. ఆమె వసుంధరతో మాట్లాడారు...



వనజ

మూడేళ్లు... చదువే లోకం

మాది మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్. నాన్న బానోతు దశరథ నాయక్, అమ్మ లలిత. ఉన్న రెండెకరాల భూమే మా కుటుంబానికి ఆధారం. ఆడపిల్ల పుట్టుకనే చిన్నచూపు చూసే మనుషుల మధ్య... నాన్న తన ముగ్గురు కూతుళ్లనూ బాగా చదివించాలని తపన పడేవారు. నలుగురికీ సాయం చేస్తూ, ఇతరుల సమస్యలను పరిష్కరించడంలో చురుగ్గా ఉండే ఆయన్ని చూసే నాకూ ప్రజాసేవ చేయాలనే కోరిక కలిగింది. అందుకోసమే ఐఏఎస్ కావాలనుకున్నా.

దూర విద్యలో డిగ్రీ...

మా ఊళ్లోనే ఏడోతరగతి వరకూ చదువుకున్నా. 5 కి.మీ. దూరంలోని ఉన్నత పాఠశాలకు ఆర్టీసీ బస్సులో వెళ్లి చదువుకునేదాన్ని. ఇంటర్ తర్వాత పలు కారణాలతో డిగ్రీ చేయలేకపోయా. అయినా సరే, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో దూర విద్యలో డిగ్రీ, ఆపై రెగ్యులర్ పీజీ(పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) పూర్తి చేశా. నా లక్ష్యాన్ని చేరుకోవడానికి హైదరాబాద్‌లోని ప్రభుత్వ స్టడీ సర్కిల్‌లో ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నా. రోజుకు 10-12 గంటలపాటు చదివేదాన్ని. ఇలా మూడేళ్లపాటు చదువే లోకంగా సాగిపోయా. సివిల్స్‌లో మూడుసార్లు ప్రిలిమ్స్, ఒకసారి మెయిన్స్‌లో వెనుదిరిగా. ఎక్కడా నిరాశ చెందకుండా తల్లిదండ్రుల కల సాకారం చేయాలనే ధ్యాసతో, పోటీ పరీక్ష సన్నద్ధతలోని లోపాలను అధిగమిస్తూ ముందుకెళ్లా. ఏకాగ్రత, పట్టుదలతో తిరిగి సాధన చేశా.

నాలుగు కొలువులు...

2024లో గ్రూప్-4 వచ్చింది. 2025లో గ్రూప్-2(సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్) ఉద్యోగం, ఇదే ఏడాది మార్చిలో జూనియర్ లెక్చరర్ (జేఎల్)కొలువు రావడంతో వరంగల్‌లోని కళాశాలలో అధ్యాపకురాలిగా విధుల్లో చేరా. పాఠాలు బోధిస్తూనే నా ఆశల కొలువు కోసం సన్నద్ధం అయ్యా. ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రంలో 38వ ర్యాంకు సాధించి డెప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యా. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది. ఒక్క రోజు శ్రమతో ఉద్యోగం రాదు. సిలబస్ కఠినంగా ఉన్నా భయపడొద్దు. నిరంతరం నిలకడగా సాధన చేస్తే కల ఫలిస్తుంది. సమయం, ప్రణాళిక, ఓపిక, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకెళ్తే విజయం వరిస్తుంది. తల్లిదండ్రులు... మగపిల్లలతో సమానంగా అమ్మాయిలనూ చదివించాలి. వాళ్ల ఆశయాలు, లక్ష్యాలను ప్రోత్సహించాలి. అప్పుడే కోరుకున్న లక్ష్యానికి చేరువ అవుతారు.

– బానాల రాజమల్లు, పెద్దపల్లి

ఈ మంత్రి... షూటర్!

బిహార్‌లో నీతీశ్ ముఖ్యమంత్రిగా కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. పురుషాధిక్య రాష్ట్ర రాజకీయాల్లో రమా నిషాద్, లేశీ సింగ్, **శ్రేయసీ సింగ్**... ముగ్గురు మహిళలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రికార్డు స్థాయిలో మహిళలు ఓటింగ్‌లో పాల్గొనడం ఇందుకో కారణం కావచ్చు. వీళ్ల ముగ్గురిలోకీ పిన్నవయస్కురాలైన శ్రేయసీ అందరి దృష్టినీ ఆకర్షించారు. ఎందుకంటే ఆమె సుప్రసిద్ధ షూటర్, బంగారు పతక విజేత, అర్జున అవార్డు గ్రహీత!



శ్రేయసీ

పంతొమ్మిదేళ్ల వయసులో తండ్రిని కోల్పోయిన శ్రేయసీ... క్రీడల్లో రాణిస్తూనే రాజకీయ వారసత్వాన్నీ అందుకుని ప్రజాసేవలోకి నడిచారు. 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో రజతాన్నీ, 2018లో స్వర్ణాన్నీ గెలుచుకున్నారు. అదే ఏడాది అర్జున అవార్డునీ అందుకున్నారు. ఆసియా క్రీడల్లో డబుల్ ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యాన్నీ, 61వ జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్నీ సాధించారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల ట్రాప్ ఈవెంట్‌లో పోటీపడ్డారు. తాజాగా జముయీ నియోజక వర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవిని చేపట్టారు శ్రేయసీ.



అలా ఎలా?

శ్రేయసీ దివంగత మాజీ మంత్రి దిగ్విజయ్ సింగ్ కుమార్తె. వీళ్లది జముయీ జిల్లాలోని గిధౌర్. సంపన్న రాజకీయ కుటుంబం. తండ్రి దిగ్విజయ్ సోషలిస్ట్ భావాలున్న వ్యక్తి. ఈమెకో సోదరి మాన్సి. తల్లి పుతుల్ కుమారి పార్లమెంట్ మాజీ సభ్యురాలు.

'తాత సెరేందర్ సింగ్, తండ్రి దిగ్విజయ్ సింగ్ ఇద్దరూ 'రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'కు అధ్యక్షులుగా చేశారు. దాంతో చిన్ననాటి నుంచే షూటింగ్‌పట్ల ఇష్టం ఏర్పడింది. అలాగని నేను గోల్డెన్ స్పూన్‌తో పెరగలేదు. డబ్బూ హోదాలున్నా నాన్న మమ్మల్ని సామాన్యుల్లానే పెంచారు. ప్రోత్సాహం తప్ప అదనపు సాయం అందించలేదు.

షూటింగ్‌కి అవసరమైనవన్నీ నేనే కొనుక్కున్నా. నేను 12- బోర్‌గన్ (డబుల్ బారెల్ షాట్‌గన్) వాడతాను. జాతీయ పోటీలకు అర్హత సాధించేవరకూ దీన్ని కొనుగోలు చేయలేం. దిగుమతీ చేసుకోకూడదు. పోనీ మనదేశంలో సెకండ్ హ్యాండ్ కొందామంటే ధర ఎక్కువ. అప్పుడు ఓ సీనియర్ షూటర్ నుంచి తుపాకీ అరువు తెచ్చుకున్నా. దాంతోనే నేషనల్స్‌కి వెళ్లాను. పతకాన్ని గెలుచుకున్నా. కానీ స్పాన్సర్లు దొరకలేదు. అరువు తుపాకీతోనే 2010లో కామన్వెల్త్ గేమ్స్‌కి వెళ్లా. ఆ తరవాత స్పాన్సర్‌షిప్ రావడంతో తొలి తుపాకీ కొన్నా. ఇప్పటికీ అదే వాడుతున్నా' అంటారు శ్రేయసీ.

రాజకీయాల్లో...

తండ్రి ఆకస్మిక మరణం శ్రేయసీని రాజకీయాల్లోకి వచ్చేలా చేసింది. ఆయన స్థానంలో తల్లి పోటీ చేయగా మాన్సీ, శ్రేయసీ ప్రచార బాధ్యతను భుజానికెత్తుకుని గెలిపించారు. క్రీడలు, రాజకీయాల్లో బిజీగా ఉన్నా చదువునీ నిర్లక్ష్యం చేయలేదు శ్రేయసీ. ఎంబీఏ చేశారీమె. కొవిడ్ సమయంలో అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2020లో ఎన్నికలకు ముందు బీజేపీలో చేరి, క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 29 ఏళ్ల వయసులో తొలి ఎన్నికల్లోనే సుమారు 41 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు. తాజా ఎన్నికల్లో 54,498 ఓట్ల ఆధిక్యంతో తన స్థానాన్ని నిలుపుకొన్నారు.

ఓ క్రీడాకారిణిగా క్రమశిక్షణతో కూడిన ఆమె జీవితం అట్టడుగు వర్గాలకు చేరువ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, క్రీడల ప్రోత్సాహం.. వంటి అంశాలమీద ప్రత్యేక దృష్టి పెట్టారీమె. తన స్వీయానుభవాల్ని దృష్టిలో పెట్టుకొని క్రీడల ద్వారా యువతలో సాధికారతను పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు శ్రేయసీ. ఇవే ఆమెను మంత్రి పదవీ వరించేలా చేశాయి.

'నాన్నే నా తొలి గురువు. ఆయన పోయాక, ఆటల్లో నిలదొక్కుకోవడానికి చాలా కష్టపడ్డా. ఆయనకిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికి అంటే, కామన్వెల్త్‌లో బంగారు పతకం గెలవడానికి ఎనిమిదేళ్లు పట్టింది. చాలామందికి రాజకీయాలపట్ల దురభిప్రాయం ఉంటుంది. మంచివాళ్లు ఈ రంగాన్ని వదిలేస్తే చెడ్డవాళ్లు తప్పనిసరిగా ఆధిపత్యం చెలాయిస్తార'ని నాన్న చెప్పేవారు. అందుకే సానుకూల దృక్పథంతో సేవాస్ఫూర్తితో రాజకీయాల్లోకి ప్రవేశించా. 2028 ఒలింపిక్స్‌కీ సిద్ధమవుతున్నా. ఆటలైనా రాజకీయాలైనా గెలుపోటములు సహజం. విజయం అంత తేలిగ్గా రాదు. నిరంతరం కష్టపడాల్సిందే. రాత్రి తరవాత ఉదయం కూడా ఉంటుంది. కాబట్టి రంగమేదయినా సమతుల్యత అవసరం. అప్పుడే రాణించగలం' అనే శ్రేయసీ... ద్విపాత్రాభినయం చేస్తూ నవతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు!

ఉద్యోగం వదిలి క్యాన్సర్‌పై పోరాటం!

కాలంతో పోటీపడి మరీ... బాగా సంపాదించి స్థిరపడాలనుకునే రోజులివి. కానీ, **సుదేష్ణ రుహాన్** మాత్రం లక్షల జీతమిచ్చే ఉద్యోగం కాదనుకుని సేవ చేయాలనుకుంటున్నారు. క్యాన్సర్ బాధితులకు అండగా నిలవాలనుకుంటున్నారు. అదెందుకో తెలుసుకుందామా?



సుదేష్ణ

'అవగాహనతోనే చాలా రకాల అనారోగ్యాలకు అడ్డుకట్ట వేయొచ్చు. ముఖ్యంగా కొన్నిరకాల క్యాన్సర్‌లను ముందుగా గుర్తిస్తే ప్రాణాపాయం నుంచీ తప్పించుకోవచ్చు' అంటారు సుదేష్ణ. ఆమెది రాయ్‌పుర్. అక్కడే ఎన్ఐటీలో ఎంటెక్ చేశారు. ఆ సమయంలో 'బ్రెస్ట్ కార్సినోమా'పై చేసిన థీసిస్ సుదేష్ణను క్యాన్సర్ బాధితుల కోసం పనిచేసేలా చేసింది. ఇందుకోసమే చదువయ్యాక లక్షల ప్యాకేజీతో వచ్చిన ఇంజినీర్ ఉద్యోగాన్ని సైతం ఆమె కాదనుకున్నారు. కౌన్సెలర్‌గా మారి ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రాలను సందర్శించి అక్కడి రోగులకు, వారి బంధువులకు నైతిక మద్దతుని అందించేవారు. ఈ సమయంలో వారి కథలను విని సుదేష్ణ చలించిపోయేవారట. ఆరోగ్యంపై కనీస అవగాహన లేకపోవడం, భయం, పేదరికం, అపోహలు... వంటివి ప్రజలను చికిత్స దిశగా ముందుకు కదలనీయడం లేదని తెలుసుకున్నారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాలనుకున్నారు. అయితే, క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలంటే మరింత విస్తృతంగా పనిచేయాలని అర్థమైంది. దానికోసం మరో ఇద్దరు స్నేహితులతో కలిసి 'నిరామయ్ క్యాన్సర్ ఫౌండేషన్‌ను' స్థాపించారు. గ్రామాల్లో క్యాన్సర్‌పై శిబిరాలను ఏర్పాటు చేసి... క్యాన్సర్ స్క్రీనింగ్, చికిత్స పద్ధతులను తెలియజేసేవారు. అలానే, రాయ్‌పుర్ పరిసర గిరిజన ప్రాంతాల్లో పాలియేటివ్ కేర్ సేవలు పరిమితంగా ఉండటం గమనించారు. దాంతో దాతల సాయంతో ఈ సేవల్ని అందుబాటులోకి తెచ్చారు. తీవ్రమైన అనారోగ్యాలతో బాధపడుతున్న రోగులకు ఉపశమనం కలిగించడం, వారి జీవన నాణ్యతను పెంచడం వంటి లక్ష్యాల కోసం దీన్ని నిర్వహిస్తున్నారు. మంచి ఆలోచనే కదూ!

ఈటీవీ భారత్

"నాయకత్వ పరంగా భారత్ కార్పొరేట్ వ్యవస్థ ఒక సంధి దశలో ఉంది. నియంత్రణ, ఆజ్ఞ, అధికారవాద దశ నుంచి మహిళల సహజ లక్షణాలైన సహకారం, భాగస్వామ్యం, స్థితిస్థాపకత దిశగా మారుతోంది. కాబట్టి వారి నాయకత్వానికి ఆదరణ పెరగనుంది. నా ఉద్దేశంలో నాయకత్వం అంటే విశ్వాసం, నిలకడ, నిజాయతీ.



- కావేరీ ఇంగలే, ఎండీ (ఆపరేషన్స్), బిలీవ్ మ్యూజిక్ ఇండియా

ఉప్పుతో జీన్స్ ఉతికేయండి...!

ఈతరం అమ్మాయిలు జీన్స్‌నే క్యాజువల్స్‌గా భావిస్తున్నారు. కుర్తీ వేసుకున్నా, టీ షర్ట్, జర్కిన్ ఇలా ఏది దానిపై జతగా ధరించినా ఫ్యాషన్ వావ్ అనిపిస్తుంది. ఇంతలా వాడే జీన్స్ ఎక్కువకాలం మన్నాలంటే...



- జీన్స్‌ను వేసుకున్న ప్రతిసారీ ఉతకొద్దు. గాలికి ఆరనిచ్చి ఐదారుసార్లు వేసుకున్నాకే శుభ్రం చేయండి. అంతేకాదు, ఉతికేటప్పుడు దాన్ని తిరగేసి వాషింగ్ మెషీన్‌లో వేస్తే సరి. బయటివైపు రంగు పోకుండా ఉంటుంది.
- మురికి త్వరగా వదులుతుందన్న ఆలోచనతో జీన్స్‌ని వేణ్నీళ్లతో ఉతికితే రంగు పోతుంది. అంతేకాదు, కఠిన రసాయనాలనూ వాడకూడదు. రంగు పోకుండా అది ఉతికేటప్పుడు కప్పు వైట్ వినెగర్ లేదా కప్పు ఉప్పు వేయాలి.
- మరకలు పడితే రెండు చెంచాల వంటసోడాలో కాస్త వినెగర్ కలిపి మరక మీద రాయాలి. పావుగంటయ్యాక బ్రష్‌తో మృదువుగా రుద్దితే ఉతికితే సరి. మరక త్వరగా వదిలిపోతుంది.
- వాషింగ్ మెషీన్‌లో జీన్స్‌ని ఉతుకుతుంటే దానికి ఉన్న జిప్‌లను పైకి లాగండి. బటన్స్ కూడా పెట్టేయండి. వాటివల్ల వేరే దుస్తులు చిరిగిపోకుండా ఉంటాయి. దీన్ని డ్రైయర్‌లో వేస్తే కుచించుకుపోయే ప్రమాదం ఉంది. బదులుగా నీడలో హ్యాంగర్‌పై వేలాడదీస్తే సరి. స్ట్రెచ్ జీన్స్‌ని నేలపైన ఆరేస్తేనే మేలు. దాని ఆకృతి దెబ్బతినకుండా ఉంటుంది.

బంగారం - వెండి

20న ముగింపు



	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,27,260	1,14,700	1,60,360
విజయవాడ	1,23,140	1,14,350	1,60,900
ప్రొద్దుటూరు	1,24,800	1,14,820	1,60,000
రాజమహేంద్రవరం	1,24,260	1,13,900	1,73,000
విశాఖపట్నం	1,24,240	1,14,300	1,60,000
తమిళనాడు	-----	1,15,000	1,73,000

అమ్మ చేతి వంటకే ఓటు..!



ఉదయం నుంచి పని చేసి అలసిపోయా! కొత్తగా ఏదైనా ప్రయత్నిద్దాం. అన్నీ రుచి చూశా, అక్కడి బిర్యానీ కూడా ఓసారి రుచి చూసేస్తా... స్నేహితులు వస్తున్నారు వాళ్ల కోసం ఏదైనా ఆర్డర్ పెడదాం... ఇలా వంటను తప్పించుకోవడానికి ఈతరానికి ఎన్ని సాకులో. చదువు, వృత్తిరీత్యా పేయింగ్ గెస్ట్‌లుగా ఉండే అమ్మాయిల విషయమైతే చెప్పనవసరమే లేదు. రోజువారీ పరుగుల్లో పడి జీవననైపుణ్యాల్లో ఒక్కటైన వంటను నేర్చుకోవడమే మానేస్తున్నారు. పెద్దవాళ్లు ఏమైనా అంటే... చేస్తున్నవన్నీ సరిపోవా? మళ్లీ ఇదో పనా? అంటూ నిట్టూరుస్తున్నారు. అయితే, ఇవన్నీ నిన్నటి మాటలు అని చెబుతున్నాయి సర్వేలు. ఇప్పటివాళ్లు వంటచేయడానికే ప్రాధాన్యం ఇస్తున్నారట. అందులోనూ అమ్మ చేతి వంటకు రెప్లికా చేసేందుకు ఎక్కువ మంది ప్రయత్నిస్తున్నారట. దాన్నే.. ఇన్‌స్టా, వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లో అమ్మ రెసిపీ, అమ్మమ్మ రహస్యం అంటూ పోస్ట్‌లూ, స్టేటస్‌లూ పెడుతున్నారట. అయితే దీన్నో వ్యాపకంగా మలుచుకుంటున్న వారూ ఎక్కువే అంటున్నాయి అధ్యయనాలు. ఎందుకిలా చేస్తున్నారని అడిగితే... ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కారణమని కొందరు జవాబు ఇస్తుంటే... ఇది శారీరక ఆరోగ్యాన్నే కాదు, మానసిక సంతులతనీ కాపాడుతుందని చెబుతున్నారట మరికొందరు. అవునుమరి వంట చేయడం కూడా ఒత్తిడిని నియంత్రించే మార్గాల్లో ఒకటి. మైండ్‌ఫుల్‌నెస్‌కు మంచి మార్గం కూడా. 'మనసూ మస్తిష్కం ఒకదాని మీదే లగ్నం చేస్తూ... దూరమైన అనుబంధాల్ని తలుచుకుంటూ... ఆ జ్ఞాపకాల్ని నెమరు వేసుకుంటూ వండే వంటలో ఎంత ఆప్యాయత దాగి ఉంటుందో. ఓసారి ప్రయత్నిస్తేనే గానీ తెలియద'ని సమాధానం ఇస్తున్నారట. మీరేం అంటారు మరి!

చలివేళ... కూల్‌గా!



ఈ కాలం... స్వెటర్లదే హవా! ఒకరకంగా స్వెటర్‌ల కాలమనే అనొచ్చేమో! ఎవ్వరు చూడూ వాటిల్లోనే కనిపిస్తారు మరి. అందుకే చాలామంది అమ్మాయిలకు శీతకాలమంటే నచ్చదు. అవును మరి... ఎరుపు, నీలం, ఆకుపచ్చ, తెలుపు... అంటూ ఒకే రంగు స్వెటర్. కుర్తీ, జీన్స్ చుడీదార్... దేనిమీదకైనా అదే వేసుకోవాలి. వేసుకోకపోతే చలి చుట్టుముట్టేస్తుంది. అలాగని డ్రెస్సుని బట్టి ఒక్కోటీ కొనుక్కుంటూ వెళ్లలేం కదా! దీంతో లోపల డ్రెస్ మారుతుంది కానీ చలికోటు మాత్రం ఒక్కటే ఉంటుంది. అంటే రోజూ ఒకే లుక్ అన్నమాట. కాబట్టే, అమ్మాయిలు ఈ కాలం ఉసూరు మనేస్తారు. ఎంత పెద్ద ఫ్యాషన్ సమస్య? మరి డిజైనర్లు గుర్తించకుండా ఉంటారా? కాబట్టే, రంగులన్నీ ఏకం చేసేశారు. ఇంద్రధనుస్సుని ఇలా దించేశారు. రెయిన్ బో, మల్టీకలర్, యూనికార్న్ కలర్... అంటూ ఇలా స్వెటర్లను తీసుకొచ్చేశారు. పుల్ ఓవర్, టర్టల్ నెక్, కార్డిగన్స్, క్రూనెక్, బటన్, కాలర్... ఎన్ని రకాలున్నాయో అన్నింటా ఈ రంగుల మేళవింపుని తీసుకొచ్చేశారు. చూడ్డానికి కూల్ లుక్‌ని ఇస్తూ... ఎంత బాగున్నాయో కదూ! ఏ రంగు డ్రెస్ మీదకైనా మ్యాచింగ్ కచ్చితం. పైగా లాంగ్ స్కర్ట్, జీన్స్ వంటివాటి మీదకి నేరుగానే మ్యాచింగ్ చేసుకోవచ్చు. ప్రశాంతత మీ కేరాఫ్ అడ్రస్ అయితే లేత రంగులు ఎంచుకోవచ్చు. లేదూ ఉత్సాహం వెల్లువెత్తాలి, చలికాలపు నిస్తేజం తొలగిపోవాలంటే ముదురు రంగులకు ఓటేయొచ్చు. భలే పరిష్కారం దొరికిందే అని మీకూ అనిపిస్తోందా? ఈ డిజైన్లు మీ మనసూ దోచాయా? ఇంకేం ప్రయత్నించేయండి. ఇంతకీ... ఏ రకం స్వెటర్ మీ ఎంపిక మరి?

నేటి ఫ్యాషన్



ఛాంపియన్

భారత్ ర్యాంకు 142

దిల్లీ: 2027 ఆసియా క్వాలిఫయర్స్‌లో బంగ్లాదేశ్ చేతిలో 0-1తో ఓడి నిరాశకు గురి చేసిన భారత ఫుట్‌బాల్ జట్టు ర్యాంకింగ్స్‌లోనూ ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా ప్రకటించిన ఫిఫా జాబితాలో ఆరు స్థానాలు కోల్పోయి 142వ ర్యాంకులో నిలిచింది. 2016 అక్టోబరు (148వ స్థానం) తర్వాత భారత్‌కు ఇదే అత్యల్ప ర్యాంకు. 2023 డిసెంబరులో 102వ ర్యాంకింగ్‌తో ఉన్న మన జట్టు.. ఆ తర్వాత నుంచి 40 స్థానాలు దిగజారింది. ఆసియాలో 46 జట్లు ఉండగా.. ప్రస్తుతం భారత్ 27వ స్థానంలో ఉంది. 1996 ఫిబ్రవరిలో భారత్ అత్యుత్తమంగా 94వ ర్యాంకు సాధించింది.



పిచ్‌ను పరిశీలిస్తున్న పంత్

ఈ పిచ్ ఏం చేస్తుందో..!

గువహటి

సిరీస్‌లో వెనుకబడ్డ టీమ్‌ఇండియా దక్షిణాఫ్రికాతో రెండో టెస్టుకు సిద్ధమవుతోంది. కోల్‌కతాలో స్పిన్‌కు విపరీతంగా సహకరించిన పిచ్‌పై ఆతిథ్య జట్టు అనూహ్యంగా బోల్తా కొట్టిన నేపథ్యంలో రెండో టెస్టు వేదిక గువహటిలో పిచ్ ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. బర్సాపారా క్రికెట్ మైదానంలోని పిచ్‌ను చూస్తే.. ఈ మ్యాచ్ కూడా త్వరగా ముగిసేలా కనిపిస్తోంది. ఎర్ర మట్టి పిచ్‌పై కాస్త పచ్చిక ఉంది. మ్యాచ్ నేపథ్యంలో దాన్ని కత్తిరించే అవకాశముంది. దాంతో పిచ్ స్పిన్‌కు సహకరిస్తుందని భావిస్తున్నారు. సాధారణంగా ఎర్రమట్టి పిచ్‌లు త్వరగా పొడిబారుతాయి. పగుళ్లు కూడా త్వరగా వస్తాయి. ఆరంభంలో బౌన్స్ ఎక్కువ ఉంటుంది. కానీ పిచ్ స్వభావం వేగంగా మారుతుంది. పిచ్ క్షీణించడంతో స్పిన్నర్లకు సహకారం లభిస్తుంది. బంతి బాగా తిరుగుతుంది. అస్థిర బౌన్స్ కూడా బ్యాటర్లను ఇబ్బందిపెడుతుంది. మరి పచ్చికను తొలగిస్తారా లేదా అన్నది ఆసక్తికరం. తొలగిస్తే మాత్రం గువాహటిలో పిచ్ కూడా దాదాపు ఈడెన్‌లో లాగే తయారవుతుంది. మూడు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా స్పిన్నర్ల దాటికి తేలిపోయిన టీమ్‌ఇండియా.. తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. 124 పరుగుల ఛేదనలో చతికిలపడ్డ ఆ జట్టు.. 30 పరుగుల తేడాతో పరాజయంపాలైన సంగతి తెలిసిందే. బంతి బాగా తిరిగే పిచ్‌లను కోరుకున్నందుకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్ర విమర్శలకు గురయ్యారు కూడా. గువహటి తొలిసారి ఓ టెస్టు మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనుండడం గమనార్హం.

పచ్చిక కత్తిరిస్తే..: బర్సాపారా స్టేడియంలోని పిచ్ బ్యాటింగ్‌కు బాగుంటుందని, పచ్చిక కత్తిరిస్తే మాత్రం తేడా వస్తుందని దక్షిణాఫ్రికా బౌలింగ్ కోచ్ పీట్ బోథా అన్నాడు. "గురువారం ఉదయం పిచ్‌ను చూశా. మ్యాచ్‌కు ఇంకా రెండు రోజుల సమయం ఉంది. వాళ్లు పిచ్‌పై మరింత పచ్చికను తొలగిస్తారా లేదా అన్నది ఊహించడం కష్టం. తొలగిస్తే పిచ్ భిన్నంగా స్పందిస్తుంది" అని బోథా విలేకరులతో చెప్పాడు. "మంచి విన్యాసం ప్రకారం ఇది మంచి బ్యాటింగ్ పిచ్. క్రమంగా స్పిన్నర్లకు సహకారం లభిస్తుంది" అని అన్నాడు. గువాహటిలో మ్యాచ్ అరగంట ముందే మొదలవుతున్నందు.. కొత్త బంతి కీలక పాత్ర పోషించే అవకాశముందని బోథా చెప్పాడు. సాధారణంగా భారత్‌లో మ్యాచ్‌లు ఉదయం 9.30కి మొదలవుతాయి. రెండో టెస్టు మాత్రం 9 గంటలకే ఆరంభం కానుంది. "ఉదయం వాతావరణం కాస్త ఎక్కువ చల్లగా ఉంటుంది. తేమ కూడా ఎక్కువే ఉంటుంది. దీంతో తొలి గంటలో కొత్త బంతి బాగా ప్రభావం చూపిస్తుంది" అని బోథా పేర్కొన్నాడు.

సుదర్శన్‌కే ఛాన్స్!

గిల్ దూరమైతే రెండో టెస్టులో అతడి స్థానంలో ఎవరు ఆడతారన్నది ఆసక్తికరం. అతడి స్థానం కోసం సాయి సుదర్శన్, పడిక్కల్ మధ్య పోటీ ఉంది. రేసులో సుదర్శనే ముందున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు అయిదు టెస్టులు ఆడిన అతడు అనుకున్న స్థాయిలో రాణించలేకపోయాడు. గతంలో సుదర్శన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. ఇప్పుడు తుది జట్టులో స్థానం దక్కితే.. అతడు ఆరో స్థానంలో వచ్చే అవకాశాలున్నాయి. ఎందుకంటే గత టెస్టుల్లో మూడో స్థానంలో ఆడిన వాషింగ్టన్ సుందర్.. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ పర్వాలేదనిపించాడు. భారత్ మరోసారి నలుగురు స్పిన్నర్లతో ఆడుతుందా అన్నది కూడా చూడాలి. పిచ్‌పై పచ్చిక ఉంటే ఓ స్పిన్నర్‌ను తప్పించి నితీశ్ కుమార్‌రెడ్డిని తీసుకునే అవకాశముంది. అక్షర్ స్థానంలో అతణ్ని తీసుకోవచ్చు.



గిల్

గిల్‌కు నేడు ఫిట్‌నెస్ పరీక్ష!

గువహటి: దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆడే అవకాశాలు దాదాపుగా లేనట్లే. అతడి స్థానంలో రిషబ్ పంత్ జట్టుకు నాయకత్వం వహించేందుకు సిద్ధమవుతున్నాడు. కానీ మ్యాచ్‌కు అందుబాటులో ఉండేందుకు చివరి ప్రయత్నంగా గిల్ శుక్రవారం ఫిట్‌నెస్ పరీక్షకు హాజరుకానున్నాడు. మెడ నొప్పి కారణంగా తొలి టెస్టు నుంచి గిల్ అర్ధంతరంగా వైదొలగిన సంగతి తెలిసిందే. తొలి ఇన్నింగ్స్‌లో మూడు బంతులే ఆడిన అతడు.. రెండో ఇన్నింగ్స్‌లో అసలు బ్యాటింగ్‌కే రాలేదు. గువాహటిలోనూ గిల్ ఆడే అవకాశాలు కనపడట్లేదు. కానీ అతడిపై తుది నిర్ణయం తీసుకునే ముందు వీలైనంతగా నిరీక్షిస్తున్నారు. 'గిల్ బాగా కోలుకుంటున్నాడు. బుధవారం అతణ్ని కలిశా. శుక్రవారం సాయంత్రం అతడిపై నిర్ణయం తీసుకుంటాం. గిల్ పూర్తి ఫిట్‌నెస్ సాధించినా.. మ్యాచ్ సందర్భంగా మెడ నొప్పి తిరగబెట్టే అవకాశముందా అన్నది బీసీసీఐ వైద్యబృందం చూస్తుంది' అని బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ చెప్పాడు. 'ఏమాత్రం సందేహమున్నా మరో మ్యాచ్‌కు గిల్ విశ్రాంతి తీసుకుంటాడు. లేదంటే జట్టుకు ఉపయోగం ఉండదు. అతడు ఆడకపోతే జట్టుకు లోటే అనడంలో సందేహం లేదు' అని అన్నాడు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య చివరిదైన రెండో టెస్టు శనివారం ఆరంభమవుతుంది. గిల్ పూర్తిగా కోలుకోవడానికి పది రోజులు పడుతుందని సమాచారం. ఒకవేళ రెండో టెస్టులో ఆడితే ఈనెల 30న ఆరంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌కు సెలక్టర్లు అతడికి విశ్రాంతినిచ్చే అవకాశముంది.

ఎవరన్నది ఆ తర్వాతే..: గిల్ గైర్హాజరీ ప్రతికూలాంశమే అని అంగీకరించిన కోటక్.. అదే సమయంలో టీమ్‌ఇండియా బెంచ్ బలంపై నమ్మకం వ్యక్తం చేశాడు. "గాయం వల్ల ఒక వేళ గిల్ దూరమైనా.. మాకు మంచి బ్యాకప్ అందుబాటులో ఉన్నారు. వాళ్లు ప్రొఫెషనల్స్. వాళ్లు మెరుగైన ప్రదర్శన చేయగలరు" అని అన్నాడు. కోల్‌కతాలో జరిగిన తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో జురెల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. అతడు మరోసారి ఆ స్థానంలో (మ్యాచ్‌కు గిల్ దూరమైతే) ఆడే అవకాశాన్ని కోటక్ కొట్టిపారేయలేదు. "జురెల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. అతడో ప్రత్యామ్నాయం. అయితే గిల్ ఆడడంపై స్పష్టత వచ్చేంతవరకు ఎవరు ఆడతారన్న విషయంపై చర్చించుకోవడం అనవసరం. అతడి పరిస్థితి తెలిశాక, శుక్రవారం పిచ్‌ను పరిశీలించిన తర్వాత కూర్పు గురించి ఆలోచిస్తాం" అని అన్నాడు.



నిఖత్



నుపుర్



మీనాక్షి



జాస్మిన్



అరుంధతి



ప్రీతి

నిఖత్ పసిడి పంచ్

మరో ఎనిమిది స్వర్ణాలు భారత్ సొంతం

- ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్

గ్రేటర్ నోయిడా: ప్రపంచకప్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ అదరగొట్టింది. ఫామ్ నిరూపించుకుంటూ స్వర్ణంతో మెరిసింది. గురువారం మహిళల 51 కేజీల ఫైనల్లో నిఖత్ 5-0తో గవో యీ గ్జువాన్ (చైనీస్ తైపీ)ని చిత్తు చేసింది. తొలి రౌండ్ నుంచే ప్రత్యర్థిపై ఎదురుదాడి చేసిన నిఖత్.. పదునైన పంచ్‌లతో విరుచుకుపడింది. ఆఖరిదాకా అదే జోరు కొనసాగించి తేలిగ్గా విజయాన్ని అందుకుంది. ఇటీవల ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్స్‌లోనే ఓడిన ఈ తెలంగాణ అమ్మాయి.. తాజా స్వర్ణంతో గాడిలో పడింది. మరో ఎనిమిది పసిడి పతకాలు కూడా భారత్ ఖాతాలో చేరాయి. 57 కేజీల్లో పారిస్ కాంస్య పతక విజేత వుయీ (చైనీస్ తైపీ)ను జైస్మిన్ లాంబోరియా (57 కేజీ) కంగుతినిపించగా.. 60 కేజీల్లో తగుచి అయాకా (జపాన్)ను పర్వీన్ హుడా చిత్తు చేసింది. 80 కేజీల్లో సొటిమ్‌బొయెవా (ఉజ్బెకిస్థాన్)ను నుపుర్ షెరోన్ ఓడించగా.. 70 కేజీల్లో అజీజా (ఉజ్బెకిస్థాన్)పై అరుంధతి చౌదరి పైచేయి సాధించింది. 54 కేజీల్లో సిరిన్ (ఇటలీ)పై ప్రీతి పన్వర్.. 48 కేజీల్లో ఫోజిలివా (ఉజ్బెకిస్థాన్)పై మీనాక్షి హుడా గెలిచి పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు. పురుషుల 70 కేజీల తుదిపోరులో నార్‌బెక్ (కజకిస్థాన్)పై హితేశ్ గులియా.. 60 కేజీల్లో మునార్‌బెక్ (కిర్గిజ్‌స్థాన్)పై సచిన్ సివాచ్ గెలిచి స్వర్ణాలు కైవసం చేసుకున్నారు. మరో 5 రజతాలు కూడా భారత్ ఖాతాలో చేరాయి. జాదుమణి సింగ్ (50 కేజీ), అంకుశ్ (80 కేజీ), పవన్ (55 కేజీ), అబినాష్ (65 కేజీ), పూజ రాణి (80 కేజీ) ఫైనల్లో ఓడి రజతాలతో సరిపెట్టుకున్నారు. అసిల్‌బెక్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో జాదుమణి, సమందర్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో పవన్ ఓడారు. నిషియెమా (జపాన్)కు అబినాష్.. ఒలాడ్‌మిజ్ (ఇంగ్లాండ్)కు అంకుశ్ తలొంచారు. అగటా (పోలెండ్) చేతిలో అరుంధతి ఓడింది. మొత్తంగా 20 పతకాలు (9 స్వర్ణాలు, 6 రజతాలు, 5 కాంస్యాలు) గెలిచిన భారత్ అగ్రస్థానంతో టోర్నీని ముగించింది.

దీక్షకు స్వర్ణం.. మహిత్‌కు రజతం

టోక్యో: డెఫ్లింపిక్స్‌లో భారత క్రీడాకారిణులు దీక్ష దాగర్, మహిత్ సంధూ సత్తాచాటారు. గోల్ఫ్‌లో దీక్ష బంగారు పతకం గెలవగా.. షూటింగ్‌లో మహిత్ రజతంతో మెరిసింది. గురువారం మహిళల గోల్ఫ్ వ్యక్తిగత స్ట్రోక్‌ప్లేలో దీక్ష అగ్రస్థానం సాధించింది. 2017లో రజతం, 2021లో బంగారు పతకం గెలుచుకున్న దీక్ష.. ఈసారి పోటీల్లో స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. మహిళల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్‌లో మహిత్ ద్వితీయ స్థానంలో నిలిచింది. అంతకుముందు క్వాలిఫయింగ్‌లో మహిత్ ప్రపంచ రికార్డు నమోదు చేసింది. ఈ డెఫ్లింపిక్స్‌లో మహిత్‌కు ఇది మూడో పతకం. ఈ పోటీల్లో మహిత్.. 10 మీ మిక్స్‌డ్ టీమ్‌లో స్వర్ణం, 10 మీ వ్యక్తిగత విభాగంలో రజతం గెలుచుకుంది.

లంక.. జింబాబ్వే చేతిలో చిత్తుగా

రావల్పిండి: ముక్కోణపు టీ20 టోర్నీలో శ్రీలంకకు షాక్.. గురువారం జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 67 పరుగుల తేడాతో లంకను చిత్తుగా ఓడించింది. మొదట జింబాబ్వే 8 వికెట్లకు 162 పరుగులు చేసింది. బ్రయాన్ బెన్నెట్ (49), కెప్టెన్ సికందర్ రజా (47) సత్తా చాటారు. హసరంగ (3/32), ఇషాన్ మలింగ (2/27) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఛేదనలో జింబాబ్వే బౌలర్ల ధాటికి లంక 20 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ శానక (34) టాప్ స్కోరర్. బ్రాడ్ ఇవాన్స్ (3/9), రిచర్డ్ ఎంగర్వ (2/15) ప్రత్యర్థి పతనంలో కీలకపాత్ర పోషించారు. టోర్నీలో 2 మ్యాచ్‌లు ఆడిన జింబాబ్వేకు ఇది తొలి విజయం. లంకకు ఇదే తొలి మ్యాచ్. ఈ టోర్నీలో మూడో జట్టు పాకిస్థాన్.



స్మృతి మంధాన

పెళ్లిపీటలెక్కనున్న స్మృతి మంధాన

దిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టు ఓపెనర్ స్మృతి మంధాన వివాహం త్వరలోనే జరగనుంది. తనకు నిశ్చితార్థం జరిగిన విషయాన్ని ఆమె గురువారం ఓ ఇన్‌స్టాగ్రామ్ రీల్ ద్వారా ప్రకటించింది. ఆ సరదా రీల్‌లో స్మృతితో పాటు ఆమె సహచర క్రికెటర్లు జెమీమా, రాధ యాదవ్, శ్రేయాంక పాటిల్, అరుంధతి రెడ్డి ఉన్నారు. పలాశ్ ముచ్చల్‌ను పెళ్లిచేసుకోబోతున్న స్మృతి.. తన నిశ్చితార్థపు ఉంగరాన్ని చూపించింది. వివాహం ఈ నెల 23న జరగనుందని సమాచారం.

టెస్టు క్రికెట్లో యాషెస్ సిరీస్‌కు ఉన్న ప్రత్యేకతే వేరు. ఇంగ్లాండ్-ఆస్ట్రేలియా మధ్య నువ్వానేనా అన్నట్లు సాగే ఈ సమరాన్ని చూసి తీరాల్సిందే. ఈ రెండు జట్లు తలపడే అయిదు టెస్టుల సిరీస్‌కు శుక్రవారమే తెరలేవనుంది. పెర్త్ వేదికగా తొలి మ్యాచ్ ఆరంభం కానుంది. 2017 నుంచి యాషెస్ సిరీస్ ఆసీస్ దగ్గరే ఉంది. మరి ఆ జట్టును సొంతగడ్డపై ఓడించి ఇంగ్లాండ్ యాషెస్‌ను సొంతం చేసుకోగలదా?

ఇంగ్లాండ్ ఆశ తీరేనా!

నేటి నుంచి ఆసీస్‌తో యాషెస్ సిరీస్

ఉదయం 7.50 నుంచి

పెర్త్

ఇంగ్లాండ్-ఆస్ట్రేలియా.. ఈ రెండు బలమైన జట్లు ఎప్పుడు తలపడినా హోరాహోరీ తప్పదు. ముఖ్యంగా యాషెస్ సిరీస్ అయితే రంజుగా సాగుతూ అభిమానులను అలరిస్తూ ఉంటుంది. మరోసారి అలాంటి ప్రతిష్ఠాత్మక సమరానికి సమయం ఆసన్నమైంది. శుక్రవారం మొదలయ్యే తొలి టెస్టులో స్టీవ్ స్మిత్ సారథ్యంలోని ఆస్ట్రేలియాతో.. బెన్ స్టోక్స్ కెప్టెన్సీలోని ఇంగ్లాండ్ తలపడబోతోంది. 2010-11లో చివరిగా కంగారూ గడ్డపై 3-1తో సిరీస్ గెలిచిన ఇంగ్లిష్ జట్టు.. సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ అక్కడ విజేతగా నిలవాలనే పట్టుదలతో ఉంది. ఇంగ్లాండ్ ఇటీవల పెద్ద ఫామ్‌లో లేదు. కానీ ఈసారి ఆస్ట్రేలియాలో సత్తా చాటాలనే పట్టుదలతో ఉంది. పేసర్ మార్క్ వుడ్ గాయం నుంచి కోలుకుని అందుబాటులోకి రావడం, జోఫ్రా ఆర్చర్ జోరు మీద ఉండడం ఇంగ్లాండ్‌కు కలిసొచ్చే అంశాలు. ముఖ్యంగా గత యాషెస్ సిరీస్‌లో 17 వికెట్లు తీసిన వుడ్‌పై ఆ జట్టు గంపెడు ఆశలు పెట్టుకుంది. స్టోక్స్ అటు బంతితో ఇటు బ్యాట్‌తో రాణించాలని ఇంగ్లాండ్ ఆశిస్తోంది. బ్యాటింగ్‌లో జో రూట్, బ్రూక్, పోప్‌లపైనే జట్టు ఆధారపడనుంది. "ఆస్ట్రేలియాలో విజయవంతమైన అతి కొద్దిమంది ఇంగ్లాండ్ కెప్టెన్లలో నేనూ ఉండాలని కోరుకుంటున్నా. చరిత్ర గురించి అందరూ మాట్లాడుతున్నారు. కానీ ఇప్పుడు ఏం జరగాలనేది మా చేతుల్లో ఉంది" అని కెప్టెన్ స్టోక్స్ అన్నాడు.

ఆసీస్.. వాళ్లిద్దరు లేకుండా: గాయంతో రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ దూరం కావడం ఆస్ట్రేలియాకు లోటే. అతడి కెప్టెన్సీ అనుభవంతో పాటు విలువైన బౌలింగ్ సేవలను ఆ జట్టు కోల్పోనుంది. మరో కీలక పేసర్ జోష్ హేజిల్‌వుడ్ కూడా గాయంతో తప్పుకోవడం కంగారూ జట్టుకు దెబ్బే. అనుభవజ్ఞులు మిచెల్ స్టార్క్, నాథన్ లైయన్‌లనే జట్టు నమ్ముకుంది. పెర్త్ టెస్టులో పేసర్ బ్రెండన్ డాగెట్ అరంగ్రేటం చేసే అవకాశాలున్నాయి. కమిన్స్ స్థానంలో తాత్కాలికంగా పగ్గాలు అందుకున్న 36 ఏళ్ల స్టీవ్ స్మిత్.. జట్టును ఎలా నడిపిస్తాడో చూడాలి. కెప్టెన్‌గా జట్టును సమర్థంగా నడిపించడం, మరోవైపు బ్యాటర్‌గా రాణించడమనే రెండు కీలక బాధ్యతలు అతడిపై ఉన్నాయి. 2018లో రెగ్యులర్ కెప్టెన్‌గా బాధ్యతల నుంచి వైదొలిగిన తర్వాత ఆసీస్‌కు కెప్టెన్సీ చేయడం స్మిత్‌కు ఇది ఏడో సారి. బ్యాటింగ్‌లో స్మిత్‌తో పాటు లబుషేన్, ట్రావిస్ హెడ్, ఖవాజా కీలకం కానున్నారు. ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ ఫిట్‌గా ఉంటే తొలి టెస్టులో ఆడే అవకాశం ఉంది. లేకపోతే బ్యాటర్ జేక్ వెదరాల్డ్‌కు ఛాన్స్ ఇస్తారు.



స్మిత్ స్టోక్స్

13 ఆస్ట్రేలియాలో గత 15 టెస్టుల్లో ఇంగ్లాండ్ ఓడిన మ్యాచ్‌లు. రెండు డ్రాగా ముగిశాయి.

361 ఆస్ట్రేలియా-ఇంగ్లాండ్ ఇప్పటిదాకా ఆడిన టెస్టులు. ఆసీస్ 152, ఇంగ్లాండ్ 112 నెగ్గాయి. 97 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి.

హార్దిక్ రాక.. మరింత ఆలస్యం



హార్దిక్ పాండ్య

దిల్లీ: గాయం కారణంగా భారత జట్టుకు దూరమైన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య పునరాగమనం మరింత ఆలస్యం కాబోతోంది. ఈనెల 30న దక్షిణాఫ్రికాతో ఆరంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌లో హార్దిక్ ఆడతాడని అనుకున్నా అది సాధ్యం అయ్యేలా లేదు. అతడి ఫిట్‌నెస్‌ను పూర్తిగా పరీక్షించాకే జట్టులోకి తీసుకోవాలని బీసీసీఐ భావిస్తున్నట్లు తెలిసింది. ఈనెల 26న ఆరంభమయ్యే ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో హార్దిక్ బరోడాకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ టోర్నీలో కనీసం మూడు మ్యాచ్‌లు ఆడితే.. డిసెంబర్ 9న దక్షిణాఫ్రికాతో మొదలయ్యే అయిదు టీ20ల సిరీస్‌లో పాల్గొనేందుకు హార్దిక్‌కు అవకాశం ఉంటుంది. బీసీసీఐ నిబంధనల ప్రకారం గాయపడిన ప్లేయర్లు.. తిరిగి జట్టులోకి రావాలంటే కనీసం మూడు దేశవాళీ మ్యాచ్‌లు ఆడి ఫామ్, ఫిట్‌నెస్ నిరూపించుకోవాలి. "హార్దిక్ మాత్రమే కాదు గాయాల చరిత్ర ఉన్న క్రికెటర్లు తిరిగి జాతీయ జట్టులోకి రావాలంటే దేశవాళీలో ఆడాల్సి ఉంటుంది. దక్షిణాఫ్రికాతో వన్డే, టీ20 సిరీస్‌లకు మధ్య పెద్ద దూరం లేదు. హార్దిక్ లాంటి ఆటగాడిని టీ20ల్లో పరీక్షించడం మేలు" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

యువ భారత్ సత్తా చాటేనా!

నేడు బంగ్లా-ఎతో సెమీస్

మధ్యాహ్నం 3 నుంచి

దోహా: భారత్-ఎ జట్టుకు పరీక్ష. శుక్రవారం జరిగే రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ సెమీఫైనల్లో బంగ్లాదేశ్-ఎతో భారత్ తలపడనుంది. ఫామ్‌లో ఉన్న వైభవ్ సూర్యవంశీపైనే జట్టు ఆశలు పెట్టుకుంది. ఈ సిరీస్‌లో 201 పరుగులతో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో అతడు రెండో స్థానంలో ఉన్నాడు. యూఏఈపై 42 బంతుల్లోనే 144 పరుగులు చేశాడు. కెప్టెన్ జితేశ్ శర్మ, నమన్ ధీర్, ప్రియాంశ్ ఆర్య రాణించడం కూడా కీలకం. బౌలింగ్‌లో భారత్ బలంగా కనిపిస్తోంది. 3 మ్యాచ్‌ల్లో 5 వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ పేసర్ గుర్‌జాప్‌నీత్ సింగ్‌తో పాటు లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ హర్ష్ దూబె. లెగ్ స్పిన్నర్ సుయాశ్ శర్మ సత్తా చాటుతున్నారు. హర్ష్ దూబె అటు బ్యాట్‌తోనూ రాణిస్తున్నాడు. ఒమన్‌తో కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో అతడు నాలుగో స్థానంలో వచ్చి అర్ధసెంచరీ సాధించాడు. మరోవైపు బంగ్లా బౌలింగ్‌పైనే ఆధారపడింది. సీనియర్ జట్టుకు ఆడిన రకిబుల్ హసన్‌తో పాటు పేసర్ రిపాన్ మొండల్ సెమీస్‌లో రాణించాలని బంగ్లా కోరుకుంటోంది. శుక్రవారమే జరిగే రెండో సెమీస్‌లో పాకిస్థాన్ షహీన్స్‌తో శ్రీలంక తలపడనుంది. ఈ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ఆరంభం కానుంది.

లక్ష్యసేన్, ఆయుష్ ముందంజ



ఆయుష్

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు లక్ష్యసేన్, ఆయుష్ శెట్టి.. సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి ముందంజ వేశారు. గురువారం పురుషుల సింగిల్స్ పోరులో లక్ష్యసేన్ 21-17, 13-21, 21-13తో యు జెన్ (చైనీస్ తైపీ)పై, ఆయుష్ 21-17, 21-16తో కొడయ్ నరవొక (జపాన్)పై గెలిచి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో టాప్ సీడ్ సాత్విక్- చిరాగ్ జోడీ 21-18, 21-11తో చిన్ హెంగ్- గ్వాన్ షున్ (చైనీస్ తైపీ) జంటపై నెగ్గి క్వార్టర్స్‌లో అడుగు పెట్టింది. మరోవైపు కిదాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్. ప్రణయ్‌లకు చుక్కెదురైంది. శ్రీకాంత్ 20-22, 16-21తో షోగో ఒగావా (జపాన్) చేతిలో, ప్రణయ్ 19-21, 10-21తో ఆల్వి ఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో, తరుణ్ మన్నెపల్లి 13-21, 21-19, 10-21తో లిన్ చున్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం చవిచూశారు. క్వార్టర్స్‌లో లక్ష్యసేన్‌తో ఆయుష్.. ఫజర్ అల్ఫియాన్- మహ్మద్ షోహిబుల్ ఫిక్రి (ఇండోనేసియా)తో సాత్విక్- చిరాగ్ తలపడనున్నారు.

రాబర్ట్ వాద్రాపై ఈడీ మరో ఛార్జిషీట్



దిల్లీ: బ్రిటన్‌కు చెందిన ఆయుధాల వ్యాపారి, పలాయనంలో ఉన్న ఆర్థిక నేరగాడు సంజయ్ భండారీ నిందితుడిగా ఉన్న మనీలాండరింగ్ కేసులో వ్యాపారవేత్త, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అభియోగ పత్రం దాఖలు చేసింది. నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కేసుల్ని విచారించేందుకు దిల్లీలో ఉన్న ప్రత్యేక న్యాయస్థానంలో ఈ మేరకు అనుబంధ 'ప్రాసిక్యూషన్ కంప్లైంట్' దాఖలు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనిపై డిసెంబరు 6న విచారణ జరగనుంది. వాద్రాపై మనీలాండరింగ్ ఛార్జిషీట్‌లలో ఇది రెండోది. హరియాణాలో భూ ఒప్పందంలో చోటుచేసుకున్న అక్రమాలపై జులైలో ఈడీ తొలి ఛార్జిషీట్ వేసింది. భండారీతో సంబంధం ఉన్న కేసులో ఈడీ గతంలో వాద్రాను ప్రశ్నించింది.

శబరిమలలో రోజుకు 5,000 స్పాట్ బుకింగ్స్

పథనంతిట్ట: కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు స్వామి దర్శనానికి రోజువారీ స్పాట్ బుకింగ్‌లను గరిష్ఠంగా 5,000కు పరిమితం చేసింది. నీలక్కల్, వండిపెరియార్ సెంటర్లలో మాత్రమే ఈ స్పాట్ బుకింగ్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపింది. పంపా, ఎరుమేలి, చెంగన్నూర్‌లలో సేవలను ఈ నెల 24 వరకు తాత్కాలికంగా నిలిపివేసినట్లు పేర్కొంది.

అడవిని ఇంటి పెరట్లోకి తెచ్చారు..

ఎర్నాకుళం: దేశంలోని పలు నగరాలు రాను రాను కాంక్రీటు వనాలుగా మారుతుండగా.. కేరళలోని కొచ్చిన్‌లో నివసిస్తున్న ఎ.వి.పురుషోత్తమ కామత్ తన ఇంటిని జీవవైవిధ్యం తొణికిసలాడే పచ్చని అడవిలా మార్చారు. దాదాపు 40 ఏళ్ల శ్రమతో ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో ఆయన అడవిని సృష్టించారు. ఈ అడవిలో సుమారు 3,000 రకాల చెట్లు ఉండగా, అందులో 300 వరకు పండ్ల



మొక్కలు. అరుదైన ఔషధ, సుగంధ జాతుల చెట్లను ఇక్కడ చూడవచ్చు. స్వచ్ఛమైన గాలి పీలుస్తూ నిత్యం కొమ్మలపై వాలే పక్షుల కిలకిలారావాలను ఆస్వాదించవచ్చు. బయటి వాతావరణంకన్నా ఈ అడవిలో ఉష్ణోగ్రత కనీసం మూడు డిగ్రీలు తక్కువగా ఉంటుంది. ఈ మొక్కల సేకరణకు కామత్ ఎంతో శ్రమించారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన అంతరించిపోతున్న మొక్కలను కాపాడాలని 1984లో కెనరా బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేశారు. భావితరాలకు పచ్చ - ధనాన్ని అందించాలనే సంకల్పంతో కామత్ ప్రయాణాల్లోనూ విత్తనాలను వెంట తీసుకువెళ్లి ఖాళీ ప్రదేశాల్లో నాటుతుంటారు.

కొలువుదీరిన నీతీశ్ ప్రభుత్వం

- మోదీ, అమిత్ షా, నడ్డా, చంద్రబాబు సహా ఎన్డీయే నేతల హాజరు
- 26 మంది మంత్రుల ప్రమాణం

పట్నా: బిహార్‌ను సుదీర్ఘకాలంగా పాలిస్తున్న జేడీయూ అధినేత నీతీశ్ కుమార్.. గురువారం పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, నడ్డా, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు సహా ఎన్డీయే నేతలు హాజరుకాగా భారీ జన సందోహం మధ్య ఆయన ప్రమాణం చేశారు. పట్నాలోని గాంధీ మైదానంలో ఏర్పాటు చేసిన వేదికపై నీతీశ్, 26 మంది మంత్రులతో గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ప్రమాణం చేయించారు. భాజపా నుంచి 14 మంది, జేడీయూ నుంచి 8 మంది, ఎల్జేపీ నుంచి ఇద్దరు, హెచ్ఏఎం, ఆర్ఎల్ఎంల నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇందులో గత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంలుగా పనిచేసిన భాజపా నేతలు సామ్రాట్ చౌధరి, విజయ్ కుమార్ సిన్హా ఉన్నారు.

■ గత ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న భాజపా నేతలు మంగళ్ పాండే, నితిన్ నబీన్, సురేంద్ర ప్రసాద్ మెహతా మళ్లీ మంత్రులయ్యారు. ఒకరికి ఒకే పదవి నిబంధనతో రెండేళ్ల కిందట మంత్రి పదవికి రాజీనామా చేసిన భాజపా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దిలీప్ జయస్వాల్ మళ్లీ మంత్రిగా ప్రమాణం చేశారు.

■ అంతర్జాతీయ షూటర్ శ్రేయాసీ సింగ్ కొత్తగా మంత్రి అయ్యారు. ఇంకా కొత్తగా మంత్రులైన వారిలో అరుణ్ శంకర్ ప్రసాద్, ప్రమోద్ కుమార్, లఖేంద్ర కుమార్ రౌషన్, సంజయ్ సింగ్ టైగర్, రమా నిషాద్ ఉన్నారు.

■ జేడీయూ నుంచి మంత్రులైన వారంతా గత ప్రభుత్వంలో ఉన్నవారే. ఎన్డీయేలోని ఏకైక ముస్లిం ఎమ్మెల్యే జమా ఖాన్ మంత్రిగా ప్రమాణం చేశారు.

■ సీఎంతోపాటు మంత్రులైన వారిలో దిలీప్ జయస్వాల్, ప్రమోద్ కుమార్, అశోక్ చౌధరి, సంతోశ్ సుమన్‌లు మండలి సభ్యులు.

■ బిహార్‌లో 36 మంది మంత్రులయ్యేందుకు అవకాశం ఉంది.



ప్రమాణ వేడుకలో ఉత్సాహంగా కండువా తిప్పుతున్న ప్రధాని మోదీ. చిత్రంలో బిహార్ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, నీతీశ్

గమ్ఛా తిప్పిన ప్రధాని.. ఉర్రూతలూగిన జనం

నీతీశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన జనంతో పట్నాలోని గాంధీ మైదానం కిక్కిరిసిపోయింది. దాదాపు 3 లక్షల మంది వచ్చారని అంచనా. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రధాని గమ్ఛా (కండువా) తిప్పి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

రాజకీయాల్లోకి రావడంపై నోరువిప్పని నీతీశ్ కుమారుడు



ఎన్డీయే ప్రభుత్వానికి ఓటేసిన బిహార్ ప్రజలకు నీతీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కులమతాలకతీతంగా మహిళలు నీతీశ్ వెంట నడుస్తున్నారని పేర్కొన్నారు. మీరు రాజకీయాల్లోకి ఎప్పుడు వస్తున్నారని ప్రశ్నించగా.. నవ్వుతూ వెళ్లిపోయారు. ఆయన ఎప్పుడూ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ప్రజా జీవితానికి దూరంగానే ఉన్నారు.

మోదీ కాళ్లు మొక్కబోయిన నీతీశ్

తన ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం వచ్చిన ప్రధాని మోదీ కాళ్లను మొక్కడానికి నీతీశ్ ప్రయత్నించారు. విమానాశ్రయంలో ప్రధానికి స్వాగతం పలికే సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రధాని కాళ్లను మొక్కేందుకు నీతీశ్ ప్రయత్నిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైంది. మోదీ వెంటనే నీతీశ్ భుజాలను పట్టుకుని లేపి దగ్గరికి తీసుకుని భుజం భుజం కలిపారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంలోనూ నీతీశ్ ఇలాగే చేయబోయారు. మోదీ కంటే నీతీశ్ కొన్ని నెలల చిన్నవారు.

శాసన నిర్మాణానికి విఘాతం

సుప్రీంకోర్టు తీర్పుపై భిన్నాభిప్రాయాలు

దిల్లీ: శాసనసభలు చేసిన బిల్లులకు ఆమోదం తెలిపేందుకు గవర్నర్లకు, రాష్ట్రపతికి గడువు విధించలేమంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం వెలువరించిన తీర్పుపై న్యాయ నిపుణులు, కొన్ని విపక్ష పార్టీల నుంచి భిన్నాభిప్రాయాలు వెలువడ్డాయి. శాసనసభ ఆమోదించి పంపిన బిల్లు కారణం తెలియకుండా గవర్నర్, రాష్ట్రపతి వద్ద చిక్కుకుపోతే ఆ బిల్లు ప్రాధాన్యాన్ని కోల్పోతుందని పశ్చిమబెంగాల్ శాసనసభ స్పీకర్ బిమన్ బెనర్జీ అన్నారు. బిల్లులకు ఆమోదం తెలిపేందుకు గవర్నర్లకు నిర్దిష్టమైన గడువు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఒక బిల్లును నిరవధికంగా పెండింగ్‌లో ఉంచడం శాసన నిర్మాణపు ప్రాథమిక ఉద్దేశాన్నే నీరుగారుస్తుందని పేర్కొన్నారు. సుప్రీం తీర్పు శోచనీయమని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ స్పందించారు. సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఏప్రిల్‌లో రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారికి 3 నెలల గడువు విధించిందని, ఇప్పుడు ఆ నిబంధనను తొలగించిందని న్యాయవాది వికాస్ పహ్వా తెలిపారు.

భారత్‌కు అమెరికా నుంచి

రూ.825 కోట్ల ఆయుధాలు

- జావెలిన్ క్షిపణి వ్యవస్థ ఇచ్చేందుకు పచ్చజెండా



ఎక్స్‌క్యాలిబర్

వాషింగ్టన్: ప్రాంతీయ ముప్పుల్ని ఎదుర్కొని రక్షణ రంగం పరంగా బలోపేతమయ్యేందుకు దోహదపడేలా 9.3 కోట్ల డాలర్ల (సుమారు రూ.825 కోట్ల) ఆయుధాలను భారత్‌కు విక్రయించేందుకు అమెరికా ఆమోదం తెలిపింది. వీటిలో ఎక్స్‌క్యాలిబర్ గైడెడ్ ఫిరంగి గుళ్లు, జావెలిన్ యుద్ధ ట్యాంకుల విధ్వంసక వ్యవస్థతో ముడిపడిన పరికరాలు ఉంటాయి. భారత దేశ ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు పెంచిన తర్వాత జరుగుతున్న తొలి భారీ కొనుగోలు ఇదే. ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాల్లో రాజకీయంగా శాంతి-సుస్థిరతలకు, ఆర్థిక పురోభివృద్ధికి కీలక శక్తిగా భారత్ నిలుస్తుందని, అలాంటి ముఖ్యమైన రక్షణ భాగస్వామి భద్రతను మెరుగుపరిచేందుకు ఈ అమ్మకాలు దోహదం చేస్తాయని అమెరికా పేర్కొంది. భారత్‌కు అందించనున్న ఆయుధ సామగ్రి జాబితాలో 100 జావెలిన్ ఫిరంగి గుళ్లు, ఒక జావెలిన్ క్షిపణి (ఫ్లై టు బై), 25 తేలికపాటి కమాండ్ లాంఛ్ యూనిట్లు, ఆయుధ సామగ్రితో ముడిపడిన విడి భాగాలు ఉన్నాయని వెల్లడించింది. మొత్తం సామగ్రికి అమెరికా సైన్యం వైపు నుంచి పూర్తిస్థాయిలో విడిభాగాల సరఫరాతోపాటు సర్వీసింగ్ సేవలు అందుతాయని వెల్లడించింది. ఈ ఆయుధ సామగ్రిని భారత్‌కు విక్రయించే ప్రధాన కాంట్రాక్టరుగా ఆర్‌టీఎక్స్ కార్పొరేషన్ వ్యవహరించనుంది. తదుపరి దశల్లో ఈ సంస్థతో భారత్ చర్చలు జరిపి అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకోనుంది.

మేధావులు ఉగ్రవాదులుగా మారితే

మరింత ప్రమాదకరం

- దేశ ద్రోహ కార్యకలాపాల్లో డాక్టర్లు, ఇంజినీర్లు
- దిల్లీ అల్లర్ల కేసులో నిందితుల బెయిలును వ్యతిరేకిస్తూ ఏఎస్‌జీ వాదనలు

దిల్లీ: మేధావులు ఉగ్రవాదులుగా మారితే మరింత ప్రమాదకరమని సుప్రీంకోర్టుకు దిల్లీ పోలీసులు తెలిపారు. దిల్లీ అల్లర్ల కేసు (2020)లో ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్, ఇతర నిందితుల బెయిల్ పిటిషన్లను వ్యతిరేకిస్తూ పోలీసుల తరఫున గురువారం అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న సమయంలో ఇమామ్ చేసిన రెచ్చగొట్టే ప్రసంగాలకు సంబంధించిన వీడియోను కూడా.. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్వీ అంజారియాల ధర్మాసనానికి చూపించారు. ఇమామ్ ఇంజినీరింగ్ విద్యార్థి అని పేర్కొంటూ.. ఈ మధ్యకాలంలో డాక్టర్లు, ఇంజినీర్లు దేశద్రోహ కార్యకలాపాల్లో పాలుపంచుకొనే ధోరణి పెరిగిపోయిందని ఎస్వీ రాజు ఆందోళన వ్యక్తం చేశారు. "సీఏఏ ప్రదర్శనల వెనక అసలు ఉద్దేశం ప్రభుత్వాన్ని పడగొట్టడం.. దేశవ్యాప్తంగా అరాచకం సృష్టించడం. ఈ అల్లర్లలో 53 మంది చనిపోయారు. 530 మందికి పైగా గాయాల పాలయ్యారు. ఇదో పెద్ద కుట్ర. మేధావులు ఉగ్రవాదులుగా మారితే వారు క్షేత్రస్థాయిలో పనిచేసే ఉగ్రవాదుల కంటే ప్రమాదకరం" అని ఏఎస్‌జీ పేర్కొన్నారు. ఈ కేసులో నిందితులు మేధావులు కాదని, దేశ ద్రోహులని తెలియక విదేశీ వార్తా పత్రికలు కూడా వారికి అనుకూలంగా కథనాలు ప్రచురిస్తున్నాయని ఏఎస్‌జీ తెలిపారు.



ఆందోళనకు కారణం అదే..

అతిగా ఆలోచిస్తూ కూర్చుంటే ఆందోళనకు గురవడం తప్ప ఎలాంటి ఉపయోగమూ లేదు. ఏదో ఒక పనిలో నిమగ్నమైతేనే ఆందోళన దూరమవుతుంది. ఆలోచనలు చుట్టుముట్టినప్పుడు కాసేపు నడకకు వెళ్లండి. డైరీలో మీ ఆలోచనలకు అక్షరరూపమివ్వండి. ఇంటిని శుభ్రం చేసుకోవడంపై దృష్టి పెట్టండి. దీనివల్ల మనసుకు సాంత్వన చేకూరుతుంది.

– మకెంజీ స్మిత్, ఫిట్‌నెస్ ట్రెయినర్

ఉక్రెయిన్ శాంతికి ట్రంప్ కొత్త ప్రణాళిక!

కీవ్: గాజా యుద్ధం ముగింపునకు 20 సూత్రాల శాంతి ప్రణాళికను రచించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఉక్రెయిన్ యుద్ధం అంతానికి కూడా 28 సూత్రాల శాంతి ప్రణాళికను రూపొందించినట్లు కథనాలు వస్తున్నాయి. అధికారికంగా దీనిపై అగ్రరాజ్యం ఎలాంటి ప్రకటన చేయలేదు. అంతర్జాతీయ వార్తా కథనాల ప్రకారం.. ఈ ప్రణాళికపై అమెరికా పశ్చిమాసియా రాయబారి స్టీవ్ విట్కాఫ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సన్నిహితుడు కిరిల్ దిమిత్రివ్ కలిసి కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. దీనికి ట్రంప్ కూడా ఆమోదముద్ర వేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ప్రణాళిక ప్రకారం.. ఉక్రెయిన్ కొంత భూభాగాన్ని వదులుకోవాలి. సైన్యాన్ని తగ్గించుకోవాలి. నాటో కూటమిలో చేరకుండా తటస్థత పాటించాలి. ఈ ప్రణాళికలో ఎక్కువ అంశాలు రష్యాకే అనుకూలంగా ఉన్నాయని తెలుస్తోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి కూడా ఈ ప్రణాళికను అమెరికా పంపినట్లు సమాచారం. ఈ శాంతి ప్రతిపాదనను ఐరోపా దేశాల విదేశాంగ మంత్రులు వ్యతిరేకిస్తున్నారు. ఇందులోని షరతులకు ఉక్రెయిన్ అంగీకరించడమంటే.. రష్యా డిమాండ్లకు తలొగ్గడమేనని వారు పేర్కొంటున్నారు.

భారత్‌లో 20.6 కోట్ల మంది చిన్నారులకు కనీస సేవలు కరవు

- యునిసెఫ్ తాజా నివేదిక వెల్లడి

దిల్లీ: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా 2030 కంటే ముందే బహుమితీయ పేదరికాన్ని సగానికి తగ్గించేందుకు భారత్ కృషి చేస్తున్నప్పటికీ, దేశంలో చాలామంది చిన్నారులు కనీస సేవలను అందుకోవడంలో ఇంకా అవాంతరాలు ఎదుర్కొంటున్నారని యునిసెఫ్ పేర్కొంది. ప్రపంచ బాలల దినోత్సవం సందర్భంగా 'ప్రపంచంలో బాలల స్థితిగతులు-2025' పేరిట ఓ నివేదికను యునిసెఫ్ గురువారం విడుదల చేసింది. భారత్‌లో ఉన్న పిల్లల్లో దాదాపు సగం మంది (20.6 కోట్లు) విద్య, వైద్యం, ఇల్లు, పోషకాహారం, రక్షిత నీరు, పారిశుద్ధ్యం వంటి ఆరు తప్పనిసరి సేవల్లో కనీసం ఒక దాన్ని పొందలేకపోతున్నారని అందులో పేర్కొంది. ఇందులో మూడోవంతు (6.2 కోట్లు) కన్నా తక్కువ మంది పిల్లలు రెండు లేదా అంతకంటే ఎక్కువ కనీస సౌకర్యాలకు నోచుకోకపోతున్నారని వెల్లడించింది. చిన్నారులు వీటి నుంచి బయటపడటానికి సహకారం అవసరమని సూచించింది. ప్రస్తుతం 23 కోట్ల మందికి పైగా చిన్నారులకు ఈ కనీస సేవలు అందుతున్నా, పురోగతిలో అసమానత్వం ఉందని తెలిపింది. జాతీయ బహుమితీయ పేదరిక సూచీ ప్రకారం 2013-14 నుంచి 2022-23 మధ్య దేశంలో 24.8 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని, దాంతో పేదరికం 29.2 శాతం నుంచి 11.3 శాతానికి తగ్గిందని యునిసెఫ్ గుర్తు చేసింది.

350% సుంకాలతో భారత్, పాక్‌లను బెదిరించా

- ట్రంప్ నోట పదేపదే పాతపాట



న్యూయార్క్: 'భారత్, పాకిస్థాన్‌లు యుద్ధం కొనసాగిస్తే.. రెండు దేశాలపై 350% సుంకాలు విధిస్తానని హెచ్చరించాను. ఇకపై అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు ఉండవని తెగేసి చెప్పాను. దీంతో ఆ రెండు దేశాలు వెనక్కి తగ్గాయి...' అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మళ్లీ పాత పాటే అందుకున్నారు. 'అమెరికా-సౌదీ పెట్టుబడుల వేదిక'లో సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్) సమక్షంలో మాట్లాడుతూ ట్రంప్ మరిన్ని విషయాలు పంచుకున్నారు. 'వివాదాలను పరిష్కరించడంలో నేను నిపుణుడిని. పలు దేశాల వివాదాలను పరిష్కరించాను. యుద్ధాలు జరగకుండా అడ్డుకున్నాను. భారత్, పాకిస్థాన్ అణ్వాయుధాలతో యుద్ధానికి సిద్ధం అయ్యాయి. అప్పుడు నేను రెండు దేశాలను హెచ్చరించాను. మీరు యుద్ధం చేసుకోవచ్చు, కానీ ఇకపై అమెరికాతో వ్యాపారం చేయలేరని చెప్పాను. నా దగ్గరకు వస్తే సమస్యను పరిష్కరిస్తారని చెప్పాను. అణుయుద్ధానికి దిగి లక్షల మంది ప్రాణాలు తీసుకోవద్దని సూచించాను. అణు ధూళి లాస్ ఏంజెలెస్‌పై తేలియాడటాన్ని నేను చూడలేను' అని ట్రంప్ చెప్పుకొచ్చారు.

ఎప్‌స్టీన్ ఫైళ్ల విడుదలకు ట్రంప్ ఆమోదం

వాషింగ్టన్: మైనర్లతో లైంగిక కార్యకలాపాల కేసులో శిక్ష పడి జైల్లోనే మరణించిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఫైళ్లను బహిరంగపరచడానికి ఉద్దేశించిన బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. డెమోక్రాట్లతోపాటు సొంత పార్టీ చట్టసభ సభ్యుల నుంచి వచ్చిన ఒత్తిడికి తలొగ్గిన ఆయన ఈ బిల్లుపై సంతకం చేశారు. దీంతో ఇది చట్టంగా మారింది. ఇప్పటికే ఉభయ సభలు ఈ బిల్లును ఆమోదించాయి. ఈ చట్టం నేపథ్యంలో అమెరికా న్యాయశాఖ.. 30 రోజుల్లో ఎప్‌స్టీన్ కేసుకు సంబంధించిన అన్ని వివరాలను, 2019లో అతడు ఫెడరల్ జైలులో మరణించడానికి దారితీసిన పరిస్థితుల సమాచారాన్ని విడుదల చేయాలి. ఎప్‌స్టీన్ బాధిత బాలికల పేర్లను గోప్యంగా ఉంచేందుకూ ఈ చట్టం వీలు కల్పిస్తుంది. అయితే ఈ సమాచారాన్ని న్యాయశాఖ రాజకీయ కారణాల రీత్యాగానీ, ప్రతిష్ఠకు భంగం కలుగుతుందన్న కారణంగాగానీ, మరే ఇతర కారణం చేతనైనా మొత్తంగా నిలిపి ఉంచేందుకు వీలుండదు.


నివేదికపై కాంగ్రెస్ ఆగ్రహం

దిల్లీ: అమెరికా-చైనా ఆర్థిక, భద్రతా సమీక్ష కమిషన్ (యూఎస్‌సీసీ)-2025 వార్షిక నివేదికలో ప్రస్తావించిన అంశాలపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పాకిస్థాన్ సైనిక విజయం సాధించిందని పేర్కొనడాన్ని ప్రస్తావిస్తూ.. భారత దౌత్యానికి ఇది పెద్ద ఎదురు దెబ్బ అని అభివర్ణించింది. పహల్గాం ఉగ్రదాడిని 'తిరుగుబాటు దాడి'గా పేర్కొనడం ఆశ్చర్యకరమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ఘర్షణలో చైనా ఆయుధాలు, ఇంటెలిజెన్స్‌ను పాకిస్థాన్ ఉపయోగించిందని నివేదిక పేర్కొందని, ఈ వ్యాఖ్యలపై అమెరికాకు మన ప్రభుత్వం అభ్యంతరం చెబుతుందా అని 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు.

నన్ను భారత్‌కు అప్పగించకండి

బెల్జియం సుప్రీంకోర్టులో మెహుల్ ఛోక్సీ పిటిషన్

దిల్లీ: భారత్‌లోని బ్యాంకులకు టోకరా వేసి పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ ఛోక్సీ.. తనను స్వదేశానికి అప్పగించరాదంటూ బెల్జియం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ వచ్చే నెల 9న విచారణకు రానుందని గురువారం అధికారులు వెల్లడించారు.



ఛోక్సీని అప్పగించాలంటూ భారత ప్రభుత్వం చేసిన అభ్యర్థనను సమర్థిస్తూ బెల్జియంలోని దిగువ కోర్టు గత నెల 17న వెలువరించిన తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టు తలుపు తట్టారు.

5 దశాబ్దాల తర్వాత 80 ఏళ్ల మహిళకు న్యాయం

చండీగఢ్: భర్త చనిపోయిన తర్వాత లభించాల్సిన పింఛను, ఇతర పదవీ విరమణ ప్రయోజనాల కోసం పోరాటం చేసిన ఓ భార్యకు ఐదు దశాబ్దాల తర్వాత న్యాయం లభించింది. ఈ కేసులో బాధితురాలైన లక్ష్మీదేవి భర్త హరియాణా ప్రభుత్వంలో విద్యుత్తు విభాగంలో పనిచేస్తూ 1974లో చనిపోయారు. అప్పటి నుంచి భర్తకు రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాల కోసం ఆమె పోరాడుతూనే ఉంది. చివరకు 80 ఏళ్ల వయసులో.. ఆమెకు పంజాబ్, హరియాణా హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. రెండు నెలల్లో బాధితురాలికి రావాల్సిన ప్రయోజనాలను ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించింది.

కాప్ సదస్సులో అగ్ని ప్రమాదం

బెలెమ్ (బ్రెజిల్): ఐక్యరాజ్య సమితి కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ - 30 (సీఓపీ 30) పేరుతో బ్రెజిల్‌లోని బెలెమ్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ వాతావరణ శిఖరాగ్ర సదస్సులో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో సదస్సుకు హాజరైన వేల మంది రక్షణ కోసం పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో మరణాలు, క్షతగాత్రుల సమాచారమేదీ వెంటనే తెలియలేదు. సభా ప్రాంగణంలోని బ్లూజోన్ ప్రాంతంలో మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తొలుత నిప్పు రాజుకున్నట్టు సమాచారం.. సదస్సుకు సంబంధించిన సమావేశాలు, సంప్రదింపులు, వివిధ దేశాలు నెలకొల్పిన పెవిలియన్లు, మీడియా సెంటర్ వంటి కీలక ప్రదేశాలన్నీ ఇక్కడే ఉన్నాయి. అగ్ని ప్రమాదం వార్త గుప్పుమనగానే సభకు విచ్చేసిన జనం అన్ని దిక్కులా నిష్క్రమణ మార్గాల దిశగా పరుగులు తీశారు.

ఎర్రకోట భద్రత కట్టుదిట్టం

- తేగ్ బహాదుర్ 350వ వర్ధంతికి ఏర్పాట్లు
- హాజరుకానున్న రాష్ట్రపతి, కేంద్ర హోం మంత్రి
- 50వేల మందితో భారీ వేడుక

దిల్లీ: ఒకపక్క ఎర్రకోట సమీపాన ఆత్మాహుతి పేలుడుపై దర్యాప్తు ముమ్మరం అవుతుండగా, మరోవైపు ఎర్రకోట వేదికగా భారీ వేడుకలు నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. గురు తేగ్ బహాదూర్ 350వ వర్ధంతి కార్యక్రమాన్ని మూడు రోజులపాటు అక్కడే నిర్వహించనున్నారు. దీనిలో సుమారు 50వేల మంది పాల్గొంటారు. ఈ నెల 23 నుంచి 25 వరకు ఈ వేడుకల్లో భాగంగా దిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలో కీర్తన్ దర్బార్ కూడా జరగనుంది. దీనిలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పాల్గొనే అవకాశం ఉందని 'దిల్లీ సిక్కు గురుద్వారా నిర్వహణ కమిటీ' (డీఎస్‌జీఎంసీ) తెలిపింది. భారీ వేడుక దృష్ట్యా భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. ఎర్రకోటకు దారితీసే మార్గంలో అదనంగా 25 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేశారు. రేయింబవళ్లు నిఘాకు వీలుగా డీఎస్‌జీఎంసీ సుమారు 300 కెమెరాలు నెలకొల్పింది. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం, బాంబు నిర్వీర్యక దళాలు, ఇతర బలగాలు కలిసి బహుళ అంచెల్లో తనిఖీలు చేయనున్నాయి. పేలుడుతో ఆందోళనకర పరిస్థితి నెలకొన్నా సందర్శకులు మాత్రం దీనిలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు.



అనంతనాగ్ ప్రభుత్వ వైద్య కళాశాల సిబ్బంది లాకర్లను తనిఖీ చేస్తున్న అధికారులు

కశ్మీర్ ఆసుపత్రుల్లో వైద్యుల లాకర్ల తనిఖీ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్, అనంతనాగ్ జిల్లాల్లో వేర్వేరు ఆసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది లాకర్లను పోలీసులు తనిఖీ చేశారు. దిల్లీ, ఫరీదాబాద్ ఘటనల నేపథ్యంలో వీటిని చేపట్టారు.

ఎన్ఐఏ కస్టడీలోకి ముగ్గురు వైద్యులు

ఎర్రకోట సమీపాన ఆత్మాహుతి పేలుడుకు పాల్పడిన వ్యక్తితో సంబంధాలున్న వైద్యులు- ముజమ్మిల్ గనయీ, అదీల్ రథేర్, షహీనా సయీద్‌లను; ఇర్ఫాన్ అహ్మద్ వగాయ్ అనే మత ప్రబోధకుడిని 10 రోజులపాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీకి అప్పగిస్తూ దిల్లీలోని న్యాయస్థానం గురువారం ఆదేశాలిచ్చింది.

అహ్మదాబాద్ పేలుళ్లలోనూ అల్-ఫలా!

దిల్లీ: ఎర్రకోట వద్ద పేలుడు ఘటన దర్యాప్తులో భాగంగా ఓ కీలక విషయం వెలుగులోకి వచ్చింది. 2008లో అహ్మదాబాద్‌లో వరుస పేలుళ్లు, 2007లో గోరఖ్‌పుర్ పేలుడు కేసుల్లో నిందితుడు షాబాద్ బేగ్ కూడా అల్-ఫలా విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి అని బయటపడింది. హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉన్న ఆ విద్యాసంస్థలో 2007లో షాబాద్ బీటెక్ పూర్తి చేశాడు. అతడిది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆజమ్‌గఢ్ జిల్లా. దేశ వ్యాప్తంగా ఐదు పేలుడు ఘటనల్లో నిందితుడు. పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. అల్-ఫలా విశ్వవిద్యాలయం ఛైర్మన్ జావెద్ సిద్దిఖీ కుటుంబానికి సంబంధించిన అక్రమ నిర్మాణాలను మధ్యప్రదేశ్‌లోని మవూ కంటోన్మెంట్ బోర్డులో అధికారులు గుర్తించారు. మూడు రోజుల్లో వాటిని కూల్చివేయాలని నోటీసులు జారీ చేశారు.

అఫ్గాన్, పీవోకేలో స్క్రిప్ట్.. టెలిగ్రామ్‌లో స్క్రీన్‌ప్లే

ఎర్రకోట వద్ద పేలుడు ఘటనకు అఫ్గానిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి ఉగ్రవాదులు వ్యూహరచన చేసినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. ఆత్మాహుతికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీ, ఇతర నిందితులు.. మన దేశం వెలుపల ఉన్న ఫైజల్ ఇష్ఫాక్ భట్, డా.ఉకాసా అనే ఇద్దరు హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరిపినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. హషీమ్ అనే మూడోవ్యక్తి టెలిగ్రామ్‌లో వీరితో సంప్రదింపులు జరిపినట్లు తెలిపారు.

జైపుర్‌లో మంత్రి నివాసంలోకి చిరుత

- ఎట్టకేలకు బంధించిన అటవీశాఖ బృందం



జైపుర్: రాజస్థాన్ రాజధాని జైపుర్‌లో అత్యంత భద్రత కలిగిన సివిల్ లైన్స్‌లోకి గురువారం ఓ చిరుత రావడం కలకలం రేపింది. సీఎం సహా ప్రముఖులు నివాసం ఉండే ఈ ప్రాంతంలో.. మొదట అక్కడి ఓ పాఠశాలలోకి చిరుత ప్రవేశించినట్లు పోలీసులకు సమాచారం అందింది. ముందు జాగ్రత్తగా విద్యార్థులను తరగతి గదుల్లోనే ఉంచి తాళాలు వేశారు. ఆ తర్వాత కాసేపటికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి సురేశ్ సింగ్ రావత్ అధికారిక నివాసంలోకి చిరుత ప్రవేశించినట్లు సీసీటీవీ దృశ్యాల్లో అధికారులు గుర్తించారు. దీంతో అటవీశాఖ బృందం రంగంలోకి దిగి దాదాపు కొన్ని గంటల పాటు శ్రమించి చిరుతను బంధించింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎవరికి ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ శిఖా మెహ్రా తెలిపారు.

టీడీబీ మాజీ అధ్యక్షుడి అరెస్టు

తిరువనంతపురం: శబరిమల ఆలయంలో బంగారం అపహరణ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) మాజీ అధ్యక్షుడు ఎ.పద్మకుమార్‌ను అరెస్టు చేసింది. ఎస్పీ శశిధరన్ నేతృత్వంలో తిరువనంతపురంలోని ఒక రహస్య ప్రదేశంలో సుమారు నాలుగు గంటల పాటు ప్రశ్నించిన అనంతరం సిట్ ఆయన్ను అరెస్టు చేసింది. అయితే ఈ కేసులో బుధవారం సాయంత్రమే సిట్ పద్మకుమార్‌కు సమన్లు జారీ చేసినట్లు తెలిపింది. వైద్య పరీక్షల అనంతరం ఆయన్ను కొల్లం విజిలెన్స్ కోర్టు ముందు హాజరుపరచనున్నారు.

నెహ్రూ ఎంపిక చేసిన రచనలు ఆన్‌లైన్‌లో..

3 వేల పత్రాలు, 35 వేల వ్యాఖ్య చిత్రాలు

దిల్లీ: దేశ తొలి ప్రధానమంత్రి నెహ్రూకు సంబంధించిన 'జవహర్ లాల్ నెహ్రూ ఎంపిక చేసిన రచనలు' ఇప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. దాదాపు 3 వేల పత్రాలు, 35 వేల వ్యాఖ్య చిత్రాలతో కూడిన మొత్తం 100 సంపుటిల సెట్‌ను పూర్తిగా డిజిటలైజేషన్ చేశారు. వీటిని తమ అధికారిక వెబ్‌సైట్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జవహర్ లాల్ నెహ్రూ మెమోరియల్ ఫండ్ (జేఎన్ఎంఎఫ్) వెల్లడించింది. వీటిలో 1920 - 1960 వరకు స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించిన నెహ్రూ నాయకత్వం, ప్రసంగాలు, అధికారిక కమ్యూనికేషన్లు, ఇంటర్వ్యూలు, పుస్తకాలు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. జేఎన్ఎంఎఫ్ ట్రస్టీ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ మాట్లాడుతూ.. రెండో దశలో నెహ్రూ లేఖలను తీసుకువచ్చే ప్రయత్నిస్తామన్నారు.



తిరుచానూరులో అమ్మవారి ఆలయం ఎదుట రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కలెక్టర్ వెంకటేశ్వర్, తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వంగలపూడి అనిత, ఎమ్మెల్యే పులివర్తి నాని, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

పద్మావతి అమ్మవారి సేవలో రాష్ట్రపతి

(మొదటి పేజీ తరువాయి)

లోపలికి ప్రవేశించిన ద్రౌపదీ ముర్ము ముందుగా ధ్వజస్తంభానికి మొక్కారు. అనంతరం అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఆశీర్వాద మండపంలో రాష్ట్రపతికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌లు అమ్మవారి ప్రసాదాలు, జ్ఞాపికలు అందించి శేషవస్త్రంతో సత్కరించారు.

ప్రజాప్రతినిధులు, అధికారులతో ఫొటో..

ఆలయం వెలుపల మీతో ఫొటో దిగుతామంటూ తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి విజ్ఞప్తి చేయగా రాష్ట్రపతి సానుకూలంగా స్పందించారు. హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి రామనారాయణరెడ్డితోపాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని.. రాష్ట్రపతితో కలిసి ఫొటో దిగారు. సమీపంలోనే ఉన్న ఈవో సింఘాల్, కలెక్టర్ వెంకటేశ్వర్‌లను రాష్ట్రపతి పిలవడంతో వారూ వచ్చి ఫొటో తీయించుకున్నారు.

■ ద్రౌపదీ ముర్ము సాయంత్రం 5.25కు తిరుమల చేరుకున్నారు. అక్కడి పద్మావతి అతిథి గృహం వద్ద తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి అనిత, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జానకీదేవి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

నేడు శ్రీవారి సేవలో..

రాష్ట్రపతి హోదాలో ద్రౌపదీ ముర్ము రెండో పర్యాయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. శుక్రవారం ఉదయం 9.30కి వరాహస్వామిని దర్శించుకుంటారు. 10-10.30 మధ్య శ్రీవారి సేవలో పాల్గొంటారు. 10.35కు అతిథిగృహానికి చేరుకుని 11 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి వెళ్తారు. అక్కడి నుంచి హైదరాబాద్ బయలుదేరతారు.

రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టులు గడువు విధించలేవు

(మొదటి పేజీ తరువాయి)

తిప్పిపంపొచ్చింది. ఆ అధికారం మొదటి నిబంధనలోని 'వెంటనే' అర్థం శాసనసభకు తిప్పిపంపడమనే. అలా తిప్పిపంపిన బిల్లు మళ్లీ తన వద్దకు వచ్చినప్పుడు గవర్నర్‌కు రెండు మార్గాలుంటాయి. ఆమోదం తెలపడం, లేదంటే రాష్ట్రపతి పరిశీలన కోసం పంపించడం చేయొచ్చు. శాసనసభకు తిప్పి పంపిన బిల్లు సవరణలతో కానీ, సవరణలు లేకుండా కానీ తిరిగి వచ్చినా... ఆ అంశంతో సంబంధం లేకుండా రాష్ట్రపతి పరిశీలన కోసం పంపే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. ■ ఒకసారి తిప్పి పంపిన బిల్లు మళ్లీ వచ్చినప్పుడు గవర్నర్ దాని అంతకుముందు ఉనికిలో దాంతో పోల్చిచూసుకొని అనుమతివ్వాలా? లేదా? అని నిర్ణయం తీసుకోవచ్చు. ■ ఒకవేళ అందులో చేసిన సవరణలు అంతర్రాష్ట్ర, సమాఖ్య కోణంలో ప్రభావం చూపుతున్నట్లు అనిపిస్తే దాన్ని రాష్ట్రపతి పరిశీలన కోసం పంపొచ్చు. ■ రెండోసారి అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు తప్పనిసరిగా అనుమతివ్వడం మినహా గవర్నర్‌కు మరో గత్యంతరం లేదనడం కుదరదు.

రాష్ట్రపతి లేఖకు కారణమైన తీర్పు ఇది...

తమిళనాడు బిల్లులను నిరవధికంగా నిలిపివేసిన కేసులో జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పు రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల్లో జోక్యం చేసుకున్నట్లుగా ఉండటంతో ద్రౌపదీ ముర్ము 14 ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు.

రాష్ట్రపతి ప్రశ్నలకు ధర్మాసనం సమాధానాలివి...

? అధికరణం 200 కింద బిల్లు సమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగ మార్గాలేంటి?

■ గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు మార్గాలున్నాయి.

1. బిల్లుకు ఆమోదం తెలపడం 2.రాష్ట్రపతి పరిశీలన కోసం రిజర్వులో పెట్టడం 3. ఆమోదాన్ని పెండింగ్‌లో పెట్టి తన అభిప్రాయాలతో బిల్లును మళ్లీ శాసనసభకు తిప్పిపంపడం.

అధికరణం 200లోని తొలి నిబంధన చాలా ముఖ్యమైంది. అందులోని నాలుగో ఆప్షన్‌కు వెళ్లడానికి బదులు అందులో ఉన్న ఆప్షన్లకే గవర్నర్ పరిమితం కావాలి. ఒకవేళ తన ముందుకు వచ్చింది ద్రవ్య బిల్లు కాకపోతే అనుమతిని పెండింగ్‌లో ఉంచి తన అభిప్రాయాలతో ఆ బిల్లును తిప్పి పంపే ఆప్షన్ ఒక్కటే గవర్నర్‌కు అందుబాటులో ఉంటుంది.

? బిల్లులపై గవర్నర్ తన ముందున్న మార్గాలను ఎంచుకొనేటప్పుడు తప్పనిసరిగా మంత్రి మండలి సలహా, సూచనల మేరకే నడుచుకోవాలా?

■ గవర్నర్ పైన పేర్కొన్న మూడు రాజ్యాంగపరమైన ఆప్షన్లను ఎంచుకొనేటప్పుడు తన విచక్షణ ప్రకారం నడుచుకోవచ్చు. అధికరణం 200 కింద విధులు నిర్వర్తించేటప్పుడు మంత్రిమండలి సలహా, సూచనలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు.

? గవర్నర్ ఉపయోగించిన రాజ్యాంగ విచక్షణాధికారాలు న్యాయపరంగా సమీక్షించవచ్చా?

■ అధికరణం 200 కింద గవర్నర్ విధులను సమీక్షించడం న్యాయబద్ధంకాదు. ఆయన తీసుకున్న నిర్ణయాల్లోని బాగోగుల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవు. కానీ సదరు బిల్లులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నిరవధికంగా జాప్యంచేసినా, కారణం చెప్పకుండా పెండింగ్‌లో ఉంచినా వారికున్న విచక్షణాధికార పరిధిపై వ్యాఖ్యలు చేయకుండా అధికరణం 200 కింద విధులు నిర్వర్తించి బిల్లులపై తగిన సమయంలోగా నిర్ణయం తీసుకోమని కోర్టులు పరిమిత ఆదేశాలు జారీచేయొచ్చు.

? అధికరణం 200 కింద గవర్నర్ చర్యలను న్యాయ సమీక్ష చేయకుండా అధికరణం 361 పూర్తిగా నిషేధిస్తోందా?

■ గవర్నర్‌ను వ్యక్తిగతంగా న్యాయ విచారణ ప్రక్రియలోకి లాగి న్యాయ సమీక్ష చేయడాన్ని అధికరణం 361 పూర్తిగా నిషేధిస్తోంది. అయితే, అధికరణం 200 కింద గవర్నర్ ఎలాంటి చర్యలూ తీసుకోకుండా నిరవధికంగా వాయిదా వేసినప్పుడు సమీక్షించేందుకు కోర్టుకు అధికారం ఉంది. ఆ పరిమిత న్యాయ సమీక్షకు అడ్డుకట్ట వేయడానికి అధికరణం 361ని ఉపయోగించుకోకూడదు. గవర్నర్ వ్యక్తిగతంగా రాజ్యాంగ రక్షణను అనుభవిస్తున్నప్పటికీ గవర్నర్ కార్యాలయం మాత్రం కోర్టు న్యాయ సమీక్ష పరిధిలోకి వస్తుంది.

? కోర్టులు గవర్నర్లకు గడువులు విధించవచ్చా?

■ నిర్దిష్ట గడువులు, గవర్నర్ అధికార వినియోగ తీరుపై రాజ్యాంగంలో ఏమీ చెప్పనప్పుడు అధికరణం 200 కింద గవర్నర్ అధికారాల వినియోగ విషయంలో కోర్టులు న్యాయపరంగా గడువులు విధించడం తగదు.

? అధికరణం 201 కింద రాష్ట్రపతికున్న విచక్షణాధికారాల వినియోగాన్ని న్యాయసమీక్ష చేయొచ్చా?

■ గవర్నర్లకు వర్తింపచేసిన కారణం ప్రకారం, అధికరణం 201 కింద రాష్ట్రపతి ఇచ్చిన ఆమోదాన్నీ న్యాయపరంగా సమీక్షించడానికి వీల్లేదు.

? రాష్ట్రపతి విచక్షణాధికారాలకు సంబంధించి కోర్టులు గడువులు విధించవచ్చా?

■ అధికరణం 200 కింద గవర్నర్లకున్న అధికారాల విషయంలో ఇచ్చిన స్పష్టతే రాష్ట్రపతికీ వర్తిస్తుంది. అధికరణం 201 కింద విధులు నిర్వర్తించేటప్పుడు కోర్టులు విధించిన గడువులకు రాష్ట్రపతి కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు.

? తన ఆమోదం కోసం గవర్నర్ బిల్లు పంపినప్పుడు అధికరణం 143లో పొందుపరిచిన ప్రతిపాదన విధానం ద్వారా రాష్ట్రపతి ప్రతిసారీ సుప్రీంకోర్టు సలహాలు తీసుకోవాలా?

■ గవర్నర్ బిల్లు పంపిన ప్రతిసారీ సుప్రీంకోర్టు సలహాను రాష్ట్రపతి తీసుకోవాల్సిన అవసరం లేదు. ఆ బిల్లుపై రాష్ట్రపతి సంతృప్తి సరిపోతుంది. ఏ విషయంలోనైనా స్పష్టత లేకపోతే రాష్ట్రపతి దాన్ని అధికరణం 143 కింద సుప్రీంకోర్టుకు ప్రతిపాదించొచ్చు. ఇలా పలుసార్లు చేశారు.

? అధికరణం 200, 201 కింద గవర్నర్, రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాలను చట్టం ఆచరణలోకి రావడానికి ముందే సమీక్షించ వచ్చా?

■ చట్టం అమల్లోకి రాకముందే అధికరణం 200, 201 కింద గవర్నర్లు, రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాలను సమీక్షించడం కుదరదు. బిల్లు చట్ట రూపం దాల్చక ముందు ఏరకంగానూ అందులోని అంశాలపై కోర్టులు న్యాయ విచారణ జరపరాదు.

? రాష్ట్రపతి, గవర్నర్లు జారీచేసే ఉత్తర్వులకు అధికరణం 142 కింద సుప్రీంకోర్టు ఇచ్చే ఉత్తర్వులు ప్రత్యామ్నాయంగా ఉంటాయా?

■ గవర్నర్లు, రాష్ట్రపతి రాజ్యాంగపరంగా నిర్వహించే విధులు, జారీచేసే ఆదేశాలను ఎట్టిపరిస్థితుల్లోనూ అధికరణం 142 ద్వారా భర్తీ చేయలేరు.

? శాసనసభలు చేసిన బిల్లులు గవర్నర్ అనుమతి లేకుండా చట్టాలవుతాయా?

■ గవర్నర్ ఆమోదం లేకుండా రాష్ట్ర శాసనసభలు తీసుకొచ్చే ఏ బిల్లూ చట్టరూపం దాల్చలేదు. అధికరణం 200 కింద ఉన్న గవర్నర్ పాత్రను మరో రాజ్యాంగ వ్యవస్థ భర్తీ చేయలేదు.

? అధికరణం 145(3) ప్రకారం... రాజ్యాంగపరమైన కేసు వచ్చినప్పుడు రాజ్యాంగ నిర్వచనంపై ముఖ్యమైన ప్రశ్నేంటో నిర్ధారించడానికి ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి పంపడం తప్పనిసరి కాదా?

■ రాజ్యాంగ ప్రాధాన్యమైన కేసుల విచారణలో ధర్మాసనాల కూర్పు గురించి అడిగిన ప్రశ్న ప్రస్తుతం అప్రస్తుతం. అందువల్ల దానికి సమాధానం ఇవ్వకుండా వదిలేస్తున్నాం.

? అధికరణం 142 కింద సుప్రీంకోర్టుకు ఉన్న అధికారాలు విధానపరమైన అంశాల కేసులకే పరిమితమా?

■ అధికరణం 142 కింద ఉన్న అధికారాలు చాలా విస్తృతం. దానికి నిర్దిష్టంగా సమాధానం చెప్పడం సాధ్యంకాదు. రాష్ట్రపతి, గవర్నర్ల విధినిర్వహణ విషయంలో అధికరణం 142కి ఉన్న పరిధిని పదో ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలోనే చెప్పాం.

? అధికరణం 131 కింద వేసిన దావా విషయంలో కాకుండా ఇంకేదైనా మార్గంలో కేంద్ర, రాష్ట్రాల వివాదాలను పరిష్కరించకుండా రాజ్యాంగం సుప్రీం న్యాయపరిధిపై పరిమితి విధిస్తోందా?

■ అధికరణం 131కి వెలుపల కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారాల విషయంలో ఈ కోర్టుకున్న న్యాయపరిధితో రాష్ట్రపతి ప్రతిపాదనకు సంబంధంలేదు. దానికి సమాధానం ఇవ్వట్లేదు.

కల్తీ నిర్ధారణైనా.. వాళ్లను ఎందుకు కొనసాగించారు?

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసిన జగన్ బాబాయ్ వైవీ సుబ్బారెడ్డిపై సిట్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. జగన్ పాలనలో తిరుమల లడ్డూ, ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు నమోదైన కేసులో గురువారం ఆయన్ను విచారించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సుబ్బారెడ్డి నివాసానికి వెళ్లిన సిట్ బృందం... ఉదయం 11 నుంచి రాత్రి పదిన్నర వరకూ ప్రశ్నిస్తూనే ఉంది. వెన్న సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో సంబంధమే లేని సంస్థలూ టెండర్లలో పాల్గొనేందుకు వెసులుబాటు కల్పించేలా నిర్ణయాలు ఎందుకు తీసుకున్నారని అడిగింది. తితిదే మాజీ ఈవో ధర్మారెడ్డి, సుబ్బారెడ్డి దగ్గర అప్పట్లో వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన చిన్నప్పన్న ఇచ్చిన వాంగ్మూలాలు, విచారణలో వెల్లడించిన అంశాల ఆధారంగా సుబ్బారెడ్డిని ప్రశ్నిస్తూ సమాధానాలు రాబట్టింది. అత్యధిక శాతం ప్రశ్నలకు.. ఆయన తనకు సంబంధం లేదని, టెండర్లు ఆహ్వానించడం, ఖరారు చేయడం వంటివన్నీ అప్పటి అధికారులే చూసుకున్నారని, ఏవైనా ఉంటే వారినే అడగాలంటూ జవాబులిచ్చినట్లు తెలిసింది. సుబ్బారెడ్డి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న సిట్ అధికారులు ఆయన్ను మరోసారి విచారించనున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలివి.

కీలక నిబంధనల్ని ఎందుకు ఎత్తేశారు?

■ తితిదే నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొనే సంస్థలకు (జాతీయ డెయిరీలు) మూడేళ్లుగా డెయిరీ నిర్వహిస్తున్న అనుభవం ఉండాలనే నిబంధనను మార్చేసి ఏడాదిగా డెయిరీ నిర్వహిస్తుంటే చాలని ఎందుకు సరిపెట్టేశారు? సంబంధిత డెయిరీ గతేడాదిలో రోజుకు కనీసం 4 లక్షల లీటర్ల ఆవుపాలు సేకరించి ఉండాలని, ఇందుకు ఆధారంగా ప్రొక్యూర్‌మెంట్ రికార్డులు, ఎఫ్ఎస్ఎస్ఏఐకి సమర్పించిన రిటర్న్‌లు జతచేయాలనే నిబంధనను ఎందుకు గల్లంతు చేసేశారు. ఆయా సంస్థలు మార్కెట్ అవసరాల కంటే అదనంగా రోజుకు 8 టన్నుల నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలనే నిబంధనను ఎందుకు ఎత్తేశారు? పాలు సేకరించకుండా, వెన్న తయారుచేయకుండా నెయ్యి ఉత్పత్తి సాధ్యం కాదనే సంగతి మీకు తెలీదా? అని సుబ్బారెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించగా.. అవన్నీ సంబంధిత అధికారులు, నిపుణుల కమిటీ తీసుకున్న నిర్ణయాలని, వాటిలో తాను జోక్యం చేసుకోలేదని ఆయన సమాధానమిచ్చినట్లు తెలిసింది.

■ నెయ్యి టెండరు నిబంధనలను మార్చడానికి కారణమేంటని అడగ్గా సాంకేతిక కమిటీ, ప్రొక్యూర్‌మెంట్ అధికారులు దీన్ని చూసుకున్నారని, తనకు ప్రమేయమేమీ లేదని సుబ్బారెడ్డి సమాధానమిచ్చారు.

మీ పీఏ చిన్నప్పన్న లంచం అడిగారని ఫిర్యాదుచేసినా ఎందుకు చర్యలు తీసుకోలేదు?

■ '2022 మే నెలలో జాతీయ డెయిరీల నుంచి 24.50 లక్షల కిలోల నెయ్యి సరఫరాకు తితిదే టెండర్లు పిలిచింది. అప్పట్లో మీ పీఏ చిన్నప్పన్న భోలేబాబా డెయిరీ ప్రతినిధులను కిలోకు రూ.25 చొప్పున లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు మా దర్యాప్తులో తేలింది. ఇది మీ ప్రమేయంతోనే జరిగిందా?' అని సిట్ అధికారులు అడగ్గా.. కానే కాదని సుబ్బారెడ్డి జవాబిచ్చినట్లు సమాచారం.

■ 'భోలేబాబా ప్రతినిధులు లంచమివ్వడానికి అంగీకరించకపోవటంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి సాంకేతిక కారణాలతో ఆ సంస్థను పోటీనుంచి తప్పించి ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థకు కాంట్రాక్టు కట్టబెట్టినట్లు మా దర్యాప్తులో తేలింది. ఈ వ్యవహారంలో చిన్నప్పన్నకు రూ.50 లక్షలు లంచం సొమ్ము చేరినట్లు మా దర్యాప్తులో వెల్లడైంది' అని సిట్ అధికారులు ప్రశ్నించగా... అవేవీ తనకు గుర్తులేవని సుబ్బారెడ్డి చెప్పినట్లు సమాచారం.

■ చిన్నప్పన్న కిలోకు రూ.25 చొప్పున లంచం అడుగుతున్నాడని భోలేబాబా ప్రతినిధులు మీకు ఫిర్యాదుచేసినా చిన్నప్పన్నపై ఎందుకు చర్యలు తీసుకోలేదని అడగ్గా తనకు అవేవీ గుర్తులేవని సుబ్బారెడ్డి సమాధానం చెప్పినట్లు సమాచారం.

■ 'అప్పట్లో మీ పీఏగా పనిచేసిన చిన్నప్పన్న బ్యాంకు ఖాతాలో 2019-2024 మధ్య రూ.4.69 కోట్లు జమైంది. అందులో రూ.4.64 కోట్లు వివిధ ఖాతాలకు మళ్లింది. వాటితో మీకు సంబంధం ఏంటి? ఇదంతా కల్తీ నెయ్యి సరఫరాదారుల నుంచి అందిన లంచాల సొమ్మేనని మా దర్యాప్తులో తేలింది. ఆ ఆర్థిక లావాదేవీలతో మీకు సంబంధమేంటి?' అని సిట్ అధికారులు అడగ్గా తనకు సంబంధం లేదని సమాధానమిచ్చినట్లు తెలిసింది.



హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని వైవీ సుబ్బారెడ్డి నివాసం

వైవీ సుబ్బారెడ్డి నివాసంలోనే విచారణ

ఈ నెల 13న తిరుపతిలోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని వైవీ సుబ్బారెడ్డికి దర్యాప్తు అధికారులు తొలుత నోటీసులిచ్చారు. లఖ్‌నవూలో సమావేశమున్న నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ వరకు తాను రాలేనని సుబ్బారెడ్డి సమాధానమిచ్చారు. అనారోగ్య కారణాల రీత్యా హైదరాబాద్‌లో తన నివాసంలోనే ప్రశ్నించాలని విన్నవించారు. దీంతో సిట్ బృందం గురువారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లి.. ఆయన్ను విచారించింది.

■ గతేడాది సెప్టెంబరులో తితిదే ప్రొక్యూర్‌మెంట్ జీఎం మురళీకృష్ణ ఫిర్యాదుచేయగా తిరుపతి తూర్పు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. చివరికి దర్యాప్తు బాధ్యతను సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగించింది. ఈ నెల 11, 12 తేదీల్లో తితిదే మాజీ ఈఓ ఏవీ ధర్మారెడ్డిని ఇదే కేసులో సిట్ అధికారులు విచారించారు. నాలుగు రోజులుగా వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్నప్పన్ననూ ప్రశ్నిస్తున్నారు. విచారణ సందర్భంగా వీరిద్దరితో పాటు ప్రొక్యూర్‌మెంట్ అధికారులు, భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్, ఏఆర్ డెయిరీ ప్రతినిధులు చెప్పిన సమాధానాల ఆధారంగా అధికారులు ప్రశ్నావళి రూపొందించుకుని సుబ్బారెడ్డిని గురువారం విచారించారు.

జగన్ మార్కు బలప్రదర్శన

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులను తోసుకుంటూ కార్యకర్తలు పోటీపడ్డారు. వాళ్లను నియంత్రించలేక పోలీసులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. అక్కడ ఉన్న పూల కుండీలు పగిలిపోయాయి. మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, పేర్ని నాని తదితరులు వచ్చారు. ధర్మాన కోర్టు ఆవరణలోకి రాగా, పేర్ని నానిని గేటు లోపలికి అనుమతించలేదు. కోర్టుకు కొంతదూరంలోనే అన్ని వాహనాలనూ పోలీసులు ఆపేశారు. జగన్‌కు చెందిన రెండు వాహనాలనే లోపలికి అనుమతించారు. కోర్టు ఆవరణలోనూ న్యాయవాదులు జగన్‌ను కలవడానికి పోటీపడ్డారు. పలువురు న్యాయవాదులు విజయవాడ నుంచి కోర్టుకు వచ్చారు. కేసులు లేని న్యాయవాదులూ కోర్టు లోపలికి వచ్చారు. కోర్టు హాలు నుంచి జగన్ బయటకు వచ్చినప్పుడూ తోపులాటలు జరిగాయి. జగన్‌ను కలవడానికి, కరచాలనం చేయడానికి, సెల్ఫీలు తీసుకోవడానికి న్యాయవాదులు పోటీపడ్డారు. పోలీసులు వారిని నియంత్రించలేకపోయారు. అనుచరులే జగన్ చుట్టూ నిలబడి బయటకు తీసుకెళ్లారు.

చెప్పాల్సిందేమీ లేదన్న జగన్: యూరప్ పర్యటనకు అనుమతి సందర్భంగా విధించిన షరతుల మేరకు జగన్ గురువారం సీబీఐ ప్రధానకోర్టు ముందు హాజరయ్యారు. కోర్టు హాలులోకి జగన్ వచ్చే సమయానికి అక్రమాస్తుల వ్యవహారంలో భాగమైన దాల్మియా కేసులో వాదనలు కొనసాగుతున్నాయి. జగన్ రాకతో న్యాయవాది వాదనలు నిలిపివేస్తాననగా న్యాయాధికారి డాక్టర్ టి. రఘురాం నిరాకరించడంతో వాదనలు కొనసాగాయి. సుమారు 15-20 నిమిషాలు కోర్టు లోపల జగన్ కూర్చున్నారు. అనంతరం ఆయన తరఫు న్యాయవాది జి.అశోక్‌రెడ్డి హాజరు మెమోను జడ్జికి అందజేశారు. యూరప్ పర్యటన సందర్భంగా విధించిన షరతుల మేరకు కోర్టు ముందు హాజరైనట్లు చెప్పారు. జగన్.. అక్టోబరు 19న తిరిగి వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌ను ఉద్దేశించి చెప్పుకోవాల్సింది ఏమైనా ఉందా అని న్యాయాధికారి ప్రశ్నించగా లేదని ఆయన బదులిచ్చారు. దీంతో పిటిషన్‌పై విచారణను ముగిసివేస్తూ జడ్జి ఉత్తర్వులు జారీచేశారు.

కోర్టు హాలులో సునీత: జగన్ కోర్టు హాలులోకి వచ్చిన సమయంలో మాజీమంత్రి వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి అదే కోర్టు హాలులో ఉన్నారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగించాలంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఉండటంతో ఆమె హాజరయ్యారు.

రప్పా రప్పా నినాదాలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: నాంపల్లి కోర్టుకు జగన్ వస్తుండడంతో కోర్టుకు దారితీసే నాంపల్లి మార్కెట్ చౌరస్తా, రెడ్‌హిల్స్ చౌరస్తా, దేవీబాగ్ ఏరియా, ఖైరతాబాద్ దారి, బజార్‌ఘాట్ నుంచి షార్ట్ రూట్‌లన్నింటినీ ఉదయమే పోలీసులు బారికేడ్లతో మూసేసి వాహనాలు, పాదచారుల రాకపోకలను నిరోధించారు. జగన్ కాన్వాయ్ కోర్టుకు చేరుకోవడంతోనే అప్పటికే రోడ్లకు ఇరువైపులా గుంపులుగా నిల్చున్న వైకాపా నాయకులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. కోర్టులో విచారణ కొనసాగుతుండగా వెలుపల వైకాపా కార్యకర్తలు సీఎం సీఎం.. 2029లో రప్పా.. రప్పా.. అంటూ నినాదాలు చేశారు.

నిఘా లేనిచోట్లే షెల్టర్

- మాస్ ప్రాంతాల్లోనే అద్దెకు దిగిన మావోయిస్టులు
- విజయవాడ చుట్టుపక్కల ఐదుచోట్ల ఇదే వ్యూహం

ఈనాడు, అమరావతి: పోలీసుల నిఘా పెద్దగా లేనిచోట్ల.. పూర్తిగా మాస్ ప్రాంతాలు.. చుట్టుపక్కల వారు దృష్టి సారించని ఏరియాలనే మావోయిస్టులు తలదాచుకునేందుకు ఎంచుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాల నుంచి తీవ్ర ఒత్తిడి కారణంగా బయటకు వచ్చిన మావోయిస్టులు.. విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఇళ్లను అద్దెకు తీసుకునేందుకు పలు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. విజయవాడ శివార్లలో మూడుచోట్ల, కానూరు కొత్త ఆటోనగర్, గన్నవరంలోని ఇళ్ల నుంచి మొత్తం 32 మందిని పోలీసు, ఆక్టోపస్ బృందాలు అరెస్టు చేశాయి. అన్నిచోట్లా వీరికి కొందరు స్థానికులు సాయం చేసినట్లు సమాచారం.

కత్తితో దాడి చేయబోయిన రంగు

విజయవాడ శివారు రామవరప్పాడు రైల్వేస్టేషన్ పక్కనే రైవస్ కాలవ ఒడ్డున అద్దెకు తీసుకున్న రేకుల ఇంట్లో బీమా అలియాస్ రంగు, అతని భార్య మంగి ఉన్నారు. ఇతను గుర్కాపూర్‌లో పోలీసులపై చేసిన దాడిలో ఓ కాలు కోల్పోయాడు. ఆగస్టు చివరి వారంలో అద్దెకు దిగారు. జాతీయ రహదారి పనుల కోసం వచ్చామని.. ఐదారు నెలలు ఉండి వెళ్తామని ఇంటి యజమానికి చెప్పారు. పోలీసులు తొలుత ఆ ఇంటి తలుపు తట్టగానే రంగు తలుపు తీశాడు. మీరెవరని ప్రశ్నించగా.. గ్రామ సచివాలయ ఉద్యోగులమని సమాధానమిచ్చారు. అనుమానంతో వెంటనే తలుపులు మూసేశాడు. బలవంతంగా నెట్టి లోపలకు వెళ్లగా.. కత్తితో దాడికి దిగాడు. పోలీసులు గట్టిగా పట్టుకుని, అదుపులోకి తీసుకుని తరలించారు. అతని భార్య మంగి కూడా తీవ్రంగా ప్రతిఘటిస్తూ పెద్దగా కేకలు వేసింది. ఆమెను వాహనం ఎక్కించడానికి తీవ్రంగా ప్రయాసపడాల్సి వచ్చింది. కృష్ణా జిల్లా రిజిస్ట్రేషన్ నంబరు గల ద్విచక్ర వాహనంపై తిరిగేవారని ఇరుగుపొరుగు వారు చెబుతున్నారు. స్థానికంగా ఎవరైనా వీరికి సాయం చేశారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

నెలకు రూ.40 వేలకు అద్దెకు..

కానూరు కొత్త ఆటోనగర్‌లోని వాణిజ్య భవనంలో మూడో అంతస్తులో అద్దెకు రజని అనే మహిళ మాట్లాడినట్లు తెలిసింది. భవనం యజమాని విదేశాల్లో ఉంటున్నారు. సూపర్‌వైజర్ ఒకరు భవనాన్ని పర్యవేక్షిస్తుంటారు. ఆ భవనానికి 'టు లెట్' బోర్డు ఉండడంతో సూపర్‌వైజర్‌ను సంప్రదించి దాదాపు 3వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల గోదామును నెలకు రూ.40వేల అద్దెకు మాట్లాడుకున్నారు. రోడ్డు పనులు చేసేవారు ఆరుగురు ఉంటారని చెప్పారు. అడ్వాన్సుగా రూ.10వేలు చెల్లించి.. మిగిలింది ఈ నెలాఖరుకు ఇస్తామని చెప్పారు. ఇక్కడే 27 మంది మావోయిస్టులు అరెస్టయ్యారు. రోజూ వీరికోసం కారులో రెండు పూటలా భోజనాలు వచ్చేవి. ఎవరు పంపారనే దానిపై పోలీసులు విచారిస్తున్నారు.

■ మావోయిస్టుల్లో ఒకరు చికిత్స కోసం గన్నవరంలో పిన్నమనేని ఆసుపత్రి సమీపంలో అద్దెకు తీసుకుని ఉన్నారు. ఆపరేషన్ జరిగిన రోజు.. కానూరులో పట్టుబడినవారు ఇచ్చిన సమాచారంతో గన్నవరంలో ఒకరిని అరెస్టు చేశారు.

ఏలూరు బదిలీపై వెళ్తున్నామని అద్దెకు తీసుకుని..

విజయవాడ శివారు ప్రసాదంపాడులోని విజయ ఆగ్రోమిల్లు రోడ్డులో రైలుపట్టాల పక్కన ఓ ఇంట్లోని మొదటి అంతస్తును మావోయిస్టులు మూడు నెలల క్రితం అద్దెకు తీసుకున్నారు. తమది గుంటూరు అని.. ఏలూరుకు బదిలీపై వెళ్తున్నామని ముగ్గురు వచ్చి అద్దెకు మాట్లాడుకున్నారు. ఆ ఇంట్లో మనీలా ఉంది. పోలీసులు అదుపులోకి తీసుకునేటప్పుడు తీవ్రంగా ప్రతిఘటించింది. నలుగురు పోలీసులను వెనక్కి నెట్టేసింది. గట్టిగా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. గుణదల రైల్వేస్టేషన్ సమీపంలో ఇంటి నుంచి లక్మ అలియాస్ జగ్గు అలియాస్ మదన్‌ను అరెస్టుచేశారు. ఆ సమయంలో అతను ఏమరుపాటుగా ఉండడంతో సునాయాసంగా పట్టుకోగలిగారు.

గూగుల్ కోసం శరవేగంగా భూసేకరణ

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారు. అయితే ఇళ్ల స్థలాన్ని 5 సెంట్లకు పెంచాలని, నైపుణ్య శిక్షణ కేంద్రం, స్కూల్‌కు గతంలో భూమిలిచ్చిన రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును రైతులు కోరారు. సీఎం దృష్టికి తీసుకెళతామని ఆయన చెప్పారు.

రైతుల్ని తప్పుదోవ పట్టిస్తే ఊరుకోం: గంటా

కొందరు దళారులు తమ వద్దకు వచ్చి రెండెకరాలకు 55 సెంట్లు అభివృద్ధి చేసిన భూమి, రూ.1.15 కోట్ల నగదు ఇస్తామని మభ్యపెడుతున్నారని గురువారం జరిగిన సమావేశంలో కొందరు రైతులు చెప్పారు. అంగీకరిస్తే ఒక్కరోజులోనే 50 శాతం మొత్తం ఖాతాల్లో జమ చేస్తామని చెబుతున్నారన్నారు. గతంలో కొందరు తమకు తెలియకుండా తమ పేరు మీద ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేసులు కూడా వేశారని చెప్పారు. దీనిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆర్డీవో సంగీత్ మాథుర్ తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ కోసం ప్రభుత్వానికి భూములివ్వద్దని, వాటికి తాము ఎక్కువ ధర చెల్లిస్తామని రైతుల్ని తప్పుదోవ పట్టిస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పోలీసులను ఆదేశించారు.

ఈ నెల 24 నుంచి 'రైతన్నా.. మీ కోసం'

(మొదటి పేజీ తరువాయి)

ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే పంచసూత్రాల విధానాన్ని చేపట్టాం. వీటిపై రైతులకే కాకుండా వారి కుటుంబసభ్యులకు కూడా అవగాహన కల్పించాలి. పాడి రైతులు, పౌల్ట్రీ, గొర్రెల పెంపకందారులు, ఆక్వా, ఉద్యాన, సెరికల్చర్ రైతులకూ అవగాహన కల్పించాలి. రైతు సేవా కేంద్రాల్లో ఉండే సిబ్బంది ముందుండి దీన్ని చేపట్టాలి' అని చంద్రబాబు ఆదేశించారు.

రైతు బజార్లలోనూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

'శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. దీని కోసం ఆధునిక పద్ధతుల ద్వారా పంటలకు మరింత విలువ జోడించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి వివరించాలి. ప్రకృతి సేద్యాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నాం. దీని వల్ల భూసార రక్షణతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఇప్పటికే ఆయా ఉత్పత్తులకు సర్టిఫికేషన్‌తోపాటు ట్రేసబిలిటీ కల్పిస్తున్నాం. రైతు బజార్లలోనూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలను మరింత ప్రోత్సహించాలి. ప్రైవేటు దుకాణాల కంటే గ్రోమోర్ కేంద్రాల్లో ఎరువుల ధర తక్కువగా ఉంది. రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే ఉత్పత్తులకు మేలు జరుగుతుంది' అని సీఎం వివరించారు.

సాగులో ఏ సాయం అవసరమో తెలుసుకోవాలి

'రైతులు ఏ పంటలు వేశారు? వారికి ఎలాంటి సాయం అవసరమనే విషయాన్ని నేరుగా తెలుసుకోవాలి. సాగులో పురుగుమందుల వినియోగం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించాలి. తక్కువ వినియోగం వల్ల లాభాలు, సేంద్రీయ విధానం ద్వారా పండించిన ఉత్పత్తులకు విదేశాల్లో ఏ స్థాయిలో డిమాండ్ ఉందనేది వివరించాలి. సమర్థ నీటి నిర్వహణ, భూసార పరీక్షలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు వంటి విషయాలను రైతులకు చెప్పాలి' అని సీఎం దిశానిర్దేశం చేశారు.

రైతును దోచుకున్న సైబర్ నేరగాళ్లు

అమరావతి, న్యూస్‌టుడే: సాగు పెట్టుబడుల కోసం పంట రుణాన్ని తీసుకున్న రైతు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.12,42,011 కొట్టేశారు. పల్నాడు జిల్లాలోని అమరావతి మండలం పెదమద్దూరు గ్రామానికి చెందిన వెంకట్రాయుడు.. ఈ నెల 17న వైకుంఠపురంలోని యూనియన్ బ్యాంకులో పొలం తనఖా పెట్టి రూ.19.90 లక్షల పంట రుణం తీసుకున్నాడు. పాత అప్పు రూ.7,48,000 బ్యాంకు వారు జమ చేసుకున్నారు. మిగిలిన నగదు రైతు ఖాతాలోనే ఉంది. ఈ నెల 19న రైతు.. బ్యాంకుకు వెళ్లగా ఖాతాలో 65 పైసలే ఉన్నాయని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఆయన ఖంగుతిన్నాడు. నగదును సైబర్ నేరగాళ్లు కొట్టేశారని గుర్తించారు. ఈ నెల 17న రూ.5 లక్షల చొప్పున రెండుసార్లు, 18న మూడు సార్లు కలిపి రూ.1,50,019, 19న రూ.91,992 ఖాతా నుంచి మళ్లించినట్లు గుర్తించారు.

వైకాపా సోషల్ మీడియా కార్యకర్త విజయ్‌భాస్కరరెడ్డికి 2 రోజుల కస్టడీ

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టి అరెస్టయిన వైకాపా సోషల్ మీడియా కార్యకర్త ఎం.విజయ్‌భాస్కరరెడ్డిని రెండు రోజుల పోలీసు కస్టడీకి తీసుకునేందుకు కోర్టు అనుమతించింది. అసభ్యకర పోస్టుల విషయంలో మరింత లోతైన విచారణ కోసం వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న రెండో ఏసీఎంఎం కోర్టు న్యాయాధికారి రాధిక నిందితుడిని పోలీసు కస్టడీకి అనుమతించారు. నిందితుడు నెల్లూరు కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉండడంతో సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో కస్టడీలోకి తీసుకొని విచారించాలని న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు.

జాతీయ దత్తత అవగాహన మాసం సందర్భంగా...

అధికారికంగా... ఆత్మీయ రాగం!



ఏలూరుకు చెందిన దంపతులకు వివాహమై 16 ఏళ్లు అవుతోంది. పిల్లల కోసం ఎన్నో ఆస్పత్రులు తిరిగినా లాభం లేకపోయింది. నల్గొండకు చెందిన ఓ దళారి అప్పుడే పుట్టిన ఆడపిల్ల ఉందని.. తల్లిదండ్రులు పెంచలేకపోతున్నారంటూ ఆ చిన్నారిని ఐదీళ్ల వారికి విక్రయించారు. ఇంటికి చిన్నారి వచ్చిందన్న సంబరం ఆ దంపతులకు రెండు రోజులు కూడా నిలవలేదు. అక్కడికి చేరుకున్న పోలీసులు, శిశు సంక్షేమ అధికారులు..చిన్నారిని సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఆ దంపతులపై కేసు నమోదు చేశారు. చట్టబద్ధమైన దత్తతకు సంబంధించిన సరైన అవగాహన లేకపోవడంతో చిక్కుల్లో పడ్డారు.

విధి వంచితులైన అభంశుభం తెలియని చిన్నారులకు మీరు ప్రేమను పంచొచ్చు. దత్తత ద్వారా వారిని మీ ప్రపంచంలోకి ఆహ్వానించి, అండగా నిలవొచ్చు. పలు కారణాలతో సంతానం పొందలేని తల్లిదండ్రులకూ ఇది వరమే. అయితే పిల్లలను చట్ట ప్రకారమే దత్తత తీసుకోవాల్సి ఉంటుంది. ఇది తెలియని కొందరు దళారుల వలలో చిక్కుకుంటున్నారు. చిన్నారుల అక్రమ విక్రయాలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నాయి.

- అసహాయ పరిస్థితుల్లో తల్లిదండ్రులు వదిలేసిన చిన్నారులు, ఆర్థికకారణాలతో పిల్లలను పెంచలేక ప్రభుత్వానికి అప్పగించిన పిల్లలను శిశు సంక్షేమశాఖ అధికారులు చేరదీస్తారు. వీరి ఆలనా, పాలన బాధ్యతలు నిర్వహిస్తారు. 'చట్టబద్ధంగా దత్తతకు అర్హులైన చిన్నారులు'గా ప్రభుత్వం గుర్తించి వారి వివరాలను అందుబాటులో ఉంచుతుంది.
- అధికారికంగా దత్తత ప్రక్రియ కోసం జాతీయ స్థాయిలో కేంద్రీయ దత్తత వనరుల ఏజెన్సీ (కారా) వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసింది. 0-18 ఏళ్ల పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు వివరాలను www.cara.nic.in లో దరఖాస్తు చేసుకోవాలి.
- దేశంలోని ఏవైనా రెండు రాష్ట్రాలను ఎంపిక చేసుకుని...వాటిలోని పిల్లలను దత్తత కోరుకోవచ్చు/ ఉంటుంది.
- కారా పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అనంతరం విచారణ, ఇతర చట్టబద్ధమైన ప్రక్రియలు పూర్తయిన తరువాత సీరియల్ నెంబరు జారీ అవుతుంది. పిల్లల అందుబాటు, వరుస క్రమంపై దత్తత సమయం ఆధారపడి ఉంటుంది.

అన్నీ పక్కాగా ఉంటేనే...

- వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత జిల్లా దత్తత ఏజెన్సీ అధికారులు ఆ కుటుంబం జీవన స్థితిగతులు, నేరచరిత్ర అధ్యయనం చేసే నివేదికను వెబ్‌సైట్‌లో నమోదుచేస్తారు.
- ఆ కుటుంబానికి అన్ని అర్హతలుంటే అప్పుడు కారా నుంచి బిడ్డను రిఫర్ చేస్తూ సమాచారం అందుతుంది. ఆ తర్వాత 48 గంటల్లోపు ఆ బిడ్డ నచ్చితే ఆ కుటుంబం రిజర్వు చేసుకోవచ్చు.
- అలా రిజర్వు చేసుకున్న 30 రోజుల్లోపు ఏజెన్సీ దగ్గరకు వెళ్లి ఆమోదం తెలిపి బిడ్డను తీసుకోవచ్చు. వారం రోజుల్లో ధ్రువపత్రాలన్నీ కలెక్టర్ కార్యాలయంలో సమర్పించి దత్తత ఉత్తర్వులు తీసుకోవాలి.

ఎవరు అర్హులు?

- పిల్లల్ని దత్తత తీసుకోవాలంటే దంపతులిద్దరి వయసు 85 ఏళ్లు, సింగిల్ పేరెంట్ అయితే 40 ఏళ్లకు మించకూడదు. భారత పౌరులు అయిఉండాలి.
- శారీరకంగా, మానసికంగా, భావోద్వేగపరంగా దృఢంగా ఉండాలి.
- సింగిల్ పేరెంట్‌గా ఉండే పురుషులు అనర్హులు.
- ఆర్థిక స్తోమత, ఆరోగ్యం బాగుండాలి.
- క్రిమినల్ కేసులు, బాలల హక్కుల ఉల్లంఘన కేసుల్లో ఆరోపణలు, శిక్షలు లేని వారు అర్హులు.
- వివాహితులైతే కనీసం రెండేళ్లపాటు స్థిరమైన దాంపత్య జీవితం కలిగి ఉండాలి.

వెంటనే ఎంపిక కావాలంటే..

సాధారణ దత్తత విధానంలో కారా అధికారులు చిన్నారికి సంబంధించిన సమాచారమిచ్చే వరకు దత్తత తీసుకునే వారు వేచి ఉండాలి. అలాకాకుండా వెనువెంటనే దత్తత తీసుకునే వీలు కూడా ఉంది. అయితే ఇక్కడ చిన్నపిల్లల్ని కాకుండా 10 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు వయసున్న పిల్లలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

ఫోస్టర్ కేర్..

అభాగ్య చిన్నారుల బాల్యం నాలుగు గోడల నడుమే ముగిసిపోరాదనే ఆలోచనతోనే ఫోస్టర్ కేర్ విధానాన్ని తీసుకొచ్చారు. 6-18 ఏళ్ల వయసున్న పిల్లలను దత్తత తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోతే ఈ విధానంలో పెంచుకునేందుకు ముందుకు వచ్చే వారికి అప్పగిస్తారు. నచ్చిన చిన్నారిని ఇక్కడ ఎంపిక చేసుకుని రెండేళ్లపాటు వారితో బంధాన్ని కొనసాగించి అంతా బాగుందనుకుంటే శాశ్వతంగా దత్తత తీసుకోవచ్చు.

హామా యాక్ట్....

హిందూ దత్తత నిర్వహణ చట్ట(హామా) ప్రకారం హిందువులను అదే మతానికి చెందిన వారు దత్తత తీసుకునే విధానం ఉంది. కారా వెబ్‌సైట్‌లోనే దరఖాస్తుకు ఆప్షన్ ఉంటుంది. జిల్లా చిన్నారుల సంరక్షణ విభాగం దీన్ని పర్యవేక్షిస్తుంది.

రిలేటివ్ అడాప్షన్....

పిల్లలు వద్దనుకున్న వారు... ఈ విధానంలో వారి బంధువుల్లో దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చే వారికి ఇవ్వొచ్చు. సొంతంగా ఎవరికి వారు పిల్లలను ఇచ్చేయడం వీలులేదు. దీనికి ఏజెన్సీల ఆమోదముద్ర ఉండాలి. కలెక్టర్ సమక్షంలోనే దత్తత స్వీకరణ ఉంటుంది.

ఇవి తప్పనిసరి....

పాన్‌కార్డు, ఆదాయ, వయసు, నివాస, వివాహ, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి.

ఆరు నెలలకొకసారి తనిఖీ...

చిన్నారిని దత్తతకు అప్పగించిన తర్వాత కూడా తనిఖీ ఉంటుంది. వారి ఆలనపాలన ఏవిధంగా సాగుతుందో ఆరు నెలలకొకసారి చొప్పున రెండేళ్లపాటు క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను ఎప్పటికప్పుడు కారా పోర్టల్‌లో నమోదు చేస్తారు.

- ఈనాడు, అమరావతి, హైదరాబాద్, ఒంగోలు, ఈనాడు డిజిటల్, హైదరాబాద్

సెల్ఫీ పాయింటుగా సహస్ర అరటి గెల



పశ్చిమబెంగాల్‌లోని నాదియా జిల్లా పులియా పరేషాంత్‌పుర్‌లోని ఓ ఇంటి ఆవరణలో కాసిన ఏడడుగులకు పైగా పొడవైన అరటి గెల ఇది. వందల కాయలు కాసిన గెల ఇలా కిందకు దిగడంతో ఇంటి యజమాని నిరంజన్ దానికోసం భూమిలో గుంత తవ్వాల్సి వచ్చింది. ఈ ఇల్లు ఆ చుట్టుపక్కల ప్రాంతాలవారికి ఇప్పుడు సెల్ఫీ పాయింటుగా మారిపోయింది. సాధారణంగా ఈ 'హజారీ కేలా' (వెయ్యికి పైగా కాయలు) రకం అరటికి బెంగాల్ నేల ఉపయుక్తం కానప్పటికీ. . నిరంజన్ తీసుకొన్న శ్రద్ధ, ఎరువులు పనిచేశాయని వృక్షశాస్త్ర అధ్యాపకుడు రాజ్‌కుమార్‌శర్మ తెలిపారు.

- ఈటీవీ భారత్



రోగనిరోధక శక్తికి క్యాప్సికం

నారింజ పండ్లలో కన్నా క్యాప్సికంలో 'సి' విటమిన్ అధిక మోతాదులో ఉంటుంది. రోగ నిరోధక వ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉండటానికి ఎక్కువ స్థాయిలో 'సి' విటమిన్ అవసరం. దీంతోపాటు ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తూ కణజాలాన్ని మరమ్మతు చేయడంలో దోహదపడుతుంది.

- డావ్‌నా ముఘల్, డైటీషియన్



టైర్లు కమ్మిన కళ్లు

చిత్రం.. భళారే విచిత్రం అంటారు కదా! అలాంటిదే ఇది. బస్సు టైర్లు బైనాక్యులర్ లెన్సులుగా భ్రమ కల్పిస్తూ వీక్షకుల దృష్టిని ఆకర్షిస్తోందీ చిత్రం. ఓ వ్యక్తి బైనాక్యులర్ లెన్స్‌లో నుంచి చూస్తున్నట్లుగా అనిపించేలా.. బస్సు టైర్ల పైభాగంలో అంటించిన ఈ రేడియం స్టిక్కర్ ఏపీ టూరిజం బస్సుకు ప్రత్యేక ఆకర్షణ తెచ్చింది. ఖమ్మం కొత్త బస్టాండు ఎదుట గురువారం ఈ బస్సు నిలిచి ఉండగా.. 'క్లిక్' అయిన దృశ్యం ఇది.

- ఈనాడు, ఖమ్మం

ఎక్స్‌రే లేకుండానే స్కానింగ్



ఏఐ స్టెత్‌తో గుండె లయను కంప్యూటర్‌పై చూస్తూ..

ఆర్-స్కాన్ మెడికార్డర్‌తో శరీరాన్ని తాకగానే ఇలా రిపోర్టు సిద్ధం

క్షయ, న్యుమోనియా వంటి సమస్యలను గుర్తించాలంటే ప్రస్తుతం ఎక్స్‌రే ఒక్కటే మార్గం. దీనివల్ల విడుదలయ్యే రేడియేషన్ ఒక్కోసారి ఇతర అవయవాలను దెబ్బతీసే ప్రమాదం ఉంది. బెంగళూరుకు చెందిన డాక్టర్ రాజేశ్ నేతృత్వంలోని బృందం తయారు చేసిన ఆర్-స్కాన్ మెడి కార్డర్ ఉపయోగిస్తే రేడియేషన్‌తో పని లేకుండా ఊపిరితిత్తుల చరిత్రను క్షణాల్లో చెప్పేస్తుంది. ఈ పరికరం రోగి శరీరంపై ఉంచితే.. అక్కడికక్కడే అవయవ చిత్రంతో పాటు దాని పనితీరును చెబుతుంది. సౌండ్ బేస్డ్ రికగ్నిషన్ సాంకేతికతతో తయారైన ఈ మెడికార్డర్‌కు అమెరికా, భారత్‌లో మేధోహక్కులు లభించినట్లు రాజేశ్ తెలిపారు. బెంగళూరులో నిర్వహిస్తున్న టెక్ సమ్మిట్‌లో ఈ మెడికార్డర్‌ను ప్రదర్శించారు. రేడియాలజిస్ట్ అవసరం లేకుండా వైద్యులే సమస్యను దీంతో గుర్తించవచ్చట. బెంగళూరుకు చెందిన ఏఐ హెల్త్ హైవే ఇండియా సంస్థ ప్రత్యేక ఏఐ స్టెతస్కోప్‌ను తయారు చేసింది. దీని ద్వారా గుండె, ఊపిరితిత్తుల లయను డిజిటల్ రూపంలో రికార్డ్ చేసే వీలుంది. ఈ డేటాను సులువుగా అడ్వాన్స్‌డ్ బ్లూటూత్ ద్వారా షేర్ చేసే వీలుందని ఈ సంస్థ జీఎం అశ్విన్ చంద్రశేఖరన్ తెలిపారు.

- ఈనాడు, బెంగళూరు

దేదీప్యం.. అనంతుని గిరి అందాలు

విశాఖపట్నం నగర పరిధి పద్మనాభంలోని అనంతుని గిరి విద్యుద్దీప కాంతులతో మెరిసిపోయింది. ఇక్కడ పూజలందుకుంటున్న శ్రీఅనంత పద్మనాభ స్వామివారి కొండ మెట్ల దీపోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి ఒక పక్క కొండ మెట్లపై ఉన్న తైల దీపపు వెలుగులు, మరోపక్క అనంతుని ఘాట్ రోడ్డులో విద్యుత్తు దీప కాంతులు వెలుగులీనాయి.

- న్యూస్‌టుడే, విశాఖపట్నం (పద్మనాభం)

75% గ్రౌండింగ్ అయినా ఏపీ పూర్తిగా మారిపోతుంది

భాగస్వామ్య సదస్సు ఒప్పందాలపై విజయసాయిరెడ్డి వ్యాఖ్య

ఈనాడు, అమరావతి: విశాఖ భాగస్వామ్య సదస్సులో చేసుకున్న రూ.13.25 లక్షల కోట్ల విలువైన 613 ఒప్పందాల్లో 75 శాతం అంటే రూ.10లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయినా ఏపీ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. తద్వారా భావితరం కోసం సిద్ధమైన ఏపీని చూడాలని కోరుకుంటున్నానని ఆయన 'ఎక్స్'లో పోస్టు చేయడం ఆసక్తికర చర్చకు దారితీసింది. ఆ పోస్టులో.. 'ఒప్పందాల అనుశీలన కోసం ప్రత్యేకాధికారిని నియమించి, అవి గ్రౌండింగ్ అయ్యేలా చూడాలి. ప్రాజెక్టుల గ్రౌండింగ్ వివరాలను రియల్‌టైంలో పారదర్శకంగా తెలిపేలా ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయాలి. అప్పుడు భాగస్వామ్య సదస్సుల్లాంటి ఈవెంట్లపై ఉన్న సందేహాలను తొలగించవచ్చు'అని వివరించారు.

'వివేకా హత్య కేసును త్వరగా తేల్చాలి'

ఈనాడు, హైదరాబాద్: మాజీ మంత్రి వివేకా హత్య కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండా అవినాశ్‌రెడ్డి, భాస్కరరెడ్డిని ఇరికించారని వారి తరఫు న్యాయవాది సీబీఐ కోర్టుకు తెలిపారు. దీంతో వారి పరువుకు నష్టం వాటిల్లుతోందని, ఈ కేసుపై సత్వరం విచారణ పూర్తి చేయాల్సిన అవసరం ఉందని నివేదించారు. వివేకా హత్య కేసులో వదిలివేసిన పలు అంశాలపై దర్యాప్తు కొనసాగించాలంటూ సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రధాన కోర్టు న్యాయమూర్తి టి.రఘురాం గురువారం విచారణ చేపట్టారు. నిందితులైన వై.ఎస్.అవినాశ్‌రెడ్డి, భాస్కరరెడ్డిల తరఫు న్యాయవాది ఇ.ఉమామహేశ్వరరావు వాదనలు వినిపించారు.

రసకందాయంలో కర్ణాటకం

- సిద్ధరామయ్య, డీకే పోటాపోటీ
- అధికార పంపిణీపై పట్టు

ఈనాడు, బెంగళూరు: కర్ణాటకలో అధికార కాంగ్రెస్‌లో రాజకీయం వేడెక్కింది. 2023 విధానసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్.. గద్దెనెక్కిన నాటి నుంచీ రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఉంటుందని ప్రచారంలో ఉంది. గురువారంతో సిద్దరామయ్య నేతృత్వంలోని సర్కారుకు రెండున్నరేళ్లు నిండాయి. ఈ నేపథ్యంలో అసలు రాజకీయం మొదలైంది. బిహార్ ఎన్నికల పరాభవం నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం కర్ణాటక రాజకీయాలపై ఇంకా దృష్టి సారించలేకపోయింది. ఈ నేపథ్యంలో సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మద్దతుదారులు ఒక్కొక్కరుగా దిల్లీకి వెళ్లి వస్తూ రాష్ట్ర రాజకీయాలను వేడెక్కిస్తున్నారు.

విస్తరణకు పట్టు

బిహార్ ఎన్నికల ఫలితాలు వెల్లడైన మర్నాడే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిల్లీ వెళ్లారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో వేర్వేరుగా సమావేశమైన ఆయన మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఇవ్వాలని కోరారు. మంత్రివర్గ విస్తరణకు అవకాశమిస్తే మరో ఏడాది పాటు ముఖ్యమంత్రి పదవికి ఢోకా ఉండదన్న అంచనాతో సిద్దరామయ్య ఈ ప్రతిపాదన చేశారు. దీనిపై ఖర్గేతో మాట్లాడాలని రాహుల్ ఆయనకు సూచించారు. ఖర్గే ఇంతవరకు మంత్రివర్గ విస్తరణపై ముఖ్యమంత్రికి సలహా ఇవ్వకపోవటం గమనార్హం. అధికార పంపిణీ అంశాన్ని మొదటి నుంచీ తోసిపుచ్చుతున్న సిద్ధరామయ్య ఐదేళ్లూ ముఖ్యమంత్రిగా తానే కొనసాగుతానని ధీమా వ్యక్తం చేస్తున్నారు.



సిద్ధరామయ్య- శివకుమార్.. ఈ నవ్వులు పైపైనేనా?

ప్రస్తుతం 136 మంది ఎమ్మెల్యేల్లో అత్యధికులు తనకు మద్దతుగా ఉన్నారని ఆయన విశ్వసిస్తున్నారు. అధికార పంపిణీ జరగాల్సి వస్తే ఎమ్మెల్యేల అభిప్రాయమే కీలకమని ప్రకటించి డీకే శిబిరంలో అలజడి రేపుతున్నారు. గురువారం ఈ విషయంపై మరింత స్పష్టత ఇస్తూ తాను అధిష్ఠానంతో అధికార పంపిణీ గురించి కాకుండా మంత్రివర్గ విస్తరణపై మాత్రమే చర్చించానని, దానినే తప్పుగా అర్థం చేసుకున్నారన్నారు.

పావులు కదుపుతున్న డీకే

సిద్ధరామయ్య తీరుపై అసహనంతో ఉన్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన మద్దతుదారులతో పావులు కదుపుతున్నారు. బిహార్ ఎన్నికల తర్వాత దిల్లీకి వెళ్లినా రాహుల్ గాంధీ చర్చకు అవకాశం ఇవ్వకపోవటంతో ఆయన మద్దతుదారుల్లో అలజడి మొదలైంది. పార్టీ కోసం ఎంతో శ్రమించిన డీకే.. ముఖ్యమంత్రి పదవికి అర్హుడని మంత్రుల్లో కొందరు ఇటీవల వ్యాఖ్యానించారు. డాక్టర్ రంగనాథ్, బాలకృష్ణ, ఇక్బాల్ హుస్సేన్, గుబ్బి శ్రీనివాస్ తదితర ఎమ్మెల్యేలు డీకేకు మద్దతుగా గురువారం దిల్లీకి వెళ్లారు. శుక్రవారం మరో పది మంది ఎమ్మెల్యేల బృందం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలవనుంది. పీసీసీ అధ్యక్షుడిగా ఇంకెన్నో రోజులు కొనసాగలేనని ప్రకటించిన డీకే శివకుమార్ భవిష్యత్తు వ్యూహాలపై సంకేతాలిచ్చారు. సీనియర్ మంత్రులు రామలింగారెడ్డి, చలువరాయస్వామి తదితరులతో గురువారం సమావేశమై చర్చించారు. మరోవైపు శివకుమార్ సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేశ్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారన్న విశ్వాసం ఉందని వ్యాఖ్యానించారు. దీంతో అధికార పంపిణీ ఒప్పందం జరిగిందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

అయోమయంలో అధిష్ఠానం

బిహార్ ఎన్నికల్లో ఓటమితో నిరాశలో ఉన్న కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికిప్పుడే కర్ణాటక రాజకీయాల్లో మార్పులకు సిద్ధంగా లేదని తెలుస్తోంది. దక్షిణాదిలో అత్యంత కీలకమైన కర్ణాటకలో నాయకత్వాన్ని మారిస్తే బలహీనవర్గాల నుంచి వ్యతిరేకత వచ్చి 2028 ఎన్నికల్లో ఆ ప్రభావం కనిపిస్తుందని అంచనా వేస్తోంది. సిద్ధరామయ్యను తప్పిస్తే ఆయనకు బలంగా ఉన్న శాసనసభ్యులు అసమ్మతి ప్రకటించే ప్రమాదం లేకపోలేదు. మరోవైపు తమకు ఇప్పటికిప్పుడే అధికారం వద్దు కానీ.. ఆ సమయం ఎప్పుడో స్పష్టత ఇవ్వాలని డీకే మద్దతుదారులు చేస్తున్న ఒత్తిడితో అధిష్ఠానం ఎటూ తేల్చుకోలేకపోతోంది.





శస్త్రచికిత్స అనంతరం షేక్‌వలీ

షేక్‌వలీ శరీరంలోకి చొచ్చుకెళ్లిన ఇనుప చువ్వ

గుండె, ఊపిరితిత్తుల పైనుంచి దూసుకెళ్లిన ఇనుప చువ్వ

మూడు గంటల శస్త్రచికిత్సతో తొలగించిన రుయా వైద్యులు

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ప్రమాదంలో రెండు మీటర్ల ఇనుపచువ్వ గుండె, ఊపిరితిత్తుల మీదుగా చొచ్చుకెళ్లిన ఓ వ్యక్తిని తిరుపతి రుయా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు మూడు గంటల పాటు శ్రమించి బతికించారు. ఆ వివరాలను రుయా సూపరింటెండెంట్ డా.కె.రాధ గురువారం మీడియాకు వెల్లడించారు. 'అనంతపురం జిల్లాకు చెందిన షేక్‌వలీ (44) శ్రీకాళహస్తిలో ఉంటున్నారు. ద్విచక్రవాహనంపై గ్రామాలకు వెళ్లి దుస్తులు విక్రయిస్తుంటారు. ఈ నెల 9న నగరి-పుత్తూరు మధ్య గ్రామాల్లో వెళ్తుండగా ముందూ వెనుక వస్తున్న బస్సులను తప్పించే క్రమంలో రోడ్డు దిగువకు పడ్డారు. అక్కడ పిల్లర్ దిమ్మెకు ఉన్న ఇనుప చువ్వపై పడటంతో అది శరీరంలోకి చొచ్చుకెళ్లింది. 108 సిబ్బంది చువ్వను కత్తిరించి అంబులెన్స్‌లో రుయా ఆసుపత్రికి తీసుకొచ్చారు. అతనికి బీపీ పడిపోతుండటంతో వైద్యులు వెంటనే శస్త్రచికిత్సకు ఉపక్రమించారు. గుండె, ఊపిరితిత్తులను ఆనుకొని చొచ్చుకెళ్లిన ఇనుప చువ్వను తీయడానికి శ్రమించారు. మొదట ఒక ఊపిరితిత్తిలోకి గాలి వెళ్లకుండా (కొలాప్స్) చేసి చువ్వను కొద్దిగా లాగారు. తర్వాత రెండో ఊపిరితిత్తినీ ఇదే విధంగా చేసి చువ్వను పూర్తిగా బయటకు తీశారు. కార్డియోథొరాసిక్ విభాగాధిపతి డా.కల్యాణిరామ, జనరల్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.గౌతమి, అనస్థీషియా విభాగాధిపతి డా.పద్మ, అసోసియేట్ ప్రొఫెసర్లు సూరిశెట్టి శ్రీనివాసులు, రవిశంకర్, జ్ఞాపికలు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. కోలుకున్న రోగిని గురువారం డిశ్చార్జ్ చేశారు.

అన్ని మతాలపైనా నమ్మకం ఉందిగానీ.. బౌద్ధాన్ని అనుసరిస్తున్నా

- సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్



ఈనాడు, దిల్లీ: బౌద్ధమతాన్ని తాను అనుసరిస్తున్నానని.. అయితే అన్ని మతాలపై తనకు విశ్వాసం ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. ఈనెల 23న పదవీవిరమణ చేయనున్న ఆయన.. సుప్రీంకోర్టు అడ్వకేట్ ఆన్ రికార్డ్స్ అసోసియేషన్ (స్కోరా) గురువారం ఇక్కడ ఏర్పాటుచేసిన వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడారు. "నేను పూర్తిగా లౌకికవ్యక్తిని. హిందు, బౌద్ధం, సిక్కు, ఇస్లాంలాంటి అన్ని మతాలపైనా నమ్మకం ఉంది. ఈరోజు నేను ఇక్కడనున్నానంటే ఈ వ్యవస్థ చలవే. అందుకే భారతీయ న్యాయవ్యవస్థకు హృదయపూర్వక కృతజ్ఞతలు చెబుతున్నా. మహారాష్ట్రలోని అమరావతిలో మురికివాడల్లోని మున్సిపల్ పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించిన నాలాంటి వ్యక్తి ఇంతటి ఉన్నతస్థానానికి రావడానికి ప్రధానకారణం అంబేడ్కర్, భారత రాజ్యాంగమని నేను నిరంతరం చెబుతూ వస్తున్నా. అంబేడ్కర్ రాజ్యాంగం రాయకపోయి ఉంటే మున్సిపల్ స్కూల్‌లో చదువుకున్న నాలాంటి విద్యార్థి ఇంతస్థాయికి రావడం గురించి కనీసం కలలో కూడా ఊహించలేం. నాలుగు దశాబ్దాల వృత్తిజీవితంలో భారతీయ న్యాయ వ్యవస్థ నాకు ఎంతో ఇచ్చింది. సుప్రీం కోర్టు సీజేఐ కేంద్రీకృత కోర్టులా కాకుండా న్యాయమూర్తులందరి కోర్టులా ఉండాలని నేను ఎప్పుడూ భావించేవాడిని. అందుకే నేను ఏ నిర్ణయాలు తీసుకున్నా న్యాయమూర్తులందరితో కలిసే తీసుకున్నా. సుప్రీంకోర్టు తీర్పు వెలువడినప్పుడు ప్రజలు కేవలం న్యాయమూర్తులను మాత్రమే చూస్తారు. అయితే దానివెనుక న్యాయమూర్తులే కాకుండా, న్యాయవాదులు, రిజిస్ట్రీ, సిబ్బంది భాగస్వామ్యం ఉంటుందన్నది గుర్తించాలి. నా 40 ఏళ్ల వృత్తిజీవితంలో నిరంతరం రూల్ ఆఫ్ లాను నిలబెడుతూ వచ్చాను. నా తీర్పుల్లో రాజ్యాంగ సూత్రాలకు ప్రాధాన్యం ఇచ్చాను. నేను పూర్తి సంతృప్తి, ఆనందంతో ఈ బాధ్యతలను తదుపరి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు అందిస్తున్నాను" అని సీజేఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తదుపరి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, అటార్నీ జనరల్ వెంకటరమణి, స్కోరా అధ్యక్షుడు విపిన్ నాయర్ తదితరులు పాల్గొని సీజేఐని సన్మానించారు.

నకిలీ ఈ-కామర్స్ మోసాలతో రూ.285 కోట్లు స్వాహా

- కడపలో నమోదైన కేసుల ఆధారంగా దర్యాప్తు

ఈనాడు, హైదరాబాద్: నకిలీ ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంల ద్వారా సైబర్ మోసాలకు పాల్పడిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు రూ.8.46 కోట్లను జప్తు చేశారు. 92 బ్యాంకు ఖాతాలతోపాటు కాయిన్‌డీసీఎక్స్, మరికొన్ని క్రిప్టో వ్యాలెట్లలో వీటిని గుర్తించారు. తొలుత కడప పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. దర్యాప్తులో తేలిన అంశాల మేరకు.. ఇలాంటి ఎఫ్ఐఆర్‌లు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోనూ నమోదయ్యాయి. పార్ట్‌టైం ఉద్యోగాల పేరిటే కాకుండా నకిలీ పెట్టుబడుల యాప్‌ల ద్వారా సైబర్ నేరస్థులు ఈ మోసాలకు పాల్పడ్డారు. తొలుత బల్క్‌గా ఎసెమ్మెస్‌లు పంపించిన మోసగాళ్లు.. తక్కువ సమయంలోనే పెద్దఎత్తున లాభాలు వస్తాయని ఆశ చూపారు. వారికి నకిలీ ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో ఖాతాలు సృష్టించారు. ఆన్‌లైన్ వ్యాలెట్లలో రివార్డు పాయింట్లు జమ అయినట్లు నమ్మబలికారు. అయితే ముందు వ్యాలెట్లలో తప్పనిసరిగా నగదు జమ చేయాలనే నిబంధన విధించారు. సాధారణంగా బ్యాంకు ఖాతాలకు లేదా డొల్ల కంపెనీలకు అనుసంధానమైన లేదా వాట్సప్ ఏజెంట్లు షేర్ చేసిన యూపీఐ ఐడీలకే ఈ డబ్బు చేరేలా ఏర్పాట్లు చేశారు. స్వల్ప లాభాలను ఇవ్వడం ద్వారా కస్టమర్ల నమ్మకాన్ని ముందు చూరగొన్నారు. పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాక వాటిని ఉపసంహరించుకునే సదుపాయాన్ని తొలగించారు. బాధితులు ఒకవేళ కస్టమర్‌కేర్‌ను సంప్రదిస్తే బ్లాక్ చేస్తూ వచ్చారు. అలా 30 బ్యాంకు ఖాతాల ద్వారా రూ.285 కోట్ల మేర కొల్లగొట్టారు. తొలుత 15రోజుల లావాదేవీలను మాత్రమే ఈ ఖాతాల ద్వారా నిర్వహించి.. అనంతరం మరో 80 ఖాతాలకు ఆ సొమ్మును మళ్లించారు. అనంతరం హవాలా లేదా క్రిప్టో కరెన్సీల్లోకి మార్చి కాజేశారు. కాయిన్‌డీసీఎక్స్ ద్వారా మోసగాళ్లు రూ.4.81కోట్ల విలువైన క్రిప్టో కరెన్సీని మార్చినట్లు ఈడీ గుర్తించింది.

ఆ సంస్థలకు విరాళాలు ఇవ్వొద్దు: తితిదే ఛైర్మన్

తిరుమల, న్యూస్‌టుడే: భక్తులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్న సంస్థలకు శ్రీవారి భక్తులు విరాళాలు ఇవ్వొద్దని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఓ ప్రకటనలో కోరారు. గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్, సేవ్ టెంపుల్స్.ఓఆర్‌జీ పేర్లతో కొందరు తిరుమల, తిరుపతి, తిరుచానూరు ప్రాంతాలను పుణ్యక్షేత్రాలుగా ప్రకటించేందుకు ఈ నెల 29న ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. మోసపూరిత చర్యలతో విరాళాలు సేకరించేందుకు భక్తులను తప్పుదారి పట్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విధమైన అనుమానాస్పద సంస్థలకు విరాళాలు ఇవ్వొద్దన్నారు.

అయ్యో పసిబిడ్డ..!

కాలువలో ముక్కలుగా శరీర భాగాలు

విశాఖపట్నం(మాధవధార), న్యూస్‌టుడే: నెలల పసికందును ముక్కలుగా నరికేసి కాలువలో పడేసిన దారుణం విశాఖలో గురువారం వెలుగులోకి వచ్చింది. తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలేనికి వెళ్లే సేవా రహదారిలోని సంజీవయ్య కాలనీని ఆనుకొని ఉన్న కాలువలో ఉదయం ఒక పసికందుకు సంబంధించి చేతులు, కాళ్ల శరీర భాగాలు కొట్టుకురావడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. కంచరపాలెం సీఐ రవికుమార్ పరిసరాల్లో పరిశీలించారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు అంచనాకు వచ్చారు. సీసీ కెమెరాలు, ఇతర ఆధారాలను సేకరిస్తున్నారు. కాలువలో కొట్టుకొచ్చిన చిన్నారి చేతులు, కాళ్లు, ఇతర శరీర భాగాలను కేజీహెచ్ వైద్యులు పరిశీలించారు. పదునైన కత్తితో ముక్కలు చేసినట్లు గుర్తించారు. పసికందు మొండెం ఎక్కడా దొరకలేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతల వివరాల కోసం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆరా తీస్తున్నారు. అప్పుడే పుట్టిన శిశువు అయితే శరీర భాగాలు లేతగా ఉండాలని, కానీ ఇక్కడ కనిపించిన అవయవాలు మూణ్నాలుగు నెలలు చిన్నారివిగా ఉన్నాయని వైద్యులు భావిస్తున్నారు. ఘటన సమీపంలో ఒక గోడకు 'ఐ మిస్ యూ బంగారం.. తర్వాత కలుద్దాం' అని రాసి ఉంది. దీనిపైనా దర్యాప్తు చేస్తున్నారు.

వెన్నువిరిగిన మావోయిస్టు కేంద్ర కమిటీ

- ఒకప్పుడు 42 మంది నేతలతో.. ఇప్పుడు మిగిలింది ఏడుగురు
- అందులో నలుగురు తెలంగాణ వారే
- ఈ ఏడాది 8 మంది ఎన్‌కౌంటర్, మరో ముగ్గురి లొంగుబాటు

ఈనాడు, అమరావతి: ఆపరేషన్ కగార్ దెబ్బతో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కుదేలైంది. 2004లో మావోయిస్టు పార్టీ ఆవిర్భావం తర్వాత 42 మంది నాయకులతో కొనసాగిన కమిటీ.. కొన్నేళ్లుగా భద్రతా బలగాల నిర్బంధం, దాడులతో గతేడాది చివరి నాటికి 18 మందికి పరిమితమైంది. ఈ ఏడాది దాడులు విస్తృతమవడంతో పార్టీ వెన్నువిరిగింది. జనవరి నుంచి ఇప్పటివరకు ఏకంగా 8 మంది కేంద్ర కమిటీ సభ్యులు ఎదురుకాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు లొంగిపోయారు. ఇంత తక్కువ వ్యవధిలో పెద్ద ఎత్తున కేంద్ర కమిటీ నాయకులను కోల్పోవడం పార్టీకిదే తొలిసారి. ప్రస్తుతానికి కేంద్ర కమిటీలో ఏడుగురే మిగిలారు.

కమిటీ భర్తీ ప్రశ్నార్థకం!

కొత్త నాయకుల్ని కమిటీలోకి తీసుకోవాలనుకున్నా.. ప్రస్తుతం పార్టీ సమావేశమవ్వడానికి వీల్లేని పరిస్థితులున్నాయి. మరోవైపు కేంద్ర కమిటీలో చోటు దక్కించుకునే అవకాశమున్న స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శులు, సభ్యులు అనేక మంది ఈ ఏడాది ఎన్‌కౌంటర్‌లలో హతమయ్యారు. పార్టీ పొలిట్‌బ్యూరో కూడా పూర్తిగా తగ్గిపోయింది. అత్యంత బలమైన నాయకత్వాన్ని కోల్పోవటం పార్టీకి కోలుకోలేని దెబ్బగా చెప్పొచ్చు. వీరు కాక డివిజనల్ కమిటీ కార్యదర్శులు, సభ్యులు, ఏరియా కమిటీ కార్యదర్శులు అనేక మంది మరణించారు. దీంతో కొత్త నాయకత్వం తయారవడం ప్రశ్నార్థకంగా మారింది.

ఈఏడాది ఎన్‌కౌంటరైన కేంద్ర కమిటీ సభ్యులు

1. **జనవరిలో:** రామచంద్రారెడ్డి ప్రతాప్‌రెడ్డి ఎలియాస్ చలపతి
2. **మే:** నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్ (కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి)
3. **జూన్:** తెంటు లక్ష్మీనర్సింహాచలం ఎలియాస్ సుధాకర్
4. **సెప్టెంబరు:** మోడెం బాలకృష్ణ ఎలియాస్ మనోజ్
5. గాజర్ల రవి ఎలియాస్ ఉదయ్
6. కట్టా రామచంద్రారెడ్డి
7. కడారి సత్యనారాయణరెడ్డి
8. **నవంబరు:** మాద్వి హిడ్మా

మిగిలింది ఏడుగురు...

కేంద్ర కమిటీలో ప్రస్తుతం మిగిలింది ఏడుగురే. వీరిలో.. 1. పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాల లక్ష్మణరావు ఎలియాస్ గణపతి, 2. ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ, 3. మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్, 4. పాకా హనుమంతు ఎలియాస్ ఊకే గణేశ్‌లు ముఖ్యులు. ఈ నలుగురూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారే. వీరు కాకుండా 5. ఝార్ఖండ్‌కు చెందిన మిసిర్ బెశ్రా ఎలియాస్ సాగర్, 6. పతిరామ్ మాంఝీ ఎలియాస్ అనల్‌దా, 7. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మజ్జి దేవ్ ఎలియాస్ రామ్‌ధేర్ మిగిలారు. ◆ గణపతికి ప్రస్తుతం 75 ఏళ్లపైనే ఉంటాయి. మల్లా రాజిరెడ్డి వయసూ 73 ఏళ్ల పైనే. పాకా హనుమంతుకు 65, తిప్పిరి తిరుపతికి 63 ఏళ్లు. ముఖ్య నాయకుల వయసు పైబడటం, కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకునే అవకాశం లేకపోవటం మావోయిస్టు పార్టీకి దెబ్బగా మారింది.

◆ ఒక్క ఏడాదిలో ఇంత మంది కేంద్ర కమిటీ సభ్యులు ఎన్‌కౌంటర్ కావటం ఇదే తొలిసారి.

◆ కేంద్ర కమిటీ సభ్యులు పుల్లూరి ప్రసాదరావు ఎలియాస్ చంద్రన్న, మల్లోజుల వేణుగోపాలరావు ఎలియాస్ సోను, పోతుల సుజాత ఎలియాస్ కల్పన ఈ ఏడాది లొంగిపోయారు.

మావోయిస్టు రహిత రాష్ట్రమే లక్ష్యం

- లొంగిపోకపోతే.. తూటాతోనే సమాధానం
- దేవ్‌జీ మా అదుపులో లేరు
- డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, రంపచోడవరం: 'మావోయిస్టు రహిత రాష్ట్రమే లక్ష్యంగా అన్ని విభాగాలకు చెందిన పోలీసు బలగాలు ఒకే గొడుగు కింద పనిచేస్తున్నాయి. ఈ ఏడాది జూన్‌లో మావోయిస్టులందర్నీ లొంగిపోవాలని పిలుపునిచ్చాం. లేకపోతే తూటాతోనే సమాధానం చెబుతాం' అని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా స్పష్టం చేశారు. రాష్ట్రంలో 'ఆపరేషన్ సంభవ్' ప్రారంభించినప్పటి నుంచి జరిగిన రెండు ఘటనల్లో 13 మంది మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో చనిపోయారన్నారు. ఈ ఆపరేషన్ కొనసాగుతుందని తెలిపారు. విశాఖపట్నం నుంచి హెలికాప్టర్‌లో గురువారం రంపచోడవరం వచ్చిన డీజీపీ.. మంగళ, బుధవారాల్లో ఎన్‌కౌంటర్లు జరిగిన ప్రాంతాలు, ఏవోబీలోని అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. రంపచోడవరంలో మీడియాతో మాట్లాడారు. 'మావోయిస్టుల ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన హిడ్మా, టెక్ శంకర్‌తోపాటు వారి అనుచరులూ ఎన్‌కౌంటర్‌లో మృత్యువాతపడ్డారు. ఇది పోలీసుల విజయం. ఈ ఘటనల్లో పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాం. పలు ప్రాంతాల్లో తలదాచుకున్న 50 మందిని అరెస్టు చేశాం. వారిలోనూ ముఖ్యులున్నారు. రాష్ట్రంలో మావోయిస్టులు ఇప్పుడు దాదాపుగా లేనట్లే" అని వివరించారు. మావోయిస్టు పార్టీ కీలక నేత దేవ్‌జీ పోలీసుల అదుపులో ఉన్నారా? అని విలేకర్లు ప్రశ్నించగా.. లేరని స్పష్టం చేశారు. ఆపరేషన్‌కు సంబంధించి మీరేం అడగవద్దు.. మేం చెప్పకూడదంటూ ముగించారు.



స్వాధీనం చేసుకున్న తుపాకులు, మందుగుండు సామగ్రిని రంపచోడవరంలో పరిశీలిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, అడిషనల్ డీజీ మహేష్‌చంద్ర లడ్హా

ఆ నలుగురిలో ఇద్దరు మైనర్లు

ఈనాడు, అమరావతి: కృష్ణా పోలీసులు అరెస్టు చేసిన మావోయిస్టుల్లో ఇద్దరు మైనర్లని తేలింది. బుధవారం 28 మంది మావోయిస్టులను విజయవాడలోని తాలూకా కోర్టులో హాజరుపర్చారు. వారిలో ఏ7, ఏ9, ఏ10, ఏ26ల వయసుపై న్యాయాధికారి సందేహం వ్యక్తం చేశారు. గురువారం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పరీక్షించి ఏ9, ఏ26 మైనర్లుగా, ఏ7, ఏ10 మేజర్లుగా నిర్ధారించారు. వీరిని గురువారం తాలూకా కోర్టులో ప్రవేశపెట్టగా.. మేజర్లకు వచ్చే నెల 2 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి లెనిన్ బాబు ఉత్తర్వులిచ్చారు. వీరిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు. మైనర్లను జువైనల్ కోర్టులో హాజరుపర్చాలని న్యాయాధికారి ఆదేశించారు.

కేబుల్ పనివారమంటూ..

గత నెల 26 నుంచి ఏలూరులో మావోయిస్టుల మకాం



ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరులో ఇటీవల పోలీసులకు పట్టుబడిన మావోయిస్టులు.. జియో కేబుల్ పనులు చేసేందుకు వచ్చామని చెప్పి ఇల్లు అద్దెకు తీసుకున్నారు. నెలకు రూ.10 వేల అద్దె మాట్లాడుకున్నట్లు తెలిసింది. గత నెల 26న ఇంట్లో దిగారు. నెలాఖరు వరకు ఆ వారం రోజుల అద్దె చెల్లించారు. ఈ నెల అద్దె చెల్లించాలి. ఇంటి యజమాని నగరంలో ఓ కార్పొరేట్ కళాశాలలో సీఈవోగా పనిచేస్తున్నారని తెలిసింది. ఏలూరు గ్రీన్‌సిటీలో పట్టుబడిన 15 మంది ఇలా అక్కడ పాగావేశారు. ఇంట్లోనే ఉండే ఇద్దరు వ్యక్తులు బయటకు వెళ్లి అల్పాహారం, భోజనాలు తెచ్చేవారని.. బయట పెద్దగా తిరిగేవారు కాదని స్థానికులు చెబుతున్నారు. మావోయిస్టులు గ్రీన్ సిటీకి వచ్చి ఇల్లు అద్దెకు తీసుకోవడానికి ఎవరు మధ్యవర్తిత్వం వహించారనే వివరాలు రాబట్టే పనిలో ఉన్నారు. ఇంటి యజమానిని విచారిస్తున్నట్లు తెలిసింది.

పువర్తిలో హిడ్మా అంత్యక్రియలు పూర్తి



రంపచోడవరం ఆసుపత్రి వద్ద తరలించేందుకు సిద్ధం చేసిన హిడ్మా, రాజే మృతదేహాలు



హిడ్మా, రాజేలకు కడసారి వీడ్కోలు పలుకుతున్న ఆదివాసీలు, అభిమానులు

చర్ల, న్యూస్‌టుడే: దండకారణ్యంలో మావోయిస్టు పార్టీని దశాబ్దాలుగా నడిపించిన కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా శకం ముగిసింది. ఏపీలోని రంపచోడవరం నుంచి గురువారం ఉదయం హిడ్మా, ఆయన భార్య మడకం రాజే మృతదేహాలను స్వగ్రామం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పువర్తికి తీసుకువచ్చారు. అప్పటికే చుట్టుపక్కల గ్రామాల నుంచి ఆదివాసీలు తరలివచ్చారు. కుమారుడి మృతదేహాన్ని చూడగానే తల్లి పుంజి విలపించారు. సామాజిక కార్యకర్త సోనీసోరీ హిడ్మా, రాజే మృతదేహాలపై నూతన వస్త్రాలను ఉంచి నివాళులు అర్పించారు. హిడ్మా సరెండర్‌కు వెళ్లినప్పుడే ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపించారు. ఆదివాసీలు, అభిమానులు హిడ్మాకు కడసారి వీడ్కోలు పలుకుతుండగా.. ఒకే చితిపై భార్యాభర్తల పార్థివదేహాలను పెట్టి తమ ఆచార వ్యవహారాలతో ఆదివాసీ పెద్దలు దహన సంస్కారాలు నిర్వహించారు. గత 35 ఏళ్లలో హిడ్మా జరిపిన వేర్వేరు దాడుల్లో 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఎక్కువ మంది భద్రతా దళాల సిబ్బందే.

దారి పొడవునా బందోబస్తుతో.. మృతదేహాల తరలింపు

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, రంపచోడవరం: మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు కీలక నాయకుడు మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే మృతదేహాలను బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు రంపచోడవరం ఆసుపత్రి నుంచి స్వగ్రామానికి తరలించారు. బుధవారం రాత్రి పోస్టుమార్టం ముగిశాక ఒక అంబులెన్సులో మృతదేహాలు పంపి.. మరో రెండు వాహనాల్లో ప్రత్యేక బలగాలు వెంట వెళ్లాయి. దారి మధ్యలో ఇబ్బందులు తలెత్తకుండా ఛత్తీస్‌గఢ్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘాట్ రోడ్డు నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా హిడ్మా స్వగ్రామం పువర్తి వరకూ బలగాలు వేర్వేరు ప్రాంతాల్లో గస్తీ నిర్వహించాయి.

దేవ్‌జీ, రాజిరెడ్డి పోలీసుల అదుపులో లేరు

- హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది

ఈనాడు, అమరావతి: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సీనియర్ సభ్యులు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డిలు పోలీసుల అదుపులో లేరని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) విష్ణుతేజ గురువారం హైకోర్టుకు నివేదించారు. అరెస్టు చేసిన మొత్తం 50 మంది మావోయిస్టులను సంబంధిత మేజిస్ట్రేట్ల ముందు హాజరు పరిచామన్నారు. వారిద్దరూ పోలీసుల అదుపులో ఉన్నారనేది పిటిషనర్ల ఆందోళన మాత్రమేనని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. వారు పోలీసుల అదుపులో ఉన్నారనేందుకు ఆధారాలను కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది జై భీమారావును ఆదేశించింది. ఇలాంటి విషయాల్లో కోర్టులు జోక్యం చేసుకోవాలంటే ప్రాథమిక ఆధారాలు ఉండాలని పేర్కొంది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ తుహిన్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఈ ఉత్తర్వులిచ్చింది. దేవ్‌జీ, రాజిరెడ్డిలను హైకోర్టులో హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రం కోరుట్ల పట్టణానికి చెందిన తిప్పిరి గంగాధర్, హైదరాబాద్‌కు చెందిన మల్లా స్నేహలత హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. ◆ పిటిషనర్ల తరఫు న్యాయవాది జై భీమారావు వాదనలు వినిపిస్తూ.. 'ఈ నెల 18న మావోయిస్టులు, పోలీసుల మధ్య కాల్పులు జరిగాయి. దేవ్‌జీ, రాజిరెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని కోర్టు ముందు హాజరుపరిచేలా ఆదేశించండి. పోలీసు ఉన్నతాధికారులు మీడియాతో మాట్లాడుతూ 9మంది కీలక నేతలను అదుపులోకి తీసుకున్నామని ప్రకటన చేశారు. ఆ వీడియోను కోర్టు ముందు ఉంచుతాం' అని తెలిపారు. దీంతో విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

పోస్టుమార్టంలో తీవ్ర జాప్యం

- మార్చురీలో ఇంకా 9 మంది మావోయిస్టుల మృతదేహాలు
- సమాచారం లేక బంధువుల పడిగాపులు

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, రంపచోడవరం, మారేడుమిల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పుల్లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలకు రంపచోడవరం ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. బుధవారం సాయంత్రానికి 13 మృతదేహాలు మార్చురీకి తరలించగా గురువారానికి నాలుగింటికి మాత్రమే పోస్టుమార్టం పూర్తయింది. టెక్ శంకర్‌ది రాత్రి 8.30 గంటలకు, ఆ తర్వాత దేవే మృతదేహానికి పోస్టుమార్టం ప్రక్రియ ప్రారంభించారు. చివరికి రాత్రి 11.45గంటలకు మృతదేహాలను బంధువులకు అప్పగించారు. హిడ్మా దంపతుల మృతదేహాలకు బుధవారం రాత్రి పోస్టుమార్టం చేశారు. పోస్టుమార్టం ఎప్పుడు పూర్తవుతుందో, ఎప్పుడు మృతదేహాలను అప్పగిస్తారో తెలియక బంధువులు ఆందోళన చెందుతున్నారు. సరైన సమాచారం లేక వారంతా ఆసుపత్రి వద్ద చలిలో పడిగాపులు పడుతున్నారు. కనీసం ప్రక్రియ ఎంత వరకొచ్చిందో తెలియడం లేదు.

ఎప్పుడు చేస్తారో చెప్పడం లేదు


సుక్మా జిల్లా బురిలంక నుంచి ఇద్దరు బంధువులతో గురువారం ఉదయం ఆసుపత్రికి వచ్చా. సాయంత్రం 6 గంటలకు డీఎన్ఏ పరీక్షకని నమూనాలు తీసుకున్నారు. మృతురాలి సోదరి ఉంటే బాగుంటుందన్నారు. ఆమెకు చిన్న పాప ఉందని, రాలేదని చెప్పాం. తల్లి వృద్ధురాలు. 190 కి.మీ. దూరం నుంచి వచ్చాం. పోస్టుమార్టం చేసి మృతదేహం ఇస్తే తీసుకెళ్తాం. లేదంటే వెళ్లిపోతామన్నాం. అధికారులు 'చూస్తాం' అన్నారే గానీ.. ఎప్పటికి పోస్టుమార్టం ప్రారంభిస్తారో చెప్పడం లేదు.

– ఎస్.రమేష్, మావోయిస్టు జ్యోతి సోదరుడు



ఆసుపత్రి వద్ద టెక్ శంకర్, జ్యోతి బంధువులు

అమ్మ చనిపోయినప్పుడు వస్తాడనుకున్నాం



శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరులో ఇటీవల మా అమ్మ చనిపోయినప్పుడు అన్నయ్య వస్తాడని అనుకున్నాం. కానీ, రాలేదు. 35 ఏళ్ల కిందట మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లారు. అప్పటి నుంచి అన్న గురించి కనీస సమాచారం లేదు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడం చాలా బాధాకరం.

– మధుసూదనరావు, టెక్ శంకర్ సోదరుడు, శ్రీకాకుళం

అనుమానాలున్నాయి



మారేడుమిల్లి ప్రాంతంలో ఎప్పుడూ ఇటువంటి ఎన్‌కౌంటర్లు జరిగిన దాఖలాల్లేవని అధికారులే చెబుతున్నారు. ప్రస్తుత రెండు ఎన్‌కౌంటర్లల్లో మావోయిస్టుల మృతిపై పలు సందేహాలున్నాయి. వారిని పట్టుకొచ్చి కాల్చి చంపినట్లు అనుమానాలున్నాయి. పూర్తి స్థాయిలో విచారణ చేయాలి.

– అంజమ్మ, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు

సహకరించండి..

బీజాపూర్ జిల్లా యర్రపల్లి నుంచి ఆరుగురం గురువారం ఉదయం రంపచోడవరం ఆసుపత్రికి వచ్చాం. రక్త నమూనాలు తీసుకొని, శుక్రవారం పోస్టుమార్టం చేస్తామని చెబుతున్నారు. మృతదేహం అప్పగిస్తే తీసుకెళ్తాం. ఆ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి సహకరించండి.

– మావోయిస్టు మల్లా సోదరుడు

EENADU Vol: 52, Issue: 101 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి దగ్గరైనట్లేనా!?



- ఇరుపక్షాల నుంచి సానుకూల సంకేతాలు
- మొదటి దశ కోసం ఆసక్తిగా చూస్తున్న పరిశ్రమ వర్గాలు

'భారత్-అమెరికా మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరబోతోంద'ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వంలోని కీలక అధికారి, యూఎస్ నేషనల్ ఎకనమిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హస్సెట్ పేర్కొన్నారు. భారత వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్ సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. 'భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై త్వరలో శుభవార్త వింటారు' అని ఇండో-అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశంలో మంత్రి పేర్కొన్నారు. మనదేశ ఉత్పత్తులపై 25% అదనపు సుంకం విధించేందుకు అమెరికా కారణంగా చూపిన 'రష్యా ముడిచమురు దిగుమతులు' తగ్గుతున్నాయి. మనదేశంలో రష్యా చమురును అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న రిలయన్స్ ఇండస్ట్రీస్.. డిసెంబరు 1 నుంచి రష్యా యేతర ముడిచమురు నుంచి తయారు చేసిన ఉత్పత్తులనే ఎగుమతిచేస్తామని ప్రకటించింది. ఇవన్నీ గమనిస్తే, అమెరికా-భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) తొలి దశపై త్వరలోనే అధికారిక ప్రకటన వస్తుందని, ఆ తర్వాత తుది ఒప్పందం ఖరారవుతుందని తెలుస్తోంది. ఈ ఒప్పందం ఎంత త్వరగా కుదిరితే, మనదేశానికి నష్టం అంత తగ్గనుంది.

అమెరికా సుంకాల వల్ల మనదేశంలో బాగా నష్టపోతున్న రంగాలు
- రెడీమేడ్ దుస్తులు, టెక్స్‌టైల్స్
- వజ్రాలు, రత్నాభరణాలు
- చేపలు, రొయ్యలు
- తోలు వస్తువులు
- ఇంజినీరింగ్ ఉత్పత్తులు
- వాహన విడిభాగాలు
- కార్పెట్లు, పాదరక్షలు

ఇప్పటి వరకు ఏం జరిగింది?

- మనదేశ ఉత్పత్తులపై 25% ప్రాథమిక పన్ను, రష్యా ముడి చమురు కొనుగోలు చేస్తున్నందుకు మరో 25% పన్ను (మొత్తం 50%)ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించారు. చైనా, ఐరోపా దేశాలు కొంటున్నప్పుడు.. రష్యా నుంచి మనం మాత్రం ఎందుకు చమురు దిగుమతి చేసుకోకూడదు అనే విధానాన్ని మోదీ ప్రభుత్వం అనుసరించింది. ఫలితంగా అమెరికాతో దౌత్య సంబంధాలు కొంత దెబ్బతినడంతో.. ప్రత్యామ్నాయంగా రష్యా, చైనా వైపు మన దేశం మొగ్గు చూపాల్సి వచ్చింది.
- ఈ పరిస్థితి తమ వ్యూహాత్మక అవసరాలకు నష్టం చేస్తుందనే అభిప్రాయం అమెరికాలో ఉంది. వాణిజ్య పరంగా, వ్యూహాత్మకంగా పరస్పరం లబ్ధి పొందేరీతిలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలనే ఆకాంక్ష రెండు దేశాల్లోనూ వ్యక్తమైన నేపథ్యంలోనే.. వాణిజ్య ఒప్పందంపై కదలిక మొదలైంది.
- ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) మొదటి దశను ఖరారు చేయడానికి 5 దఫాలుగా రెండు దేశాల అధికారులు సంప్రదింపులు సాగించారు. గత వారంలో మన వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ అమెరికా వెళ్లి, అక్కడి ప్రతినిధులను కలిశారు.

- ఈనాడు, హైదరాబాద్

200 ఉత్పత్తులపై పన్ను మినహాయింపు

దాదాపు 200 రకాల ఆహార వస్తువులపై పన్నులు తొలగిస్తూ ఈనెల 12న అమెరికా అధ్యక్షుడు 'ఎగ్జిక్యూటివ్ ఆర్డర్' జారీ చేయడం కాస్త ఉపశమనం కలిగించింది. పన్ను మినహాయించిన వాటిల్లో కాఫీ, టీ, పండ్లు, కోకోవా, సుగంధ ద్రవ్యాలు, అరటిపండ్లు, బత్తాయిలు, టమోటా, మాంసం వంటివి ఉన్నాయి. దిగుమతి సుంకాలు పెంచడం వల్ల, అమెరికాలోనే ధరలు పెరిగి, ద్రవ్యోల్బణం శ్రుతి మించడం వల్లే ట్రంప్ ఈ చర్య తీసుకున్నారు. ఇందువల్ల మనదేశ ఎగుమతుల్లో 2.5-3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.22,000-26,400 కోట్ల) విలువైన ఉత్పత్తులకు ఉపశమనం కలుగుతుందని కేంద్ర ప్రభుత్వ వాణిజ్య శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

అతిపెద్ద వాణిజ్య భాగస్వామి

మనదేశానికి అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. మన వస్తువుల ఎగుమతుల్లో 18% అమెరికాకే చేరుతున్నాయి. మన దిగుమతుల్లో అమెరికా వాటా 6% పైనే ఉంది. 2030కి ఇరుదేశాల మధ్య 500 బి.డాలర్ల (రూ.44 లక్షల కోట్ల) వాణిజ్యాన్ని నమోదు చేయాలనేది ఇరుదేశాల ఆకాంక్ష. సుంకాల విధింపుతో దీనికి తాత్కాలిక అవాంతరాలు ఎదురయ్యాయి. వాణిజ్య ఒప్పందం కుదిరితే మళ్లీ రెండు దేశాల మధ్య వాణిజ్యం విస్తరిస్తుందని పరిశ్రమ వర్గాలు ఆశాభావంతో ఉన్నాయి.



తొలి దశ ఒప్పందం

మనదేశ ఉత్పత్తులపై విధించిన 50% సుంకాలు తొలగించాలి.
- బదులుగా అమెరికా వస్తువులను మన దేశం ఆంక్షలు లేకుండా అనుమతించాలి.

రెండో దశ ఒప్పందం

- రెండు దేశాలకు మేలు జరిగేలా దీర్ఘకాలిక వ్యాపార ఒప్పందం ఖరారు చేసుకోవాలి.

ఈనాడు బిజినెస్

జాతీయ రహదారుల నగదీకరణకు రాజ్‌మార్గ్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్

దిల్లీ: జాతీయ రహదారుల ఆస్తుల నగదీకరణ కోసం పబ్లిక్ ఇన్విట్‌గా రాజ్‌మార్గ్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఆర్ఐఐటీ)ను ఏర్పాటు చేసే ప్రక్రియలో ఉన్నట్లు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) గురువారం ప్రకటించింది. నిర్వహణలో ఉన్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో రిటెయిల్ మదుపర్లు నేరుగా పెట్టుబడులు పెట్టి, ఆదాయాన్ని ఆర్జించే సాధనంగా పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్) ఉంది. ఎన్ఎస్ఈ, బీఎస్ఈ వంటి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో పబ్లిక్ ఇన్విట్‌ల యూనిట్లు నమోదై, ట్రేడవుతున్నాయి. ప్రతిపాదిత ఇన్విట్ కోసం ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్‌గా రాజ్‌మార్గ్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్ఐఐఎంపీఎల్)ను ఎన్‌హెచ్ఏఐ ఏర్పాటు చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, నాబ్‌ఫిడ్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ వెంచర్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఇండస్ఇండ్‌బ్యాంక్, యెస్ బ్యాంక్ సహా అగ్రగామి బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి ఈక్విటీ భాగస్వామ్యంతో ఆర్ఐఐఎంపీఎల్‌ను ఏర్పాటు చేశారు. 'ఆస్తుల నగదీకరణలో ఎన్‌హెచ్ఏఐకు మంచి రికార్డు ఉంది. ఇటీవలి సంవత్సరాల్లో టోల్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) మోడల్ ద్వారా రూ.48,995 కోట్ల ఆస్తులను విజయవంతంగా విక్రయించాం. ప్రైవేట్ ఇన్విట్‌ల్లో నాలుగు దఫాల్లో రూ.43,638 కోట్లు సమీకరించాం' అని ఎన్‌హెచ్ఏఐ ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. రిటెయిల్, పబ్లిక్ మదుపర్లకు ఆర్ఐఐఎంపీఎల్ మొదటి విడత ఇన్విట్‌ల జారీ 2026 ఫిబ్రవరిలో ఉండే అవకాశం ఉంది.

రూ.150-200 టికెట్ ధరలతో చిన్న పట్టణాల్లోకి పీవీఆర్ ఐనాక్స్



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 100 తెరలను పెంచుకుంటున్నామని మల్టీప్లెక్స్ నిర్వాహక సంస్థ పీవీఆర్ ఐనాక్స్ తెలిపింది. ఇందులో 60 తెరలను ఇప్పటికే ప్రారంభించామని, మార్చిలోపు మిగిలిన 40 తెరలను అందుబాటులోకి తెస్తామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ కుమార్ బిజ్లి వెల్లడించారు. రూ.150-200 టికెట్ ధరలతో చిన్న పట్టణాల్లోకి అడుగుపెట్టే యోచనలో ఉన్నామని తెలిపారు. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల పైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో లాభదాయకంగా లేని 55-69 తెరలను మూసివేయగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 10-15 తెరలు మూసివేసే జాబితాలో ఉన్నాయని సంజీవ్ కుమార్ తెలిపారు.

హైదరాబాద్‌లో ఈబీజీ పవర్‌హౌస్

ఈనాడు, హైదరాబాద్: సాంకేతికత, స్థిరాస్తి, లైఫ్‌స్టైల్, మొబిలిటీ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈబీజీ గ్రూపు హైదరాబాద్‌లో తన కార్యాలయం ఈబీజీ పవర్‌హౌస్‌ను ప్రారంభించింది. మొత్తం 400 సీట్ల సామర్థ్యంతో, 22,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 50 మంది ఉద్యోగులున్నారని, రెండేళ్లలో రూ.58 కోట్ల పెట్టుబడి పెట్టడంతో పాటు, మరో 350 మందికి ఉద్యోగాలు కల్పిస్తామని సంస్థ ఛైర్మన్ ఇర్ఫాన్ ఖాన్ వెల్లడించారు. ఏడాది కాలంలో ప్రపంచ వ్యాప్తంగా తమ ఉద్యోగుల సంఖ్య 3,000కు చేరుతుందని పేర్కొన్నారు.

కోడి గుడ్లు

21న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	635
వరంగల్	637
విజయవాడ	660
తూ/ప గోదావరి	645
విశాఖపట్నం	635
చిత్తూరు	673

డేటా సెంటర్లలోకి రూ.18,000 కోట్లు

టీసీఎస్, టీపీజీ ఒప్పందం



ఐటీ సేవల రంగంలో దేశీయ అతిపెద్ద సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ప్రైవేటు ఈక్విటీ దిగ్గజ సంస్థ టీపీజీ కలిసి డేటా కేంద్రాలపై రూ.18,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. హైపర్‌వాల్ట్ పేరిట నెలకొల్పే ఏఐ (కృత్రిమమేధ) డేటా కేంద్రాల వ్యాపారంలో టీపీజీ 1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8,870 కోట్ల) పెట్టుబడి పెడుతుంది. ఫలితంగా ఈ వ్యాపారంలో సంస్థకు 27.5-49% వాటా లభిస్తుంది. డేటా కేంద్రాల వ్యాపారంలో టీపీజీని వ్యూహాత్మక భాగస్వామిగా చేర్చుకోవడం వల్ల తమకు పెట్టుబడి భారం తగ్గుతుందని, వాటాదార్లకు మరింత పటిష్ఠంగా ప్రతిఫలాలు అందించేందుకు, డేటాకేంద్రాల ప్లాట్‌ఫామ్‌కు దీర్ఘకాల విలువ కలిగించేందుకు వీలవుతుందని టీసీఎస్ వెల్లడించింది. 1 గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా కేంద్రాలను 6.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.57,000 కోట్ల)తో నిర్మిస్తామని గత నెలలో టీసీఎస్ ప్రణాళికను ప్రకటించిన సంగతి విదితమే. 'గిగావాట్ ఏఐ డేటా కేంద్రాల్లో టీపీజీ భాగస్వామ్యం వల్ల, ఏఐ కంపెనీలతో మరింత బంధం ఏర్పడుతుంద'ని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ పేర్కొన్నారు. టీసీఎస్ ఖాతాదార్లకు పూర్తిస్థాయి ఏఐ సొల్యూషన్లు అందించేందుకు ఇది ఉపకరిస్తుందన్నారు. 'హరిత ఇంధనం, మౌలిక వసతులు, టెక్నాలజీ, స్థిరాస్తి భాగస్వామ్యంతో డేటా కేంద్రాలు ఏర్పాటవుతాయ'ని టీపీజీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జిమ్ కోల్టర్ వివరించారు.

✦ హైపర్‌స్కేలర్లు, ఏఐ కంపెనీలు, ప్రైవేటు-ప్రభుత్వ సంస్థలకు కంప్యూటర్ హార్డ్‌వేర్ నిర్వహణ, హైస్పీడ్ స్టోరేజీ, తక్కువ జాప్యం ఉన్న నెట్‌వర్క్‌ల అమలుకు ఏఐ డేటా కేంద్రాలు ఉపకరిస్తాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి బీఈ టీకాకు ప్రీ-క్వాలిఫికేషన్



ఈనాడు, హైదరాబాద్: బయొలాజికల్ ఇ. లిమిటెడ్ (బీఈ) అభివృద్ధి చేసిన 14-వలెంట్ న్యూమోకోక్కల్ కంజుగేట్ వ్యాక్సిన్ (పీసీవీ), న్యూబెవాక్స్ 14 (బీఈ-పీసీవీ-14)కు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నుంచి ప్రీ-క్వాలిఫికేషన్ అర్హత లభించింది. డబ్ల్యూహెచ్ఓ నుంచి ప్రీ-క్వాలిఫికేషన్ అర్హత సాధించిన బీఈ కి చెందిన 11వ టీకా ఇది. ఈ టీకాతో 22ఎఫ్, 33ఎఫ్ తో సహా 14 రకాల స్ట్రెప్టోకోక్కస్ న్యూమోనియా సెరోటైప్స్‌తో వచ్చే న్యూమోకోక్కల్ వ్యాధుల నుంచి పిల్లలకు రక్షణ లభిస్తుందని బీఈ వివరించింది. ఇదే తరగతికి చెందిన కొన్ని ఇతర టీకాల్లో 22ఎఫ్, 33ఎఫ్ నుంచి రక్షణ లభించదని సంస్థ తెలిపింది. పుట్టిన పిల్లలకు 6 వారాల వయస్సులో ఈ టీకా ఇస్తారు. న్యూమోనియా, మెనిన్జైటిస్, సెప్సిస్ వ్యాధుల నుంచి ఈ టీకా కాపాడుతుంది. క్లినికల్ పరీక్షల్లో తమ టీకా మంచి ఫలితాలు సాధించినట్లు బీఈ పేర్కొంది. అన్ని 14 సెరోటైప్స్‌లో ప్రాథమిక లక్ష్యమైన ఇమ్యూనోజెనిసిటీ కనిపించిందని వివరించింది. డబ్ల్యూహెచ్ఓ ప్రీ-క్వాలిఫికేషన్ వల్ల ఈ టీకాను ప్రపంచ వ్యాప్తంగా చిన్న పిల్లలకు అందించగలుగుతామని బయొలాజికల్ ఇ.లిమిటెడ్ ఎండీ మహిమా దాట్ల పేర్కొన్నారు.

వచ్చే ఏడాదిలో హోండా విద్యుత్ కారు



ఎలివేట్ ఏడీవీ ఎడిషన్‌తో కునాల్ బేహి

ఈనాడు, హైదరాబాద్: హోండా నుంచి విద్యుత్ కారును వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో మన విపణిలోకి తీసుకొచ్చే అవకాశాలున్నాయని హోండా కార్స్ ఇండియా మార్కెటింగ్, సేల్స్ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బేహి వెల్లడించారు. 2030కి కొత్తగా 10 మోడళ్లు తీసుకొస్తామని, ఇందులో 7 ఎస్‌యూవీలు ఉంటాయని తెలిపారు. ఎలివేట్ ఏడీవీ ఎడిషన్‌ను గురువారం హైదరాబాద్‌లో విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ వాహనాలను ఎక్కువగా ఇష్టపడుతున్న యువత, ఐటీ ఉద్యోగుల ఆలోచనలకు అనుగుణంగా ఈ ఎస్‌యూవీని తీసుకొచ్చినట్లు వివరించారు. తెలుగు రాష్ట్రాల ఎస్‌యూవీ అమ్మకాల్లో 7 శాతానికి పైగా వాటా సాధించినట్లు తెలిపారు. 1.5 లీటర్ ఐ-వీటెక్ పెట్రోల్ ఇంజిన్‌తో 6 గేర్ల మాన్యువల్, 7 స్పీడ్ సీవీటీ ఆటోమేటిక్‌తో ఇది అందుబాటులో ఉందన్నారు. ఎక్స్‌షోరూం ధర రూ.15.29-16.66 లక్షలని తెలిపారు. మూడేళ్లపాటు అపరిమిత కిలోమీటర్లకు వారంటీ ఇస్తున్నట్లు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లో అవసరం మేరకు డీలర్‌షిప్‌లను పెంచుతామని చెప్పారు.

2 రోజుల్లో 9% తగ్గిన ఫిజిక్స్‌వాలా షేరు

స్టాక్ మార్కెట్‌లో నమోదైన రోజు (ఈనెల 18) దుమ్మురేపిన ఫిజిక్స్‌వాలా షేరు, తదుపరి నష్టపోతోంది. ఇష్యూ ధర రూ.109తో పోలిస్తే 33% ప్రీమియంతో, బీఎస్ఈలో రూ.143.10 వద్ద ఈ షేరు నమోదైంది. అదే రోజు 44 శాతానికి పైగా పెరిగి రూ.156.49 వద్ద ముగిసింది. రెండో రోజు నుంచి షేరు నష్టపోతోంది. బుధవారం 7.5% నష్టంతో రూ.143.55 వద్ద ముగిసింది. విక్రయాల ఒత్తిడి గురువారం కూడా కొనసాగడంతో ఒక దశలో షేరు రూ.121.15 వరకు పతనమైంది. చివరకు కోలుకుని, 1.81% స్వల్ప నష్టంతో రూ.140.95 వద్ద స్థిరపడింది. కంపెనీ విలువపై ఆందోళనలు, కొత్త తరం కంపెనీల లిస్టింగ్‌పై మదుపర్లు జాగ్రత్తగా వ్యవహరించడం, లాభాల స్వీకరణకు దిగడమే ఇందుకు కారణమని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. షేరు 2 రోజుల్లో 9.18% పడినా, ఇప్పటికీ ఇష్యూ ధర రూ.109తో పోలిస్తే 29% పైనే ఉంది. ఈ షేరు నమోదైన రోజు కంపెనీ మార్కెట్ విలువ రూ.44,382 కోట్లు కాగా, గురువారం రూ.40,307 కోట్లుగా ఉంది.

హైదరాబాద్‌లో సొనాకో సీఓఈ

ఈనాడు, హైదరాబాద్: ప్యాకేజింగ్ సేవలను అందించే అమెరికా సంస్థ సోనాకో ప్రొడక్ట్స్ కంపెనీ, హైదరాబాద్‌లో తన ఫైనాన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ని ఏర్పాటు చేయనుంది. ఆవిష్కరణలు, డిజిటల్ ఎక్సలెన్స్ సేవలను ఇక్కడి నుంచి అందించనుంది. ప్రస్తుతం 145 మంది నిపుణులు ఇక్కడ పనిచేస్తున్నారని, అంతర్జాతీయ వినియోగదారులకు పలు కీలక సేవలు అందుతున్నాయని చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ రాజీవ్ అంకిరెడ్డిపల్లి తెలిపారు. హైదరాబాద్ కేంద్రంపై తమ పెట్టుబడులు కొనసాగుతాయని సీఈఓ, ప్రెసిడెంట్ హోవార్డ్ కోకర్ వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి బృందాలను ఇక్కడ నియమించుకోబోతున్నట్లు పేర్కొన్నారు.

అప్పుల కోసం వాటాదార్ల అనుమతి కోరిన పవర్ మెక్ ప్రాజెక్ట్స్

ఈనాడు, హైదరాబాద్: తన వ్యాపార అవసరాల కోసం పవర్ మెక్ ప్రాజెక్ట్స్ రూ.5,000-7,500 కోట్ల వరకు అప్పులు చేయడానికి వాటాదార్ల నుంచి అనుమతి తీసుకోనుంది. కంపెనీ చేతిలో ఉన్న భారీస్థాయి ఆర్డర్లు పూర్తిచేయడానికి నిధులు సమీకరించాల్సి వస్తున్నట్లు సమాచారం.

ట్రైబ్యునల్ నియామకాల్లో సీఏలకు 25 ఏళ్ల సర్వీసు అక్కర్లేదు

ఆ నిబంధనను పక్కన పెట్టిన సుప్రీంకోర్టు

దిల్లీ: ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్ సహా పలు ట్రైబ్యునళ్లలో సాంకేతిక సభ్యులుగా నియమితులయ్యే చార్టర్డ్ అకౌంటెంట్లకు కనీసం 25 సంవత్సరాల సర్వీస్ అనుభవం ఉండాలనే నిబంధనను సుప్రీంకోర్టు గురువారం పక్కన పెట్టింది. ఈ నిబంధన రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఇకాయ్) దాఖలు చేసిన వివరాలతో ఏకీభవిస్తున్నాం. ఇటువంటి సర్వీసు నిబంధనలను అనుమతిస్తే, 50 ఏళ్ల వయసు వచ్చిన తర్వాతే, వారు సేవల్లోకి వస్తారు. న్యాయవాదుల విషయంలో ఇటువంటి నిబంధనలు పనిచేయవని స్పష్టం చేస్తున్నాం' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ట్రైబ్యునల్ సభ్యుల నియామకానికి సంబంధించి కొత్త చట్టాన్ని రూపొందించేటప్పుడు, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. చార్టర్డ్ అకౌంటెంట్లకు న్యాయవాదులతో సమానత్వం కోరుతూ ఇకాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ట్రైబ్యునల్ సభ్యులుగా న్యాయవాదులను నియమించడానికి కనీస వయసు 50 సంవత్సరాలు ఉండాలనే నిబంధనను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసిన విషయం తెలిసిందే.

అంతర్జాతీయ అగ్రగామి 100లో మరిన్ని భారత బ్యాంకులు

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



దిల్లీ: అగ్రగామి 100 అంతర్జాతీయ బ్యాంకుల జాబితాలో, మనదేశం నుంచి త్వరలోనే మరిన్ని ప్రభుత్వ/ప్రైవేటు బ్యాంకులు చోటు దక్కించుకుంటాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక విస్తరణ వేగవంతం కావడం, బ్యాంకింగ్ వ్యవస్థలో వృద్ధి ఇందుకు దోహదపడతాయన్నారు. దిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో వీకేఆర్‌వీ రావు స్మారకోపన్యాసం ఇచ్చిన తర్వాత, విద్యార్థులతో ఆర్‌బీఐ గవర్నర్ మాట్లాడారు. అంతర్జాతీయ జాబితాలో చేరదగ్గ, దేశీయ పెద్ద బ్యాంకుల సంఖ్యను ఆర్‌బీఐ నిర్ణయించలేదని తెలిపారు. 'ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో చాలా పెద్ద బ్యాంకులు ఉన్నాయి. అవి వృద్ధి చెందుతున్న వేగాన్ని చూస్తే.. అంతర్జాతీయ అగ్రగామి 100లో, పలు బ్యాంకులు చేరే అవకాశం ఉంద'ని మల్హోత్రా అన్నారు. ప్రపంచ అగ్రగామి 100 బ్యాంకుల్లో మన దేశం నుంచి ఎస్‌బీఐ 43, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 73వ స్థానాల్లో ఉన్నాయి. 2024-25లో దేశంలోని 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు రికార్డు స్థాయిలో రూ.1.78 లక్షల కోట్ల లాభాన్ని ఆర్జించాయి. 2023-24 లాభం రూ.1.41 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 26% ఎక్కువ.

రూపాయికి ఎటువంటి లక్ష్యాన్నీ పెట్టుకోలేదు

డాలరుతో పోలిస్తే రూపాయిని ఏ స్థాయిలో ఉంచాలన్న లక్ష్యాన్ని ఆర్‌బీఐ పెట్టుకోలేదని మల్హోత్రా స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌ల కారణంగా తలెత్తిన అనిశ్చితులతోనే, ఇటీవలి కాలంలో రూపాయి విలువ క్షీణించిందన్నారు. అమెరికాతో మంచి వాణిజ్య ఒప్పందాన్ని భారత్ కుదుర్చుకునే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు. తద్వారా దేశ కరెంట్ ఖాతాపై ఒత్తిడి తగ్గుతుందని వెల్లడించారు. కరెంట్ ఖాతాతో పాటు క్యాపిటల్ ఖాతాపై ఎగుమతులు, ఎఫ్ఐఐల ప్రభావం పడిందన్నారు. రిజర్వ్ బ్యాంక్ వద్ద సరిపడా విదేశీ మారకపు నిల్వలు ఉన్నాయని.. అందువల్ల అంతర్జాతీయ పరిణామాలపై అతిగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యవస్థలో ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటమే ఆర్‌బీఐ మొదటి ప్రాధాన్యమని తెలిపారు. నియంత్రణ వ్యవస్థలను నిర్వహిస్తూనే, నిబంధనలను సులభతరం చేయడానికి ఆర్‌బీఐ ప్రయత్నిస్తోందన్నారు.

నెలకు 20,000 మ్యూల్ ఖాతాలు గుర్తిస్తున్నాం

డిజిటల్ మోసాల నిరోధానికి తీసుకొచ్చిన మ్యూల్ హంటర్ టూల్‌తో మంచి ఫలితాలు వస్తున్నాయని మల్హోత్రా వెల్లడించారు. ప్రతి నెలా ఈ కృత్రిమ మేధ టూల్‌తో 20,000 మ్యూల్ ఖాతాలను ఆర్‌బీఐ గుర్తిస్తోంది. ఈ టూల్‌ను 20 బ్యాంకుల్లో వినియోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ లక్ష్యానికి దాదాపు దగ్గరగా ఉన్నామని వివరించారు. మోసపూరిత లావాదేవీల కోసం ఒకరి ఖాతాను, వేరొకరు వినియోగించడాన్నే మ్యూల్ ఖాతాగా పేర్కొంటున్నారు.

తప్పుదోవ పట్టించే ప్రకటనల్లేవు

- అనైతిక వ్యాపార విధానాలకూ దూరం
- ప్రభుత్వానికి వెల్లడించిన 26 ఇ-కామర్స్ సంస్థలు



దిల్లీ: తప్పుదోవ పట్టించే ప్రకటనలు, అనైతిక వ్యాపార విధానాల వంటి డార్క్ ప్యాటర్న్స్‌కు తమ ప్లాట్‌ఫామ్‌లు దూరంగా ఉన్నాయని ప్రభుత్వానికి జెప్టో, బిగ్ బాస్కెట్, జొమాటో, జియోమార్ట్ సహా 26 దిగ్గజ ఇ-కామర్స్ సంస్థలు వెల్లడించాయి. మదుపర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు డార్క్ ప్యాటర్న్స్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నట్లు వినియోగదారు వ్యవహారాల శాఖ తెలిపింది. డార్క్ ప్యాటర్న్స్ నియంత్రణ మార్గదర్శకాలు-2023ను పాటించడంలో భాగంగా 26 ప్రముఖ ఇ-కామర్స్ సంస్థలు స్వచ్ఛందంగా స్వీయ ప్రకటన (సెల్ఫ్ డిక్లరేషన్) పత్రాలను ప్రభుత్వానికి సమర్పించాయి. ఈ కంపెనీల్లో ఫార్మ్ ఈజీ, ఫ్లిప్‌కార్ట్ ఇంటర్నెట్, మింత్రా డిజైన్స్, వాల్‌మార్ట్ ఇండియా, మేక్‌మైట్రిప్ లాంటివీ ఉన్నాయి. డిజిటల్ మార్కెట్ విభాగంలో, ఇలా కంపెనీలు స్వీయ ధ్రువీకరణలు ఇవ్వడం.. వినియోగదార్ల ప్రయోజనాల పరిరక్షణ దిశగా కీలక పరిణామమని వాణిజ్య శాఖ అభివర్ణించింది. డార్క్ ప్యాటర్న్స్‌ను గుర్తించేందుకు, తొలగించేందుకు ఈ 26 సంస్థలు అంతర్గత స్వీయ ఆడిట్, థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించాయని తెలిపింది. ఇతర సంస్థలు కూడా ఇదే తరహాలో స్వీయ ధ్రువీకరణలు సమర్పించేందుకు ఈ పరిణామం ఉపయోగపడుతుందని సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) అభిప్రాయపడింది. వెబ్‌సైట్‌ల్లో పలు డిజైన్‌లను ఉపయోగించి కొనుగోలుదార్ల ఎంపిక నిర్ణయాలను ప్రభావితం చేయడం, బలవంత పెట్టడం, మోసగించడం, తప్పుదోవ పట్టించడం లాంటివి డార్క్ ప్యాటర్న్స్ కిందకు వస్తాయి. ఇలాంటి 13 డార్క్ ప్యాటర్న్స్‌ను గుర్తించి, ప్రభుత్వం వాటిపై నిషేధం విధించింది.

హైదరాబాద్ సమీపంలో జెహ్ ఏరోస్పేస్ కొత్త ప్లాంటు

ఈనాడు, హైదరాబాద్: ఏరోస్పేస్ తయారీ సేవల సంస్థ జెహ్ ఏరోస్పేస్, హైదరాబాద్ సమీపంలో కొత్తూరు వద్ద హెరైజన్ ఇండస్ట్రియల్ పార్కులో కొత్త తరం తయారీ అవసరాల కోసం మాక్-2 ప్లాంటును నెలకొల్పుతోంది. సుమారు 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ ప్లాంటు 2026 చివరికి సిద్ధం అవుతుంది. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో 'ఫ్యూచర్ ఫ్యాక్టరీ'గా రూపొందుతున్న ఈ ప్లాంటులో అటానమస్ మెషీనింగ్, డిజిటల్ ట్విన్స్, క్లోజ్డ్ లూప్ క్వాలిటీ సిస్టమ్స్.. తదితర అత్యాధునిక సదుపాయాలు ఉంటాయి. ఏరోస్పేస్ పరిశ్రమకు సంబంధించి 'ప్రెసిషన్ మ్యానుఫ్యాక్చరింగ్'ను ఈ ప్లాంటు సరికొత్తగా ఆవిష్కరిస్తుందని జెహ్ ఏరోస్పేస్ వ్యవస్థాపకుడు, సీఈఓ విశాల్ సంఘవి తెలిపారు. ఈ సంస్థ ఏడాదిన్నర కాలంలో 150 మిలియన్ డాలర్ల (రూ.1300 కోట్లకు పైగా) ఆర్డర్లు సంపాదించింది. కొత్త ప్లాంటుతో తమ తయారీ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందన్నారు. ఈ సంస్థలో జనరల్ క్యాటలిస్ట్, ఎలివేషన్ క్యాపిటల్, ఇండిగో వెంచర్స్. వంటి ప్రముఖ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి.

రెండో రోజూ లాభాలు



ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.283.65 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.824.46 కోట్లు

సెన్సెక్స్	నిఫ్టీ
▲446	▲140
85633	26192

సూచీలు వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిశాయి. చమురు-గ్యాస్, ఎంపిక చేసిన ఆర్థిక షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం కలిసొచ్చింది. అంతర్జాతీయ సంకేతాల మద్దతు, భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం అతిత్వరలో కుదురుతుందనే ఆశావాదం ఇందుకు కారణం. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 20 పైసలు నష్టపోయి 88.68 వద్ద స్థిరపడింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.83% పెరిగి 64.03 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగియగా షాంఘై సూచీ నష్టపోయింది. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి.

✦ గతేడాది అక్టోబరుతో పోలిస్తే, ఈ ఏడాది అక్టోబరులో దేశంలోని 8 కీలక మౌలిక రంగాల ఉత్పత్తిలో ఎలాంటి వృద్ధి నమోదు కాలేదు.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.67,000 కోట్లు పెరిగి, రూ.476.41 లక్షల కోట్ల (5.37 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 85,470.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,186.47) సానుకూలంగా ప్రారంభమైంది. 85,201.22 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకినా, ఒక దశలో 85,801.70 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 446.21 పాయింట్ల లాభంతో 85,632.68 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 139.50 పాయింట్లు పెరిగి 26,192.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 26,246.65 - 26,063.20 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 15 లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్ 2.28%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.25%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.01%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.42%, టెక్ మహీంద్రా 1.29%, యాక్సిస్ బ్యాంక్ 1.20% చొప్పున పెరిగాయి. ఏషియన్ పెయింట్స్ 1.20%, హెచ్‌సీఎల్ టెక్ 1.06% నష్టపోయాయి.

✦ రంగాల వారీ సూచీలకొస్తే ఇంధన, ఆర్థిక సేవలు, భారీ యంత్ర పరికరాలు, వాహన, బ్యాంకింగ్, పారిశ్రామిక, చమురు-గ్యాస్ రంగాలు రాణించాయి. మన్నికైన వినిమయ వస్తువులు, టెలికాం, ఐటీ, టెక్, స్థిరాస్తి రంగాలు డీలాపడ్డాయి.

ఐపీఓ సమాచారం


✦ రూఫ్‌టాప్ సోలార్ పరిశ్రమకు సేవలు అందిస్తున్న **ఫ్యుజియామా పవర్ సిస్టమ్స్** షేరు, ఇష్యూ ధర రూ.228తో పోలిస్తే బీఎస్ఈలో 4.21% తక్కువగా 218.40 వద్ద నమోదైంది. ఒక దశలో 9.93% నష్టపోయి రూ.205.35 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 8.61% నష్టంతో రూ.208.35 వద్ద ముగిసింది.

✦ గ్రో మాతృసంస్థ **బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్** షేరు వరుసగా రెండో రోజూ నష్టపోయింది. బీఎస్ఈలో 7.84% తగ్గి రూ.156.62 వద్ద స్థిరపడింది. గ్రో షేరు 2 రోజుల్లో 17% నష్టపోయింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.96,690.87 కోట్లకు పరిమితమైంది.

✦ **ఎక్సెల్‌సాఫ్ట్ టెక్నాలజీస్ లిమిటెడ్** ఐపీఓ రెండో రోజుకు 6.88 రెట్ల స్పందన దక్కింది. కంపెనీ రూ.500 కోట్ల ఐపీఓలో 3,07,01,754 షేర్లను ఆఫర్ చేయగా, 21,13,67,250 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. సంస్థాగతేతర మదుపర్ల విభాగంలో 18.19 రెట్లు, రిటెయిల్ మదుపర్ల విభాగంలో 5.92 రెట్లు అధిక స్పందన లభించగా, అర్హులైన సంస్థాగత మదుపర్ల (క్యూఐబీ) విభాగంలో 9% స్పందనే దక్కింది.

ఆ మాటలు నమ్మొద్దు మోసపోవద్దు

మీరు ఏదో పనిలో ఉంటారు. పదే పదే ఫోన్ వస్తూ ఉంటుంది. మంచి పాలసీ, పెట్టుబడి పథకం అంటూ వివరిస్తూ.. ఇప్పుడు తీసుకోకపోతే.. పెద్ద మొత్తంలో ప్రయోజనాలు కోల్పోతారు అన్నట్లు చెబుతుంటారు. మనం ఏ మాత్రం నమ్మినా.. ఎందుకూ పనికిరాని పాలసీలనూ, పథకాలను మనకు అంటగట్టేస్తారు. కాబట్టి, వీరి నుంచి మన కష్టార్జితాన్ని కాపాడుకునేందుకు అప్రమత్తత చాలా అవసరం.



తప్పుదారి పట్టించే ఉదాహరణలు.. అసంపూర్ణ సమాచారం.. ఆచరణలో సాధ్యం కాని రాబడి.. ఇలాంటి వాటితో ఊరించి అవసరం లేని ఉత్పత్తులను వినియోగదారులు తీసుకునేలా ప్రోత్సహిస్తారు. ఇలాంటి వాటిని 'మిస్ సెల్లింగ్'గా చెప్పొచ్చు. వారు అమ్మాలనుకున్న పథకాలనే మదుపరులకు అందిస్తారు. కానీ, వాస్తవంగా మదుపరులకు ఏం కావాలన్నది పట్టించుకోరు.

● **బీమా పాలసీలు:** బీమా పాలసీ ముఖ్య ఉద్దేశం.. ఆర్థిక రక్షణ కల్పించడం. కానీ, కొంతమంది సలహాదారులు, కాల్ సెంటర్లు మంచి రాబడి వస్తుందని చెబుతూ.. పాలసీదారులకు ఏమాత్రం సరిపోని వాటిని అందిస్తారు. వారి నుంచి ఎలాగైనా ప్రీమియం రాబట్టాలనేదే వారి లక్ష్యం. సంప్రదాయ పాలసీల నుంచి మొదలు.. యూనిట్ ఆధారిత పాలసీల వరకూ ఇదే ధోరణి. మీ డబ్బును రెట్టింపు చేస్తాయనే హామీలూ ఇస్తారు. యూనిట్ ఆధారిత పాలసీలు తీసుకున్నప్పుడు స్టాక్ మార్కెట్ పనితీరును బట్టి, రాబడి అందుతుంది. కాబట్టి, కచ్చితమైన హామీ ఉండదు. యులిప్‌ల గురించి అర్థం కాకుండా చెప్పి, పాలసీదారులను గందరగోళానికి గురి చేసి, ఆ ఉత్పత్తుల్లో డబ్బును నష్టపోయేలా చేస్తుంటారు. బీమా పాలసీల ఎంపిక విషయంలో మీ ఆర్థిక ప్రణాళిక కీలకం. వీలైనంత వరకూ తక్కువ ప్రీమియంతో, అధిక రక్షణనిచ్చే పాలసీలవైపే మొగ్గు చూపాలి.

● **క్రెడిట్ కార్డులు:** మీరు ఒక కార్డు కోసం దరఖాస్తు చేస్తారు. కానీ, మీ అనుమతి లేకుండానే వేరే కార్డు జారీ అవుతుంది. ఎక్కడో షాపింగ్ మాల్‌లో మన వివరాలు సేకరించి, కార్డును జారీ చేస్తున్నట్లు చెబుతుంటారు. ఇలాంటి వాటితో మోసపూరిత లావాదేవీలూ జరిగే అవకాశం ఉంది. మనం క్రెడిట్ నివేదిక తనిఖీ చేసుకుంటే తప్ప, మన పేరుమీద ఎన్ని కార్డులున్నాయో అర్థం కాదు. వార్షిక రుసుములు లేవంటూనే, నిర్ణీత కొనుగోలు లక్ష్యం పూర్తికాకపోతే, అధిక మొత్తంలో రుసుములు విధిస్తాయి. మీకు అవసరం లేకపోతే, ఎవరు చెప్పినా కార్డును తీసుకోవద్దు. వీలైతే మీ బ్యాంకును సంప్రదించి, మీకు అనుకూలంగా ఉండే కార్డు ఏదో తెలుసుకోండి. ఆ తర్వాతే నిర్ణయం తీసుకోండి.

● **మ్యూచువల్ ఫండ్లు:** దీర్ఘకాలిక పెట్టుబడులుగా పేరున్న మ్యూచువల్ ఫండ్లను స్వల్పకాలిక పథకాలుగా చెప్పి, అందిస్తుంటారు. ఈ మాటలు అస్సలు నమ్మొద్దు. ముఖ్యంగా పన్ను ఆదా కోసం ఉపయోగపడే ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల (ఈఎల్ఎస్ఎస్) విషయంలో. ఇప్పుడు కొత్త పన్ను విధానాన్ని ఎంచుకునే వారికి ఎలాంటి మినహాయింపులతో పనిలేదు. కాబట్టి, ఈ పథకాలను ఎంచుకుంటే, పన్ను ఆదా, అధిక రాబడి వస్తుందనే హామీ మోసపూరితమే. మ్యూచువల్ ఫండ్ పథకాల్లో కనీసం 7 ఏళ్లకు పైగా పెట్టుబడులు పెట్టినప్పుడే మంచి రాబడిని ఆశించగలం.

● **బహుళ ఉత్పత్తులు:** కొన్ని ఆర్థిక ఉత్పత్తులను ఒకటికి మించి అందిస్తుంటారు. ఇందులో మనకు అవసరం లేనివి ఉన్నా తప్పనిసరిగా తీసుకోవాల్సిందిగా సూచిస్తుంటారు. ఉదాహరణకు బ్యాంకు ఖాతాతో పాటు క్రెడిట్ కార్డు, బీమా, ఇతర పెట్టుబడి పథకాలను అందిస్తారు. ఇందులో అవసరం లేనివీ ఉండే ప్రమాదం ఉంది. కాబట్టి, ఇలాంటి ఖాతాలను ప్రారంభించేప్పుడే పూర్తి వివరాలు తెలుసుకొని ముందడుగు వేయాలి.

నష్టాలేమిటి?

● మీ లక్ష్యాలకు సరిపోని ఉత్పత్తుల ద్వారా కష్టార్జితాన్ని కోల్పోతారు. అధిక నష్టభయం ఉన్న పాలసీలను, పథకాలను సురక్షితమైన వాటిగా మభ్యపెట్టి మనకు కీడు చేస్తారు.

● అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డబ్బుగా మార్చుకునే వీలుండకపోవచ్చు. ఉదాహరణకు 15 ఏళ్ల లాకిన్ పాలసీలను తీసుకుంటే, మధ్యలో రద్దు చేసుకుంటే పెద్ద మొత్తంలో నష్టం వస్తుంది.

● ఒకసారి మోసపోతే, నిజమైన ఆర్థిక ఉత్పత్తుల మీదా నమ్మకం కోల్పోతారు. దీనివల్ల భవిష్యత్తులో మంచి రాబడినిచ్చే పథకాలను వదిలేస్తారు.

ఏం చేయాలి?

● మీ డబ్బు రెండు మూడేళ్లలోనే రెట్టింపు అవుతుంది.. ఇలాంటి ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మొద్దు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, చిన్న మొత్తాల పొదుపు పథకాలవంటి కొన్ని పథకాలు మాత్రమే రాబడికి హామీ ఇస్తాయి. మిగతా పథకాలేమీ కచ్చితమైన రాబడిని అందించవు. ఇలాంటి రాబడి హామీ పదాన్ని విన్నవెంటనే అప్రమత్తం కావాలి. హామీ ఎవరు ఇస్తున్నారు? రాబడి శాతం ఎంత? లాకిన్ వ్యవధి ఉందా? అనే ప్రశ్నలు అడగాలి. ● బీమా పాలసీలు కొంటేనే రుణం ఆమోదిస్తాం అంటూ చెప్పినప్పుడు, మీరు వ్యతిరేకించే వీలుంది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం.. రుణానికి తప్పనిసరిగా బీమా తీసుకోవాలనేం లేదు. కేవలం అది మీ ఆర్థిక భద్రత కోసమే.

● రక్షణ ఉన్న వాటిని అడిగినా, అధిక నష్టభయం ఉన్న వాటిని ఇస్తే.. వాటిని వెంటనే వదిలించుకోండి.

● చివరి రోజు, నేడు తీసుకుంటేనే ఈ లాభాలు వంటి మాటలను పట్టించుకోకండి. ఇదంతా మోసపూరిత వ్యవహారమని గుర్తించండి.

రోజుకు రూ.200 ఉంటే

సంపదను పోగు చేయాలంటే ఒకేసారి పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. ఆర్థిక క్రమశిక్షణ, నిలకడతో దీర్ఘకాలం పాటు చిన్న మొత్తంలో మదుపు చేసినా గణనీయమైన మొత్తాన్ని సాధించవచ్చు. ఈ రోజుల్లో మ్యూచువల్ ఫండ్ పథకాలు రోజువారీ క్రమానుగత పెట్టుబడి విధానాన్నీ అందిస్తున్నాయి. దీనిద్వారా స్వల్ప మొత్తంతోనూ అనుకున్న లక్ష్యాన్ని సాధించొచ్చు.

ఒక ఉదాహరణ చూద్దాం...

రోజుకు రూ.200 పెట్టుబడి అనుకుంటే.. నెలకు రూ.6,000 అవుతుంది. ఇలా 12 ఏళ్లపాటు పెట్టుబడి పెడితే.. దాదాపు రూ.8,76,000 మదుపు చేస్తాం. దీనిపై సగటు వార్షిక రాబడి 12 శాతం అనుకుంటే.. మీ దగ్గర రూ.19,59,292 జమ అవుతాయి. చూశారుగా.. చిన్న మొత్తంతోనూ ఎంత నిధిని జమ చేసుకున్నామో!

● మరింత మెరుగైన రాబడికోసం ఏటా పెట్టుబడిని 10 శాతం చొప్పున పెంచుకుంటూ వెళ్లొచ్చు. దీనివల్ల చక్రవడ్డీ ప్రభావంతో పెద్ద మొత్తంలో డబ్బు మీ చేతికి అందుతుంది.

సిరి

siri@eenadu.net

మీ పిల్లలకు 18 ఏళ్లు వచ్చాయా?

పిల్లలు 18 ఏళ్లను పూర్తి చేసుకోవడం అంటే.. వారి జీవితంలో ఒక కీలక మైలురాయిని చేరుకోవడమే. తల్లిదండ్రులుగా ఇది మీకూ ఒక ముఖ్యమైన ఘట్టం. ఇంతకాలం అన్ని అవసరాలకూ మీపై ఆధారపడిన మీ పిల్లలు ఇకపై కొన్ని నిర్ణయాలను వారు సొంతంగా తీసుకోవాల్సి ఉంటుంది. బాధ్యత వహించాల్సి వస్తుంది. ఓటు వేయడం, డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవడం, ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం ఇలా ఎన్నో విషయాలకు వారు అర్హులవుతారు. దీనిని మరింత సులభతరం చేసేందుకు ఏం చేయాలో తెలుసుకుందాం.



పాన్ తీసుకోండి: పిల్లలకు 18 ఏళ్లు నిండగానే వారు చట్టబద్ధంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహించేందుకు అర్హత సాధిస్తారు. కాబట్టి, శాశ్వత ఖాతా సంఖ్య (పాన్) తీసుకోవడం అవసరం. ఆధార్ కార్డులోనూ వివరాలను ఒకసారి అప్‌డేట్ చేయించండి. ఆ తర్వాత పాన్ తీసుకోవడం మేలు.

బ్యాంకు ఖాతా, డీమ్యాట్ ఖాతా ప్రారంభించేందుకు, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టేందుకు పాన్ తప్పనిసరి. ఇప్పటికే పాన్ ఉంటే, దాన్ని మైనర్ నుంచి మేజర్‌కు మార్చాలి. వారి సొంత ఫొటో, సంతకంతో దాన్ని అప్‌డేట్ చేయించండి.

బ్యాంకు ఖాతాలో..: మైనర్‌గా ఉన్నప్పుడు పిల్లల పేరుమీద తల్లిదండ్రులు ఉమ్మడి ఖాతా ప్రారంభించేందుకు వీలుంటుంది. ఇప్పుడు వారు మేజర్ అయ్యారు కాబట్టి, ఆ ఖాతాను వ్యక్తిగత ఖాతాగా మార్చాల్సి ఉంటుంది. లేదా పూర్తిగా కొత్త పొదుపు ఖాతాను ప్రారంభించండి. సాధారణంగా బ్యాంకులు వారి కేవైసీ పత్రాలు, వయసు ధ్రువీకరణతో పాటు కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత ధ్రువీకరణలనూ అడుగుతాయి. దీని తర్వాత వారి పేరుమీద ఒక రికరింగ్ డిపాజిట్, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లాంటివి ప్రారంభించి ఇవ్వండి. నెట్, మొబైల్ బ్యాంకింగ్ వినియోగంలో వారికి జాగ్రత్తలు నేర్పించండి.

పెట్టుబడుల ప్రయాణం..: మీ పిల్లలకు పెట్టుబడుల ప్రాధాన్యం నేర్పించండి. ఇప్పటికే మీరు వారి కోసం షేర్లను కొంటే, వాటిని వారికి బదిలీ చేయండి. వారిప్పుడే సొంతంగా షేర్లలో పెట్టుబడులు పెట్టడం కాస్త నష్టభయంతో కూడుకున్నది కాబట్టి, ముందుగా వారిని మ్యూచువల్ ఫండ్ల మార్గంలో వెళ్లాల్సిందిగా సూచించండి. దీనివల్ల వారికి మార్కెట్ గురించి పరిచయం ఏర్పడుతుంది.


పన్ను బాధ్యత..: మైనర్ పిల్లలకు ఆదాయం వచ్చినప్పుడు, దాన్ని తల్లిదండ్రుల ఆదాయంలో కలిపి చూపించి, పన్ను చెల్లించాల్సి వస్తుంది. మేజర్ అయిన తర్వాత వారికి పన్ను బాధ్యత ప్రత్యేకంగా ఉంటుంది. ఎంత ఆదాయం ఉన్నా, పన్ను రిటర్నులు దాఖలు చేయడం ద్వారా వారికి, చట్టపరమైన బాధ్యతల గురించి అవగాహన వస్తుంది.

బీమాతో ధీమా: మేజర్ అయిన తర్వాత సొంతంగా ఆరోగ్య, జీవిత, వాహన బీమా పాలసీలను తమ సొంత పేరుమీద కొనుగోలు చేసేందుకు అర్హులే. ఆదాయం ఉండదు కాబట్టి, టర్మ్ పాలసీల్లాంటివి రాకపోవచ్చు. ఆరోగ్య బీమా మాత్రం తప్పనిసరిగా తీసుకోవడం మంచిది.

టర్మ్ పాలసీ తీసుకుంటున్నారా?

కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనుకున్నప్పుడు టర్మ్ పాలసీ ముందు వరుసలో ఉంటుంది. ఈ రోజుల్లో ఈ పాలసీ ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాల్లో ఒకటిగా మారింది. ఇంత కీలకమైన పాలసీని తీసుకునేటప్పుడు ఏ సంస్థను ఎంచుకోవాలి అనే సందేహం సహజం. దీనికి సమాధానం తెలుసుకుందాం.

● **క్లెయిం చెల్లింపులు:** అనుకోనిది ఏమైనా జరిగినప్పుడు మీ కుటుంబానికి డబ్బు వచ్చేది కంపెనీ చెప్పిన మాటలతో కాదు. క్లెయింను సకాలంలో చెల్లించడమే ఇక్కడ ముఖ్యం. ఐఆర్‌డీఏఐ వెబ్‌సైట్‌లో ఏటా క్లెయిం చెల్లింపుల నిష్పత్తిని ప్రచురిస్తారు. ఇందులో 98 శాతం పైన క్లెయిం చెల్లింపుల నిష్పత్తి ఉన్న కంపెనీలనే ఎంచుకోండి. అప్పుడే మీ కుటుంబం సురక్షితంగా ఉంటుంది.



● **కంపెనీ ఆర్థిక బలం:** బీమా అనేది ఒక దీర్ఘకాలిక ఒప్పందం. ఈ వ్యవధిలో బీమా సంస్థ దివాలా తీయకుండా ఉంటేనే మనకు భరోసా. అందుకే, కంపెనీ స్వాల్వెన్సీ నిష్పత్తిని చూడాలి. ఇది కనీసం 1.5 కంటే ఎక్కువగా ఉండాలి. ఇలాంటి కంపెనీలే బలంగా నిలదొక్కుకోగలుగుతాయి.

● **ఫిర్యాదులు ఎక్కువగా ఉంటే:** ఐఆర్‌డీఏఐ వెబ్‌సైటులో బీమా సంస్థపై ఉన్న ఫిర్యాదులనూ ఒకసారి పరిశీలించాలి. 10వేల పాలసీలకు 5 కంటే తక్కువ ఫిర్యాదులు వస్తే, సాధారణంగా అది మంచి కంపెనీ కింద పరిగణించొచ్చు. అంతకు మించితే పాలసీ తీసుకునేటప్పుడు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి.

● **ప్రీమియం చౌకగా ఉంటే:** ఒకే వయసు, ఒకే పాలసీ విలువకు కొన్ని కంపెనీలు తక్కువ ప్రీమియం వసూలు చేయొచ్చు. చౌకగా ప్రీమియం ఉన్నంత మాత్రాన పాలసీ తీసుకునేందుకు ఇదే ప్రామాణికం కాదు. ఇవి క్లెయిం చెల్లింపుల్లో ఇబ్బంది పెట్టే అవకాశాలు లేకపోలేదు. కాబట్టి, ప్రీమియం గురించి కాకుండా, నిజంగా ఆ పాలసీ అందించే ప్రయోజనాలనే పట్టించుకోండి.

● **అనుబంధాలు:** ప్రాథమిక పాలసీతోపాటు కొన్ని అనుబంధాలనూ అందిస్తుంటే ఆ పాలసీని పరిశీలించొచ్చు. ముఖ్యంగా ప్రమాదవశాత్తూ మరణం, తీవ్రవ్యాధులకు రక్షణ కల్పించేలా పాలసీలో రైడర్లు ఉండాలి. పాలసీని దశల వారీగా పెంచుకునే వీలు కల్పిస్తుందా? లాంటివీ పరిశీలించాలి.

● **సేవల మాటేమిటి?:** ఇప్పుడు అన్ని కంపెనీలూ డిజిటల్ విధానంలోనే సేవలను అందిస్తున్నాయి. పాలసీ కొనుగోలు మొదలు, క్లెయిం వరకూ అన్నీ సులభంగా ఉండాలి. అంతేకానీ, అనవసరమైన పత్రాలను అడుగుతూ కాలయాపన చేసే వాటికి దూరంగా ఉండటమే మేలు.

కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించేలా పాలసీ తీసుకుంటున్నప్పుడు, కష్టకాలంలో ఆదుకునేలా ఉండాలి. కాబట్టి, పాలసీని ఎంపిక చేసుకునేటప్పుడే జాగ్రత్తగా ఉండటం ఎంతో అవసరం.

పదవీ విరమణ వేళలో



దాదాపు మూడు దశాబ్దాలకు మించి ఉద్యోగం చేసిన తర్వాత, ఒక దశ వస్తుంది. అదే పదవీ విరమణ. ఇది ఎంతో కీలకం. ఈ విశ్రాంత జీవితం ప్రశాంతంగా సాగాలంటే.. కొన్ని కీలక అంశాలు ఆచరణలో పెట్టాలి.

పదవీ విరమణ తర్వాత గణనీయమైన ఖాళీ సమయం లభిస్తుంది. ఈ సమయాన్ని మీరు ఎలా ఉపయోగించాలన్నది ముందే సరైన ప్రణాళిక వేసుకోవాలి. ముఖ్యంగా అభిరుచులు తీర్చుకోవడం, సేవ, అనుభవానికి తగ్గ ఉద్యోగం, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడంలాంటివి ఉండొచ్చు. పని, విశ్రాంతి, వ్యక్తిగత అభివృద్ధికి ఇది ఒక మంచి సమయం అని నిపుణులు సూచిస్తున్నారు.

▼ పొదుపు, పెట్టుబడులను సమీక్షించుకోవాలి. వాటినన్నింటినీ ఒకేచోటకు తీసుకురావాలి. మీ పెట్టుబడి వ్యూహం, మీ పదవీ విరమణ లక్ష్యాలకు దగ్గరగా ఉందా లేదా చూసుకోవాలి.

▼ మీకు ఎంత ఆదాయం అవసరమో తెలుసుకునేందుకు, మీ నెలవారీ ఆదాయం, ఖర్చులను అంచనా వేసుకోండి. మీ పొదుపు, పెట్టుబడుల నుంచి ఉపసంహరణలను జాగ్రత్తగా ప్లాన్ చేసుకోండి. మీ జీవితాంతం వరకూ ఈ డబ్బు మీకు అండగా ఉండాలి.

▼ సాధ్యమైనంత వరకూ పదవీ విరమణ నాటికి ఎలాంటి రుణాలూ ఉండకూడదు. అది మీ లక్ష్యం కావాలి. మీ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు, ఒత్తిడిని ఎదుర్కొనేందుకు ఇది ఎంతో అవసరం. ముఖ్యంగా గృహరుణం, క్రెడిట్ కార్డు రుణాలవంటివి పూర్తిగా చెల్లించాలి. కొత్తగా వ్యక్తిగత రుణాలు తీసుకోవడంలాంటివి చేయొద్దు.

▼ సులభంగా అందుబాటులో ఉండే విధంగా అత్యవసర నిధిని పెట్టుకోండి. ఊహించని వైద్య ఖర్చులను తట్టుకునేందుకు ఇది ఎంతో అవసరం. మీ పెట్టుబడులకూ, దీనికీ సంబంధం ఉండకూడదు.

▼ మీ సంస్థ అందించే బృంద ఆరోగ్య బీమాతో సంబంధం లేకుండా, మీ సొంత పాలసీ ఒకటి ఉండాలి. వాస్తవానికి పదవీ విరమణకు నాలుగేళ్ల ముందు నుంచే సొంతంగా ఆరోగ్య బీమా పాలసీని తీసుకోవడం అవసరం. వయసుతో పాటే ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరుగుతాయి. కాబట్టి, మీ పొదుపు మొత్తాన్ని హరించకుండా, వైద్య ఖర్చులను తట్టుకునేందుకు మంచి బీమా పాలసీ అవసరం.

▼ పదవీ విరమణ తర్వాత మీ పెట్టుబడి వివరాలతో కుటుంబ పత్రం రాయడం మర్చిపోవద్దు. వీలైనంత వరకూ వీలునామా రాయడం మంచిదని నిపుణుల సూచన.

ఆరోగ్య రంగంలో

బంధన్ మ్యూచువల్ ఫండ్ ఒక హెల్త్‌కేర్ పథకాన్ని ఆవిష్కరించింది. పేరు బంధన్ హెల్త్‌కేర్ ఫండ్. దీని ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 24. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.1,000 పెట్టుబడి పెట్టాలి. ప్రధానంగా హెల్త్‌కేర్, ఫార్మా, ఆరోగ్య పరీక్షలు, ఫార్మసీ, వెల్‌నెస్, బీమా, హెల్త్ టెక్... తదితర వైద్య అనుబంధ విభాగాలకు చెందిన కంపెనీల్లో ఈ పథకం పెట్టుబడి పెడుతుంది. మనదేశంలో జనాభా, తలసరి ఆదాయం పెరుగుతున్నాయి. దీనివల్ల వైద్య సేవలకు గతంలో ఎన్నడూ లేనంత గిరాకీ కనిపిస్తోంది. అందువల్ల ఈ రంగంలోని కంపెనీలకు ఇటీవల కాలంలో ఆదాయాలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవటం బంధన్ హెల్త్‌కేర్ ఫండ్ ప్రధాన లక్ష్యం.

మౌలిక వసతుల్లో మదుపు

మౌలిక సదుపాయాల రంగానికి చెందిన కంపెనీల్లో పెట్టుబడి పెట్టి లాభాలు ఆర్జించేందుకు మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్, మిరే అసెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ అనే పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ వచ్చే నెల 1. కనీసం రూ.5,000 పెట్టుబడి పెట్టాలి. రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్, బిల్డింగ్ మెటీరియల్స్, సరకు రవాణా, విద్యుత్తు, టెలికం, డేటా సెంటర్లు తదితర విభాగాలకు చెందిన కంపెనీల్లో ఈ పథకం పెట్టుబడి పెడుతుంది. వచ్చే కొన్నేళ్ల పాటు మనదేశం అభివృద్ధి దశలో ఉంటుందని అంచనా. ఈ క్రమంలో మౌలిక సదుపాయాలు ఎంతగానో విస్తరిస్తాయి. ఈ రంగంలో కార్యకలాపాలు సాగించే కంపెనీలకు అవకాశాలు అధికమే. ఈ విభాగంలో పెట్టుబడి లాభదాయకంగా ఉంటుందనే అంచనా.

పెట్టుబడి వైవిధ్యంగా

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా యాక్సిస్ మల్టీ అసెట్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్) అనే పథకాన్ని ఆవిష్కరించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్ ఆఫ్ ఫండ్ స్కీము. ప్రధానంగా ఈక్విటీ, డెట్ మ్యూచువల్ ఫండ్ పథకాలు, కమాడిటీ ఆధారిత ఈటీఎఫ్‌ల యూనిట్లను ఈ పథకం కొనుగోలు చేస్తుంది. ఒకే పథకం ద్వారా ఈక్విటీ, డెట్, బంగారం/ వెండిలో పెట్టుబడి పెట్టేందుకు, రిస్కును తగ్గించుకునేందుకు ఇది అవకాశం కల్పిస్తుంది. ఎన్ఎఫ్ఓ వచ్చే నెల 5న ముగుస్తుంది. కనీస పెట్టుబడి రూ.100. ఒకే ఫండ్ మేనేజర్‌పై ఆధారపడటం అనేది ఫండ్ ఆఫ్ ఫండ్ల విషయంలో తక్కువ. వివిధ పథకాలను నిర్వహించే ఫండ్ మేనేజర్ల నైపుణ్యాలు, అనుభవం ఇలాంటి పథకాలకు ఉన్న అదనపు ఆకర్షణ. అదే సమయంలో వైవిధ్యమైన ఆస్తుల మీద పెట్టుబడి ఉంటుంది. తద్వారా దీర్ఘకాలంలో సంపద సృష్టికి అవకాశం లభిస్తుంది.

చిన్న కంపెనీల్లో

శ్యాంకో మ్యూచువల్ ఫండ్, ఒక కొత్త స్మాల్‌క్యాప్ పథకాన్ని ఆవిష్కరించింది. శ్యాంకో స్మాల్‌క్యాప్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 28 వరకూ అందుబాటులో ఉంటుంది. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.5,000 పెట్టుబడి పెట్టాలి. స్మాల్‌క్యాప్ తరగతికి చెందిన పథకం అనగానే రిస్కు ఎక్కువ అనే ఆందోళన కనిపించక మానదు. కానీ స్మాల్‌క్యాప్ తరగతికి చెందిన షేర్లు బాగా కరెక్షన్ అయిన ప్రస్తుత తరుణంలో ఇలాంటి పథకాలను పరిశీలించవచ్చు. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ 'ట్రెయిలింగ్ పీఈ' 28.5 ఉంది. ఒక ఏడాది- 5 ఏళ్ల సగటు పీఈ అయిన 31.8- 28.9 కంటే ఇది తక్కువ. శ్యాంకో మ్యూచువల్ ఫండ్ ఈ పథకాన్ని నిర్వహించటంలో 'మొమెంటమ్ స్ట్రాటజీ'ని అనుసరిస్తుంది. ఈ తరహా పథకం ఇదే మొదటిదని చెప్పొచ్చు.

సుకన్య సమృద్ధి.. ఆపొద్దు

మార్గదర్శి

1 నా వయసు 38. నెలకు రూ.70వేలు వస్తున్నాయి. ఇప్పటి వరకూ రూ.15 లక్షలను మ్యూచువల్ ఫండ్లలో జమ చేశాను. అత్యవసర నిధి రూ.5లక్షల వరకూ ఉంది. ఇప్పుడు ఇల్లు కొనాలనే ఆలోచనతో ఉన్నాను. మ్యూచువల్ ఫండ్లు, అత్యవసర నిధి నుంచి మొత్తం తీసి, మిగతా మొత్తాన్ని రుణం తీసుకోవచ్చా? లేక వీటిని ఇలాగే కొనసాగిస్తూ, అప్పు తీసుకోవాలా?

- కె.రామారావు

ముందుగా ఇల్లు మీరు నివసించేందుకా? పెట్టుబడికా? అన్నది నిర్ణయించుకోండి. ఉండడం కోసమైతే ఇబ్బంది లేదు. రుణం తీసుకున్నప్పుడు, మీ ఆదాయంలో మొత్తం నెలవారీ వాయిదాలు 30-40 శాతానికి మించకూడదు. ఇలాంటి పరిస్థితి ఉన్నప్పుడే గృహ రుణం తీసుకోండి. లేకపోతే ఆర్థికంగా భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయి. ఇల్లు విలువలో కనీసం 25 శాతం వరకూ సొంత డబ్బులు పెట్టుకోవాలి. వీటన్నింటినీ బట్టి, నిర్ణయం తీసుకోండి. అత్యవసర నిధిని వీలైనంత వరకూ తీయొద్దు. మ్యూచువల్ ఫండ్లలో ఉన్న మొత్తాన్ని అవసరం మేరకు వాడుకోండి.

2 నేను మ్యూచువల్ ఫండ్లలో నెలకు రూ.15,000 చొప్పున మదుపు చేయాలనే ఆలోచనతో ఉన్నాను. కనీసం 25 ఏళ్లపాటు మదుపు చేయడానికి ఎలాంటి పథకాలను ఎంచుకోవాలి? ఎంత మొత్తం జమ అవుతుంది. **- జితేంద్ర**

దాదాపు 25 ఏళ్లపాటు మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయాలనే ఆలోచన మంచిదే. దీనివల్ల దీర్ఘకాలంలో చక్రవడ్డీ ప్రయోజనంతో మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. స్వల్పకాలంలో కాస్త హెచ్చుతగ్గులు వచ్చినా, ఆందోళన చెందకుండా పెట్టుబడులు కొనసాగించాలి. భారత ఆర్థిక వ్యవస్థ రాబోయే రెండు, మూడు దశాబ్దాల్లో మంచి వృద్ధి సాధిస్తుందనే అంచనాలున్నాయి. స్టాక్ మార్కెట్ పనితీరూ బాగుంటుంది. మీరు మదుపు చేయాలనుకుంటున్న మొత్తాన్ని డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు, మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్లకు మళ్లించండి. మీరు 25 ఏళ్లపాటు మీ పెట్టుబడిని కొనసాగిస్తే.. 12 శాతం రాబడితో దాదాపు రూ.2.40 కోట్ల వరకూ జమ అయ్యే అవకాశం ఉంది. భవిష్యత్తులో మీ ఆదాయం పెరిగినప్పుడు మీ పెట్టుబడినీ పెంచుకునే ప్రయత్నం చేయండి.

3 నా వయసు 29. నేను స్విట్జర్లాండ్‌లో ఉంటున్నాను. నేను మన దేశంలో టర్మ్ పాలసీ తీసుకోవచ్చా? షేర్లు, ఫండ్లలో పెట్టుబడులు పెట్టేందుకు వీలవుతుందా? **- ప్రశాంత్**

మన దేశంలో టర్మ్ పాలసీ తీసుకునేందుకు వీలవుతుంది. మీ వార్షికాదాయానికి 10-12 రెట్ల వరకూ పాలసీ తీసుకోవచ్చు. మంచి క్లెయిం సెటిల్‌మెంట్ ఉన్న కంపెనీలను ఎంచుకోండి. మీరు షేర్లలో, ఫండ్లలోనూ మదుపు చేయొచ్చు. దీనికి ముందుగా కేవైసీ పూర్తి చేయాలి. ఇది పూర్తి అయ్యాక డీమ్యాట్ ఖాతాను ప్రారంభించాలి. నేరుగా షేర్లలో మదుపు చేసే బదులు, డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలో మదుపు చేయొచ్చు. పెట్టుబడులు పెట్టేటప్పుడు ఎన్ఆర్ఈ లేదా ఎన్ఆర్ఓ ఖాతా ద్వారా మదుపు చేయండి. మీరు డబ్బులు వెనక్కి తీసుకెళ్లాలి అనుకుంటే, ఎన్ఆర్ఈ బ్యాంకు ఖాతా ద్వారానే మదుపు చేయాలి.

4 మా అమ్మాయి వయసు 9. తన పేరుమీద ఏడాదికి రూ.40వేల వరకూ సుకన్య సమృద్ధి యోజనలో జమ చేస్తున్నాను. ఈ పథకంతో పోలిస్తే, గోల్డ్ ఫండ్లు అధిక లాభాలను ఇస్తున్నాయి అంటున్నారు. నిజమేనా? ఇప్పుడు నేను పెట్టుబడిని గోల్డ్ ఫండ్లలోకి మార్చేయాలా? **- గాయత్రి**


సురక్షితమైన సుకన్య సమృద్ధి (ఎస్ఎస్‌వై)పథకంలో 8.2 శాతం వడ్డీ లభిస్తోంది. దీంతో గోల్డ్ ఫండ్లను పోల్చలేం. ఈ ఫండ్లలో నష్టభయం ఉంటుందని మర్చిపోవద్దు. మీ పెట్టుబడిపై నష్టాలూ రావచ్చు. మూడునాలుగేళ్లుగా పసిడి అధిక రాబడినిచ్చిన విషయం చూస్తున్నాం. దీంతో గోల్డ్ ఫండ్లూ మంచి రాబడిని అందించాయి. సుకన్య సమృద్ధిని ఆపేయొద్దు. రూ.40వేలలో రూ.20 వేలు సుకన్య సమృద్ధి పథకంలో, రూ.10వేలు బంగారం ఫండ్లలో, మిగిలిన రూ.10వేలను డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలో మదుపు చేసే ఆలోచన చేయొచ్చు.

(ఆర్థిక విషయాల్లో మీకున్న సందేహాలను siri@eenadu.net కు మెయిల్ చేయండి.)

- తుమ్మ బాల్‌రాజ్,
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

ఈనాడు సినిమా

పుట్టినరోజునే పేరు



నాగచైతన్య

కథతోనే కాకుండా... తన యాక్షన్‌తోనూ ప్రేక్షకులకు థ్రిల్‌ని పంచేందుకు సిద్ధమయ్యారు హీరో నాగచైతన్య. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న ఆయన కొత్త చిత్రం మేకింగ్ వీడియో చూస్తే ఈ విషయమే స్పష్టం అవుతోంది. కార్తీక్ దండు దర్శకత్వంలో మిథికల్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్న చిత్రమిది. మీనాక్షి చౌదరి కథానాయిక. 'లాపతా లేడీస్' ఫేం స్పర్శ్ శ్రీవాస్తవ కీలక పాత్రని పోషిస్తున్నారు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, సుకుమార్ నిర్మాతలు. కథానాయకుడు నాగచైతన్య పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 23న సినిమా పేరు, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని ఆవిష్కరించాలని నిర్ణయించింది చిత్రబృందం. ఆ విషయాన్ని ప్రకటిస్తూ గురువారం మేకింగ్ వీడియోను విడుదల చేసింది. అందులో సినిమా స్థాయితోపాటు, నాగచైతన్య యాక్షన్ ఘట్టాల కోసం చెమటోడ్చడం కనిపించింది. అంతర్జాతీయ స్థాయిలో పేరున్న యాక్షన్ కొరియోగ్రాఫర్ జుజి పర్యవేక్షణలో నాగచైతన్య ప్రత్యేకంగా శిక్షణ తీసుకుని ఇందులో నటిస్తున్నారు. శారీరకంగా కూడా ఆయన ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నారు. నాగచైతన్య కెరీర్‌లోనే అత్యధిక వ్యయంతో ఈ చిత్రం రూపొందుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రధాన తారాగణంపై కీలకమైన యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు.

మరో రైడ్‌కి సన్నాహాలు



అజయ్ దేవగణ్

'దే దే ప్యార్ దే 2' చిత్రంతో ఇటీవలే థియేటర్లో ప్రేక్షకుల్ని అలరించాడు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అజయ్ దేవగణ్. ఆయన తదుపరి చిత్రంగా ఇప్పుడు 'రైడ్' ఫ్రాంఛైజీలో భాగంగా రానున్న 'రైడ్ 3'కి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఫ్రాంఛైజీకి దర్శకత్వం వహించిన రాజ్‌కుమార్ గుప్తా మరోసారి బలమైన కథాంశంతో తెరకెక్కించేందుకు స్క్రిప్ట్‌ని సిద్ధం చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. "చిత్రబృందం ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్‌పై పనిచేస్తోంది. తిరిగి తన ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి పాత్రను పోషించడానికి అజయ్ సిద్ధంగా ఉన్నారు. ఆయన ప్రస్తుత ప్రాజెక్టులను పూర్తి చేసిన తర్వాత వచ్చే ఏడాదిలోనే ఈ సినిమా చిత్రీకరణలో పాల్గొననున్నారు. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభిస్తార"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

'పుష్పక విమానం' లాంటి చిత్రం చేయాలని ఉంది

"ఏడాదికి నాలుగు సినిమాలు చేయడానికైనా నేను సిద్ధమే. కానీ ఇప్పుడు విడుదలలన్నీ ఓటీటీ వేదికలతో ముడిపడి ఉన్నాయి. నా నుంచి మునుపటిలా వేగంగా సినిమాలు రాకపోవడానికి కారణం అదే" అన్నారు అల్లరి నరేశ్. విభిన్నమైన కథల్లో నటిస్తూ... ఆల్‌రౌండర్ అనిపించుకునే ప్రయత్నాల్లో ఉన్న కథానాయకుడీయన. తన కెరీర్‌లో తొలిసారి థ్రిల్లర్ కథతో '12 ఏ రైల్వే కాలనీ' చేశారు. ఈ చిత్రం ఈ రోజే ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు అల్లరి నరేశ్.



● '12ఏ రైల్వే కాలనీ'... ఈ కథని ఎంపిక చేసుకోవడం వెనుక మిమ్మల్ని ప్రేరేపించిన అంశాలేమిటి?

■ కొత్త జానర్ కథలు చేయాలని మొదట్నుంచీ ఉండేది. 'నాంది' తర్వాత ఆ విషయంపై మరింతగా దృష్టి పెట్టా. ఇప్పటివరకూ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా చేయలేదు. ఆ జానర్‌లోనే నిజమైన సంఘటనల ఆధారంగా దర్శకులు నాని, అనిల్ విశ్వనాథ్ ఈ కథని సిద్ధం చేశారు. విరామ సన్నివేశాలతోనే నాకు షాక్‌నిచ్చారు దర్శకులు. ఇక్కడ్నుంచి ఈ కథ ఎలా వెళుతుందనే ఆసక్తి మొదలైంది. ఇందులో ప్రధాన ఆకర్షణ స్క్రీన్‌ప్లేనే.

● ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?

■ కార్తీక్ అనే యువకుడిగా కనిపిస్తా. స్థానిక ఎమ్మెల్యేకి తలలో నాలుకలాంటి అనుచరుడు కార్తీక్. తనకి నలుగురు స్నేహితులు, వాళ్లతో కలిసి సరదాగా గడుపుతూ ఉంటాడు. అలాంటి ఓ కుర్రాడి జీవితంలో ఓ సీరియస్ సంఘటన జరుగుతుంది. అది ఎక్కడివరకూ వెళ్లిందన్నదే ఈ కథ. 12ఏ అనే ఓ ఇంటితో ముడిపడిన కథ ఇది.

● తొలిసారి సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలో నటించారు కదా. కామెడీతో పోలిస్తే ఈ అనుభవం ఎలా ఉంది?

■ ఇందులోనూ చాలా సవాళ్లే ఉంటాయి. ఇలాంటి సినిమాలు చేసేటప్పుడు ఎక్కువగా మాట్లాడకూడదు, హావభావాలతోనే అన్నీ ప్రేక్షకులకు తెలిసిపోయేలా నటించాలి. ఓ నటుడిగా ఇది నాకు ప్రత్యేకమైన అనుభవమే. అయితే కామెడీ పండించడం ఇంకా కష్టం.

● ఈ సినిమాలో తెలంగాణ యాసలో సంభాషణలు చెప్పారు కదా. అందుకు సంబంధించి కసరత్తులు ఎలా సాగాయి?

■ వరంగల్ నేపథ్యంలో సాగే కథ ఇది. యాస పక్కాగా ఉండాలని తెలంగాణ విశ్వవిద్యాలయం నుంచి అజయ్ అనే పరిశోధకుడితో కలిసి మూడు నాలుగు రోజులు వర్క్‌షాప్ చేశాం. వరంగల్ జిల్లా పరిధిలోనే ఎక్కడెక్కడ ఎలా యాస మారుతూ ఉంటుంది, ఎవరెలా మాట్లాడతారో తెలుసుకుని మరీ సంభాషణలు పలికా. ఏ సినిమాకైనా ఒక రోజులో డబ్బింగ్ పూర్తి చేసేవాణ్ని. కానీ ఈ సినిమాకి నాలుగు రోజులు సమయం పట్టింది. తొలిసారి తెలంగాణ యాసలో సంభాషణలు చెబుతున్నప్పుడు బాగా చెప్పాలనుకుంటాం కదా.

● ఇంకా ఏయే తరహా కథల్లో నటించాలని ఉంది? కథ ఎంపికలో మీ ప్రాధాన్యం దేనికి?

■ ఎప్పటికప్పుడు కొత్త జానర్స్ పుడుతూనే ఉన్నాయి. నేను ఇంకా చాలా చేయలేదు. హారర్ కామెడీ చేశాను కానీ, పూర్తి హారర్ సినిమా చేయలేదు. అలాగే నాకు ఎప్పట్నుంచో మూకీ సినిమా చేయాలని ఉంది. 'పుష్పకవిమానం'లో కమల్‌హాసన్ చేసినట్టుగా సంభాషణలేమీ చెప్పకుండానే నవ్వించాలని ఉంది. రెండు గంటలు అలా నవ్వించడం మామూలు విషయం కాదు కదా.

■ "దర్శకత్వం చేయాలని ఉంది. మూణ్నాలుగేళ్ల తర్వాత తప్పకుండా చేస్తా. కానీ సమస్య ఏమిటంటే... దర్శకుడినైతే కథలు రావడం ఆగిపోతుంది. నటించడానికైతే రెండు మూడు నెలలు సమయం సరిపోతుంది, అదే దర్శకత్వం అంటే ఒక సినిమాని పూర్తి చేయడానికి ఏడాదిన్నర అవుతుంది. పైగా ఒక సినిమా చేశాక 'ఇతనిలో దర్శకుడు కూడా ఉన్నాడు. మా కథల్లో జోక్యం చేసుకుంటాడేమో' అనే అనుమానాలు మొదలయ్యే అవకాశం ఉంది. అందుకే దర్శకత్వం ఇప్పుడే వద్దు అనుకున్నా. ఒకవేళ సినిమా చేస్తే మాత్రం 'దిల్‌వాలే దుల్హానియా లేజాయెంగే' తరహాలో ఎప్పటికీ నిలిచిపోయే ఒక సినిమా చేయాలని ఉంది".

■ "కామెడీ రచయితలు, దర్శకులు తగ్గిపోయారు. అందరూ పెద్ద సినిమాలు, సీరియస్ సినిమాలు చేయడంపైన దృష్టిపెడుతున్నారు. పైగా చాలామందిలో కామెడీ అంటే ఒక చిన్న చూపు కూడా ఉంది. కానీ నవ్వించడం కష్టమైన కళ. కామెడీ రాయడం ఇంకా కష్టం. తెరపై ఓ దెయ్యాన్ని చూపెట్టి భయపెట్టొచ్చేమో కానీ, కామెడీ అంత సులభం కాదు. ప్రత్యేకంగా సృష్టించి, సహజంగా నవ్వించాలి. పైగా ఈమధ్య అందరం సున్నితమైపోయాం. ఏ జోక్ వేస్తే ఎవరి మనోభావాలు దెబ్బతింటాయో చెప్పలేం. 'సీమశాస్త్రి', 'కితకితలు' లాంటి సినిమాల్ని ఇప్పుడు తీస్తే అవి విడుదల కూడా కావేమో. ప్రాసలు, కౌంటర్ల కాలం పోయింది. సామాజిక మాధ్యమాల్లోనే అలాంటి జోక్స్‌ని వినేస్తున్నాం. ఇప్పుడు చేస్తే, ఎవ్వరికీ తెలియని కామెడీనే చేయాలి. కథతోనే నవ్వించాలి. తదుపరి నేను చేసే రెండు సినిమాలూ అలాంటి హాస్యంతోనే తెరకెక్కుతాయి".

మన ఆత్మ స్క్రిప్ట్‌లో కనిపిస్తేనే...!

"వాస్తవ సంఘటనల ఆధారంగా అల్లుకున్న ప్రేమకథా చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఇది పరువు హత్యకు సంబంధించిన కథ కాదు కానీ, ఆ కోవలోనే ఉంటుంది" అన్నారు దర్శకుడు సాయిలు కంపాటి. ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్స్ నుంచి వస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు వేణు ఊడుగుల.. నిర్మాత రాహుల్ మోపిదేవితో కలిసి నిర్మించారు. సాయిలు దర్శకత్వం వహించారు. అఖిల్, తేజస్విని రావ్ జంటగా నటించారు. ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు సాయిలు కంపాటి పంచుకున్న విశేషాలివీ.



"ఇదొక యదార్థ ప్రేమకథ. బలమైన భావోద్వేగాలతో మనసుల్ని హత్తుకునేలా ఉంటుంది. 2004లో ఈ ఘటన జరిగింది. నేను చిన్నప్పుడు దీని గురించి విన్నాను. ఈ కథలో రాజు తన ప్రేయసి రాంబాయిని పెళ్లి చేసుకున్నట్లే ఊహించుకుని రాజు వెడ్స్ రాంబాయి అని రాస్తుంటాడు. మరి ఆ ప్రేమ జంట ప్రయాణం ఎలా సాగింది? ఆఖరికి వాళ్లకి ఏం జరిగింది? తెలియాలంటే సినిమా చూడాల్సిందే. అప్పట్లో మా ప్రాంతంలో ఎవరి మధ్యనైనా గొడవలు జరిగితే.. అన్నలు వచ్చి, కొట్టి, బెదిరించి ఆ సమస్యను సెటిల్ చేసేవాళ్లు. ఈ కథలో బాధిత కుటుంబం వాళ్లను కలిసి ఇలా సినిమా చేస్తున్నానని అడిగితే. 'సినిమా చేయి గానీ మా పేర్లు, ఫొటోలు బయటకు రాకుండా చూడమని కోరారు".

■ "ఈ చిత్ర విషయంలో రాంబాయి పాత్ర కోసం చాలా మంది కథానాయికల్ని వెతకాల్సి వచ్చింది. హీరో అఖిల్ మాత్రం మా వరంగల్ జిల్లాలోనే దొరికాడు. ఓ స్నేహితుడి ద్వారా తన ప్రొఫైల్ నా వద్దకు వచ్చింది. రాజు పాత్రకు కావాల్సిన ఈజ్ అతనిలో కనిపించి తనని ఎంపిక చేసుకున్నా. దీంట్లో హీరోయిన్ తండ్రి పాత్రలో చైతన్య జొన్నలగడ్డ నటన ఆకట్టుకుంటుంది. తనిందులో దివ్యాంగుడిగా కనిపిస్తారు. ఈ సినిమా చిత్రీకరణను గతేడాది ప్రారంభించాం. సగం చిత్రీకరణ పూర్తయ్యాక వర్షాలు, వరదలు వచ్చి ఆ ఊరు మునిగిపోయింది. ఇలా జరగడాన్ని చెడుగా భావించి.. అక్కడి గ్రామస్థులు తమ ఊరిలో చిత్రీకరణ చేయొద్దన్నారు. దీంతో మేము ఆ వరద ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ఆగి. ఊరి వాళ్లను బతిమాలి చిత్రీకరణ పూర్తి చేశాం. దీనివల్లే ఈ సినిమా కాస్త ఆలస్యమైంది".

■ "మాది వరంగల్ జిల్లా. చిన్నప్పటి నుంచే సినిమాలపై ఆసక్తి ఉండేది. బీటెక్ పూర్తి చేశాక ఓవైపు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూనే.. మరోవైపు కథలు రాసుకోవడం మొదలు పెట్టా. ఆరంభంలో కమర్షియల్ స్క్రిప్ట్స్ గురించి ఆలోచించినా ఆ తర్వాత మనదైన నేటివిటీ చూపించాలనిపించింది. మన ఆత్మ ఆ స్క్రిప్టులలో కనిపించాలనుకున్నా. అలా రాస్తూ.. దర్శకులు వేణు ఊడుగుల, శ్రీకాంత్ అడ్డాల దగ్గర సహాయ దర్శకుడిగా పని చేశా. ఈక్రమంలోనే ఓసారి వేణు అన్నకి ఈ 'రాజు వెడ్స్ రాంబాయి' స్క్రిప్ట్ వినిపిస్తే.. బాగుందని మెచ్చుకున్నారు. ఆ తర్వాత ఓ డెమో షూట్ చేసుకుని రమ్మంటే.. చేసి చూపించా. అది కూడా నచ్చడంతో ఈ సినిమాని తెరకెక్కించే అవకాశమిచ్చారు. ఆ తర్వాత ఈటీవీ విన్ వాళ్లు దీంట్లో భాగమయ్యారు. నా తదుపరి సినిమా కోసం సన్నాహాలు మొదలయ్యాయి. త్వరలో ఆ వివరాల్ని ప్రకటిస్తా".

వనం ఉంటేనే మనం



నాగదుర్గ

"సినిమా అంటే వినోదమే కాదు, విజ్ఞానం కూడా పంచేలా ఉండాలి. ప్రకృతి లేకపోతే మనం లేము అనే విషయాన్ని అచ్చమైన ఒక పల్లెటూరి కథతో చెప్పే ప్రయత్నమే మా చిత్రం" అంటున్నారు రాజ్ నరేంద్ర. ఆయన దర్శకత్వంలో నాగదుర్గ కథానాయికగా తెరకెక్కిన చిత్రం 'కలివివనం'. రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, బిత్తిరి సత్తి కీలక పాత్రలు పోషించారు. మల్లికార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి నిర్మాతలు. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ "మొక్కను చూస్తే మొక్కాలి కానీ, కొట్టేయకూడదనే స్పృహని కలిగించే ఓ మంచి చిత్రమిది. ప్రకృతి గొప్పతనాన్ని చాటి చెబుతూ, గొప్ప సందేశాన్నిస్తుంది. వందకు పైగా థియేటర్లలో సినిమాని విడుదల చేస్తున్నాం' అన్నారు. వనం ఉంటేనే మనం ఉంటామనే విషయాన్ని గొప్ప కథతో చెప్పే చిత్రమిదనీ, హరిత అనే పాత్రలో తాను నటించానని చెప్పారు నాగదుర్గ. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

'సరిపోదా శనివారం' దర్శకుడితో?



కార్తి వరుస సినిమాలతో తీరిక లేకుండా ఉన్నారు. ఇప్పటికే ఆయన నటించిన 'అన్నగారు వస్తారు' విడుదలకు సిద్ధమవుతుండగా. 'సర్దార్ 2', 'మార్షల్' చిత్రాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి. అయితే ఈలోపే ఆయన తదుపరి సినిమాకి సంబంధించి చర్చలు మొదలైనట్లు తెలిసింది. తెలుగు దర్శకుడు వివేక్ ఆత్రేయ తనకు ఓ కథ వినిపించారని సమాచారం. ఈ చర్చలు ఇప్పుడు ప్రారంభ దశలో ఉన్నట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే తెలుగులో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ దీన్ని నిర్మించనున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనిపై స్పష్టత రానుంది. వివేక్ గతేడాది 'సరిపోదా శనివారం'తో మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే.

బాలకృష్ణకు ఇఫి సత్కారం



అశోక్ గజపతిరాజు, బాలకృష్ణ, ప్రమోద్ సావంత్, మురుగన్

ప్రముఖ కథానాయకుడు బాలకృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. గోవా వేదికగా గురువారం ఘనంగా ప్రారంభమైన 56వ 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా(ఇఫి)' వేడుకలో ఆయన్ను సన్మానించారు. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఆయన్ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. నటుడిగా 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బాలకృష్ణకు ఈ గౌరవం దక్కింది. ఈ నెల 28 వరకూ ఈ చిత్రోత్సవం కొనసాగనుంది. ముగింపు వేడుకలో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు. ఆయనదీ 50 ఏళ్ల నట ప్రస్థానం. సన్మానం అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ.. తన ప్రయాణంలో భాగమైన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. "ఎన్టీఆర్-బసవతారకం దంపతులకు జన్మించడం నా అదృష్టం. ఈ ప్రయాణంలో నా సతీమణి వసుంధర మద్దతు చాలా ఉంది" అని పేర్కొన్నారు. సినిమాల్లోకి వచ్చి 50 ఏళ్లు అని, అసలు వయసు అడగొద్దు అంటూ నవ్వులు పూయించారు. నట ప్రయాణం ఇంకా కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఎన్టీఆర్ నట, రాజకీయ జీవితాన్ని, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి విశేషాలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు కూడా 'ఇఫి'కి హాజరయ్యారు. – పణజీ

ఉత్తమ నూతన దర్శకులకు రూ.17 లక్షలు

వర్ధమాన సినీ దర్శకులను ప్రోత్సహించే లక్ష్యంతో 'ఇఫి'కి అనుబంధంగా వేవ్స్ ఫిల్మ్ బజార్‌ను నిర్వాహకులు ప్రారంభించారు. ఉత్తమ చిత్రాలతో మెప్పించినవారికి 20 వేల డాలర్ల (సుమారు రూ.17 లక్షలు) నగదు బహుమతి అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా భరత్ భూషణ్



ప్రస్తుతం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌కి అధ్యక్షుడిగా ఉన్న పి.భరత్ భూషణ్ మరో కీలక పదవిని అందుకున్నారు. ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సినిమాలపై మక్కువతో 27ఏళ్లుగా డిస్ట్రిబ్యూటర్‌గా ఎన్నో విజయవంతమైన చిత్రాల్ని ప్రేక్షకులకు అందించారు భరత్ భూషణ్. తనని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకి ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు భరత్.

ప్రియాంక ఆపరేషన్ డ్రీమ్ థియేటర్



ప్రియాంక మోహన్

'ఓజీ'లో అగ్రహీరో పవన్ కల్యాణ్ సరసన కనిపించి ఇటీవలే ప్రేక్షకుల్ని అలరించిన ప్రియాంక మోహన్.. ఇప్పుడో కొత్త ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కన్నడ హీరో శివ రాజ్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. 'సప్తసాగరాలు దాటి' ఫేమ్ హేమంత్ ఎం.రావు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో కథానాయికగా ప్రియాంకను ఎంపిక చేసుకున్నారు. గురువారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా 'ఆపరేషన్ డ్రీమ్ థియేటర్‌లోకి స్వాగతం' అనే వ్యాఖ్యతో వెల్లడించింది చిత్రబృందం. 'ఓంధ్ కథే హెల్లా' అనే కన్నడ చిత్రంతో సినీరంగంలోకి అడుగు పెట్టిన ప్రియాంక.. మళ్లీ చాన్నాళ్లకు కన్నడలో నటిస్తుండడం విశేషం. డాలీ ధనుంజయ కీలక పాత్ర పోషిస్తున్నారు. 1970 నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపాయి సినీ వర్గాలు.

నా ఆలోచనల్ని రుద్దాలనుకోను

''విలక్షణమైన కథలు చేస్తాననే ఒక గుర్తింపును ఇచ్చారు ప్రేక్షకులు. అది నాకు దక్కిన ఒక గౌరవంలా భావించి మరింత బాధ్యతతో సినిమాలు చేస్తున్నా'' అంటున్నారు ప్రియదర్శి. ఆయన కథానాయకుడిగా.. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వంలో రూపొందిన 'ప్రేమంటే' ఈరోజు ప్రేక్షకుల ముందుకొస్తోంది. చిత్రం విడుదల సందర్భంగా ప్రియదర్శి గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.



"ప్రేమ, పెళ్లి జీవితంతో ముడిపడిన కథ ఇది. ప్రేమ ఎంత అద్భుతమైనదో మన కవులు, దర్శకులు తమ రచనలతోనూ, సినిమాలతోనూ గొప్పగా ఆవిష్కరించారు. అదంతా ఒక థియరీ అనుకుంటే, దాని అప్లికేషన్ కూడా మనకు అర్థం కావాలి. అది ఎక్కువసార్లు పెళ్లితోనే అర్థం అవుతుంది. ప్రేమంటే ఇంత బాగుంటుంది అనుకోవడం నుంచి... ఇలా కూడా ఉంటుందని చెప్పే ప్రయత్నమే ఈ సినిమా. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే భావోద్వేగాలు ఉంటాయి".

■ "ఇద్దరు ప్రేమలో ఉన్నప్పుడు ఆ ప్రయాణం కొన్నిసార్లు థ్రిల్లింగ్‌గా, ఓ సాహసోపేతమైన ప్రయాణంలా ఉండొచ్చు. ఆ ప్రయాణంలో వాళ్లకు ఎదురైన సమస్యల్ని ఎలా పరిష్కరించుకున్నారన్నది ఇందులో కీలకం. కథానాయిక ఆనంది మన వరంగల్ అమ్మాయి. తమిళంలో నటనకు ప్రాధాన్యమున్న సినిమాలు చేసి, తన ప్రతిభని చాటింది. సుమతో కలిసి ఇందులో నటించడం మంచి అనుభవం. తనని ఒక యాంకర్‌గానే చూశా. ఈ సినిమాతో వ్యక్తిగా, నటిగా చూడటం ప్రత్యేకంగా అనిపించింది".

■ "చేసే పాత్రలకీ, సొంత వ్యక్తిత్వానికీ సంబంధం లేనప్పుడే నా నుంచి ప్రయోగాత్మక చిత్రాలు వస్తుంటాయి. 'మల్లేశం', 'బలగం', 'కోర్ట్' సినిమాలు అలా వచ్చినవే. నాకున్న ఐడియాలజీని నా పాత్రలపైన రుద్దాలనే ఆలోచన ఎప్పుడూ ఉండదు. చాలామంది 'మీ స్టైల్‌లో ఒక సినిమా చేద్దాం' అంటుంటారు. నాకేం స్టైల్ లేదు, మీరు ఏదైనా కొత్తగా చెప్తే అదే నా స్టైల్ అవుతుందని చెబుతుంటాను. కథల విషయంలో నా ఆలోచనా ధోరణి అలా ఉంటుంది. ప్రస్తుతం పొలిటికల్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్న 'అసమర్థుడు', థ్రిల్లర్ నేపథ్యంలో సాగే 'సుయోధన' చిత్రాల్లో నటిస్తున్నా".

అంతకు మించి ఏమీ చెప్పలేను


"అభిమానం అనేది చాలా గొప్ప ఎమోషన్. ఎలాంటి బంధం లేకుండా ఓ పరిచయం లేని వ్యక్తిని ప్రేక్షకులు అంతలా ఎలా అభిమానిస్తారనిపించేది. 'ఆంధ్ర కింగ్ తాలూకా' కథ విన్నాక ఆ ప్రశ్నకు సమాధానం దొరికింది" అంది నటి భాగ్యశ్రీ బోర్సే. ఆమె.. రామ్ పోతినేని జంటగా నటించిన ఈ సినిమాని పి.మహేశ్‌బాబు తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఈ చిత్రం ఈనెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే భాగ్యశ్రీ గురువారం హైదరాబాద్‌లో మాట్లాడుతూ "నేను ఉత్తరాది నుంచి తెలుగులోకి వచ్చినప్పుడు ఇక్కడి ప్రేక్షకులు ఒక స్టార్‌ని ఇంత గొప్పగా ఎలా ఆరాధిస్తారో.. ప్రేమిస్తారో ప్రత్యక్షంగా చూశాను. ఈ కథలో అలాంటి ఓ అంశం ఉంది. అలాగే ఓ స్వచ్ఛమైన ప్రేమకథతో అది ముడిపడి ఉంది. ఈ చిత్రంలో నేను మహాలక్ష్మి అనే పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తాను. కాలేజీ చదివే తను రామ్ పోషించిన సాగర్ పాత్రతో ప్రేమలో పడుతుంది. దీనికన్నా ఈ ప్రేమకథ గురించి ఎక్కువ చెప్పలేను. నాకోసం ఎలాంటి కథలు, పాత్రలు రాసి పెట్టి ఉన్నాయో నాకు తెలియదు. వచ్చిన ప్రతి పాత్రకు వందశాతం న్యాయం చేస్తూ విలక్షణ నటిగా పేరు తెచ్చుకోవాలని ఉంది. అనుష్క చేసిన 'అరుంధతి' లాంటి పాత్రలు చేయాలని ఉంది. నన్ను అందరూ తమ తెలుగమ్మాయిగా అభిమానిస్తున్నారు. ఇలాంటి అభిమానం, గౌరవం, ప్రేమ మరింత పొందాలని కోరుకుంటున్నా" అని చెప్పింది.



భాగ్యశ్రీ బోర్సే

కొవ్వు ఆమ్లాలు

కొవ్వు ఆమ్లాలు పొడవైన కార్బన్ శృంఖలాలను కలిగిన కార్బాక్సిలిక్ ఆమ్లాలు. అంటే ఇవి –COOH ప్రమేయ సమూహం ఉన్న సమ్మేళనాలు. ఇవి జీవకణాల్లోని లిపిడ్లకు ప్రాథమిక ఘటకాలు. జీవకణాల్లో శక్తి నిల్వ, కణ కవచ నిర్మాణం, జీవక్రియల్లో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. ఈ ఆమ్లాలు హార్మోన్ల సంశ్లేషణలో, కొవ్వు నిల్వల రూపంలో అవయవాల చుట్టూ రక్షణ పొరగా, శరీర ఉష్ణోగ్రతను స్థిరంగా ఉంచడంలో సహాయపడతాయి. ఒమేగా-3, ఒమేగా-6 కొవ్వు ఆమ్లాలు మెదడు అభివృద్ధి, జ్ఞాపకశక్తి, నాడీ సంకేత ప్రసారంలో ప్రముఖపాత్ర వహిస్తాయి.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
కెమిస్ట్రీ

తల భాగం నీటిలో.. తోక నూనెలో కరుగుతాయి!

- ✦ కొవ్వు ఆమ్లాల సాధారణ ఫార్ములా: **R–COOH**
- ✦ ఇక్కడ R కార్బన్ అణువుల శృంఖలాన్ని సూచిస్తుంది. ఇది సాధారణంగా 4 - 24 వరకు కార్బన్ అణువులను కలిగి ఉంటుంది.

ఉదా: బ్యూటిరిక్ ఆమ్లం, పామిటిక్ ఆమ్లం, స్టియరిక్ ఆమ్లం, లినోలిక్ ఆమ్లం మొదలైనవి

- ☛ కొవ్వు ఆమ్లాలు జలవిరోధి అంత్యాలు/తోకలు, జలసఖ్యత తలను కలిగి ఉంటాయి.
- ☛ కొవ్వు ఆమ్లాల తోకలు నీటిలో కరగవు, నూనెల్లో కరుగుతాయి. వీటి తల భాగాలు నీటిలో కరుగుతాయి.

కొవ్వు ఆమ్లాల వర్గీకరణ

I. సంతృప్తత ఆధారంగా

కొవ్వు ఆమ్లాలను హైడ్రోకార్బన్ తోకలోని కార్బన్ పరమాణువుల మధ్య సంతృప్తత ఆధారంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

సంతృప్త కొవ్వు ఆమ్లాలు: సంతృప్త కొవ్వు ఆమ్లాల శృంఖలాల్లో కార్బన్ పరమాణువుల మధ్య ఏక బంధాలు (C–C) మాత్రమే ఉంటాయి. కార్బన్-కార్బన్ ద్విబంధాలను కలిగి ఉండవు.

- ❖ ఇవి సాధారణంగా గది ఉష్ణోగ్రత వద్ద ఘనరూపంలో ఉంటాయి. వీటిలో కార్బన్ సరళ శృంఖలాలు ఒకదానికి మరొకటి దగ్గరగా అమరి ఉండటమే కారణం.
- ❖ ఇవి అధిక ద్రవీభవన స్థానాన్ని కలిగి ఉంటాయి.
- ❖ సంతృప్త కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా జంతువుల కొవ్వుల్లో లభిస్తాయి.
- ❖ శరీరంలో చెడు కొలెస్ట్రాల్ (LDL: Low Density Lipoprotein) పెరగడానికి సంతృప్త కొవ్వు ఆమ్లాలు కారణం అవుతాయి.

కొవ్వు ఆమ్లం	కార్బన్ల సంఖ్య	రసాయన ఫార్ములా	నిర్మాణం	సాధారణ మూలం
బ్యూటిరిక్ ఆమ్లం	4	$C_4H_8O_2$	$CH_3(CH_2)_2COOH$	వెన్న
క్యాప్రిలిక్ ఆమ్లం	8	$C_8H_{16}O_2$	$CH_3(CH_2)_6COOH$	కొబ్బరి నూనె



రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్

అసంతృప్త కొవ్వు ఆమ్లాలు: అసంతృప్త కొవ్వు ఆమ్లాల శృంఖలాల్లో కార్బన్ పరమాణువుల మధ్య ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ద్విబంధాలు (C=C) ఉంటాయి.

- ◆ సాధారణంగా ఇవి గది ఉష్ణోగ్రత వద్ద ద్రవస్థితిలో ఉంటాయి. దీనికి కారణం వీటిలో ద్విబంధాలు కలిగిన కార్బన్ శృంఖలాలు మెలికలు తిరిగి ఒకదానికి మరొకటి దగ్గరగా అమరి ఉండటాన్ని నిరోధిస్తాయి.
- ◆ ఇవి తక్కువ ద్రవీభవన స్థానాన్ని కలిగి ఉంటాయి.
- ◆ ఈ కొవ్వు ఆమ్లాలు శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి, మంచి కొలెస్ట్రాల్‌ను (HDL: High Density Lipoprotein) పెంచడానికి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో ఉపయోగపడతాయి.
- ◆ ఇవి గింజలు, అవకాడో, ఆలివ్, పొద్దుతిరుగుడు, సోయాబీన్ నూనెలు లాంటి కూరగాయల/శాకాయుత నూనెల్లో లభిస్తాయి.
- ◆ అసంతృప్త కొవ్వు ఆమ్లాలను తిరిగి రెండు రకాలుగా విభజించవచ్చు. అవి:

ఎ) ఏక అసంతృప్త కొవ్వు ఆమ్లాలు:

ఈ రకం కొవ్వు ఆమ్లాల్లో కార్బన్ పరమాణువుల మధ్య ఒక ద్విబంధం ఉంటుంది.

కొవ్వు ఆమ్లం	కార్బన్ల సంఖ్య	నిర్మాణం	సాధారణ మూలం
ఓలిక్ ఆమ్లం	18	$CH_3(CH_2)_7CH = CH(CH_2)_7COOH$	ఆలివ్ ఆయిల్
పామిటోలిక్ ఆమ్లం	16	$CH_3(CH_2)_5CH = CH(CH_2)_7COOH$	మకాడమియా గింజలు

బి) బహు అసంతృప్త కొవ్వు ఆమ్లాలు:

ఈ రకం కొవ్వు ఆమ్లాల్లో కార్బన్ పరమాణువుల మధ్య రెండు లేదా అంతకంటే ఎక్కువ ద్విబంధాలు ఉంటాయి.

కొవ్వు ఆమ్లం	కార్బన్ల సంఖ్య	నిర్మాణం	సాధారణ మూలం
లినోలిక్ ఆమ్లం (Omega-6)	18	$CH_3(CH_2)_4(CH = CHCH_2)_2(CH_2)_6COOH$	పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, సోయాబీన్ నూనె
లినోలెనిక్ ఆమ్లం (α-Linolenic acid) (Omega-3)	18	$CH_3CH_2(CH = CHCH_2)_3(CH_2)_6COOH$	అవిసె గింజలు, వాల్‌నట్‌లు, చియా గింజలు, సోయాబీన్ నూనె, చేప నూనె

2. మూలం ఆధారంగా

కొవ్వు ఆమ్లాలను వాటి మూలం ఆధారంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

జంతు ఆధారిత కొవ్వు ఆమ్లాలు: ఇందులో ప్రధానంగా సంతృప్త కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. అధిక సంతృప్త కొవ్వు ఆమ్లాలు ఉండటం వల్ల గది ఉష్ణోగ్రత వద్ద ఘనస్థితిలో ఉంటాయి.

మూలం: వెన్న, చేపల నూనె, మాంసం, పౌల్ట్రీ ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు

ఉదా: స్టియరిక్ ఆమ్లం, పామిటిక్ ఆమ్లం మొదలైనవి.

మొక్కల ఆధారిత కొవ్వు ఆమ్లాలు: వీటిలో ఏక అసంతృప్త కొవ్వు ఆమ్లాలు, బహు అసంతృప్త కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి.

- ● అధిక అసంతృప్త కొవ్వు ఆమ్లాలు ఉండటం వల్ల సాధారణంగా గది ఉష్ణోగ్రత వద్ద ద్రవస్థితిలో ఉంటాయి.

మూలం: విత్తనాలు, అవకాడో, ఆలివ్, సోయాబీన్, పొద్దుతిరుగుడు లాంటి నూనెలు

ఉదా: ఓలిక్ ఆమ్లం, లినోలెనిక్ ఆమ్లం మొదలైనవి.

3. అవశ్యకత ఆధారంగా

కొవ్వు ఆమ్లాల ఆవశ్యకత ఆధారంగా వీటిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

ఆవశ్యక కొవ్వు ఆమ్లాలు: వీటిని శరీరం స్వయంగా తయారు చేయలేదు. కాబట్టి వీటిని ఆహారం నుంచి తప్పనిసరిగా తీసుకోవాలి.

ఉదా: లినోలిక్ ఆమ్లం, లినోలెనిక్ ఆమ్లం, అరాకిడోనిక్ ఆమ్లం, డోకోసాహెక్సోనోయిక్ ఆమ్లం లాంటి ఒమేగా-3, ఒమేగా-6 కొవ్వు ఆమ్లాలు.

అనావశ్యక కొవ్వు ఆమ్లాలు: వీటిని శరీరం స్వయంగా ఇతర పోషక సమ్మేళనాల నుంచి ఉత్పత్తి చేసుకుంటుంది. కాబట్టి ఆహారం ద్వారా వీటిని తీసుకోవాల్సిన అవసరం లేదు.

ఉదా: పామిటిక్ ఆమ్లం, స్టియరిక్ ఆమ్లం మొదలైనవి.

Word of the Day 837

Officious

Telugu meaning: అనుచిత, ఉచిత సలహాలిచ్చే

English meaning: Officious (ఆఫీషియస్) describes someone who is overly eager to offer unwanted help, advice, or interference, often in an annoying or intrusive way.

Synonyms: Interfering, Intrusive; ***Antonyms:*** Reserved, Modest

Usage: **1.** The officious guard kept interrupting visitors with unnecessary instructions.

2. His officious behaviour during meetings made others uncomfortable as he constantly inserted himself into matters that did not concern him.

నోటిఫికేషన్స్

నాన్ టీచింగ్ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) దుర్గాపుర్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ గ్రూప్-ఎ, బి, సి పోస్టుల భర్తీకి ఆఫ్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 118. దరఖాస్తు ఫీజు రూ.1500. అర్హులైన అభ్యర్థులు 2025, డిసెంబరు 2లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ట్రేడ్ అప్రెంటిస్ పోస్టులు

దిల్లీలోని డీఆర్‌డీవో - సెంటర్ ఫర్ ఫైర్, ఎక్స్‌ప్లోజివ్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సేఫ్టీ (సీఎఫ్ఈఈఎస్) ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 38. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 10 డిసెంబరు 2025.

పీహెచ్‌డీ ప్రవేశాలు

అమేథీ (ఉత్తర్‌ప్రదేశ్)లోని రాజీవ్ గాంధీ నేషనల్ ఏవియేషన్ యూనివర్సిటీ (ఆర్‌జీఎన్ఏయూ) 2025-26 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. మొత్తం సీట్ల సంఖ్య 25. దరఖాస్తు ఫీజు రూ.500. అర్హులైన అభ్యర్థులు 2025 నవంబరు 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?


కింది ఉద్యోగాలకు నేడే (నవంబరు 21) చివరి తేదీ

- ☛ ఏపీఎన్ఎల్‌లో 133 జూనియర్ టెక్నీషియన్ పోస్టులు. డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ☛ కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 27 ఆపరేటర్ ఉద్యోగాలు. ఏడో తరగతి ఉత్తీర్ణతతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- ☛ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్‌లో 21 డిప్లొమా టెక్నీషియన్ పోస్టులు. డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ☛ ఎయిమ్స్ దిల్లీలో రిసెర్చ్ సైంటిస్ట్ ఉద్యోగాలు. పీజీ, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- ☛ ఐఐపీఈ విశాఖలో జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్) పోస్టులు. బీటెక్, ఎంఎస్సీ, ఎంటెక్ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

చంద్రశేఖర్ — శాస్త్రవేత్తలు విశేషాలు

20వ శతాబ్దపు ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్తల్లో చంద్రశేఖర్ ఒకరు. ఈయన సంఖ్యా సిద్ధాంతం, సమ్మబిలిటీ రంగాల అభివృద్ధిలో చేసిన కృషికి ప్రసిద్ధి చెందారు. మ్యాథ్స్‌కి సంబంధించి ఆయన అనేక పుస్తకాలు రచించారు. గణిత సూత్రాలను ప్రజలకు దగ్గర చేయడంలో, సులభంగా అభ్యసనం చేయడంలో ఇవి ఎంతగానో తోడ్పడ్డాయి. నవంబరు 21న చంద్రశేఖర్ జన్మదినం సందర్భంగా ఆయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!



బాల్యం – వృత్తి జీవితం

ఈయన పూర్తి పేరు కొమరవోలు చంద్రశేఖర్. 1920, నవంబరు 20న ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలో జన్మించారు. తండ్రి బాపట్లలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా ఉండేవారు. ఆయన స్కూలింగ్ మొత్తం అక్కడే జరిగింది.


- ✦ ఉన్నత విద్య కోసం నాటి మద్రాస్‌లోని ప్రెసిడెన్సీ కాలేజ్‌లో చేరారు. 1940లో గణితంలో బీఏ ఆనర్స్ డిగ్రీ పొందారు.
- ✦ 1940-43 మధ్య కాలంలో మద్రాస్ విశ్వవిద్యాలయంలోని గణితశాస్త్ర విభాగంలో రిసెర్చ్ స్కాలర్‌గా చేరారు.
- ✦ 1943-46 సమయంలో ప్రెసిడెన్సీ కాలేజ్‌లో పార్ట్‌టైం లెక్చరర్‌గా పనిచేశారు.
- ✦ 1949లో చంద్రశేఖర్‌ను టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (టీఐఎఫ్ఆర్) వ్యవస్థాపకులు హోమీ జహంగీర్ బాబా టీఐఎఫ్ఆర్ స్కూల్ ఆఫ్ మ్యాథమెటిక్స్‌లో అధ్యాపకుడిగా చేరాల్సిందిగా ఆహ్వానించారు. అదే ఏడాది ఆయన టీఐఎఫ్ఆర్‌లో చేరారు.

చివరగా: టీఐఎఫ్ఆర్‌లో పనిచేసిన కాలంలో చంద్రశేఖర్ తీసుకున్న నిర్ణయాల ఫలితంగా నేటికీ అది ప్రపంచవ్యాప్తంగా అత్యున్నత సంస్థగా ఉంది. విదేశీ విశ్వవిద్యాలయాలు, సంస్థల తరహాలో భారత విద్యా సంస్థలు ఎదగాలని ఆయన భావించేవారు. విద్యార్థులకు చదువుతోపాటు నైపుణ్యాలను అందించాలని, వాటికోసం ప్రత్యేకంగా పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

చంద్రశేఖర్ ప్రముఖ రచనలు, ఆయన పొందిన గౌరవాలు - పురస్కారాల గురించి తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

ఇకైనోడర్మేటా



ఫైలమ్ ఇకైనోడర్మేటాకు చెందిన జీవులు ప్రత్యేకమైన సముద్ర జీవులు. ఇప్పటివరకు భూసంబంధ లేదా మంచినీటి ఇకైనోడర్మ్‌లు ఉన్నట్లు గుర్తించలేదు. ఇవి బాగా అభివృద్ధి చెందిన అవయవ వ్యవస్థలతో ఉన్న బహుకణ జీవులు. ఈ ఫైలమ్‌కు చెందిన జీవులన్నీ దాదాపు ఒకే లక్షణాలను కలిగి ఉంటాయి. పర్యావరణపరంగా, భౌగోళికంగా ముఖ్యమైన ఈ జీవులు వివిధ వర్ణాల్లో, ప్రత్యేకమైన ఆకారంతో ఉంటాయి.

లక్షణాలు

ఇవి నక్షత్రం లాంటి రూపాన్ని కలిగి ఉంటాయి. కొన్ని గోళాకారంగా లేదా పొడవుగా ఉంటాయి.

- ❖ ఇవి ప్రత్యేకంగా సముద్ర జీవులు.
- ❖ స్పైనీ - స్కిన్‌ను కలిగి ఉంటాయి.
- ❖ ఈ జీవులు నిర్మాణపరంగా అవయవ వ్యవస్థ స్థాయిని ప్రదర్శిస్తాయి.

ప్రధాన ఉదాహరణలు

సముద్ర నక్షత్రాలు (ఆస్టెరాయిడియా)

- ❖ సముద్రపు అర్చిన్‌లు (ఇకినోయిడియా)
- ❖ పెళుసుగా ఉండే నక్షత్రాలు (ఎఫియురాయిడియా)
- ❖ సముద్ర దోసకాయలు (హోలోతురాయిడియా)
- ❖ సముద్రపు లిల్లీలు (క్రినోయిడియా)

ఇకైనోడర్మేటా - ప్రాముఖ్యత, న్యూట్రియంట్ సైక్లింగ్, ఆర్థిక ప్రాముఖ్యత మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

What does the term Arboriculture refer to?

Current Affairs

1. Which organisation has launched the 'Aadhaar Vision 2032' Framework to strengthen India's digital identity infrastructure?
A) NITI Aayog B) UIDAI C) MeitY D) Digital India Corporation

2. In which year is India scheduled to host the Historic Maritime Convergence, a major event aimed at strengthening naval cooperation and maritime security?
A) 2025 B) 2024 C) 2026 D) 2027

3. Who inaugurated the WAVES Bazaar at IndiaJoy 2025 held in Hyderabad?
A) Anurag Thakur B) Sanjay Jaju C) Apurva Chandra D) Ashwini Vaishnaw

4. The Aviation Corps of the Indian Army celebrated its 40th Raising Day in which year?
A) 2024 B) 2022 C) 2023 D) 2025

5. Which organisation has launched the SMART-CROP Project to promote sustainable agricultural practices in India?
A) NABARD B) SBI Foundation C) NITI Aayog D) ICAR

6. Where was the Indigenous Survey Ship 'Ikshak', commissioned by the Indian Navy, officially inducted?
A) Kochi B) Visakhapatnam C) Mumbai D) Chennai

7. Which country launched its largest-ever defence training initiative on November 6, 2025, as announced by Defence Minister Wladyslaw Kosiniak-Kamysz?
A) Germany B) Poland C) France D) Italy

8. Which district has officially become the most populated district in India as of 2025, surpassing Thane (Maharashtra)?
A) Patna (Bihar) B) Jaipur (Rajasthan) C) North 24 Parganas (West Bengal) D) Lucknow (Uttar Pradesh)

General Science

9. Who discovered that the Earth behaves like a giant magnet, with magnetic field lines determining the strength of its magnetic field?
A) Michael Faraday B) William Gilbert C) Hans Christian Orsted D) James Clerk Maxwell

10. Which rule in organic chemistry states that a double bond cannot exist at the bridgehead position of a bridged ring system unless the ring is sufficiently large?
A) Bredt's Rule B) Markovnikov's Rule C) Saytzeff's Rule D) Hund's Rule

SSC Exams Special

General Awareness

11. In which group of organisms is a hypostome-a structure used for anchoring and feeding-commonly found?
A) Annelids B) Molluscs C) Amphibians D) Arthropods

12. What is the process called in which fats are broken down into smaller droplets to aid enzyme action during digestion?
A) Saponification B) Oxidation C) Emulsification D) Hydrolysis

Polity

13. Which committee recommended a constitutional amendment to ensure regular elections, defined functions, and financial support for local government institutions in India?
A) Balwant Rai Mehta Committee B) P.K. Thungan Committee C) Ashok Mehta Committee D) G.V.K. Rao Committee

14. The Indian High Courts Act of 1861 led to the establishment of High Courts in which three cities?
A) Delhi, Calcutta, and Mumbai B) Chennai, Patna, and Allahabad C) Hyderabad, Kolkata, and Agra D) Calcutta, Madras, and Bombay

15. Which Article of the Indian Constitution provides for reservation of seats for Scheduled Castes (SCs) and Scheduled Tribes (STs) in State Legislative Assemblies?
A) Article 330 B) Article 331 C) Article 332 D) Article 333

16. Which Constitutional Amendment gave special constitutional status and protection to all cooperative societies in India under Part IX-B?
A) 91st Amendment Act, 2003 B) 94th Amendment Act, 2006 C) 97th Amendment Act, 2011 D) 100th Amendment Act, 2015

Geography

17. What was the main objective of the Green Revolution initiated in India?
A) To promote organic farming B) To increase industrial output C) To encourage cash crop cultivation D) To achieve self-sufficiency in food grains

18. What does the term Arboriculture refer to?
A) Cultivation of trees, shrubs, and woody plants for shading and decoration
B) Study of soil and crop management techniques
C) Cultivation of herbs and medicinal plants
D) Science dealing with fruit production and orchard management

19. Which year in Indian demographic history is known as the 'Year of Great Demographic Divide' due to a recorded decline in population growth?
A) 1911 B) 1921 C) 1931 D) 1941

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

యుద్ధ ట్యాంకులకు యమపాశం జావెలిన్

మారుతున్న భద్రతా పరిస్థితుల దృష్ట్యా వేగంగా సైనిక బలగాలను ఆధునికీకరిస్తున్న భారత్ మరిన్ని ఆయుధ వ్యవస్థలను సమకూర్చుకునేందుకు సిద్ధమవుతోంది. ట్యాంకుల పాలిట సింహస్వప్నంగా నిలిచే జావెలిన్ క్షిపణి వ్యవస్థను మన దేశానికి విక్రయించేందుకు అమెరికా సిద్ధమైంది. ఇది మన సైనికుల పోరాట సామర్థ్యాన్ని మరింత రాటుదేలుస్తుంది. యుద్ధరంగంలో వారిని సురక్షితంగా ఉంచడానికి ఇది దోహదపడుతుంది.





పరిధి: 65 మీటర్ల నుంచి 4 కిలోమీటర్ల వరకూ	బరువు: క్షిపణి: 11.8 కిలోలు; సీఎల్‌యూ: 7 కిలోలు; రౌండ్: 15.5 కిలోలు	పొడవు: క్షిపణి: 108.2 సెంటీమీటర్లు	లాంచ్ ట్యూబ్: 119.8 సెంటీమీటర్లు

ఏమిటీ జావెలిన్?

ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా వినియోగమవుతున్న ఆధునిక ట్యాంకు విధ్వంసక క్షిపణుల్లో జావెలిన్ ఒకటి. దీన్ని అమెరికాకు చెందిన రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు సంయుక్తంగా ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ అస్త్రాన్ని ప్రయోగించడానికి భారీ లాంఛ్ వ్యవస్థలు అవసరం లేదు. సైనికుడి భుజంపైనుంచి సులువుగా ప్రయోగించవచ్చు. ఇది 'ఫైర్ అండ్ ఫర్గెట్' ఆయుధం. అంటే.. లక్ష్యాన్ని నిర్దేశిస్తే దాన్ని వేటాడే పనిని ఈ క్షిపణి చూసుకుంటుంది. ఇందులో పరారుణ సీకర్ ఉంటుంది. ప్రయోగానికి ముందే దీన్ని లక్ష్యంతో 'లాక్-ఆన్' చేయవచ్చు. ప్రయోగానంతరం.. ఈ క్షిపణి.. లక్ష్యం దిశగా సొంతంగా మార్గనిర్దేశం చేసుకుంటుంది. ఫలితంగా సైనికుడిపై భారం తగ్గుతుంది. ఈలోగా అతడు.. తానున్న ప్రదేశాన్ని ప్రత్యర్థి గుర్తించకుండా వేరేచోటుకు వెళ్లిపోవచ్చు. లేదా మరో క్షిపణిని లోడ్ చేసుకొని ఇంకో లక్ష్యం వైపు గురిపెట్టవచ్చు.

రెండు రకాలు

జావెలిన్‌లో రెండు రకాల మోడ్‌లు ఉన్నాయి. 1. టాప్ ఎటాక్ మోడ్. ఇది నింగిలోకి దాదాపు 500 అడుగుల ఎత్తు వరకూ పైకిలేచి, శత్రు ట్యాంకు పైభాగంపైకి దూసుకొస్తుంది. ఆ ప్రదేశంలో ట్యాంకు కవచం అంత పటిష్ఠంగా ఉండదు. 2. డైరెక్ట్ ఎటాక్ ఆప్షన్. ఇది సూటిగా వెళ్లి లక్ష్యాన్ని తాకుతుంది. ఈ విధానంలో బంకర్లు, భవనాలు, సమీపంలోని సైనిక వాహనాలను ధ్వంసం చేయవచ్చు.

ఈ క్షిపణి వ్యవస్థలో సాఫ్ట్‌లాంచ్ డిజైన్ ఉంది. అందువల్ల బంకర్లు, భవనాలు వంటి నిర్మాణాల నుంచి దీన్ని సురక్షితంగా ప్రయోగించే వీలుంది.

- తొలుత ఒక తేలికపాటి మోటార్.. క్షిపణిని లాంచర్ నుంచి బయటకు నెట్టేస్తుంది. అలా అది గాల్లో కొద్దిసేపు సురక్షిత దూరం వరకూ ప్రయాణిస్తుంది.
- ఆ తర్వాత ప్రధాన మోటారు ప్రజ్వరిల్లుతుంది. అప్పుడు వేడి వాయువులు చిమ్ముకుంటూ దూసుకెళుతుంది. ఈ ఏర్పాటు వల్ల జావెలిన్‌ను ప్రయోగించిన సైనికుడికి వేడి వాయువుల నుంచి రక్షణ లభిస్తుంది. అలాగే ప్రత్యర్థికి సంబంధించిన పరారుణ సెన్సర్లు, రాడార్లు.. ఈ క్షిపణి ఎక్కడి నుంచి వచ్చిందన్నది నిర్దిష్టంగా గుర్తించలేవు.

పటిష్ఠ కవచాలు సైతం..

జావెలిన్ వ్యవస్థలో క్షిపణి, రీయూజబుల్ కమాండ్ లాంచ్ యూనిట్ (సీఎల్‌యూ) ఉంటాయి. క్షిపణిని డిస్పోజబుల్ లాంచ్ ట్యూబ్‌లో ఉంచుతారు. సీఎల్‌యూలో పగలు, రాత్రి చూడగలిగే ఇమేజింగ్ వ్యవస్థలు ఉంటాయి. అందువల్ల ఈ అస్త్రాన్ని భిన్నరకాల వాతావరణాల్లో వినియోగించొచ్చు.

- ట్యాంకులకు ఉండే సంప్రదాయ కవచంతోపాటు దుర్భేద్య ఎక్స్‌ప్లోజివ్ రియాక్టివ్ ఆర్మర్ (ఈఆర్‌ఏ)లనూ ఛేదించే సత్తా జావెలిన్ సొంతం.
- ఇది ట్యాంకును ధ్వంసం చేయడానికి రెండు రకాల పేలుళ్లను సృష్టిస్తుంది. ట్యాంకు కవచాన్ని ఛేదించడానికి ఒకటి, లోపలికి వెళ్లాక ఆ శకటాన్ని పూర్తిగా ధ్వంసం చేయడానికి రెండో పేలుడును సృష్టిస్తుంది.

ఈ అస్త్రాన్ని అఫ్గానిస్థాన్, ఇరాక్‌లలో విరివిగా ఉపయోగించారు. 5వేలకుపైగా శత్రు లక్ష్యాలను ఇది ధ్వంసం చేసింది. రష్యాపై పోరులో ఉక్రెయిన్ కూడా ఈ అస్త్రాలను భారీగా ప్రయోగించింది. రష్యా ట్యాంకుల విధ్వంసంలో ఇది సాధించిన ట్రాక్ రికార్డు దృష్ట్యా దీన్ని ఉక్రెయిన్‌లో 'సెయింట్'గా అభివర్ణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ఎగుమతవుతున్న ట్యాంకు విధ్వంసక గైడెడ్ క్షిపణి వ్యవస్థల్లో ఇదొకటి. ఉత్తర అమెరికా, ఐరోపా, పశ్చిమాసియా, ఇండో-పసిఫిక్ ప్రాంతాల్లోని 25కిపైగా దేశాలు దీన్ని ఉపయోగిస్తున్నాయి. లక్ష్య ఛేదనలో దీని కచ్చితత్వం 94 శాతంగా ఉంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

భూమి మ్యాపింగ్‌కు ఏఐ డ్రోన్ వ్యవస్థ

దిల్లీ: దేశంలో భూమి సర్వేల రూపకల్పనలో లోపాన్ని అధిగమించడానికి ఎన్‌.ఐ.టి.-రవుర్కెలా పరిశోధకులు కృత్రిమ మేధ (ఏఐ) డ్రోన్లను మేళవించి 'భూ మానచిత్ర' అనే భూ నక్షా (నేవిగేషన్) వ్యవస్థను రూపొందించారు. అది స్వయంచాలిత రియల్ టైమ్ భూ మ్యాపింగ్ డ్రోన్ వ్యవస్థ. ఇంటర్నెట్, కంప్యూటర్, మానవ జోక్యం లేకుండా తనకుతాను భూమి మ్యాప్‌లను తయారుచేయగలదు. వ్యవసాయ భూములు, అడవులు, పట్టణ ప్రాంతాలను భూ మానచిత్ర సమర్థంగా చేస్తుంది. మారుమూల ప్రాంతాలను కూడా మ్యాప్‌పై గుర్తిస్తుంది. సాధారణ డ్రోన్లు తీసే చిత్రాలను తరవాత లేబులింగ్ చేయడానికి కొన్ని వారాలు పడుతుంది. వీటికి భిన్నంగా భూ మానచిత్ర తనకుతానే చిత్రాలను ప్రాసెస్ చేస్తుంది. మారుమూల ప్రాంతాలతోపాటు ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రాంతాలలో, కమ్యూనికేషన్ నెట్‌వర్కులు లేని ప్రాంతాలలో కూడా భూ మానచిత్ర డ్రోన్ వ్యవస్థ పనిచేస్తుంది. భూ రికార్డుల ఆధునికీకరణ, పట్టణ ప్రణాళికలు, స్మార్ట్‌సిటీ నమూనాల రూపకల్పనకు తోడ్పడుతుంది. భూ మానచిత్ర సాయంతో పంటల పరిస్థితి, భూసారాన్ని, సాగునీటి అవసరాలనూ పరిశీలించవచ్చు.

మెటాపై దావా గెలిచిన స్పానిష్ పత్రికలు

బార్సిలోనా: స్పెయిన్‌లోని దాదాపు 81 వార్తా పత్రికలు, మ్యాగజైన్లు, రేడియో, టీవీ ఛానళ్లకు మెటా కంపెనీ 48.1 కోట్ల యూరోల (సుమారు రూ.4,900 కోట్ల) నష్టపరిహారం చెల్లించాలని స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లోని మర్కంటైల్ కోర్టు గురువారం ఆదేశించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ కంపెనీల మాతృసంస్థ అయిన మెటా.. ఐరోపా చట్టాలను ఉల్లంఘించి ఇంటర్నెట్ వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని అక్రమంగా సేకరించి, వాణిజ్య ప్రకటనలకు ఉపయోగించుకుంటోందని స్పానిష్ పత్రికలు, టీవీ ఛానళ్లు కేసు పెట్టాయి. వారి వాదనల్ని ఆమోదించిన మర్కంటైల్ కోర్టు మెటాకు భారీ జరిమానా విధించింది. ఆ సొమ్మును స్పానిష్ పత్రికలు, టీవీ, రేడియో ఛానళ్లకు చెల్లించాలని ఆదేశించింది. మార్కెట్‌లో తన ఆధిక్యాన్ని మెటా ఉపయోగించుకుని స్పానిష్ డిజిటల్ మీడియా సంస్థలకు ఆన్‌లైన్ వాణిజ్య ప్రకటనలు రాకుండా, ఆదాయానికి గండి కొట్టిందని కోర్టు వ్యాఖ్యానించింది.

ఏడాదిన్నర బాలుడికి తోక!

ఈటీవీ భారత్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బలరాంపుర్ వైద్యులు తోకలాంటి శరీర భాగంతో పుట్టిన ఏడాదిన్నర చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స చేసి దానిని తొలగించారు. లఖ్‌నవూకు చెందిన ఈ బాలుడికి నడుము భాగంలో పుట్టుకతోనే చిన్న తోకలాంటిది ఉంది. వయసుతోపాటు అది పెరుగుతూ వచ్చింది. తల్లిదండ్రులు పలు ఆస్పత్రులు తిరిగాక చిన్నారికి శస్త్రచికిత్స చేసేందుకు బలరాంపుర్ వైద్యులు అంగీకరించారు. ఈ తోక వెన్నెముక ఎముకలైన వెర్టిబ్రా మధ్యలో ఉన్న స్పైనల్ కార్డ్‌ను కప్పే మెంబ్రేన్‌లకు గట్టిగా అతుక్కున్నట్లు శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ అఖిలేశ్ కుమార్ తెలిపారు. నవంబరు 14న జరిగిన శస్త్రచికిత్సలో చాలా జాగ్రత్తగా దాన్ని తొలగించామని, బాలుడి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందన్నారు.



వాహ్..తాజ్

- జూనియర్ ట్రంప్ కితాబు

ఆగ్రా: ప్రేమకు చిహ్నమైన తాజ్‌మహల్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనయుడు జూనియర్ ట్రంప్ గురువారం తన స్నేహితులతో కలిసి సందర్శించారు. కట్టడం వివరాలు తెలుసుకోవడంపై ఆసక్తి కనపరిచారు. డయానా బెంచ్ సహా పలుచోట్ల ఫొటోలు తీసుకున్నారు. కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య సుమారు గంటసేపు ఆయన అక్కడ విహరించారు. 2020లో తాజ్ సందర్శనకు ట్రంప్ వచ్చినప్పుడు విశేషాలను వివరించిన గైడ్ నితిన్‌సింగ్ ఇప్పుడు మళ్లీ అదేపాత్ర పోషించారు. నిర్మాణ శైలి గురించి జూనియర్ ట్రంప్ అడిగిన లోతైన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఆయన పర్యటన సందర్భంగా విస్తృతమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

40 దేశాల ప్రముఖులు కూడా

గురువారం తాజ్‌మహల్‌ను సందర్శించినవారిలో 40 దేశాలకు చెందిన 126 మంది ప్రముఖులు కూడా ఉన్నారు. దిల్లీలో జరిగిన ప్రపంచ దేశాల ప్రధాన న్యాయమూర్తుల 26వ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన వివిధ దేశాల మాజీ అధ్యక్షుడు, మాజీ ప్రధానులు, ప్రధాన న్యాయమూర్తులు తాజ్‌మహల్‌ను సందర్శించారు.





బిహార్ సీఎం నీతీశ్ ప్రమాణ స్వీకార వేడుకలో కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్‌ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న ఏపీ సీఎం చంద్రబాబు. ✦ కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌తో భేటీ అయిన చంద్రబాబు. చిత్రంలో మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు

ఎస్‌ఐఆర్‌ను తక్షణమే నిలిపేయండి

- సీఈసీకి మమతా బెనర్జీ లేఖ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్) కార్యక్రమాన్ని వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం ప్రధాన ఎన్నికల అధికారి (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌కు లేఖ రాశారు. ఎస్‌ఐఆర్ తమ రాష్ట్రంలో అరాచకంగా, బలవంతంగా, ప్రమాదకరంగా సాగుతోందని ఆమె ఆరోపించారు. కనీస సన్నద్ధత, తగినంత ప్రణాళిక, స్పష్టమైన సమాచారం లేకుండా ఎన్నికల సంఘం అధికారులు, పౌరులపై ఎస్‌ఐఆర్ రుద్దుతోందని అన్నారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వో) పనివేళల్లో ఓటర్లను కలవడం అసాధ్యమని, ఈ కసరత్తు అత్యంత బలహీన ప్రాతిపదికన సాగుతోందనడానికి ఇది నిదర్శనమని మమత తెలిపారు. ఎస్‌ఐఆర్‌లో పాల్గొంటున్న అధికారులు అసాధారణ పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని మమత విమర్శించారు. ఈ లేఖపై భాజపా స్పందించింది. మోసపూరితంగా సృష్టించుకున్న ఓటు బ్యాంకును కాపాడుకునేందుకే మమత ఆరాటపడుతున్నారు, నాటకీయతకు దిగుతున్నారని భాజపా ఆరోపించింది.

ఓటరు నమోదు పత్రాల పంపిణీ దాదాపు పూర్తి

దిల్లీ: ప్రస్తుతం 9 రాష్ట్రాలు మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్)లో భాగంగా ఓటరు నమోదు పత్రాలు పంచే కార్యక్రమం దాదాపు పూర్తయిందని, దాదాపు 99 శాతం మంది ఓటర్లకు పాక్షికంగా నింపిన పత్రాలను అందజేశామని ఎన్నికల కమిషన్ గురువారం వెల్లడించింది. మొత్తం 50.97 కోట్ల మంది ఓటర్లు ఉండగా అందులో 50.40 కోట్ల మందికి నమోదు పత్రాలు అందజేశామని, 98.89 శాతం పత్రాల పంపకం పూర్తి చేశామని కమిషన్ ఎస్‌ఐఆర్‌పై ప్రతిదినం అందించే సమాచార బుల్లెటిన్‌లో వెల్లడించింది.

బీఎల్‌వోకు తీవ్ర అనారోగ్యం

పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో ఓటరు నమోదు పత్రాలు పంచే కార్యక్రమంలో పాల్గొంటున్న ఒక బీఎల్‌వోకు బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో ఆమెను ఆ పని నుంచి తప్పించారు. బీఎల్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త తపతి బిస్వాస్ బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. దీంతో ఆమెను కొన్నగర్ మునిసిపల్ ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ల విడిభాగాల అపహరణ.. అధికారి నివాసంలో వెలికితీత

- 'శంభూ' రైతుల ఆందోళన సమయంలో చోరీ!



పటియాలా: రైతుల ట్రాక్టర్ల నుంచి అపహరించిన విడిభాగాలను నాభా మున్సిపల్ అధికారి నివాసం వెనుకవైపు పాతిపెట్టి ఉండగా పంజాబ్ పోలీసులు వెలికితీయించారు. దిల్లీ శివారులోని శంభూ - ఖనౌరీ సరిహద్దులో శిబిరాలు ఏర్పాటుచేసుకొని ఆందోళనకు దిగిన రైతుల ట్రాక్టర్ల నుంచి ఎనిమిది నెలల కిందట వాటిని అపహరించినట్లుగా తమకు ఫిర్యాదు అందినట్లు తెలిపారు. వీటి రికవరీ కోసం గత రెండు రోజులుగా రైతులు తీవ్ర ఆందోళనలు చేస్తుండగా, పోలీసులు స్పందించారు. పొక్లెయిన్ సాయంతో పెద్ద గుంత తవ్వించి ట్రాక్టర్ల పరికరాలను బుధవారం బయటకు తీశారు. ఆధారాలను నాశనం చేసేందుకే పరికరాలను పాతిపెట్టినట్లు భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) నేతలు ఆరోపించారు. ఆ ఇల్లు తన పేరుతో కేటాయించినా అందులో తాను నివాసం ఉండటం లేదని, ట్రాక్టరు పరికరాలను దాచిపెట్టడంలో తన ప్రమేయం లేదని నాభా మున్సిపాలిటీ ఈవో గురుచరణ్ సింగ్ గిల్ తెలిపారు. మున్సిపల్ కౌన్సిలు అధ్యక్షురాలి భర్త పంకజ్ పప్పు పర్యవేక్షణలో ఆ ఇల్లు ఉందన్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పటియాలా పోలీసు అధికారి దవీందర్ సింగ్ చెప్పారు.

ఖగోళ పరిశోధనలో భారత్, రష్యాల సహకారం మరింత ముందుకు

మాస్కో: ఖగోళ పరిశోధనలో పరస్పరం సహకరించుకునే ఏర్పాటులో భాగంగా ఉపగ్రహాల నియంత్రణతోపాటు వాటితో సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం కోసం గ్రౌండ్ స్టేషన్లు ఏర్పాటు చేసే విషయంలో ఒకరికొకరు సహకారం అందించుకోవాలని భారత రష్యాలు నిర్ణయించాయి. రష్యాకు చెందిన దిక్సూచి వ్యవస్థ 'గ్లోనాస్' నుంచి, భారత ప్రాంతీయ నేవిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ 'నావిక్' నుంచి కొలతలు సేకరించి విశ్లేషించడంలో ఇరుదేశాల గ్రౌండ్ స్టేషన్లు సహకరించుకునేందుకు కసరత్తు సాగుతోందని భారత్‌లో రష్యా రాయబారి డెనిస్ అలిపొవ్ తెలిపారు. "బయో మెడిసిన్, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వైద్య సేవ, వస్తు విజ్ఞాన శాస్త్ర రంగాల్లో భారత రష్యాల ద్వైపాక్షిక వైజ్ఞానిక, సాంకేతిక సహకారం దిగ్విజయంగా సాగుతోంది. ధ్రువ ప్రాంతాల్లో ఉమ్మడి పరిశోధనకు ఇరు పక్షాలూ ఆసక్తి చూపుతున్నాయి. క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో పరిశోధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ రంగంలో ఇరుదేశాలు గణనీయ ప్రగతి సాధించాయి" అని రష్యా రాయబారి చెప్పారు.

విద్యార్థి ప్రాణం తీసిన 100 గుంజీలు.. టీచర్ అరెస్ట్

పాల్ఘర్: మహారాష్ట్రలో పాఠశాలకు ఆలస్యంగా వచ్చిందని ఓ విద్యార్థినితో 100 గుంజీలు తీయించి ఆమె మరణానికి కారణమైన ఉపాధ్యాయురాలిని పోలీసులు అరెస్టు చేశారు. వాసాయి ప్రాంతంలోని సతివాలిలోని ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని ఈ నెల 8న స్కూల్‌కు ఆలస్యంగా వచ్చింది. దీనిపై ఆగ్రహించిన ఉపాధ్యాయురాలు 100 గుంజీలు తీయాలని విద్యార్థినిని బలవంతం చేసింది. అప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న బాలిక గుంజీలు తీస్తూ అస్వస్థతకు గురైంది. ఈ క్రమంలో ఆమెను ముంబయిలోని ఓ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాలిక మృతికి కారణమైన మహిళా ఉపాధ్యాయురాలిని అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టినట్లు గురువారం అధికారులు తెలిపారు.

'కశ్మీర్ టైమ్స్' కార్యాలయంపై ఎస్ఐఏ దాడులు

- ఏకే 47 కాట్రిడ్జ్‌లు లభ్యం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కశ్మీర్ టైమ్స్ పత్రికా కార్యాలయంలో తూటాలు లభ్యమవడం కలకలం సృష్టిస్తోంది. రాష్ట్ర పోలీసు విభాగానికి చెందిన స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎస్ఐఏ) జరిపిన సోదాల్లో జమ్మూలోని సంస్థ కార్యాలయంలో ఏకే 47 రైఫిల్ కాట్రిడ్జ్‌లు, మరికొన్ని పిస్టోలు తూటాలు దొరికాయని పోలీసు వర్గాలు వెల్లడించాయి. పిస్టల్ రౌండ్స్, మూడు గ్రెనేడ్ పిన్నులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నాయి. గురువారం ఉదయం నుంచి ఈ తనిఖీలు జరుగుతున్నాయి. కశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనూరాధ భాసిన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతదేశం, జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతానికి వ్యతిరేకంగా, వేర్పాటువాదానికి అనుకూల సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి.

1954లో వీక్లీగా మొదలై..

కశ్మీర్ టైమ్స్ అనేది జమ్మూకశ్మీర్‌కు చెందిన ప్రముఖ మీడియా సంస్థ. 1954లో ప్రచురణను ప్రారంభించిన దీనిని వేద్ భాసిన్ స్థాపించారు. 1964 వరకు వీక్లీగా ఉన్న ఈ పత్రిక అనంతరం దినపత్రికగా మారింది. మరోవైపు ఈ సోదాలపై కశ్మీర్ టైమ్స్ సీనియర్ ఎడిటర్లు ప్రబోధ్ జమ్వాల్, అనూరాధ స్పందించారు. తమను బెదిరించేందుకు, తమ గళాన్ని అణచివేసేందుకే ఈ ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. తాము మౌనంగా ఉండకుండా తమ పని కొనసాగిస్తున్నామని, అందుకే తమను లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు.


ప్రశాంత్ కిశోర్ మౌన నిరసన

పట్నా: ఇటీవల బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ ఘోర పరాజయం పాలైనందుకు నిరసనగా ఆ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ గురువారం ఒకరోజు మౌన వ్రతం పాటించారు. రాష్ట్రంలోని పశ్చిమ చంపారణ్ జిల్లాలోని భితిహర్వా గాంధీ ఆశ్రమంలో కిశోర్ మౌన నిరసన చేపట్టినట్టు ఆ పార్టీ ప్రకటించింది. మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించి తమ పార్టీ నాయకులతో కలిసి కిశోర్ మౌన ఉపవాసం చేపట్టారు. పార్టీ పరాజయానికి 100% బాధ్యత తనదేనని, తప్పిదాలను సరిదిద్దుకుని తిరిగి మరింత బలంగా వస్తామని ఇటీవల కిశోర్ విలేకరులతో మాట్లాడుతూ.. ఒకరోజు మౌన ఉపవాసం చేస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే.

'దేశీయ' చీతా తల్లైంది

- కునో జాతీయ పార్కులో ఐదు పిల్లలకు జన్మనిచ్చిన 'ముఖీ'

శ్యోపుర్: మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో భారతీయ చీతా 'ముఖీ' ఐదు కూనలకు జన్మనిచ్చినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ గురువారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దీన్ని 'ప్రాజెక్టు చీతా'లో చరిత్రాత్మక మైలురాయిగా అభివర్ణించారు. 'తల్లి చీతా సహా కూనలు ఆరోగ్యంగా ఉన్నాయి. భారత్‌లో జన్మించిన చీతా విజయవంతంగా పునరుత్పత్తి చేయడం ఇదే తొలిసారి. దేశ ఆవాసాలకు చీతాలు అలవాటు పడుతున్నాయి. దేశంలో స్వయం సమృద్ధి, జన్యుపరంగా వైవిధ్యభరితమైన చీతాల జనాభా పునరుద్ధరణకు ఇది బలమైన సంకేతం" అని పేర్కొన్నారు.



✦ భారతీయ తొలి ఆడ చీతా ముఖీ ఐదు కూనలకు జన్మనివ్వడం.. దేశ ఆవాసాల్లో తమ జాతుల జీవన సామర్థ్యానికి, ఆరోగ్యానికి, అభివృద్ధికి బలమైన సంకేతమని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు.

కొలంబో పోర్టులో భారత్, పాక్ నౌకలు

కొలంబో: భారత నౌకా దళానికి చెందిన గస్తీ నౌక ఐఎన్ఎస్ సుకన్య శ్రీలంక రాజధాని కొలంబో పోర్టులో లంగరేసింది. భారత్-శ్రీలంక మధ్య సద్భావనా కార్యక్రమాల్లో భాగంగా తమ తీరానికి చేరిన కమాండర్ సంతోష్ కుమార్ నేతృత్వంలోని 101 మీటర్ల పొడవైన ఈ నౌకకు శ్రీలంక నౌకాదళం మంగళవారం సంప్రదాయ రీతిలో స్వాగతం పలికింది. ఈ మేరకు ఆ దేశ నౌకాదళం గురువారం వెల్లడించింది. శుక్రవారం ఈ నౌక కొలంబో నౌకాశ్రయాన్ని వీడనున్నట్లు తెలిపింది. మరోవైపు పాకిస్థాన్ నౌకాదళానికి చెందిన పీఎన్ఎస్ ఎస్ఏఐఎఫ్ నౌక కూడా మంగళవారం కొలంబో పోర్టుకు చేరుకుని బుధవారం వెనుతిరిగింది. నౌకాదళ సంప్రదాయాల్లో భాగంగా కెప్టెన్ అస్ఫాంద్ ఫర్హాన్ ఖాన్ నేతృత్వంలో వచ్చిన 123 మీటర్ల పీఎన్ఎస్ ఎస్ఏఐఎఫ్ నౌకకు శ్రీలంక నౌకాదళం తగురీతిలో వీడ్కోలు పలికింది.



మంచు ఖండంలో సంగీతం భూమి అంచున అభ్యాసం

వెల్లింగ్టన్: ప్రపంచపు ఘనీభవించిన అంచు అంటార్కిటికాలో నిలబడి బూర ఊదుతూ సంగీత సాధన చేస్తున్న ఈమె పేరు నటాలీ ఫైన్. న్యూజిలాండ్ నేవీలో ఫ్రెంచ్ హార్న్ ఊదే సభ్యురాలు. గత అక్టోబరు నెల నుంచి అంటార్కిటికాలో విడిది చేసిన 21 మంది మిలిటరీ సభ్యుల బృందంలో ఈమె ఒకరు. భూమిపై అత్యంత మారుమూల ప్రాంతంలో నిలబడి ఆమె ఆలపిస్తున్న సంగీత తరంగాలు గడ్డకట్టిన రాస్ సముద్రం మీదుగా విహరిస్తున్నాయి కాబోలు. "ఇది చాలా స్ఫూర్తిదాయకం, అరుదైన అభ్యాసం" అని నటాలీ మీడియాకు తెలిపారు.

విదేశీ ఉద్యోగులు లేకపోతే విజయం సాధించలేం



- ట్రంప్ కీలక వ్యాఖ్యలు

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి వలసలపై కఠిన నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్నారు. అందులో హెచ్1బీ వీసా ఫీజును పెంచడం చాలా మందిలో గందరగోళాన్ని సృష్టించింది. అయితే తాజాగా జరిగిన అమెరికా-సౌదీ పెట్టుబడుల ఫోరమ్‌లో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. విదేశీ ఉద్యోగుల అవసరం అమెరికాకు ఉందని పేర్కొన్నారు. విదేశీ వృత్తి నిపుణులు వేల మందిని తమతో తీసుకురావాలని, వారిని స్వాగతిస్తానని ట్రంప్ తెలిపారు. అమెరికాలోని కంపెనీల్లో బిలియన్ డాలర్ల కొద్దీ పెట్టుబడులు పెట్టే వారిని అనుమతించకపోతే తాము విజయం సాధించలేమని వ్యాఖ్యానించారు. విదేశీ ఉద్యోగులు అమెరికన్లకు నైపుణ్యాలు నేర్పించి తిరిగి స్వదేశాలకు వెళ్లవచ్చని సూచించారు.

యూకేలో శాశ్వత నివాసానికి పదేళ్లు

లండన్: యూకే ప్రభుత్వం అంతర్జాతీయ వలసదారుల విధానంలో కీలక మార్పు తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. భారత్ సహా వివిధ దేశాల నుంచి వచ్చినవారు 'శాశ్వత నివాస అనుమతి' కోసం దరఖాస్తు చేసుకునే గడువును రెట్టింపు చేయాలని యోచిస్తోంది. దీనికి సంబంధించిన కీలక ప్రతిపాదనను గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టినట్లు హోం మంత్రి షబానా మహమూద్ వెల్లడించారు. కొత్త 'ఎర్న్‌డ్ సెటిల్‌మెంట్' మోడల్‌లో భాగంగా ఈ మార్పులు తీసుకురానున్నారు. ఇప్పటివరకూ అమల్లో ఉన్న ఐదేళ్ల ఆటోమేటిక్ ఐఎల్ఆర్ విధానాన్ని పదేళ్లకు పెంచుతున్నట్లు షబానా ధ్రువీకరించారు. కొత్త ప్రతిపాదనల ప్రకారం.. తక్కువ వేతనం ఉన్న ఉద్యోగులు 15 ఏళ్లు వేచి ఉండాలి. ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్న వలసదారులైతే ఏకంగా 20 ఏళ్లు నిరీక్షించాలి. నేషనల్ హెల్త్ సర్వీస్ వంటి కీలక రంగాల్లో పని చేసే నిపుణులు, ఎక్కువ సంపాదన ఉన్న వ్యాపారవేత్తలకు మినహాయింపు ఉంది. వారికి ఐదేళ్లు లేదంటే అంతకంటే తక్కువ సమయంలోనే నివాస అనుమతి పొందే మార్గం అందుబాటులో ఉంటుంది.

బ్రిటన్‌లో భారత విద్యార్థులకు ఉద్యోగార్హత కల్పన వేదిక

లండన్: బ్రిటన్‌కు చెందిన ఇండియన్ నేషనల్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐఎన్ఎస్ఏ).. కృత్రిమ మేధ ఆధారిత ఉపాధి వేదిక అయిన క్రియా సంస్థతో కలిసి ఇండియన్ నేషనల్ స్టూడెంట్స్ ఎంప్లాయబిలిటీ కౌన్సిల్ (ఐఎన్ఎస్ఈసీ) ఏర్పాటు చేసింది. ఈ సంస్థ బ్రిటన్‌లోని భారతీయ విద్యార్థుల్లో ఉద్యోగార్హత సాధించడం కోసం పాటుపడనున్న తొలి వేదిక కానుంది. బ్రిటన్‌లో దాదాపు 1.66 లక్షల మంది భారత విద్యార్థులు ఉన్నట్లు అంచనా. 'ఐఎన్ఎస్ఈసీ అన్నది కేవలం ఒక సంస్థ కాదు.. అది ఓ ఉపాధి నిబద్ధత' అని క్రియా సంస్థ సీఈవో ఆయేషా గోయల్ తెలిపారు. 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్, కింగ్స్ కాలేజీ లండన్ వంటి ప్రసిద్ధ విద్యా సంస్థల్లో దేశ వ్యాప్తంగా ఉపాధి వేదికల్ని నిర్వహించడానికి ఈ సంస్థ కట్టుబడి ఉందని ఐఎన్ఎస్ఏ, యూకే జాతీయ అధ్యక్షుడు అమిత్ తివారీ పేర్కొన్నారు. యూకేలో చదువు పూర్తిచేసిన విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్ అనంతరం 18 నెలలపాటు బ్రిటన్‌లోనే ఉద్యోగం చేసుకునేందుకు వీలుంది. ఈ విధానాన్ని గ్రాడ్యుయేట్ రూట్ అంటారు. అయితే బ్రిటన్ సంస్థలు తాము చేసుకునే దరఖాస్తులకు స్పందించడం లేదని, దరఖాస్తుల్ని గుడ్డిగా తిరస్కరిస్తున్నాయని భారతీయ విద్యార్థులు పేర్కొంటున్నారు. భారతీయ విద్యార్థుల దరఖాస్తులకు బ్రిటన్ సంస్థలు సమాన ప్రాధాన్యం ఇచ్చేలా ఆయా సంస్థలతో సంప్రదింపులు జరపాలని భారత హైకమిషన్‌తోనూ, ఫారిన్ కామన్‌వెల్త్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీసుతోనూ చర్చలు జరుపుతున్నట్లు ఇండియన్ నేషనల్ స్టూడెంట్స్ అసోసియేషన్ పేర్కొంది.

పార్టీయేతర ఆపద్ధర్మ ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే బంగ్లా ఎన్నికలు

ఢాకా: బంగ్లాదేశ్‌లో పార్టీయేతర ఆపద్ధర్మ ప్రభుత్వ (కేర్ టేకర్ ప్రభుత్వం) వ్యవస్థను పునరుద్ధరిస్తున్నట్లు ఆ దేశ సుప్రీం కోర్టు ప్రకటించింది. ఎన్నికల సమయంలో నిష్పాక్షికంగా వ్యవహరించడానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 2011లో ఈ ప్రభుత్వ వ్యవస్థను సుప్రీం కోర్టే రద్దు చేసింది. ఆ తీర్పు చట్ట విరుద్ధమని అదే అత్యున్నత న్యాయస్థానం గురువారం తేల్చి చెప్పింది. ప్రధాన న్యాయమూర్తి రెఫాత్ అహ్మద్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యులతో కూడిన అప్పిలేట్ డివిజన్ గురువారం ఈ తీర్పును వెలువరించింది. 1996లో ఈ కేర్‌టేకర్ ప్రభుత్వ వ్యవస్థను ప్రవేశపెట్టారు. పార్టీతో సంబంధం లేకుండా నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగేలా చూడటం దీని ప్రధాన విధి. ఇది మొత్తం 90 రోజులు అధికారంలో ఉంటుంది. అయితే ప్రస్తుతం యూనస్ నేతృత్వంలో ఉన్న కేర్‌టేకర్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే 13వ పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాత సుప్రీం తీర్పు ప్రకారం.. 14వ పార్లమెంటు ఎన్నికల నుంచి ఆపద్ధర్మ ప్రభుత్వ వ్యవస్థ అమల్లోకి వస్తుంది.

మావోయిస్టులు హింసామార్గాన్ని వదిలేస్తున్నారు: రాష్ట్రపతి ముర్ము

అంబికాపుర్ (ఛత్తీస్‌గఢ్): దేశవ్యాప్తంగా మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి ప్రధాన స్రవంతిలోకి వస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. త్వరలోనే వామపక్ష తీవ్రవాదం నుంచి దేశం విముక్తి కానుందని, ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేస్తున్నాయని తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపుర్‌లో గురువారం జరిగిన 'జన్‌జాతీయ గౌరవ్ దివస్' కార్యక్రమంలో రాష్ట్రపతి మాట్లాడుతూ.. మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని అన్నారు. హింసా మార్గాన్ని వీడి ప్రధాన స్రవంతిలోకి వస్తున్న నక్సలైట్లు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు.

✦ ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేత కార్యక్రమంలో కీలకపాత్ర పోషించిన 27వ ఇండో- టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ)కు బెస్ట్ యాంటీ మావోయిస్టు ఆపరేషన్స్ యూనిట్ అవార్డు లభించింది. ఆగస్టులో ఈ బెటాలియన్ కీలక మావోయిస్టు నేతలు విజయ్ రెడ్డి, లోకేశ్‌లను మట్టుబెట్టింది.

63 ఔషధాలు ప్రమాణాలకు అనుగుణంగా లేవు

దిల్లీ: వివిధ కంపెనీలకు చెందిన 63 ఔషధాలు ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలిందని గురువారం కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. అక్టోబరు నెలలో నిర్వహించిన కేంద్రీయ ఔషధ ల్యాబ్‌లలో వీటికి పరీక్షలు నిర్వహించామని తెలిపింది. మరోవైపు రాష్ట్రాల్లోని ఔషధ ల్యాబ్‌లు పరీక్షించిన 148 ఔషధాలు ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలిందని వివరించింది. ఈ వివరాలను సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీవో) పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.

వైకాపా హయాంలో... ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలు

- 7 జిల్లాల్లో బహిర్గతం
- సరి చేయించేందుకు క్షేత్రస్థాయి అధికారులకు 20 రోజుల గడువు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరుతో ఆప్షన్-3 కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో 7 జిల్లాల్లో అవకతవకలు బయటపడ్డాయి. మొత్తంగా 26 జిల్లాల పరిధిలో గతంలో గుత్తేదారులు చేపట్టిన 2.25 లక్షల గృహాల్లో 80 శాతం నిర్మాణాలను ఇప్పటివరకు అధికారులు తనిఖీ చేయించారు. 25 వేల ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలున్నట్లు తేలింది. ప్రధానంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, విశాఖపట్నం, తిరుపతి, వైఎస్సార్ కడప, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఈ తేడాలున్నాయి. మిగతా జిల్లాల్లోనూ కొంతమేర లోపాల్ని గుర్తించారు. నెల రోజులుగా గృహనిర్మాణశాఖ అధికారులు ప్రత్యేక బృందాన్ని నియమించి క్షేత్రస్థాయిలో ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాన్ని తనిఖీ చేయిస్తున్నారు.

బేస్‌మెంట్, రూఫ్ స్థాయి నిర్మాణాల్లో ఎక్కువ...

బేస్‌మెంట్, రూఫ్ స్థాయి నిర్మాణాల్లో ఎక్కువ తేడాలున్నట్లు అధికారులు గుర్తించారు. అప్పటివరకు జరిగిన ఇంటి నిర్మాణానికి ఇవ్వాల్సిన ఇనుము, సిమెంట్ కంటే ఎక్కువగా గుత్తేదారులకు అందించడం, అదనంగా బిల్లు చేయడం తదితరాలు బయటపడ్డాయి. ఇందుకు అప్పట్లో అవకతవకలు జరిగేందుకు ఆస్కారమిచ్చిన సంబంధిత గృహనిర్మాణ శాఖ ఏఈ, గ్రామ, వార్డు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను బాధ్యుల్ని చేశారు. వీటిని సరిచేసేందుకు 20 రోజులు గడువిచ్చారు. లేనిపక్షంలో వారి జీతాల నుంచి రికవరీ చేస్తామని ఉన్నతాధికారులు స్పష్టంచేశారు.

వినూత్న ఆడిట్ విధానాలు అవలంబించాలి

- ప్రిన్సిపల్ ఎకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ



ఈనాడు, అమరావతి: 'ఆడిట్ సమగ్రంగా నిర్వహించడం వల్ల ప్రజాధనం సక్రమంగా వినియోగమవుతుంది. ఈ విషయాన్ని ప్రజలకు, శాసనసభకు, కార్యనిర్వహక వర్గాలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉంది. ఏఐ, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునాతన సాంకేతికతతో వినూత్న ఆడిట్ విధానాలను అవలంబించేలా మన ఉద్యోగులను తీర్చిదిద్దాలని' అని ప్రిన్సిపల్ ఎకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ అన్నారు. విజయవాడలో గురువారం ఆమె ఏజీ ఆడిట్ దివస్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాగ్ ఆధ్వర్యంలోని ఇండియన్ ఆడిట్ ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వ ఎకౌంట్ల ఎన్‌టైటిల్‌మెంట్ బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తోందన్నారు. సమాజంలో విశ్వాసం, సుస్థిరత, జవాబుదారీతనం లక్ష్యంగా ప్రజావనరులను సక్రమంగా వినియోగిస్తూ పని చేయాలని కాగ్ పాత్రను వివరించారు. తమ సంస్థ చరిత్రాత్మకమని డిప్యూటీ ఎకౌంటెంట్ జనరల్ సుష్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డిప్యూటీ ఎకౌంటెంట్ జనరల్ ఆర్.శ్యామ్, డిప్యూటీ ఎకౌంటెంట్ జనరల్ వి.లలితకుమార్, కుశాల్, నాబార్డు జీఎం మహేశ్ కుమార్, ఆర్పిత డీజీఎం అనంత్, విజయవాడ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్ట్ డైరెక్టర్ రమేష్ శ్రీకొండ తదితరులు పాల్గొన్నారు.

పే అండ్ ఎకౌంట్స్ అసోసియేషన్ బైలాలో మార్పులకు ప్రభుత్వం అనుమతి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పే అండ్ ఎకౌంట్స్ ఆఫీసు(వర్క్స్ ఎకౌంట్స్) ఎంప్లాయిస్ అసోసియేషన్ బైలాలో మార్పులకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ విషయాన్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.హరనాథ్, ప్రధాన కార్యదర్శి పి.వి.రమణారెడ్డి గురువారం తెలిపారు. 'ఇంతకుముందు సూపరింటెండెంట్లుగా ఉన్న వారిని ప్రభుత్వం జూనియర్ పే అండ్ ఎకౌంట్స్ అధికారులుగా మార్చింది. వారికి గెజిటెడ్ హోదా ఇచ్చింది. సంఘం బైలా ప్రకారం సూపరింటెండెంట్లు కాని వారు ఆ సంఘంలో ఉండటానికి వీల్లేదు. గెజిటెడ్ హోదా పొందినా సంఘంలో కొనసాగేందుకు ఉన్న వీలు, ఇతర సంఘంలో కలిసేందుకు అవకాశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వానికి దరఖాస్తు చేశాం. తాజాగా ఇందుకు అనుమతిస్తూ సంఘం బైలాలో మార్పులకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతోపాటు సంఘం కోశాధికారి పోస్టును ఆఫీసు బేరర్‌గా గుర్తిస్తూ ఉత్తర్వులిచ్చింది' అని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెల్లడించారు. ఉత్తర్వులొచ్చిన వెంటనే వెలగపూడి సచివాలయంలో ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ఆలమట్టి ఎత్తు పెంపునకు రూ.లక్ష కోట్లు

- భూసేకరణ, పునరావాసానికి అవసరమని కర్ణాటక ప్రభుత్వం అంచనా
- సుప్రీంకోర్టులో కేసు కొనసాగుతున్నా ముందుకే..



ఈనాడు హైదరాబాద్: ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచడానికి అవసరమైన భూసేకరణకు, పునరావాసానికి సుమారు రూ.లక్ష కోట్లు వ్యయమయ్యే అవకాశం ఉందని కర్ణాటక ప్రభుత్వం అంచనా వేసింది. ముంపు ప్రాంతంతోపాటు పునరావాస కేంద్రాలు, కాలువలు, డిస్ట్రిబ్యూటరీల నెట్‌వర్క్‌కు కలిపి లక్షా 33 వేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని, అయితే మొదటి దశలో ఎత్తు పెంచడం వల్ల ముంపునకు గురయ్యే 75,563 ఎకరాల భూమిని ఒకేసారి సేకరించాలని నిర్ణయించింది. దీంతోపాటు రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే పనులు పెండింగ్‌లో ఉన్నందున వీటిని కూడా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొంది. ముంపు ప్రాంతంలో భూమిని మొత్తం ఒకే దశలో సేకరించాలని, ఇందుకు ఏడాదికి రూ.18వేల కోట్ల చొప్పున నాలుగేళ్లలో దాదాపు రూ.75వేల కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

కేంద్ర మంత్రికి ఉత్తమ్ ఫిర్యాదు..

ఆలమట్టి ఎత్తు పెంపునకు అనుమతిస్తూ బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ 2013లో తుది తీర్పు ఇవ్వగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో అమలు చేయకుండా స్టే ఇచ్చింది. అప్పటి నుంచి సుప్రీంకోర్టులో కేసు కొనసాగుతూ ట్రైబ్యునల్ తీర్పు అమలులోకి రాకున్నా, నాలుగేళ్లుగా ముంపు ప్రాంతంలో భూసేకరణకు కర్ణాటక ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రైతులను ఒప్పించి వారి అంగీకారంతో భూసేకరణ చేసేలా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. దీనిపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ఇప్పటికే ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆలమట్టి ఎత్తు 519.6 మీటర్లు కాగా 129.72 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉంది. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 173 టీఎంసీల వినియోగానికి కేటాయింపు ఉంది. దీనిని 524.256 మీటర్ల ఎత్తు వరకు పెంచడానికి కర్ణాటక మూడు దశాబ్దాలుగా ప్రయత్నిస్తోంది. 2004లో ఏర్పాటైన బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ 2010లో మధ్యంతర తీర్పు, 2013లో తుది తీర్పు ఇస్తూ 524.256 మీటర్ల ఎత్తునకు పెంచుకోవడంతో పాటు అదనంగా మరో 130 టీఎంసీలు కేటాయించింది. దీంతో ఆలమట్టిలో నిల్వ సామర్థ్యమే 90 టీఎంసీలు పెరుగుతుంది. అది నిండి దిగువన ఉన్న జూరాల, శ్రీశైలంలోకి ప్రవాహం రావడానికి మరింత ఆలస్యమవుతుంది.

పరిహారం ఎకరాకు రూ.30-40 లక్షలు..

అప్పర్ కృష్ణా మూడో దశ అమలుతో విజయపుర, బాగలకోటె, రాయచూరు, కలబురగి, యాదగిరి, కొప్పళ, గదగ జిల్లాల్లో 5.94 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించాలన్నది కర్ణాటక ప్రభుత్వం లక్ష్యం. దీనికి తగ్గట్లుగా డ్యాం ఎత్తు పెంచడంతోపాటు ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే పనులకు 1,33,417 ఎకరాలు అవసరమని కర్ణాటక ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచడం వల్ల ముంపునకు గురయ్యే భూమి 75,563 ఎకరాలు, బాగలకోటె పట్టణంతో సహా 20 గ్రామాల పునరావాసానికి 6,467 ఎకరాలు, కాలువల నెట్‌వర్క్‌కు 51,387 ఎకరాలు అవసరమవుతుంది. 2022లో కర్ణాటక ప్రభుత్వం ఈ భూమిని రెండు దశల్లో సేకరించాలని నిర్ణయించింది. 29,566 ఎకరాలకు అవార్డు పాస్ చేయగా, అదనంగా చెల్లించాలంటూ వివిధ కోర్టుల్లో 28,338 కేసులు దాఖలయ్యాయి. దీంతో ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కర్ణాటక ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రజాప్రతినిధులు, రైతులతో చర్చించి పరిహారం పెంచాలని నిర్ణయించారు. ముంపు ప్రాంతంలో 75,653 ఎకరాలకు మెట్టకు ఎకరాకు రూ.30 లక్షలు, మాగాణికి రూ.40 లక్షలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. కాలువ పనులకు మాత్రం రూ.25 లక్షలు, రూ.30 లక్షలుగా నిర్ణయించారు.

బెంగళూరు ట్రాఫిక్‌పై వ్యోమగామి శుభాన్షు శుక్లా చురకలు

ఈనాడు, బెంగళూరు: అంతరిక్షయానంపై తాను చేసే ప్రసంగ సమయంతో పోలిస్తే బెంగళూరు రహదారులపై ప్రయాణం మూడు రెట్లు అధికమని వ్యోమగామి శుభాన్షు శుక్లా వ్యాఖ్యానించారు. ఆయన గురువారం బెంగళూరు టెక్ సమ్మిట్ (బీటీఎస్)లో 'ఫ్యూచర్ మేకర్స్ కాంక్లేవ్'కు హాజరయ్యే క్రమంలో మారతహళ్లి నుంచి మూడు గంటల పాటు ప్రయాణం చేయాల్సి వచ్చింది. ఇందులో మూడో వంతు సమయంలోనే తాను ప్రసంగాన్ని పూర్తి చేశానన్నారు. గత జూన్‌లో 'యాగ్జియం మిషన్' ద్వారా చేపట్టిన అంతరిక్ష ప్రయాణంపై ఆయన మాట్లాడుతూ అంతరిక్షంలో అడుగుపెట్టక మన గుండెపై మోటారు వాహనం ప్రయాణించినట్లు ఉంటుందన్నారు. అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు కనీసం వారం రోజులు పడుతుందని వివరించారు. భూమికి వచ్చాక రెండు వారాలపాటు మన శరీరం అదుపు తప్పే ఉంటుందని తన అనుభవాన్ని వివరించారు. ఈ ప్రయాణం భారతీయ అంతరిక్ష విజయానికి ప్రతీక అని తెలిశాక గర్వంగా ఉందన్నారు. మనకు, మన అంతరిక్ష ప్రగతికి హద్దుల్లేవని ప్రకటించారు. అంతరిక్షం నుంచి భారతదేశం ఎలా కనపడుతుందో శుభాన్షు వీడియో రూపంలో చూపారు.

'వ్యర్థాల' విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లలో యూనిట్ ధర ఖరారు

ఈనాడు,అమరావతి: ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో విజయవాడ, తిరుపతిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్లాంట్లలో యూనిట్ విద్యుత్తు ధరను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. రోజు 12 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల తిరుపతి ప్లాంట్‌లో యూనిట్ ధర రూ.7.95గా నిర్ణయించారు. 15 మెగావాట్ల సామర్థ్యంగల విజయవాడ ప్లాంట్‌లో యూనిట్ ధర రూ.7.50గా నిర్ణయిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

డీఈఓ, ఎంఈఓలు సాయంత్రం కార్యాలయాల్లో ఉండాలని ఆదేశాలు

జిల్లా, మండల విద్యాధికారులు నిర్దేశిత సమయంలో కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. డీఈఓలు ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు, ఎంఈఓలు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని సూచించింది.

బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక చర్యలు..

బాల్య వివాహాల నివారణకు క్షేత్రస్థాయి అధికారులకు పాఠశాల డైరెక్టర్ పలు సూచనలు జారీ చేసింది. బాల్య వివాహాలను నివారించడాన్ని చట్టబద్ధమైన, కీలక బాధ్యతగా భావించాలని ఆదేశించింది. జిల్లా విద్యాధికారులు వెంటనే బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించేందుకు ప్రచారం నిర్వహించాలని పేర్కొంది.

సీబీఐ కోర్టును ప్రభావితం చేసేలా జగన్ అలజడి

- తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

ఈనాడు, అమరావతి: సీబీఐ ప్రత్యేక న్యాయస్థానాన్ని ప్రభావితం చేయాలని వైకాపా అధినేత జగన్ అలజడి సృష్టించారని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. అందుకే అక్రమాస్తుల కేసులో విచారణ హాజరయ్యేందుకు సమూహంగా వెళ్లారని విమర్శించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "జగన్ ఏమైనా స్వాతంత్ర్య కోసం పోరాడిన మహాత్మాగాంధీనా? సర్దార్ వల్లభ్‌బాయ్‌పటేలా? ప్రజల సొమ్ము కాజేసిన ఆర్థిక నేరస్థుడు" అని వర్ల రామయ్య మండిపడ్డారు.

'ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త'పై అవగాహన కల్పించాలి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రాంతాల వారీగా సమావేశాలు పెట్టి అవగాహన కల్పించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. సచివాలయంలోని రెండోబ్లాక్‌లో పరిశ్రమల శాఖ అధికారులు, 26 జిల్లాల జనరల్ మేనేజర్లతో మంత్రి గురువారం సమీక్షించారు. 'పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి.. రుణ సదుపాయాలు, అనుమతుల విషయంలో పారిశ్రామికవేత్తలకు సహకరించాలి. సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక ప్రోత్సాహకాలపై అధికారులకు అవగాహన ఉండాలి. ఔత్సాహికులకు శిక్షణ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి' అని మంత్రి సూచించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, డైరెక్టర్ శుభమ్ బన్సల్ పాల్గొన్నారు.

జగన్ హయాంలోని ధాన్యం బకాయిల్ని చెల్లించాం

ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో రైతులకు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిన రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిల్ని కూటమి ప్రభుత్వం చెల్లించిందని ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'వ్యవసాయాన్ని జగన్ నట్టేట ముంచారు. ఆయన ప్రభుత్వంలో ఒక్కో రైతుకు కనీసం రూ.30 వేల నష్టం వాటిల్లింది. 64 లక్షల మంది అర్హులైన రైతులు ఉంటే కేవలం 52 లక్షల మందికే 'రైతు భరోసా' పథకాన్ని వర్తింపజేశారు' అని మండిపడ్డారు. 'అన్నదాతా-సుఖీభవ' రెండో విడత నిధుల జమతో సీఎం చంద్రబాబు రైతులకు అండగా నిలిచారని వివరించారు.

అయ్యప్ప భక్తులకు ఏర్పాట్లలో కేరళ ప్రభుత్వం విఫలం

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వ విధానాల వల్ల శబరిమలలో అయ్యప్ప స్వామి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ధ్వజమెత్తారు. అయ్యప్ప భక్తులు పడుతున్న అవస్థలు వివరిస్తూ గురువారం ఆయన ఓ వీడియో విడుదల చేశారు. "శబరిమలకు ఏటా లక్షల మంది భక్తులు వెళ్తుంటే వారికి వసతి, నీటి, ఆహార ఏర్పాట్లలో అక్కడి ప్రభుత్వం విఫలమవుతోంది. అయ్యప్ప సేవా సంఘం, అమృతానందమయి మఠం, తితిదే లాంటి ధార్మిక సంస్థలు శబరిమలలో సేవ చేస్తామని ముందుకొస్తున్నా వారికి అవకాశం ఇవ్వకుండా అడ్డుకుంటోంది. ఉద్దేశపూర్వకంగానే సరైన ఏర్పాట్లు చేయకుండా భక్తుల నమ్మకం సన్నగిల్లే ప్రయత్నాలు చేస్తోంది. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం వెంటనే తన వైఖరి మార్చుకోవాలి. ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లిన అయ్యప్ప భక్తులపై అమానుషంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి" అని మాధవ్ డిమాండ్ చేశారు.

నేటి నుంచి సచివాలయాల్లో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ

ఈనాడు, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో స్పౌజ్ కోటాలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మొదలు కానుంది. ప్రభుత్వ ఆదేశాలతో ఈ నెల 30లోగా బదిలీలు పూర్తి చేయాలని సచివాలయాల శాఖ నిర్ణయించింది. షెడ్యూల్‌ను గురువారం కలెక్టర్లకు పంపింది. ★ సచివాలయాల్లో ఉద్యోగుల ఖాళీల వివరాలు ఉమ్మడి జిల్లాల వారీగా శుక్రవారం ప్రకటిస్తారు. ★ అర్హులైన ఉద్యోగులు శుక్రవారం నుంచి ఈ నెల 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి ★ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో), మున్సిపల్ కమిషనర్లు 24నే దరఖాస్తులు ప్రాసెస్ చేస్తారు. ★ 25, 26 తేదీల మధ్య దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం పూర్తి చేసి, అభ్యర్థుల తుది సీనియారిటీ జాబితాలను జిల్లా స్థాయిలో ప్రకటిస్తారు. ★ తుది జాబితాలను కలెక్టర్లు 26నే పరిశీలించి రాష్ట్రస్థాయిలోని శాఖాధిపతులకు పంపుతారు. ★ శాఖాధిపతులు పరిశీలించి 27, 28 తేదీల్లో ప్రభుత్వానికి నివేదిస్తారు. ★ 29న ఉద్యోగుల బదిలీ తుది జాబితా ప్రకటిస్తారు. ★ అభ్యంతరాలు వస్తే 30లోగా పరిష్కరిస్తారు.

వచ్చే ఏడాది ఐదుగురు ఐఏఎస్‌ల పదవీ విరమణ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐదుగురు ఐఏఎస్ అధికారులు వచ్చే సంవత్సరం పదవీ విరమణ చేయనున్నారు. వీరిలో 1988 బ్యాచ్‌కి చెందిన వై.శ్రీలక్ష్మి, 1991 బ్యాచ్‌కి చెందిన జి.సాయిప్రసాద్, అజయ్ జైన్, 1993 బ్యాచ్‌కి చెందిన ఎం.టి.కృష్ణబాబు, 2004 బ్యాచ్‌కి చెందిన వి.కరుణ ఉన్నారు.

మాతృ సంస్థకు ఈపీడీసీఎల్ డైరెక్టర్

ఈనాడు, అమరావతి: తూర్పు మండల విద్యుత్ పంపిణీ సంస్థలో డైరెక్టర్(ఫైనాన్స్)గా పని చేస్తున్న దండగల చంద్రంను మాతృశాఖకు తిరిగి పంపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రంలో ఐఆర్ఏఎస్ (ఇండియన్ రైల్వే ఎకౌంటింగ్ సర్వీస్) అధికారిగా పనిచేస్తున్న ఆయన డిప్యుటేషన్ వ్యవధి ఈ నెల 15తో ముగియడంతో మాతృశాఖకు వెళ్లేందుకు అనుమతించింది.

ఏపీ వైద్య సేవల నియామక బోర్డుకు స్వయం ప్రతిపత్తి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీఎంఎస్ఆర్‌బీ)కు ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి హోదా కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వ బిజినెస్ రూల్స్-2018 రెండో షెడ్యూలును సవరిస్తూ అటానమస్ ఆర్గనైజేషన్ జాబితాలో ఏపీ వైద్యసేవల నియామక బోర్డును చేర్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖలో ఏపీపీఎస్సీ పరిధిలో లేని రాష్ట్ర, జోనల్, జిల్లాస్థాయి పోస్టుల భర్తీని వేగవంతం చేసే వీలుంటుంది.

చుక్కా రామయ్య స్ఫూర్తితో విద్యా విధానంలో మార్పులు

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్
- పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు



చుక్కా రామయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ✦ రామయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న కేటీఆర్. చిత్రంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జూలూరి గౌరీశంకర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యారంగం ఉన్నతికి రేవంత్‌రెడ్డి సర్కారు ప్రాధాన్యం ఇస్తోందని... చుక్కా రామయ్య స్ఫూర్తితో విద్యా విధానంలో మరిన్ని మార్పులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య జన్మదినం సందర్భంగా గురువారం హైదరాబాద్ విద్యానగర్‌లోని ఆయన నివాసానికి.. మంత్రి పొన్నం ప్రభాకర్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, మాజీ గవర్నరు బండారు దత్తాత్రేయ, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తెజస వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొ.కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ప్రొ.హరగోపాల్, బాసర సరస్వతీ ఆలయం కార్యనిర్వాహణాధికారి అంజనీదేవి, సమాచార శాఖ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, బుద్ధభవన్ డైరెక్టర్ మల్లేపల్లి లక్ష్మయ్య, సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి, పాశం యాదగిరి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు తదితరులు వేర్వేరుగా పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. 'సాధకులు-బోధకులు, మొదటి పాఠం' పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ... చుక్కా రామయ్య శత వసంతాల పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సీఎంతో మాట్లాడతానన్నారు.

ఐఐటీ విద్యార్థులకు మార్గదర్శి: కేటీఆర్

''తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని చాలా మంది విద్యార్థులు ఐఐటీ పూర్తి చేసి దేశవిదేశాల్లో స్థిరపడ్డారంటే చుక్కా రామయ్యనే కారణం'' అని కేటీఆర్ అన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ... ''విద్యార్థుల కోసం తన జీవితాన్ని తరగతి గదికే అంకితం చేసి వారిని విశ్వ వ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి చుక్కా రామయ్య'' అని కొనియాడారు.

చుక్కా రామయ్యకు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్యకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'అద్భుత విద్యాబోధనతో యువత భవితకు బంగారు బాటలు వేసి ఐఐటీ రామయ్యగా పేరుగాంచి, తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిన ఆయన మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని మనసారా కోరుకుంటున్నాను' అని సీఎం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

విద్యా వికాసానికి చుక్కాని 'ఐఐటీ రామయ్య': చంద్రబాబు

''తెలుగునేలపై విద్యా వికాసానికి చుక్కాని ఐఐటీ రామయ్య. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు'' అని ఏపీ సీఎం చంద్రబాబు ఎక్స్‌లో తెలిపారు.

మావోయిస్టు నేత దేవ్‌జీని కోర్టుకు హాజరు పరచాలి: వామపక్షాలు

ఈనాడు, అమరావతి: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ముఖ్యనేత తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ సహా నిర్బంధించిన మావోయిస్టులను వెంటనే కోర్టులో హాజరు పరచాలని సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, ఎంసీపీఐ(యు), ఫార్వర్డ్‌బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, ఎస్‌యుసీఐ(సి)లు సంయుక్తంగా ఒక ప్రకటనలో డిమాండ్ చేశాయి. 'అడవులు, అటవీ సంపదలను బడా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి. మారేడుమిల్లి ఏజెన్సీలో జరిగిన వరస ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలి. అటవీ ప్రాంతంలో మావోయిస్టులను ముందుగానే నిర్బంధించి ఆ తర్వాత పోలీసులు కాల్చి చంపారన్న అనుమానాలు ప్రజల్లో ఉన్నాయి. ఇంతవరకూ అడవుల్లో దొరికిన వారిని అడవుల్లోనే ఎదురుకాల్పుల పేరిట కాల్చి చంపారు. ఇప్పుడు అడవుల నుంచి బయటకు వచ్చి, పట్టణ, నగర ప్రాంతాల్లో తల దాచుకున్న వారిని పట్టుకొని అడవులకు తీసుకెళ్లి ఎదురు కాల్పుల పేరిట కాల్చి చంపుతున్నారు' అని విమర్శించాయి.

కొత్త టీచర్లకు సెలవులు మంజూరు..

ఈనాడు,అమరావతి: మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాల్లో చేరిన ఉపాధ్యాయులకు సెలవులను మంజూరు చేస్తూ డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు సీఎల్స్ 4, ఐచ్ఛిక సెలవు ఒకటి, ప్రత్యేక సీఎల్స్ 2, ఉపాధ్యాయినులకు అదనపు ప్రత్యేక సెలవు ఒకటి మంజూరు చేశారు.

ఎస్ఐఆర్ నిలిపివేయాలని సీఈవోకు వినతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)ను నిలిపివేయాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌కు వామపక్ష, ఇతర పార్టీలు గురువారం వినతిపత్రం సమర్పించాయి. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలకు 2029 వరకు సమయం ఉన్నందున ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విన్నవించారు. నాయకుల అభ్యర్థన మేరకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని సీఈవో హామీ ఇచ్చినట్లు వామపక్ష పార్టీలు ప్రకటించాయి.

వైద్యారోగ్య శాఖలో సర్వీసు నిబంధనల సవరణ

ఈనాడు, అమరావతి: వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖలో క్లాస్ సి, కేటగిరీ 2 కింద ఉన్న పోస్టులకు అర్హతలను ప్రభుత్వం సవరించింది. నియామక అర్హతలు, పదోన్నతులు, బదిలీలకు అవసరమైన సర్వీసు నిబంధనల్లో మార్పులు చేసింది. సర్వీసు రూల్స్- 2022కు సవరణలు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. డిస్ట్రిక్ట్ మాస్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ పోస్టుకు కొత్తగా సవరించిన నిబంధనలో యూజీసీ గుర్తింపు పొందిన ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉండాలని, ఏదైనా ప్రభుత్వ సంస్థలో మాస్ కమ్యూనికేషన్/ఫీల్డ్ పబ్లిసిటీ రంగంలో సాధారణంగా రెండేళ్ల సర్వీసు సీనియారిటీ, అనుభవం ఉండాలని పేర్కొంది. పదోన్నతి, బదిలీ ద్వారా నియామకానికి అర్హత పొందాలంటే కనీసం రెండేళ్ల సర్వీసు పూర్తిచేసి ఉండాలని పేర్కొంది.

పోలవరం- నల్లమలసాగర్ అనుసంధానంతో కరవు ప్రాంతాలకు మేలు

- 20 సూత్రాల అమలు కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్

ఈనాడు, అమరావతి: 'పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు మళ్లించి నల్లమలసాగర్‌కు అనుసంధానం చేయడం వల్ల ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లోని కరవు ప్రాంతాలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇది చరిత్రాత్మక నిర్ణయం. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది' అని 20 సూత్రాల అమలు కార్యక్రమం (వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర) లంకా దినకర్ అన్నారు. ఆయన సచివాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఈ ఏడాది జనవరి 1న సీఎం చంద్రబాబును కలిసి గోదావరి వరద జలాలు నల్లమలసాగర్‌కు మళ్లించాలని కోరానని, ఆ మర్నాడే జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడి నుంచి ఈ అంశంపై చర్చించేందుకు పిలుపు వచ్చిందని దినకర్ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఎంత సమష్టిగా, ఎంత అభివృద్ధి అనుకూలంగా పని చేస్తోందో చెప్పేందుకు ఇదే పెద్ద ఉదాహరణ అన్నారు. 'ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలైన పశ్చిమ ప్రకాశంలోని కనిగిరి, యర్రగొండపాలెం, మార్కాపురం నియోజకవర్గాలు, దొనకొండ, మర్రిపూడి, చీమకుర్తి మండలాలకు, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగం. ఈ ప్రాజెక్టు వల్ల 23 లక్షల మందికి తాగునీరు, 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కేంద్ర నివేదిక ప్రకారం దేశంలో అతి ఎక్కువ ఫ్లోరైడ్ ప్రభావిత జిల్లాల్లో 11వ స్థానంలో పల్నాడు, 16వ స్థానంలో ప్రకాశం జిల్లాలు ఉన్నాయి. వీటికి పరిష్కారం గోదావరి జలాలను ఇక్కడికి మళ్లించడమే అని మంత్రి రామానాయుడితో చెప్పా' అని పేర్కొన్నారు.

నేడు పోలవరానికి కేంద్ర అదనపు కార్యదర్శి

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వ ఎక్స్ అఫీషియో అదనపు కార్యదర్శి ఆదిత్యశర్మ శుక్రవారం పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు. పోలవరం పనుల పురోగతిని స్వయంగా తెలుసుకుంటారు. పోలవరం అధికారులతో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ అధికారులతోనూ సమావేశమై వివిధ అంశాలను చర్చిస్తారు.

తప్పుడు ధ్రువపత్రాలతో భూ రిజిస్ట్రేషన్

- తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: తప్పుడు ధ్రువపత్రాలతో తన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని చిత్తూరు జిల్లా పుత్తూరు మండలం భవానీనగర్‌కు చెందిన బంగారయ్య కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. పలు సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తన భూమిని కబ్జా చేయాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని చిత్తూరు జిల్లా కుప్పం మండలం అడవిబూదుగూరుకు చెందిన రాణి ఫిర్యాదు చేశారు. ఆస్తి కోసం తన కుమారులు, కోడళ్లు తనను కొడుతున్నారని కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన రామలక్ష్మి వాపోయారు.

రూ.20 కోట్ల వక్ఫ్ ఆస్తులతో మెగా డెవలప్‌మెంట్

- వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా తమ ఆధీనంలో ఉన్న ఆస్తుల్లో.. రూ.20 కోట్లతో మెగా డెవలప్‌మెంట్ పనులు చేపట్టాలని వక్ఫ్ బోర్డు తీర్మానించింది. ఈ మేరకు ప్రభుత్వ అనుమతితో ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికను ఎన్‌సీపీఈ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు గురువారం జరిగిన వక్ఫ్ పాలక మండలి సమావేశంలో సభ్యులకు వివరించారు. రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తులను కాపాడతామని, వాటితో సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు చేపడతామని వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈ ప్రణాళిక అమల్లోకి వస్తే వక్ఫ్ ఆస్తుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. దీంతో ముస్లిం సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ఒక వక్ఫ్ ఆస్తి నిధులను రుణంగా తీసుకుని, మరో వక్ఫ్ ఆస్తి అభివృద్ధికి ఉపయోగించాలని తీర్మానించారు. పలు మేనేజింగ్ కమిటీలు, ముతవల్లిలను నియమించారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.41 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.41.15 కోట్ల విడుదలకు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 'ధర్తి ఆబా జన్‌భాగీదారి గ్రామ ఉత్కర్ష్ అభియాన్'లో భాగంగా కేంద్రం ఈ నిధుల్ని రాష్ట్రానికి కేటాయించింది.

8 జిల్లాలకు ఏపీసీల నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎనిమిది జిల్లాలకు సమగ్ర శిక్షా అభియాన్ అదనపు ప్రాజెక్టు సమన్వయ అధికారులను (ఏపీసీ) నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం, అనకాపల్లి, పల్నాడు, ప్రకాశం, అన్నమయ్య, వైఎస్సార్ కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఏపీసీలు రానున్నారు.